
# సుందరకాండ



రచయిత : ఆచి శ్రీనివాసాచార్య

# సుందరకాండ ముద్రాపకులు



**శ్రీమాన్ బూరుగ్గడ్డ రంగాచార్యులు గారు**

**S/o శింగరాచార్యులుగారు**

శ్రీనివాసనగర్, ఇం.నెం. 1-128/01/ఏ,
నిజామాబాద్, ఆంధ్రప్రదేశ్.
సెల్ నెం. 9440881957



సమాశ్రయణ ప్రదాతలైన శ్రీమదాత్తాన్ నృసింహదేశికుల దివ్య
పాదారవిందముల సన్నిధిలో అనేకానేక దాసోహములు

# అంకితము



"స్వాచార్య శ్రీహస్తాలతో ఆచార్య హనుమకు అంకితము"

- ఆచి శ్రీనివాసదాసః



**రచయిత : ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**

11-5-29/9, శ్రీ వేంకటేశ్వర కాలని,
రోడ్ నెం.5, సరూర్‌నగర్, హైద్రాబాద్ - 500 035.
ఫోన్: 040-24053137

# విషయసూచిక


1. శ్రీ హనుమాన్ చాలీసా

2. శ్రీ మద్రామాయణ పారాయణానికి ముందు పఠించవలసిన శ్లోకాలు

3. పారాయణ సమాప్తిలో పఠించవలసిన శ్లోకాలు

4. వాల్మీకి రామాయణము "సుందరకాండ" మూలము

5. మంగళాశాసనములు

I. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు

II. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరంగరామానుజ జీయర్ స్వామివారు

III. "ఆరావముదం" - కె.వి. రాఘవాచార్య స్వామివారు

IV. "సమమధురోపనతార్థ వాక్యజాతము"
డా॥ కందాళై రామానుజాచార్యస్వామివారు

V. దాసోఽహం కోసలేంద్రస్య : డా॥ సి. విజయరాఘవాచార్యులు

5. శ్రీరామబాణము

6. కథాభాగము:-

1. సుందరకాండ పీఠిక .................... 1
2. సముద్రతరణము .................... 12
3. మైనాకుడు .................... 19
4. సురస .................... 22
5. సింహిక .................... 25
6. హనుమ విచారము .................... 29
7. లంకిణీ విజయము .................... 32
8. లంకా దర్శనము .................... 35
9. రావణ భవనము .................... 38
10. హనుమ నిర్వేదము .................... 45
11. అశోకవనము .................... 48
12. సీతాదేవి దీన స్వరూపము .................... 55
13. రావణునిరాక .................... 64
14. "తృణమంతరతః" .................... 69

15. సీతాదేవి పాతివ్రత్యము ........................................ 84
16. రావణాగ్రహము ........................................ 88
17. సీతాదేవి విషాదము ........................................ 90
18. త్రిజటా స్వప్నము ........................................ 95
19. స్వప్న విశ్లేషము ........................................ 98
20. శుభశకునాలు ........................................ 102
21. సీతాదేవి పరితాపము ........................................ 105
22. మళ్లీ శుభశకునాలు ........................................ 110
23. శింశుపావృక్షంపై హనుమ స్వామి ........................................ 112
24. హనుమ సందర్శనము ........................................ 120
25. సీతాహనుమల సంవాదము ........................................ 122
26. రామలక్ష్మణుల లక్షణాలు ........................................ 134
27. అంగుళీయక ప్రధానము ........................................ 141
28. రెండునెలలు మాత్రమే ........................................ 150
29. కాకాసురుడు ........................................ 154
30. నా పాపమే కారణము ........................................ 161
31. సీతాదేవి సిగపూవు ........................................ 166
32. సీతాదేవి చివరి మాటలు ........................................ 169
33. శత్రునిరసనము ........................................ 172
34. "జయత్యతిబలోరామః" ........................................ 175
35. రాముడు సకలాస్త్రవేత్త ........................................ 181
36. జంబుమాలి ........................................ 183
37. మంత్రిసుతులు ........................................ 184
38. సేనాధిపతులు ........................................ 185
39. అక్షకుమారుడు ........................................ 187
40. ఇంద్రజిత్తు - బ్రహ్మాస్త్రము ........................................ 189
41. ప్రపత్తి - బ్రహ్మాస్త్రము ........................................ 193
42. హనుమ హితోపదేశము ........................................ 195
43. లంకాదహనము ........................................ 201
44. హనుమ పరితాపము ........................................ 209
45. తిరుగు ప్రయాణము ........................................ 214
46. హనుమ ప్రయాణ వర్ణనము ........................................ 216
47. శ్రీరామునికి నివేదనము ........................................ 224

శ్రీ రామాయ నమః

SHRIMANNARAYANA RAMANUJA YATHIBHYO NAMAHA

Tridandi Chinna Srimannarayana Ramanuja Jeeyar Swamy

JEEYAR EDUCATIONAL TRUST
SITANAGARAM 522 501
GUNTUR DISTRICT A.P
(08645) 272929, 272353

శ్రీమతే రామానుజాయ నమః

ప్రియ శ్రీమన్! ఆచి శ్రీనివాసాచార్య స్వామి! 24-08-07

శ్రీమతే నారాయణాయ నమః.

అనేక మంగళాశాసనములు.

దేవర వారు పంపిన "సుందరకాండ" అనుభవ గ్రంథము అందింది.

సుమారు 40 వ్యాసాలుగ కాండసారాన్ని సామాన్యులకు గూడ అందుబాటులో ఉండే రీతిలో దేవర వారందించి ఎంతో ఉపకారం చేసారు,

ఎన్నెన్నో సౌందర్యాలకు ఆలవాలం కద సుందరకాండ! ముఖ్యంగ కర్మబద్ధుడైన జీవునికి దైవతత్త్వాన్ని తెలిపి, సంస్కరించి భగవత్స్వీకారానికి సమాయత్త పరిచే, తద్వారా ఆత్మ స్వరూపోజ్జీవనము కలిగించే సుందరమైన ఆచార్య తత్త్వాన్ని ప్రకటించిన కాండ ఇది.

దీనిని ఎంత అనుభవించినా, ఎంతెంత అనుభవించినా అంతంత భాగమే సుందర రసాస్వాదమై తాపాలను చల్లారుస్తుంది.

ఎందరెందరు, ఎన్నెన్ని రీతులుగ ఆస్వాదించినా, స్వత స్సౌందర్య పూర్ణమైన "సుందరకాండ" ఈ రకంగ ధేవర వారి ద్వార వెలుగు చూడడం సంతోషదాయకం!

హనుమ దీనిని ప్రీతితో స్వీకరించి శ్రీరాముని కృపను కురియించుగాక!

జై శ్రీమన్నారాయణ!

(signature)

శ్రీ రామాయ నమః


**శ్రీ రామానుజ పీఠము**

(రిజిష్టర్డ్ ట్రస్ట్ 54/2004)

4-61-18/1/1, ఫ్లాట్ నెం. 14,
లాసన్స్ బే కాలని,
విశాఖపట్టణము - 530 017.
ఫోన్: 5522317.




భగవద్రామానుజులు


వ్యవస్థాపకులు
పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరంగ రామానుజ
జీయర్ స్వామివారు


తేది : 1.11.2007

# మంగళాశాసనములు

శ్రీమద్రామాయణాన్ని ఎంతోమంది ఎన్నో విధాలుగా అనుభవించేరు. ఆ అనుభవానికి భగవదనుగ్రహం ఎలా తప్పనిసరిగా ఉండాలో అలాగే తామనుభవించిన దానిని తిరిగి ఆవిష్కరించడానికి కూడ భగవదనుగ్రహం ఉండి తీరవలసినదే.

ఆ ఆవిష్కరణలో కూడ కేవలం ఏదో ఒక వర్గానికి మాత్రమే సంతృప్తి కలిగేటట్లు కాకుండా అందరికీ అందుబాట్లోకి వచ్చేటట్లు ఆవిష్కరించగలగడం, భగవదనుగ్రహాన్ని విశేషంగా లభింపచేసుకున్న వారికే సాధ్యం అవుతుంది.

శ్రీ ఉ.వే. శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్య స్వామివారు ఆ కోవకి చెందిన వారే. కిష్కింధాకాండ వరకు ప్రకటించబడిన వారి శ్రీమద్రామయణ భాగాలు ఇప్పుడు సుందరకాండ వరకు వ్యాపించడం చాల ముదావహం. రామభక్తుల భాగ్యం.

వారికీ, వారి సౌజన్యానికీ కూడ అనేక మంగళాశాసనములు.

(శ్రీరంగ రామానుజ జీయర్)

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ సీతారామచంద్రపరమాత్మనే నమః

"వ్యాఖ్యాతృవాచస్పతులు"

"సాహిత్య సంప్రదాయ నిష్ణాతులు",

**శ్రీ ఉవేప్ర కె.వి. రాఘవాచార్య స్వామి**

# "ఆరావముదం"

"వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః" వేదవాక్కులన్ని పరబ్రహ్మ వైభవాన్ని తెల్పుతాయి. వేద వేద్యుడైన పరబ్రహ్మ దేవతల ప్రార్థనల వలన మన దేశంలో మానవ రూపంతో "శ్రీరామునిగా" అవతరించాడు. ఆయన స్వరూప, రూప, గుణాలను తెలుపడానికి వేదం రామాయణంగా మూర్తీభవించింది. దేవతలు ఎందుకాయనను ప్రార్థించారు?

"నైనం సూర్యః ప్రతపతి' సూర్యుడు రావణునికి వేడిని తాకజేయలేదు. "పార్శ్వేవాతి నమారుతః" వాయువు రావణుని ప్రక్క అధికవేగంగా వీచలేదు. "చలోర్మి మాలీ తం దృష్ట్వా సముద్రోఽపి న కంపతే" ఎత్తైన కెరటాలతో ఎగిసిపడే సముద్రుడు కూడ రావణుని చూచి భయంతో కదలలేదు.

దశకంఠుని వలన భయంతో దీనులైన దేవతలు తమ కష్టాలను తీర్చుమని పరమాత్మతో మొరపెట్టుకొన్నారు.

"పురుహూత ప్రభృతయః। సురకార్యోద్యతం సురాః

అంశైరనుయయుర్విష్ణుం। పుష్పైర్వాయుమివ ద్రుమాః॥"

దేవకార్యార్థమై అవతరించిన శ్రీ మహావిష్ణువుకు తోడ్పడానికి దేవతలు తాము ఉన్న చోటునే ఉండి తమ అంశలు వెళ్లునట్లు చేశారని కాళిదాస మహాకవి మనోజ్ఞమైన ఉపమానంతో నిరూపించాడు. చెట్లు పూల రూపంలో గాలి వెంట వెళ్లి నట్లు దేవతలు తమ అంశలతో స్వామిని అనుసరించారట. ఎంత చక్కని ఉపమానం!

"రాముడు" అంటే "తన రూప గుణ సౌందర్యాలతో అందరిని ఆనందింప జేసేవాడ"ని అర్థము. ఎంత మహత్తరమైనది రామనామము! "ఆ ఒక్క నామమే వేయి నామాలతో సమానమ"ని పరమేశ్వరుడు, పార్వతితో పలికి, ఆ రామ నామాను సంధానంతో తన్మయుడవుతాడు.

"రమంతే యోగినోఽనంతే। సత్యానందే చిదాత్మని

ఇతి "రామ" పదే నాసౌ। పరంబ్రహ్మాభిధీయతే" (అగస్త్య సంహిత)

సర్వదేశ, సర్వకాలాల యందు, సర్వ ప్రకారాలుగా ఉండడము వలన, అంతులేని వాడు, ఆనందరూపుడైన, జ్ఞాన స్వరూపుడైన పరమాత్మ యందు యోగులు మనస్సులను నిలిపి ఆనందిస్తున్నారు. కాబట్టి "రామ" శబ్దం చేత పరబ్రహ్మ నిర్దేశింప బడుతున్నాడనే "అగస్త్య సంహిత"లోని శ్లోకాన్ని శ్రీమద్రామాయణ వ్యాఖ్యాతలైన గోవిందరాజుల వారు ప్రమాణంగా చూపారు.

ఆ పరబ్రహ్మవాచకమైన "రామనామమే" ఆయన అవతారమైన దాశరథికి అన్ని విధాల అన్వయించిన నామమైంది.

ఇక ఆంజనేయుడు రుద్రుని అంశావతారమే. ఆయన అంజనాసుతుడు, వాతాత్మజుడు, సుగ్రీవ సచివుడు. ఆయన "సావిత్రీ విద్యాసంసేవి".

"వందే రామాయణార్ణవం" అన్నట్లు సముద్రమంత విశాలమైనది, అంతే లోనది కూడ. వర్ణస్తోమ విభ్రాజితమై, సర్వశ్రుతి మనోహరమైనది. "సముద్రమివ రత్నాఢ్యం" సముద్రంలో రత్నాలుపైన కనుపించవు. లోతుగా వెళ్లగలిగిన వాళ్లకే లభిస్తాయి. అదిగో అంతటి రత్నాఢ్యమైన రామాయణ మహా మాలలో నాయక రత్నమైన వాడు హనుమ.

"రామాయణ మహామాలా। రత్నం వందేఽనిలాత్మజం".

శ్రీమద్వేదాంతదేశికులు, "ద్వేచక్షుషీ త్వదనుభావమవేక్షితుంనః" రామాయణ, మహాభారతాలు మానవ జాతికి రెండు కన్నులని పాదుకా సహస్రంలో సెలవిచ్చారు. కన్ను తాను చూచిన వస్తువును ప్రతిబింబించుకొని, ఎదుటి వస్తువును చూస్తుంది. సంస్కారవంతుని కన్ను వస్తు రూపరేఖలను లోతుగా పరిశీలించ గలుగుతుంది.

శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్య స్వామివారు పండిత పౌత్రులు, పండిత సూనులు, స్వయంగా ఉభయవేదాంత పండితులు, రామాయణార్ణవ తలస్పర్శులు వీరు. తమ "రామాయణానుభవాన్ని" ఇంతవరకే నాలుగు కాండలలో అద్భుతంగా వచన రూపంగా రచించి అనేక పండిత ప్రశంసలను పొందారు. ఇప్పుడు సుందర కాండను రచించి ఆంధ్రజనావళికి అందిస్తున్నారు.

ఈ పంచమ కాండను స్థాలీపులాకంగా చూద్దామనుకొన్న నేను చదువుతున్నప్పుడు శబ్దార్థ భావ రచనల సౌందర్యము నన్ను ముగ్ధుణ్ని చేసి సమగ్రంగా మళ్లీ మళ్లీ చదివించింది. అతృప్తామృతంగా గోచరించింది.

"ఆచినోతిహిశాస్త్రార్థాన్" అన్నట్లు ఆచి శ్రీనివాసాచార్యస్వామివారు గురుముఖతః ఉభయ వేదాంత విద్యను అభ్యసించి, "మనోస్యదైవం చక్షుః" అన్నట్లు దివ్య మనస్కులయ్యారు. "విశుద్ధేన మన సాగ్రాహ్యో" బ్రహ్మ విద్య పరిశుద్ధమైన మనస్సు చేత గ్రహించ దగినది. ఆనందస్వరూపమైన పరబ్రహ్మానుభవము సమస్త పరవిద్యకు ఫలము.

"యదేవ విద్యయాకరోతి, తదేవ వీర్యవత్తరం భవతి" విద్య చేత ఏ కర్మను చేస్తాడో, ఆ కర్మ వీర్యవత్తరమవుతుందని శ్రుతి పలుకుచున్నది. కాబట్టి ఆచి స్వామివారు తమకు కలిగిన ఆనందాన్ని గ్రంథరూపంగా ప్రకటించటం ఉత్తమ పురుషార్థమనదగినది.

"కావ్యాద్ధర్మ ప్రాప్తిః భగవచ్చరణారవిందస్తవాదినా" భగవచ్చరణారవిందస్తోత్ర రూపమైన కావ్యము వలన ధర్మరూపమైన భగవత్ప్రాప్తి కలుగుతుంది.

భక్త్యా రామస్య యే చేమాం। సంహితామృషిణా కృతాం।

లేఖయంతీహచ నరాస్తేషాం వాసః త్రివిష్టపే॥

ఆదికవియైన వాల్మీకి మహర్షిచేత రచింపబడిన రామసంహితను వ్రాసిన భక్తులకు పరంధామ నివాసయోగ్యత కలుగుతుందని శ్రీమద్రామాయణంలో సుశ్లోకితము.

ఇక ఆచి. స్వామివారి వాక్పాకాన్ని కొంత రుచి చూద్దామా!

(1) "హనుమ, తనను రాఘవుడు ప్రయోగించిన బాణంగా భావిస్తూ, సముద్రాన్ని దాటుతున్నప్పుడు కలిగిన విఘ్నాలను క్రామ క్రోధాదులను జయించాడు.

(2) "లంకిణి" అనే అవిద్య, బ్రహ్మనిష్ఠుడైన హనుమను ఆపగలదా?

(3) లంకలోనికి 'అద్వారేణ' అంటే అకార వాచ్యుడైన పరమాత్మ (సంకల్పం) ద్వారా హనుమ వెళ్లాడని ధ్వన్యర్థము.

(4) ఫలాపేక్ష లేకుండా భగవత్కృప కొరకు కర్మలను చేసే చేతులే "మహా బాహువులు".

5) "సీత" అంటే కుండలినీ శక్తి. గుండ్రంగా మూడున్నర చుట్టలు చుట్టుకొని పడుకొన్న శక్తి. ఆమె ఉన్న స్థానం లంక క్రింది (దక్షిణ) దిశలో ఉన్నది. కనుక అది "మూలాధార" చక్రానికి సంకేతము. మూలాధారంలో ఉన్న కుండలినీ శక్తిని (సీతాదేవిని) ప్రబుద్ధం చేసి, కుంభక వాయువు (హనుమ) పైపై చక్రాలకు ఆకర్షించి "సహస్రార" చక్రానికి (శ్రీరామ పరమాత్మ స్థానానికి) చేర్చడమే మహాయోగి (హనుమ) కర్తవ్యము.

(6) హనుమకు చల్లగా ఉండుమని సీతాదేవి అగ్నిని కోరింది. ఆమె (జీవాత్మ) యొక్క అన్వేషణకు రాముని (పరమాత్ముని) చేత పంపబడిన వాడు హనుమ (ఆచార్యుడు). ఆచార్యుని యొక్క దేహ సంరక్షణ శిష్యుని బాధ్యత. శిష్యుని యొక్క ఆత్మ సంరక్షణ ఆచార్యుని బాధ్యత.

(7) "ఏతి జీవింతమానందో, నరం వర్ష శతాదపి" ఈ సామెత సీతాదేవి చరిత్రకు సంబంధించినదైనా, ప్రత్యేక వ్యాసరచనారూపంగా సాగి, స్వామి వారి లోకజ్ఞతనూ, సంప్రదాయ మర్మాభిజ్ఞతనూ ప్రస్ఫుటీకరిస్తున్నది.

(8) "రామః కమల పత్రాక్షః" అని వర్ణించే చోట, "కట్టురైక్కిల్ నిన్ కణ్, పాదం కైయొవ్వా" - అనే నమాళ్లార్వ సూక్తి రీతిలో, "శ్రియః పతి కన్నులతో తామర పూవులను పోల్చుట పొసగునా?" అని పరిశీలించి, ఛాందోగ్యోపనిషద్వాక్యాన్ని ('కప్యాసం పుండరీకమే వమక్షిణీ") ఉదహరించి సమర్థించబడింది.

ఇలా సాహిత్య, యోగశాస్త్ర, ఉభయ వేదాంతార్థాలతో సమన్వితమైన మహత్తర రచన సరళ భాషలో సాగడం వలన అక్షరాస్యులు అందరు చదివి ఆనందించడానికి వీలు ఉంది.

విశిష్టాద్వైత సంప్రదాయ నిష్ఠులూ, రామాయణానువంశిక పారాయణ గరిష్ఠులూ, సంస్కృత, ద్రావిడ వేదాంత విద్వద్వరిష్ఠులూ, అయిన శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్య స్వామి వారు అనన్య సదృశంగా రచించిన ఈ గ్రంథరాజానికి "అభిప్రాయాన్ని" వ్రాయు మని ఆత్మీయతతో వారు కోరినందువలన, నా ఈ అభిప్రాయాన్ని అందిస్తున్నాను.

శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్య స్వామివారు ఆయురారోగ్య సంపన్నులై, 'వాచాధర్మమవాప్నుహి" అన్న విధంగా వాచిక కైంకర్యపరులై వర్ధిల్లేలా తిరువేంగడము డైయాన్ కృపతో కటాక్షించాలని ఆ ఏడు గొండల ప్రభువును సర్వదా ప్రార్థిస్తుంటాను.

ఇంద్ర కుటీర్,
నల్లకుంట, హైద్రాబాద్-44

**కారంచేటి తిరుమల రాఘవాచార్య**

శ్రీమతే రామానుజాయ నమః
శ్రీ సీతారామచంద్రపరమాత్మనే నమః
అస్మద్గురుభ్యో నమః

**ఉభయవేదాంత ప్రవచన పారీణులు,**
**వ్యాకరణ శాస్త్ర మర్మజ్ఞులు,**
**విశదవాక్ శిఖామణులు,**
**డా॥ కందాడై రామానుజాచార్య స్వామి**
రిటైర్డ్ ప్రిన్సిపల్
శ్రీ వేంకటేశ్వర వేదాంతవర్ధినీ కళాశాల,
సీతారాంబాగ్.

# "సమమధురోపనతార్థ వాక్యజాతము"

శ్రీ ఉ.వే.ప్ర. ఆచి శ్రీనివాసాచార్య స్వామివారు అఖండ రామభక్తి పరిపూర్ణ హృదయులు. ఆధ్యాత్మిక బంధురులు. ఉభయ వేదాంత నిష్ణాతులు, కృపామాత్ర ప్రసన్నులు.

పరమాత్మ "ఆర్తత్రాణ పరాయణుడు", "దీనజనబంధువు". ఈ రెండు గుణాలు ఆచార్యులను చూచియే పరమాత్మ అలవర్చుకొన్నాడని "శ్రీవచనభూషణ" శ్రీ సూక్తి.

"తాము సర్వాత్మనా పరిపూర్ణులము, భగవత్ జ్ఞానపూర్ణులము, ఆత్మారాములము. జనులతో, లోకముతో మాకేమిపని?" అని వాల్మీకి, వ్యాసభగవానులు భావించి ఉంటే, "శ్రీమద్రామాయణ", "మహాభారతాలు" ఆవిర్భవించేవి కావు.

లోకుల ఆర్తిని, అజ్ఞానమును చూచి వారి హృదయాలు ద్రవించి, "శోకః శ్లోకత్వ మాగతః" అని లోకుల పట్ల శోకమే వాల్మీకి శ్లోకమైనది. "వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా" అని వేదమును, వేదార్థమును, వేదాంతార్థములను రామాయణముగా లోకులకు పరమకారుణికుడైన వాల్మీకి మహర్షి అందించాడు.

అయిననూ సంస్కృత పరిజ్ఞానము, వేదాంత పరిజ్ఞానము, సంప్రదాయ నిష్ఠ, ఆచార్య వాత్సల్యము, నిరంతర గ్రంథ పఠన, పాఠనములు శ్రవణ, ప్రవచనములు ఉన్న వారికి మాత్రమే శ్రీమద్రామాయణములోని గంభీరార్థములు బోధపడును. కేవల శ్లోకపఠనముతో అవి అర్థము కావు. అందుచే పరమ దయాళువులు శ్రీ గోవిందరాజులు సంప్రదాయార్థము

లను వ్యాఖ్యానముగా అందించి ఉన్నారు. అయితే ఆ వ్యాఖ్యానమును మాత్రము అందరు చదువగలరా? చదివిననూ ఆ గంభీరార్థములను అర్థము చేసికొనగలరా?

అటువంటి వారికి ఆ వ్యాఖ్యానార్థములను, ఋషి హృదయమును బోధింప దలచి సుందర, సులలిత పదవాక్యజాతముతో "శ్రీమద్రామాయణానుభవము" పేరుతో శ్రీమాన్ ఆచి. శ్రీనివాసాచార్య స్వామివారు గ్రంథాలను కృప జేయుచున్నారు. ఆ పరంపరలో "బాల", "అయోధ్య", "అరణ్య", "కిష్కింధా" కాండలు పూర్తి అయినవి.

ఇప్పుడు "సుందరకాండ"ను అందించుచున్నారు శ్రీ స్వామివారు. "సుందరే, కిం న సుందరమ్" అనినట్లుగా చరమపర్వమైన ఆచార్యనిష్ఠను చక్కగా ప్రతిపాదించుచు ఈ "సుందరకాండను" ఆచార్యులవారు హృద్యముగా, పండిత పామర వేద్యంగా అందించు చున్నారు.

సహజముగా ఆచార్యుల వారి శైలియే లలితము. దీర్ఘసమాసములు మచ్చుకైనను కనుపించవు. కఠిన పదములు, దూరాన్వయ వాక్యములు వెతికిననూ దొరకవు. ఎంత గంభీరమైన భావమునైనను చిన్న చిన్న పదములలో అందించుటే ఆచార్యుల వారి ప్రత్యేక స్వభావము. అందుకు సుందరములు, విస్పష్టములైన ఉదాహరణలతో, ఎక్కువ మంది స్పృశించని విషయములను, నూతనములైన అంశములను అందరికి అందించుటలో స్వామివారికి స్వామివారే సాటి. ఉదాహరణకు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము విషయములో స్వామివారి విశ్లేషణము అద్భుతము.

బ్రహ్మాస్త్రము ప్రపత్తికి సంకేతము. "బ్రహ్మాస్త్రమును ప్రయోగించిన తరువాత ఇంకొక అస్త్రము పనిచేయదు. ఇంకొక అస్త్రమును ప్రయోగించినచో బ్రహ్మాస్త్రము విఫలమవుతుంది. అది విఫలమైందని బ్రహ్మాస్త్రాన్ని మరల ప్రయోగించినను, ఆ బ్రహ్మాస్త్రము కూడ పని చేయదు" ఇవి బ్రహ్మాస్త్రమునకు సంబంధించిన నియమ నిబంధనలు.

ప్రపత్తి కూడ అంతేనట, ప్రపత్తిని చేసినవారు, తరువాత ఇతరోపాయములను ఆశ్రయించినచో, ఆ ప్రపత్తి విఫలము అవుతుంది. ఆ ఇతరోపాయములు కూడ పనిచేయవు. ఆ రెండు వ్యర్థమయినవని, మరల ప్రపత్తిని చేయరాదు. ఒకవేళ ప్రపత్తిని తిరిగి ఆచరంచినను, అది కూడ నిష్ఫలమే అవుతుంది".

ఎంత చక్కని పోలిక! ఎంత ఆహ్లాదకరమైన వివరణ!

"అందరికి అజేయమైన హనుమ ఇంద్రజిత్తునకెలా వశ్యుడైనాడు?" హనుమ కన్నా ఇంద్రజిత్తు గొప్పవాడా?" అను సందేహము చాల మంది పాఠకులలో కలుగుతుంది.

ఇంచుమించు సమాధానము దొరుకదు. దానికి స్వామి వారి వివరణము చాల చక్కని సమాధానము, సమాశ్వాసనము కూడ.

"ఇంద్రజిత్తు" అనే పేరులో "ఇంద్ర" పదమునకు అర్థము "మనస్సు". మనస్సును జయించేది బుద్ధి. అందువలన "ఇంద్రజిత్తు" అనగా బుద్ధి అని అర్థము. రావణుడంటే అహంకార పూరితమనస్సు. ఇంద్రజిత్తు అంటే నిశ్చయాత్మకమైన బుద్ధి.

ఆ బుద్ధి ఆగ్నేయ, వాయువ్య, వారుణాస్త్రములను అనగా కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములను వశపరుచుకొన్నది. వాటిని ఎరజూపి ఆచార్యుని (హనుమను) వశపరచుకొనుటకు ప్రయత్నించినది. కాని ఆ బుద్ధి సఫలము కాలేదు. చివరకు బ్రహ్మాస్త్ర రూపమైన ప్రపత్తిని ప్రయోగించినది. ఆ చరమాస్త్రానికి ఆచార్యుడు కట్టుబడ్డాడు.

బ్రహ్మాస్త్ర బద్ధుడైన హనుమను చిన్న చిన్న తాళ్లతో రాక్షసులు బంధించారు. వాటి వలన హనుమకు బంధము బలపడలేదు. పైపెచ్చు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము కూడ నిర్వీర్యమైంది.

ఆచార్యుని ప్రపత్తి ద్వారా ప్రసన్నుని కావించుకొన్న తరువాత స్వాతంత్ర్య బుద్ధి, స్వకర్తృత్వ బుద్ధి ఉండరాదు. అట్లున్నచో ముందు చేసిన ప్రపత్తి కూడ నిష్ఫలము అవుతుంది.

ప్రపత్తి (బ్రహ్మాస్త్రం) తో తప్ప ఆచార్యుని (హనుమను) వశం చేసికొనుటకు మరే ఇతర అస్త్రాలు (ఉపాయములు) పని చేయవని మనస్సుకు (రావణునికి) తెలుపుటకే హనుమంతుడు రావణుని వద్దకు వెళ్లినాడు. చూచితిరా! ఇది ఎంత గూఢార్థము! ఇంతగా వివరించినచో మరల గ్రంథ విస్తరమగుననుకొని ఆ భావమును సూచించి ఉన్నారు.

ఇంతయే కాదు ఆచార్యుడు భగవంతుని దగ్గర మాత్రమే జీవుని దైన్యమును, బాధలను తెలుపదగిన అనుభవాలను, ప్రార్థించినను భక్తుల వద్ద తెలుపజాలడు.

జీవుని సంసార బంధమును సడలించుటకు, అతనికి జ్ఞానోపదేశము చేయుటకు తాను పడిన శ్రమను, ఎదుర్కొనిన ఆటంకములను, వాటిని తన బుద్ధిబలంతో జయించిన విధానమును ఆచార్యుడు భగవంతునికి తెలుపరాదు. అట్లు తెలిపినచో ఆచార్యుని గర్వము, స్వోత్కర్ష బయటపడును.

జీవుని మీద దయ కలిగించుటకు, భగవంతుని అతడు ఎట్లు ఆరాధించి ఉన్నాడో, ఇప్పుడు భగవంతునికి దూరమై ఎట్లు విలపించుచున్నాడో అనే విషయములను మాత్రమే ఆచార్యుడు భగవంతునికి నివేదించవలెను.

భగవంతుడు జీవుని స్వప్రయత్నమును నిషేధించి, "నన్నే ఆశ్రయించవలయునని, స్వప్రయత్నమును మానిన నాడే తాను రక్షించెదనని" అన్నాడని కాకాసుర వృత్తాంతము యొక్క పరమార్థమును స్వామివారు చక్కగా వివరించారు.

కాకాసుర వృత్తాంతమును వానరులకు తెలుపక, రామచంద్ర స్వామికే తెలుపుట ఆ ఆచార్యుని (హనుమ) యొక్క సందర్భోచిత చర్య. ఆయన తన ప్రయత్నమును, దానికెదురైన ఆటంకములను, వాటిని తాను ఎదుర్కొనిన విషయములను తోటి ఆచార్యులకు (వానరులకు) తెలుపవచ్చును.

దాసులను ఉద్ధరించుటకు చేయు ప్రయత్నములో విరోధులెట్లు ఎదురగునో, వాటిని ఎట్లు నిర్మూలించవలయునో "మైనాక', 'సురస' 'సింహిక' వృత్తాంతములను అంగదాదులకు హనుమ వివరించాడు. కాని రామచంద్రునికి తెలుపలేదు.

కాకాసురాది వృత్తాంతములను, సీత తన వీపును అధిరోహించి వచ్చుటకు నిరాకరించిన విషయమును రామునికి తెలిపాడు. కాని అంగదాదులకు తెలుప లేదు.

ఒక దూత కృత్యమును హనుమ ఎంత చక్కగా నిర్వర్తించెనో వివరించుచు ఆచార్యుదు కూడ స్వామిదూతయే కనుక, ఆచార్య కృత్యమును, దానిలోని ఔచిత్యమును ఆచార్యుల వారు సరళరీతిలో తెలిపిఉన్నారు.

ఇట్టి అగాధమైన, గంభీరమైన, సామాన్యులకు బోధపడని అద్భుత రహస్యముల నెన్నిటినో ఆచార్యుల వారు 'సుందరకాండలో' అందించి ఉన్నారు. అవి కేవలము అనుభవైక వేద్యములు. అందరూ తప్పక చదివి, చదివించి, గూడార్థ వివరణ గ్రహించి, ఆనందించి, ఆనందింప జేసెదరని ఆకాంక్షిస్తున్నాను.

ఇట్లు
భాగవత పాదరేణువు
**డా. కందాడై రామానుజాచార్య**

ప్లాట్‌నెం. 16, న్యూనాగోల్ కాలని,
రోడ్ నం.5, సరూర్‌నగర్, హైద్రాబాద్-35.

# A.P. RESIDENTIAL DEGREE COLLEGE

(State Level Degree College Managed by APREIS, Govt. of Andhra Pradesh)
Nagarjuna Sagar Dam, VIJAYAPURI SOUTH - 522439, Guntur (Dist),
Phone (O) 08642-242347, (R) 278176 Cell: 9490083216

**Dr. C. VIJAYA RAGHAVACHARYULU,**

**M.A., Ph.D., B.Ed., D.I.S.**

Principal & Chairman
(UG) Board of Studies (Pol. Science & Pub. Admn.)
Acharya Nagarjuna University.


12 July, 2007

Priya Sreeman Sreenivasacharya Swami,

'Dasoham Kosalendrasya Ramasyaaklishta Karmanah!'

Dasoham, I am infinitely delighted to go over your excellent exposition of Ramayana and Kishindhakanda so kindly sent through Sreeman GVSN Acharyaswamy of Simhachalam. It was to my hand about a month ago, but I was drinking deep the nectarian juice that you have so deliciously mixed in the slokas that mde me a captive of language, literature, lyrical beauty and epical majesty. Ramayana-Kishkindha Kanda received wonderful treatment in your hands and brought the heart of Valmiki closer to the masses even like me. I feel that Rama has showered His Grace on you, while Hanuma as Acharya has stayed on the tip of your tongue and made you document your innate passion for Rama and His Aayana. 'A wonderful work in deed'.

I beg your pardon for my inability to acknowledge the book earlier, as I told you that every para of reading made me so induced that I was carrying this book with me in my brief case wherever I was travelling these days, even today, for that matter.

"Samskaara krama sampannam adrumamavalambitaam
Uchharayati kalyaneem vacham hridaya haarineem"

This is my sincere apprreciation of your good book. It has been my routine practice to recite a few verses of Valmikam for several years now, and somehow, Rama motiviated me to enjoy the poetic style, beauty of the language, the efficacy of the letters and the inner spirit of the words so used, thanks to Govindaraja Swamy for his scholastic and realistic

commentary. Having seen several commentaries on Valmikam, I was really moved by your own. Earlier, I remember to have seen your Balakanda somewhere. It is a God's work that you have taken upon yourself, and I pray, you should complete the total project and enliven the hearts of Rama-Priyas. I shall be deeply beholden if I could be granted the grace of going through the other Kandas also, of course, on payment of price basis. Just as Ramayana, even your work remains a perennial source of inspiration to the posterity. It will be my prayer to Rama to see that these volumes are sent to every School and College libraries in the State for larger dessimination of ethical values pregnant in it.

The prefatory note by His Holiness Chinna Jeeyarswamiji, HH Sri Ranga Ramanuja Jeeyar Swamiji, U.Ve. Sirisinahal Venkatacharya Swamy, Dr. Kandalai Ramanujacharya Swami preceded by your own note add perfume to the book.

Our Ramanuja Sampradaya is the epitome of all the schools of religious thought across othe world, and excels in its approach and application. It is the synergy of the Universal Religion, which confers the honour of Divine Grace on every living being irrespective one's entitlement and station. Nothing surpasses Ramanuja Sampradaya in treating every soul as equivalent and a potential agent of God. Prapatthi is its keyword and provides a free passage from mundane to Divine. I have enjoyed such great references in your analysis of the essence of Ramayana.

Sometime, I wish, I should have your benedictory Darshan at your premises in Hyderabad. After rendering 37 years of service as a teacher, I am getting superannuated by the next December and I only consider that nothing else remains than to fall on the sandal (Paduka) of Rama for the rest of the life. I seek your blessings.

I thank Shriman GVSN Acharayaswamy and his pious son Sreeman Seshavataram for yoking me to a great soul as yourself.. and take leave of you, seeking your Mangalasasanam.

Nivaasavrukshah saadhunaam aapannanaam paragathihi
Artaanaam samsrayaschhaiva yasasahchaika bhaajanam - Astu.

with Prem Pranam & Prapathi

Your,

**(VIJAYA RAGHAVACHARYULU)**

శ్రీసీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# శ్రీ రామబాణము

శ్రీ సీతారామచంద్రస్వామి మా ఇలవేల్పు. కోదండపాణి మా కులదైవము. శ్రీరామ పరమాత్మ లీలలు అపురూపాలు. అవి అపూర్వాలు కూడ.

మొదట తన జీవిత చరిత్రను రచించడానికి ఒక బోయవాడైన వాల్మీకిని వరించాడు. తరువాత తన కథాపరిమళాన్ని తెలుగులో తేటతెల్లం చేయడానికి ఒక కుమ్మరి కన్నె "మొల్లను" మిన్నగా ఎన్నుకొన్నాడు. ప్రస్తుతం తన 'శ్రీరామయణానుభవాన్ని' పదిమందితో పంచుకొమ్మని ఆజ్ఞుడనైన నన్ను 'ఆచిదాసుని' ఆదేశించాడు.

నాటి వాల్మీకి మహాకవి నుండి, "కులపతులు", 'ఉభయవేదాంతాచార్యులు' తె.కం. గోపాలాచార్య స్వామి వారి "రామాయణ రత్నాకరం" వరకు, "మహామహోపాధ్యాయులు" శ్రీ భాష్యం అప్పళాచార్య స్వామివారి "రామాయణ తత్వదీపికల" వరకు ఎందరో మరెందరో శ్రీరామచరితామృతాన్ని తాము తృప్తిగా ఆస్వాదించి, పాఠకలోకానికి ఆ అమృతాన్ని పంచి తరించారు, తరింపజేశారు.

రచయితలు ఎవ్వరైనా, ఎంతవారైనా, రామాయణ రచనా రంగంలో అందరికి తన అమృత హస్తాన్ని, అందించి, ముందుకు నడిపించి, నడిపిస్తున్న నేత దయాశరథి దాశరథే.

ఈ శ్రీరామాయణార్ణవ రచనా సేతు నిర్మాణ కార్యక్రమంలో నేనొక బుడుత ఉడుతను. నా 'ఉడుత' యత్నానికి సంతసించి, తన చల్లని కరస్పర్శతో ధన్యుడిని చేస్తున్న దయ గల దొర ఆ కోసలేంద్రుడే.

కోసలేశ్వరుని కృపాకటాక్షంతో నా "శ్రీరామాయణానుభవము'లో ఇప్పటికి 'బాల', 'అయోధ్య', 'అరణ్య', 'కిష్కింధ'లను దాటి ప్రస్తుతం 'సుందర' గమ్యానికి చేరుకొన్నాను.

'నా ఈ రచనామార్గంలో నా అజ్ఞత వలన పాఠక పాంథులకు ఎన్ని రాళ్లు, ఎన్ని ముళ్లు కుచ్చుకొంటున్నాయో?" అని బాధపడుతున్నాను.

అయితే ఈ 'సుంధరకాండారంభం' నాలో ఒక 'సుందర సత్యాన్ని' ప్రకాశింప జేసింది. ఆ సత్యప్రకాశానికి కారణాదిత్యుడు 'ఆచార్య హనుమే'.

'శ్రీసీతాన్వేషణ' మహాకార్యంలో ఆంజనేయస్వామి తనను 'రాఘవ నిర్ముక్త శరం'గా భావించుకొన్నాడు. తన అమోఘ బాహుబలాన్ని, తన అసమాన ధైర్యోత్సాహాలను దేనిని ఆయన నమ్ముకోలేదు. శ్రీరామభద్రుని చేతిలో తనను అచేతనమైన బాణంగా చెప్పుకొన్నాడు.

శరము (బాణము) అచేతనమైంది. దానికి స్వంతంగా ఒక లక్ష్యం. ఒక వేగం, ఒక శక్తి ఉండవు. ప్రయోగించేవాడి బలాన్ని బట్టి, వేగాన్ని బట్టి, లక్ష్యాన్ని బట్టి వెళ్లి అది పని చేస్తుంది. అది పరాధీనమైంది.

హనుమ తనను కేవల 'రామపరతంత్రుడి' గానే (రామబాణంగానే) అనుకొన్నాడు. ఆ హనుమ భావనే భగవత్కృప వలన నాలో కూడ ఆవహించి నన్ను కూడ రాముని చేతిలో పనిముట్టుగా మార్చింది. నాలోని స్వాతంత్ర్య భావనను నిర్మూలించింది. నాలోని అజ్ఞతా, అల్పజ్ఞతా భావాల భయాన్ని పోగొట్టింది.

నేను స్వతంత్రుడనైతే కదా నా అజ్ఞత, అల్పజ్ఞతల ఆలోచన! "స్వామి చేతిలో శరాన్ని" అయినప్పుడు నాకింకేమి బాధ? ఈ ఆలోచనే అందమైంది. ఈ సుందర భావనే ఈ "సుందరకాండానుభవాన్ని" మిగిలిన (కాండల) అనుభవాలను తరింపజేస్తుంది.

నేను పరతంత్రమైన బాణాన్ని! ధనుర్ధరుడైన దాశరథి నన్ను ఎలా ఉపయోగించుకొన్నా ఆయన ఇష్టమే!

ఆది నుండి తమ అవ్యాజకృపతో నా "శ్రీరామాయణానుభవ" కాండలన్నిటిని తమ మహనీయ మంగళాశాసనాలతో ప్రభావభరితం కావిస్తున్న, పవిత్రమూర్తులు, ప్రాతః స్మరణీయ పాదారవిందులు, పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి (చిన్న) శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి సన్నిధిలో అనేకానేక దాసో2హములు.

ఈ సర్వజిత్ సంవత్సరంలో తమ చాతుర్మాస్య దీక్షా నిర్వహణకై భాగ్యనగర ప్రజలను తరింపజేయడానికి పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి రంగరామానుజ యతీంద్రులు వేంచేసి ఉన్నారు. అహరహము "శ్రీసుదర్శన క్రతు నిర్వహణాది" అనేక సంప్రదాయ కార్యక్రమాలలో క్షణం తీరిక లేకుండా ఉన్నారు.

అంతటి కార్యక్రమాల ఒత్తిడిలో కూడ "శ్రీరామాయణానుభవములో సుందరకాండాను భవాన్ని" కటాక్షించి తమ అమోఘ మంగళాశాసనాలతో తమ అవ్యాజకృపతో నన్ను అనుగ్రహించారు. ఆ పవిత్ర మూర్తుల దివ్యపాదారవిందాల సన్నిధిలో పరశ్శత ప్రణామాలను సమర్పించుకొంటున్నాను.

నేను నా పదవీ విరమణ చేసి, భాగ్యనగరానికి చేరుకొన్న సమయాన్నుండి నేటి దాకా తమ సత్సాంగత్యంతో, "సమమధురోపనతార్థ వాక్యజాతము"తో నాలో శక్త్యుత్సాహాలను, జ్ఞానస్ఫూర్తులను నింపుతున్న "విశదవాక్శిఖామణులు' 'వ్యాకరణశాస్త్ర మర్మజ్ఞులు', 'ఉభయ వేదాంత పారంగతులు', డా. కందాడై రామానుజాచార్య స్వామివారికి హార్దికానేకాభి వందనాలు.

అలాగే "వ్యాఖ్యాతృ వాచస్పతులు", "సాహిత్య సంప్రదాయనిష్ణాతులు", బహు గ్రంథ నిర్మాతలు, "ఆరావముద" ప్రసాదకులు అయిన శ్రీ ఉ.వే.ప్ర. కారంచేటి తిరుమల వేంకట రాఘవాచార్యస్వామి వారికి పరిశ్శత ప్రణామాలు.

సింహాచలం లోని శ్రీమాన్ జి.వి.ఎస్.ఎన్. ఆచార్యుల ద్వారా "నా సుందర కాండానుభవాన్ని' పరిశీలించి అత్యంత సుందరంగా తమ అమూల్యాభిప్రాయాలను అనుగ్రహించిన డా॥ సి. విజయ రాఘవాచార్యులు (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ యూజి. బోర్డ్ ఆఫ్ స్టడీస్ పూర్వాధ్యక్షులు) గారికి అనేక హార్దిక కృతజ్ఞతాంజలులు.

"శ్రీ రామాయణానుభవ" రచనలో నేను తొలి అడుగు వేస్తున్న రోజులలోనే 'సుంధరకాండ' ముద్రణ బాధ్యతను తాము హనుమ ప్రసాదంగా భావించి నిర్వహిస్తామని మాటనిచ్చి, ఇప్పుడా బాధ్యతను అత్యంత సుందరంగా (మూలముతో సహా, ఫోటోలతో సహా) సమగ్రంగా, గురుతరంగా నిర్వహిస్తున్న శ్రీ బూరుగ్గడ్డ సింగరాచార్యుల కుమారులు శ్రీమాన్ బూరుగ్గడ్డ రంగాచార్యులు (నిజామాబాద్) బావగారి సహృదయతకు అనేక కృతజ్ఞతాంజలులు.

శ్రీ సీతారామచంద్ర స్వామివారి కృపాకటాక్షాలు మా బావగారిపై, వారి కుటుంబ సభ్యులపై సంపూర్ణంగా నిరంతరంగా ప్రసరించుగాక!

గతంలో "అరణ్యకాండ", "కిష్కింధాకాండ"ల వలె ప్రస్తుతం సుందర కాండను కూడ అక్షర రామణీయకతతో అందంగా అందిస్తున్న మిత్రులు వి. శ్రీనివాసరావు (ఆర్వీ. ప్రింటర్స్, హైదరాబాదు) గారికి అనేక కృతజ్ఞతలు.

ఈ "సుందరకాండను" అస్మదాచార్యవర్యులు శ్రీ ఉ.వే.ప్ర. జీడికంటి అత్తాన్ నృసింహ దేశికులవారి దివ్య శ్రీహస్తాల ద్వారా సుందరుడు, ఆచార్యుడు, శ్రీ సీతారాముల దివ్యానుగ్రహ సంపూర్ణ పాత్రుడైన ఆంజనేయస్వామి దివ్యపాదారవిందముల సన్నిధిలో అంకితం కావిస్తున్నాను.

ఎందరో మహానుభావులు – అందరికి వందనాలు.

శ్రీ సర్వజిత్ ఆశ్వీయుజము. — బుధజనవిధేయుడు

11-5-29/9, శ్రీ వేంకటేశ్వర కాలని — **ఆచి శ్రీనివాసాచార్య**

సరూర్‌నగర్, హైద్రాబాద్.

# ఉపయుక్త గ్రంథావళి


1. "శ్రీమద్రామాయణము" - శ్రీవాల్మీకి విరచితము- "వ్యాఖ్యాన చతుష్టయ విశిష్టము"
2. శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము - "మందరము" : - శ్రీవావికొలను సుబ్బారావుగారు.
3. "తనిశ్లోకి" - శ్రీపెరియవాచ్ఛాన్పిళ్లై గారు
4. "రామాయణ రత్నాకరము" - శ్రీమాన్ తె.కం. గోపాలాచార్య స్వామివారు.
5. "శ్రీరామాయణ తత్వదీపిక" - శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పళాచార్య స్వామివారు.
6. "శ్రీమద్రామాయణసుధా, స్వాదము" : - శ్రీమాన్ సాతులూరి గోపాలకృష్ణమాచార్య స్వామి వారు.
7. "రామాయణ కల్పవృక్షము" - శ్రీ విశ్వనాథగారు
8. "అంతరార్థ రామాయణము" - శ్రీ వేదుల సూర్యనారాయణ శాస్త్రిగారు
9. "రామాయణము" - శ్రీ ఉషశ్రీ గారు
10. "శ్రీ వాల్మీకి రామాయణ దర్శనము" - శ్రీ పాండురంగ అఠావలెగారు.
11. "శ్రీమద్రామాయణము-విశ్వశ్రేయము" - డా. మల్లాది గోపాల కృష్ణ శర్మ గారు.

# సుందరకాండ-1

"శ్రీరామచంద్రః శ్రితపారిజాతః సమస్త కల్యాణ గుణాభిరామః।

సీతాముఖాంభోరుహచంచరీకో। నిరంతరం మంగళమాతనోతు।"

శ్రీమద్రామాయణంలో ఇది వరకు గడచిన "బాలకాండ" శ్రీరామచంద్ర స్వామి బాల్యాన్ని సీతాకల్యాణం వరకు తెలిపింది. "అయోధ్య", "అరణ్య", "కిష్కింధ" కాండలు స్వామి నివసించిన స్థలాలను వివరిస్తున్నాయి.

అలాగే రాబోయే "యుద్ధకాండ" ప్రధానంగా "రామరావణయుద్ధాన్ని" వివరిస్తుంది. "ఉత్తరకాండ" శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేకానంతరము (ఉత్తర = పట్టభిషేకము తరువాత) జరిగిన సీతావనవాసము, లవకుశ జననము, అశ్వమేధయాగము, సీతాదేవి భూప్రవేశము మొదలైన సంఘటనలను తెలుపుతుంది. ఇందులో "సీతాయాశ్చరితం మహత్" అని సీతాదేవి చరిత్ర అధికంగా ఉంటుంది.

ఈ సుందరకాండ మిగిలిన అన్ని కాండలకంటే విలక్షణమైంది. నిజంగా ఇందులో శ్రీరామునికి సూటిగా సంబంధము కల చరిత్ర చాల తక్కువ. సీతాదేవి చరిత్ర కొంత ఎక్కువ. అయితే వీరి ఇద్దరి కంటే ఆద్యంతములలో కూడ హనుమకు సంబంధించిన చరిత్ర నిండుగా ఉంటుంది.

అటువంటప్పుడు ఈ కాండకు "హనుమత్కాండ" అని పేరు పెట్టవచ్చు కదా! మరి వాల్మీకి కవీంద్రుడు హనుమ పేరును ఈ కాండకు ఎందుకు పెట్టలేదు?

హనుమ అత్యంత వినయ సంపన్నుడు. రాముడు తనను దూతగా పంపడం, తాను సముద్రం దాటి లంకలో సీతాదేవిని సందర్శించి ఆమెను ఓదార్చడం, రాక్షస సైన్యాన్ని వధించడం, సీతాక్షేమవార్తను శ్రీరామునికి తెలియజేయడం మొదలైన అద్భుత కార్యాలను తాను నిర్వహించినా, వీటన్నిటికి కారణము తన గొప్పదనమని హనుమ ఎన్నడు అనుకోలేదు. వీటన్నిటికి "తన పేరు" వాడు కోవడం ఆయనకు ఎంత మాత్రము ఇష్టము లేదు.

1ఈ కాండకు తన పేరుతో "హనుమత్కాండ" అని పేరు పెట్టడం తనకేమాత్రము ఇష్టము లేదని వాల్మీకి మునీంద్రుని కలలో కనబడి హనుమ చెప్పాడని పురాణాంతరాలలో

1. శ్రీమద్రాయణసుధాస్వాదము - పేజీ 155)

ఒక కథ ఉంది. ఆ కథ నిజమో, కాదో తెలియదు. కాని హనుమ స్వభావము మాత్రము ("స్వోత్కర్ష"ను) తన గొప్పదనాన్ని ప్రకటించుకోవడానికి విరుద్ధమని అందరికి తెలిసిందే. "యథా రాఘవ నిర్ముక్తః శరః" అని తనను రాఘవుడు ప్రయోగించిన బాణంగా (రాముని పనిముట్టుగా) హనుమ భావించాడు. బ్రహ్మ వరప్రసాదంగా ("సర్వంతేవిదితంభవతి" అని) అన్ని తెలిసిన వాల్మీకి మహర్షి హనుమ స్వభావాన్ని గుర్తించినందువలన ఈ కాండకు "హనుమత్‌కాండ" అని నామకరణం చేయలేదు. అయితే ఈ కాండను హనుమంతుని పేరు నుండి వేరు చేయడం కూడ వాల్మీకి మునీంద్రుని ఇష్టం కాదు. హనుమ పేరును సూటిగా పెట్టవద్దు. కాని "హనుమ" అనే అర్థము వచ్చేట్లుగా మరేదైనా పేరు పెట్టాలి.

"సుందరో, వానరః కపిః" అని "సుందరుడు", "వానరుడు", "కపి" అనే పదాలు హనుమను సూచిస్తాయి. మిగిలిన పదాల కంటె "సుందరుడు" అనే పేరు బాగుంటుందని వాల్మీకి కవీంద్రుడు అనుకొని ఈ కాండకు "సుందరకాండ" అని పేరు పెట్టాడు.

"పరాశర సంహిత" హనుమంతుని "సుందర హనుమాన్" అని పేర్కొన్నది. హనుమకు సుందరహనుమాన్ అని పేరు. "నామైకదేశే నామగ్రహణమ్" అనే ఒక న్యాయము ఉంది. ఒక పేరులో రెండు మూడు పదాలు ఉంటే ఏ ఒక్క పదమును పల్కినా మొత్తము పేరు వస్తుందని ఆ న్యాయము తెలుపుతుంది. "సుందరహనుమాన్" అని మొత్తము పేరులో "సుందరః" అన్నా "హనుమాన్" అన్నా హనుమంతుడనే అర్థము. అందువలన కూడ హనుమ ప్రాధాన్యాన్ని తెలిపే ఈ కాండకు "హనుమత్కాండ" అని సూటిగా పేరు పెట్టక "సుందరకాండ" అని వాల్మీకి మునీంద్రుడు పేరు పెట్టాడు.

ఆంజనేయస్వామి మరొక విధంగా కూడ సుందరుడే. "అంజనయతీతి అంజనా" అని వ్యుత్పత్తి. "అం" = పరమాత్మను, "జనయతి"=కలిగించేది అంజన. అంజన అంటే (భగవత్) జ్ఞానము. "అంజన" ఆంజనేయుని తల్లి. "జ్ఞానాన్మోక్షః" అని జ్ఞానముద్వారా పరమాత్మ లభిస్తాడు. కనుక "అంజనాదేవి పరమాత్మను కలిగించే జ్ఞానానికి సంకేతము. "ఆంజనాయాః అయమ్ ఇతి ఆంజనేయః" అంజనకు సంబంధించినవాడు ఆంజనేయుడు. "అంజనాయాః అపత్యం పుమాన్ ఇతి ఆంజనేయః". అంజనా దేవి కొడుకు ఆంజనేయుడు. (అంజనకు) జ్ఞానానికి సంబంధించిన విశేష స్వరూపము "ఉపాసనా బుద్ధి" లేక "భక్తి". అందువలన అంజనాదేవి పుత్రుడైన ఆంజనేయుడు (ఉపాసనా) బుద్ధికి లేక భక్తికి సంకేతము. ఆ కారణంగానే ఆంజనేయుని "బుద్ధిమతాం వరిష్ఠః" బుద్ధి కలిగిన వారందరిలో శ్రేష్ఠుడని, వరిష్ఠుడైన శ్రీరామభక్తుడని వర్ణిస్తారు. శ్రీరామునికి (భగవంతునికి) అత్యంత ప్రియమైన (ఉపాసనా) బుద్ధి, భక్తి కూడ సుందరములే కదా! అందువలన ఆంజనేయుడు సుందరుడు.

హృదయస్థానంలో ఉండే చక్రము "అనాహతము". "అనాహతము" అంటే కొట్టబడనిది. పతనం లేనిది. అది బుద్ధికి సంకేతము. అది "విశుద్ధ", "ఆజ్ఞా", "సహస్రార" చక్రాలను అందుకోవడానికి ప్రయత్నిస్తుంది. హనుమ అనాహత చక్రానికి సంకేతం. అందుకే ఆయన బుద్ధి మతాం వరిష్ఠుడు. కుండలినీ శక్తి స్వరూపమైన సీతాదేవిని సహస్రార చక్రం స్థానంలో ఉండే రామ పరమాత్మతో కలుపడానికి ప్రయత్నిస్తాడు.

వాల్మీకి మునీంద్రుడు ఈ కాండకు "సుందరకాండ" అని పేరు పెట్టినప్పుడు మరింత విశాలంగా కూడ ఆలోచించి ఉంటాడు. అప్పుడు "సుందరకాండ" అంటే ఒక హనుమను సూచించేది మాత్రమే కాక "సీతాదేవిని", "శ్రీరామచంద్రుని" కూడ సూచిస్తుంది.

1) "సత్యం, శివం, సుందరమ్" అని పరమాత్మకు మూడు వైదికములైన పేర్లు ఉన్నాయి. అందువలన "సుందరకాండ" అంటే పరమాత్మను (శ్రీరామచంద్రుని) తెలిపే కాండ అని అర్థము.

విష్ణుసహస్రనామము కూడ, "ఉద్భవః, సుందరః, సుందో, రత్ననాభః, సులోచనః" అని భగవంతుని నామాలను వివరిస్తూ ఆయన "సుందరుడు" అని పేరు కలవాడని పేర్కొంది.

ఈ విధంగా "సుందరుడు" అంటే పరమాత్మ.

2) ఇక అమ్మవారి పేర్లలో "సుందరి" అనే పేరు ఒకటి. సర్వజగత్తును మోహింపజేయగలిగిన ఆ జగన్మోహనుడైన పరమాత్మను కూడ తన సౌందర్యము చేత (అజుగాలే తిరుత్తుం) వశపరుచుకోగలిగిన దేవదేవి ఆమె.

అందువలన "సుందరి" అంటే అమ్మవారు లేక శ్రీదేవి. "సుందరశ్చ సుందరీచ సుందరౌ। తయోః కాండః సుందరః కాండః" అని వ్యుత్పత్తి. సుందరుడైన భగవంతుడు, సుందరి అయిన శ్రీదేవి - ఇద్దరు కలసి సుందరులు. వారిద్దరికి సంబంధించిన కాండ. కనుక "సుందరకాండ".

"సుందరే సుందరో రామః। సుందరే సుందరః కపిః।
సుందరే సుందరీ సీతా। సుందరే కిం న సుందరమ్"॥

సుందరకాండలో శ్రీరామచంద్రుడు సుందరుడు. సీతాదేవి సుందరి. కపీంద్రుడైన హనుమ సుందరుడు. సుందరకాండలో సుందరము కానిది ఏది? అని ప్రశ్నిస్తారు పెద్దలు.

**1) రామసౌందర్యము:** హనుమ సీతాదేవికి శ్రీరాముని గురించి తనకు తెలిసినది తెలుపుతూ "రామః కమల పత్రాక్షః సర్వసత్వమనోహరః" అమ్మా! రాముడు తామర పూరేకుల వంటి విశాలనేత్రములు కలవాడు అంటాడు. అప్పుడు సీతాదేవి "మా రాముని విశాలనేత్ర సౌందర్యము మీ కోతులకు ఎలా అర్థమవుతుంది? అని అనుకొంటుంది. అప్పుడు హనుమ "తల్లీ! మా కోతులకే కాదు. సర్వప్రాణుల మనస్సులను హరించే సౌందర్యమమ్మారామసౌందర్యము" అని వివరిస్తాడు. "పుంసాం మోహన రూపుడు" (పురుషులకు కూడ పిచ్చిని కలిగించే అత్యధిక సుందరుడు) శ్రీరాముడు.

2) ఇక సీతాదేవి సౌందర్యమంటారా? "అతిరూపవతీసీతా". ఆమె సౌందర్యానికి సాటే లేదు. ఆంజనేయుడు - అశోకవనంలో సీతాదేవిని చూడగానే ఆమె శ్రీరామునికి (శీలములో వయస్సులో, వృత్తము (నడువడి)లో, అభిజన లక్షణములో) అన్ని విధాల తగినది అని నిశ్చయానికి వచ్చి ఒక్క విషయములో మాత్రము ఆమె "అసితేక్షణ", (నల్లని కన్నులు గలది) కనుక శ్రీరాముని కంటె గొప్పది అనుకొంటాడు. రాముని నేత్ర సౌందర్యముకంటే, సీతాదేవి నేత్ర సౌందర్యమే గొప్పది. సీతాదేవి కన్నులు నల్లనివి, చల్లనివి. ఆ కనులకు కరుణే తప్ప ఆగ్రహము తెలియదు. అవి ఎప్పుడు కోపంతో ఎఱ్ఱబారేవి కావు. తల్లి కనులకు కరుణే సౌందర్యము కదా!

సీతాదేవిని చూడక ముందు, "అయ్యో! రాముడు వశిష్టమహాముని శిష్యుడే? ఇంత గొప్పవాడే? ఒక్క ఆడదాని కొరకు ఇంతగా ఏడువాలా?" అని శ్రీరాముని దుఃఖాన్ని చూచి హనుమ విసుగుకొనేవాడట.

సీతాదేవిని చూచాక, "ఇంతటి సౌందర్యవతిని విడిచి ఇంకా రాముడు జీవిస్తున్నాడంటే రాముడు నిజంగా కఠినుడే "దుష్కరం కృతవాన్ రామో। హీనోయదనయా ప్రభుః" అని బాధపడ్డాడు.

అంతటి సర్వాతిశయ సుందరి సీతాదేవి.

3) సీతారాముల సౌందర్యము జగత్తులో అందరికి తెలిసిందే. అయితే "సుందరే సుందరః కపిః" అని హనుమను కూడ సుందరుడు అంటారే? హనుమ ఒక కోతి కదా! కోతి సౌందర్యానికి గుర్తా? కాదు కదా?

హనుమ కూడ సుందరుడే! "ఆంజనేయ మతి పాటలాననం॥ కాంచనాద్రి కమనీయ విగ్రహమ్' అని ఆయన వర్ణింపబడతాడు. "ఆంజనేయుడు ఎఱ్ఱని ముఖము కలవాడు. బంగారు కొండవంటి సుందర స్వరూపము గలవాడ"ని అంటారు. అందాన్ని బట్టే కాక అనేక లక్షల భక్తుల మనస్సులలో కొలువై ఉన్న ఆంజనేయ స్వామి నిజంగా బంగారు కొండే కదా!

అయితే సౌందర్యమంటే శ్రీమద్రామాయణంలో శరీర సౌందర్యమని మాత్రమే అర్థము కాదు. రామాయణ మహాకావ్యంలో శబ్దాలకు, సాధారణార్థము (వాచ్యార్థము) మాత్రమే ఉండదు.

శబ్దాలకు సాధారణార్థము మాత్రమే ఉండే కావ్యాలు అధమ (నీచ) కావ్యాలు అనబడుతాయి.

సాధారణ (వాచ్య) అర్థముతో పాటు విశేష (వ్యంగ్య / ధ్వని) అర్థము కూడ ఉంటే అవి మధ్యమ కావ్యాలు.

విశేష (ధ్వని) అర్థమే ప్రధానంగా గల శ్రీమద్రామాయణము ఉత్తమ కావ్యము. "సౌందర్యమంటే" విశేషార్థమేమిటి?

"సుతరాం ఆద్రియత ఇతి సుందరః" అని సుందర శబ్దానికి వ్యుత్పత్తి. మిక్కిలి (అందరిచే) ఆదరింపబడేవాడు సుందరుడు. ఈ వ్యుత్పత్తిని బట్టి చూస్తే హనుమే అందరికంటే సుందరుడు.

"మృతసంజీవనం రామవృత్తాంతమ్" అన్నట్లు శ్రీరాముని క్షేమవార్తను సీతాదేవికి తెలిపి, చనిపోవడానికి సిద్ధపడిన ఆమెను బ్రతికించినవాడు హనుమ. అలాగే సీతాదేవి క్షేమవార్తను శ్రీరామునికి తెలియజేసి, ఆయనలో ధైర్యోత్సాహాలను కలిగించినవాడు హనుమ. సీతాదేవిని శ్రీరామవార్తతో శ్రీరాముని - సీతాదేవి వార్తతో బ్రతికించిన మహానుభావుడు హనుమ. వారిద్దరినే కాదు. ఈ కాండను శ్రద్ధతో పఠించే లక్షలాది పాఠకుల మనస్సులలో ఆనందోత్సాహాలను నింపిన హనుమకంటె అమితంగా ఆదరింప బడే, ఆరాధింపబడే సుందరుడు మరెవ్వరు ఉండరు కదా! అలాగే శ్రీరామచంద్రస్వామి చేత ప్రశంసింపబడిన "ఆచార్య హనుమ జ్ఞానము" అత్యంత సుందరమైనది కదా!

ఇంతవరకు కథాపరంగా సీతారామ హనుమల సౌందర్యాన్ని గురించి చూచాము కదా! ఇక సీతా, రామ, హనుమల విశేష పాత్రల సౌందర్యాన్ని చూద్దాము.

శ్రీరాముడు బ్రహ్మాది దేవతల ప్రార్థనను అనుసరించి నరుడుగా ఇక్కడ అవతరించిన భగవంతుడు. సీతాదేవి భగవానుని విడిచి యుండక, అవతారాలలో కూడ తాను అతనిని అనుసరించే జీవాత్మ (రాఘవత్వేஉభవత్ సీతా). హనుమ అంటే పరమాత్మకు దూరమైన జీవాత్మను సమీపించి, ఓదార్చి, పరమాత్మ దగ్గరికి చేరడానికి వీలయిన సంస్కార లక్షణాలను కలుగజేయడానికి భగవంతునిచే పంపబడిన దూత. ఆ భగవద్దూతే ఆచార్యుడు. ఇక వారి సౌందర్యాలను పరిశీలిద్దామా.

1) భగవత్సౌందర్యము:- భగవంతుడు సర్వలోకపిత. జీవాత్మలు అన్ని అతడికి ఆశ్రితులు. కొన్ని జీవాత్మలు (నిత్యసూరులు) అతనితోనే విడువక ఉండి, బ్రహ్మానందాన్ని

పొందుతుండగా, కొన్ని కొంతకాలానికి ఆయనను చేరుకోగా (ముక్తులు), కొన్ని ఆయనకు దూరమై ఆయనను చేరుకోజాలక అపరిమిత దుఃఖాన్ని అనుభవిస్తు ఉంటాయి. రామునికి దూరమైన సీతాదేవి పరిస్థితి అదే.

ఒకరికొరకు దూరమైన జీవపరమాత్మలు దుఃఖాల పాలవుతారు కదా! ఇందులో ఎవ్వరి దుఃఖమధికమంటే, జీవదుఃఖము గోష్పదము ఆవు కాలు గుంట అంత అయితే, పరమాత్మ దుఃఖము సముద్రమంతటిది.

సీతను ఎడబాసిన శ్రీరాముడు దుఃఖంతో పిచ్చెక్కి కనబడిన చెట్టును గుట్టను, పుట్టను సీతా విషయాన్ని అడుగుతూ విలపించాడంటే, లోకసాధారణమైన భార్యా వ్యామోహ దుఃఖముతో కాదు. తనకు దూరమైన జీవాత్మలను విడిచి ఉండలేని పరమాత్మ దుఃఖమది. ఆ వ్యామోహమే, ఆ దుఃఖమే పరమాత్మ సౌందర్యము.

2) జీవ సౌందర్యము :- వియోగ దుఃఖము పరమాత్మకే కాదు. జీవులకు కూడ ఉంటుంది కదా! "అవును ఎడబాసిన దూడ దుఃఖము వంటిది" జీవదుఃఖము. జీవాత్మ స్వభావమేమిటి? 1 భగవంతునికే సేవలు చేయుట (అనన్య శేషత్వము),2 భగవంతుని పైననే సమస్త భారమువేసి అతని రక్షణనే కోరుకొనుట (అనన్య శరణత్వము)3 అతడి ఆనందాన్నే తన ఆనందంగా భావించుట (అనన్య భోగ్యత్వము) ఈ మూడు రకాల స్వభావాన్ని "ఆకారత్రయము" అంటారు.

సీతాదేవి రావణుని చేత అపహరింపబడిన క్షణం నుండి శ్రీరామునే ధ్యానిస్తూ దుఃఖించింది. తనకు రావణాసురుని దగ్ధం చేయగలిగిన శక్తి ఉన్నా, స్వంతంగా తన రక్షణకు తాను ప్రయత్నించలేదు. రాముడే తనను రక్షిస్తాడని గట్టిగా నమ్మి ఉంది. రావణుడు ఎన్ని ప్రలోభాలను కల్పించినా వాటిని గడ్డిపోచతో సమానంగా చూచింది. ఈ ఆకారత్రయ సంపదే జీవాత్మకు (సీతాదేవికి) సౌందర్యము.

3) ఆచార్య సౌందర్యము: భగవంతునికి దూరమైన జీవుల దుఃఖాన్ని చూచి భరించక పోవడం (పరదుఃఖ దుఃఖిత్వము), తనను భగవంతుని యొక్క పనిముట్టుగా భావించుకోవడం, ఆచార్య కటాక్షం చేత తాను సంసార సాగరాన్ని దాటగల్గడం (స్వయం తీర్ణః), తనను ఆశ్రయించిన వారిని దాటింపగల్గడం ( పరాన్ తారయతి), తన ఆశ్రితులకు సంసార సాగరాన్ని దాటడానికి తగిన సంస్కారాలను కల్గజేయడం, భగవదలంకారాలను (శంఖచక్రాదులను) అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని కల్గించడం ఆచార్య సౌందర్యము.

శ్రీరాముని చేతిలో నుండి విడువబడిన బాణము (యథా రాఘవ నిర్ముక్తః శరః)గా హనుమ తనను భావించుకొని, నూరు యోజనాల విస్తీర్ణమైన సముద్రాన్ని దాటి సీతను చూచి తాను కూడ దుఃఖ వివశుడై, ఆమెకు రాముని వార్తను తెలిపి, ఆయన ఉంగరాన్ని ఆమెకిచ్చి, ఆమె "సిగపూవును" (చూడామణిని) తీసికొని, ఆమె విషయాన్ని శ్రీరామునికి నివేదించాడు. ఇది హనుమ యొక్క ఆచార్య సౌందర్యము.

ఇక శ్రీరామాయణము ఒక మహాకావ్యము. కనుక కావ్యసౌందర్యానికి అవసరమైన శబ్ద సౌందర్యము, అర్ధసౌందర్యము, రససౌందర్యము ఈ సుందరకాండలో పుష్కలంగా కనబడుతాయి.

## 1) శబ్దసౌందర్యము

**మహీకృతా పర్వతరాజిపూర్ణా।**
**శైలాః కృతాః వృక్షవితానపూర్ణాః**
**వృక్షాః కృతాః పుష్పవితానపూర్ణాః**
**పుష్పం కృతం కేసరపత్రపూర్ణమ్ (సుంద. 7-9)**

ఈ శ్లోకంలో "కృతా" "పూర్ణా" అనే శబ్దాలు నాలుగు పాదాలలో ప్రయోగించబడి శ్లోకానికి ఒక అందాన్ని తెచ్చాయి. అంతేకాదు. రెండవ చరణంలోని "వృక్ష, వితాన" శబ్దాలు, మూడవ చరణంలో, మూడవ చరణంలోని "పుష్ప" పదము నాలుగవ చరణంలో ఆవృత్తములు అయ్యాయి. ఇటువంటి శ్లోకాలెన్నో ఈ కాండకు శబ్దసౌందర్యాన్ని సమకూర్చాయి.

## 2) అర్ధ సౌందర్యము:-

1) హనుమ వెంద్రుకలతో నిండిన గుండ్రని తన తోకను విదిల్చినపుడు, ఆ తోక పామును పట్టుకొని వెళ్లుతున్న గరుత్మంతునిగా కనబడిందట.

"తస్యలాంగూల మావిద్ధ। మాత్తవేగస్య పృష్టతః
దదృశే గరుడేనైవ। హ్రియమాణో మహోరగః॥"

2) హనుమ తన చేతిని ముందుకు చాచుకొని వెళ్లుతున్నాడు. ఐదువ్రేళ్లుగల ఆ హస్తము అయిదు తలలనెత్తి పోతున్న నాగసర్పము వలె కనబడుతున్నదట.

కాళిదాసంతటి మహాకవీంద్రునికి ఉపమాలంకార భిక్షను పెట్టిన వాల్మీకి కవివతంసుని కవిత్వంలో అర్థాలంకారాలకు కొదువేమిటి?

## 3) రససౌందర్యము

కావ్యరసాలు నవరసాలని ప్రసిద్ధి. శృంగారము, వీరము, కరుణ, శాంతము, హాస్యము, రౌద్రము, భయానకము, భీభత్సము, అద్భుతము అనేవి ఆ నవరసాలు.

శృంగారము "రసరాజము" అంటారు. రసాలన్నిటిలో అది శ్రేష్ఠమైనది. అది "సంయోగము", "విప్రలంభము" అని రెండు రకాలు.

"విప్రలంభ శృంగారము" అంటే నాయికానాయకులు వేరుగా ఉన్నప్పుడు పొందే దుఃఖానుభవము. సీతా, రాముల విరహములో వారిద్దరి అనుభూతి విప్రలంభ శృంగారమును సూచిస్తుంది.

అలాగే సముద్రతరణంలో వీరరసము, అద్భుతరసము, రావణుని ముందు హనుమ పల్కిన పలుకులలో వీరరసము, సీతను రావణుడు, రాక్షస స్త్రీలు బెదిరించినపుడు భయానక రసము, లంకాదహనములో భీభత్సరసము, సీతాదేవి దుఃఖాన్ని చూచినపుడు కరుణారసము, సురస, లంకిణి విషయంలో హాస్యము, లంకాదహనము తరువాత "సీత ఏమైందో?" అని హనుమ బాధపడినప్పుడు శాంతరసము కనబడుతాయి.

# సుందరకాండ ప్రాధాన్యము

శ్రీమద్రామాయణంలో సుందరకాండకు ఉన్న ప్రాధాన్యము మరే కాండకు లేదు.

సుందరకాండను కథాపరంగా ఆలోచిస్తే మొత్తము రామాయణానికే ఈ కాండను సంగ్రహ స్వరూపంగా భావించవచ్చు.

హనుమ లంకలో అశోకవనంలో సీతాదేవిని సందర్శిస్తాడు. రావణుడు తన పరివారంతో సీతాదేవి దగ్గరి నుండి వెళ్లిపోయిన తరువాత హనుమ ఆమె దగ్గరకు వెళ్లి ఆమెతో మాట్లాడి, ఆమె దుఃఖాన్ని తగ్గించాలనుకొంటాడు.

హనుమ సీతాదేవి ముందు వెళ్లే ముందు ఆమెకు తన పట్ల విశ్వాసం కల్గడానికి తాను కూచున్న చెట్టుపైనుండే ఆమె ఉన్న స్థలంలో పడేట్లుగా శ్రీరాముని ఉంగరాన్ని వదిలాడని, ఆమె దానిని చూచి ఆనందాన్ని పొందిన తరువాత ఆయన చెట్టుదిగి వచ్చి ఆమె ముందు నిలిచాడని ఒక రామాయణంలో ఉంది. (తులసీ రామాయణం)

ఆ రామాయణ కర్తకు అలా హనుమ రామాంగులీయకాన్ని వదలడం ద్వారా సీతాదేవికి విశ్వాసం కలుగుతుందనే ఆలోచన వచ్చిఉండవచ్చు. అయితే ఆ ఆలోచన

ఆయన ఊహే కాని నిజం కాదు. అంతేకాదు ఆ కర్త ఊహించినట్లుగా అత్యంత పవిత్రమైన శ్రీరాముని ఉంగరాన్ని అలా ఎక్కడపడితే అక్కడ హనుమ వదలుతాడా? అత్యంత రామభక్తి పూర్ణుడైన హనుమ అలా చేస్తాడని అనుకోవడానికి వీలు లేదు.

పోనీ "సీతాదేవికి సమీపంలో కదా హనుమ శ్రీరాముని ఉంగరాన్ని వదిలాడు. దానిని చూచుకొంటే ఆమెకు ఆనందము, శ్రీరామదూతపట్ల ఆదరము కల్గుతాయి కదా!" అని కూడ అనుకోవడానికి వీలులేదు.

ఒకవేళ హనుమ వదలిన ఉంగరము సీతాదేవికి కొంత దూరంలో పడితే, దానిని ఆ దేవి చూడగల్గేదా?

లేదు, హనుమ వదిలిన ఉంగరము సీతాదేవికి దగ్గరలోనే పడ్డా దానిని ఆమె గమనిస్తుందని ఏమి నమ్మకం? ఆమెకు హనుమ తాను నిలుచున్న చెట్టుపైనే ఉన్నాడని ఆయన ఉంగరాన్ని వదిలాడని తెలియదు కదా?

అంతేకాదు రామ వియోగ దుర్భర దుఃఖంలో ఉన్న ఆమె పరిసరాలను గమనించగల్గిన ధ్యాసలో కూడ లేదు కదా?

సీతాదేవి శ్రీరాముని ఉంగరాన్ని గమనించకపోతే తీవ్ర ప్రమాదం కూడ కలిగేది. అది ఏదో రాక్షసుల కంటపడితే ఎంత ప్రమాదము?

అందువలన సర్వజ్ఞుడైన వాల్మీకి మహాముని సీతాదేవి భయాన్ని పోగొట్టడానికి హనుమ శ్రీరాముని ఉంగరాన్ని క్రిందపడవేశాడని తెలుపలేదు. అప్పుడు జరిగిన వాస్తవ విషయాన్ని మాత్రమే వివరించాడు.

ఆమెకు శ్రీరాముని పట్ల ఆసక్తి, విశ్వాసాలు కలుగడానికి ఆమెకు అత్యంత ప్రియమైన, మృతసంజీవనమైన రామకథను గానం చేయడం మొదలు పెట్టాడు. "రాజాదశరథో, నామ। రథకుంజర వాజిమాన్" ఆ విధంగా ప్రారంభించి కైక వరాల కారణంగా పట్టాభిషేకానికి విఘ్నమేర్పడి, సీతాదేవితో కలసి రామ లక్ష్మణులు అడవికి బయలుదేరడం, అడవిలో రావణుడు సీతాదేవిని అపహరించడం వరకు తెలిపాడు. ఇదంతా సీతాదేవికి తెలిసిన కథే. ఈ కథ విన్నాక చెట్టుపైనున్న హనుమ పట్ల సీతాదేవికి కొంత నమ్మకము ఏర్పడింది.

తరువాత ఆమెకు తెలియని రామ కథను తెలుపసాగాడు. సీతాన్వేషణలో రామ లక్ష్మణులు కిష్కింధకు రావడం, సుగ్రీవసఖ్యము, వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకము, సుగ్రీవుడు నాల్గుదిక్కులలో వానర వీరులను సీతాన్వేషణ కొరకు పంపడం, అంగదుని

నాయకత్వంలో దక్షిణదిశకు బయలుదేరిన వానరులలో నుండి, తాను సముద్రము దాటి లంకలో ప్రవేశించి, సీతను చూడగల్గడం వరకు తెలిపాడు.

దీనివలన సీతాదేవికి ధైర్యోత్సాహాలు కలిగాయి. హనుమను నమ్మింది. ఆయన ద్వారా రామాంగుళీయకాన్ని గ్రహించి, ఆయనకు తన తల పూవును సమర్పించింది.

ఆమెకు ధైర్యాన్ని పూర్తిగా కలిగించడానికి హనుమ రాబోయే కథను కూడ సూచన ప్రాయంగా తెలిపాడు.

"నివృత్త వనవాసంచ। త్వయాసార్ధమరిందమః॥

అభిషిక్త మయోధ్యాయాం। క్షిప్రం ద్రక్ష్యసి రాఘవం"

"దేవీ! శ్రీరామభద్రుడు రావణుని సమూలంగా సంహరించి, నీతో పాటు వనవాసాన్ని ముగించుకొని, అయోధ్యకు తిరిగి వెళ్లి నీతో పాటు పట్టాభిషిక్తుడు కావడం నీవు కళ్లారా చూస్తావు తల్లీ" అని భవిష్యత్కథను కూడ సూచించాడు.

ఈ విధంగా రామాయణ కథ మొత్తమీ సుందరకాండలో చోటు చేసికొంది. కనుక రామాయణం మొత్తము పారాయణం చేస్తే కలిగే పుణ్యమంతా ఈ ఒక్క "సుందరకాండ" పారాయణం వలననే కలుగుతుంది.

అందువలననే కేవలము ఒక్క "సుందరకాండనే" పారాయణం చేసేవారు లెక్కకు మించి ఉన్నారు.

**పారాయణ విధానము:-** సుందరకాండలోని (68) అరువై ఎనిమిది సర్గలను రోజుకొక సర్గ చొప్పున అరువై ఎనిమిది రోజులలో పారాయణం పూర్తిచేయవచ్చు.

లేదా 2,4,4,4,8,1,8,1,7,7,7,6,1,6,2 అనే పద్ధతిలో 16 రోజులు చేయవచ్చును. "రాఘవో విజయం దద్యాత్। మమ సీతాపతి ప్రభుః॥" (యర "ర" 2వ అక్షరం, కఖగఘ "ఘ" 4వ అక్షరం).

లేదా ప్రతి రోజు 7 సర్గల చొప్పున 68 రోజులలో పూర్తిగా 7 పర్యాయాలు పారాయణం చేయవచ్చును. దీనిని "సప్త సర్గ పారాయణము" అంటారు. ఈ పద్ధతి వెంటనే ఫలాన్ని ఇస్తుంది. మొదట సంక్షేప రామాయణము, శ్రీరామావతారం చదివాక సప్త సర్గ పారాయణం తరువాత శ్రీసీతారామపట్టాభిషేకం పారాయణం చేస్తే మన కోరికలన్ని తీరి, మన ప్రతిబంధకాలు పటాపంచలవుతాయి.

ఇక సుందరకాండలోని వేర్వేరు ఘట్టాలను పారాయణం చేస్తే వేర్వేరు ఫలితాలు కలుగుతాయని "తత్వసంగ్రహ రామాయణము" తెలుపుతుంది.

(1) సుందరకాండలోని మొదటి సర్గ. హనుమ సముద్రాన్ని దాటేప్పుడు విజృంభించిన తీరును పారాయణం చేస్తే కుష్టు మొదలైన రోగాలు, భూత భేతాళాది గ్రహ బాధలు తొలగి పోతాయి.

(2) "సనిర్జిత్య పురీం శ్రేష్ఠాం" అనే శ్లోకము పఠనం వలన బంధవిముక్తి కలుగుతుంది. బ్రహ్మప్రాప్తి కలుగుతుంది.

(3) "సీతా సందర్శన" ఘట్టము వలన శోకము నశిస్తుంది.

(4) "త్రిజటా" స్వప్న వృత్తాంతము వలన దుస్స్వప్నాలు దూరమై పోతాయి.

(5) "శ్రీరాముని ఉంగరాన్ని సీతకు అందివ్వడం" పారాయణం చేస్తే యుద్ధం లో శత్రువులను జయించి, స్థిరంగా రాజ్యాన్ని పాలిస్తారు.

(6) "ధన్యా దేవా స్సగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః" అనే శ్లోకం వలన స్వేచ్ఛా సంచార శక్తి కలుగుతుంది.

(7) "హనుమంతుని బ్రహ్మాస్త్ర బంధము" పారాయణం వలన బంధవిముక్తి కలుగుతుంది.

(8) "లంకాదహనము" పారాయణం తాపత్రయాలను తొలగిస్తుంది.

(9) "మంగళాభిముఖీ" శ్లోక పారాయణం వలన సౌందర్య ప్రాప్తి కలుగుతుంది.

(10) మొత్తము సుందరకాండ పారాయణము వలన హనుమ ప్రసాదము, బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతాయి.

వ్యాధులు, కారాగార బాధలు గ్రహపీడలు, సంతానము లేక పోవుట, దారిద్ర్యము, శస్త్ర, చోర, అగ్ని బాధలు, మిగిలిన అనిష్టాలన్ని తొలగి రాజ్యసంపద, పూర్ణాయుష్యము, ఆరోగ్యము, ధనము, భూలాభము, విద్య, స్త్రీ సౌఖ్యము, కీర్తి ప్రతిష్టలు మొదలైన సకలాభీష్టాలు లభిస్తాయి.

ఈ విధంగా అనేక బీజాక్షర సమన్వితమై, సమస్త రామకథా సంపూర్ణమైన సుందరకాండ పారాయణము సమస్త ఆపదలను పోగొట్టి, సకల శుభాలను కలిగిస్తుంది.

ఓం తత్సత్

# సుందరకాండ - కథాభాగము

# సముద్ర తరణము-2

"తతోరావణ నీతాయాః సీతాయాః శత్రు కర్శనః
ఇయేష పదమన్వేష్టుం చారణా చరితేపథి":

సుందరకాండలో మొదటి శ్లోకమిది. ఇది కేవలము ఒక శ్లోకమే కాదు. ఇది ఒక మహామంత్రము కూడ. ఇటువంటి మహామంత్రాలు సుందరకాండ అంతా నిండి ఉన్నాయి.

ఈ శ్లోకాలను ఆచార్యుని సన్నిధిలో ఉపదేశంగా పొంది నిత్యపారాయణంలో పెట్టుకొంటే ఈ సుందరకాండ సకల ఆపదలను నివారించి అన్ని కోరికలను తీర్చిపెట్టు తుంది. ఇంతకు ముందు కాండలో హనుమ మనస్సులో లంకకు వెళ్లినట్లు భావించుకొన్నాడు. ఇప్పుడు శరీరంతో వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు.

గాయత్రీమంత్రం లోని 12వ అక్షరం "వ" ను మొదటి ఈ శ్లోకంలో 4వ అక్షరంగా ప్రయోగించాడు.

ఈ శ్లోకం "తత్" శబ్దంతో (తతో అని) మొదలయింది. ఈ కాండలోని చివరి శ్లోకం కూడ "తత్" శబ్దంతోనే (తతోమయా) మొదలవుతుంది.

"తత్" అనే పదము పరమాత్మను తెలుపుతుంది. పరమాత్మ (తత్) నామంతో మొదలయి, అదే పదంతో పూర్తి అయిన సుందరకాండ పాఠకులకు, శ్రోతలకు భగవదనుగ్రహాన్ని కల్గిస్తుంది. "సీతా" శబ్దము అమ్మవారి, శ్రీదేవి యొక్క పారతంత్ర్య స్వరూపాన్ని, తద్వారా ఆమె పురుషకారశక్తిని సూచిస్తున్నది.

"తత్" లో "త" అనే బీజాక్షరము ఉంది. "రావణ" శబ్దంలో "వ" అనే బీజాక్షరము ఉంది. బీజాక్షరాలు శక్తిమంతమైనవి. బీజాక్షరాలు కలిగినందువలన కూడ ఈ శ్లోకము – తద్వారా ఈ కాండ శక్తిమంతమైనది. "తకారో విఘ్న నాశకః" "తు" అనే బీజాక్షరము విఘ్నాలను పోగొట్టుతుంది.

ఇంతకుముందు కిష్కింధాకాండలో మొదట హనుమంతుడు రామలక్ష్మణులను కలసినప్పుడు రాముని పరమాత్మ లక్షణాలు, హనుమంతుని ఆచార్య లక్షణాలు సూచింప బడ్డాయి.

తారా, వాలుల ద్వారా శ్రీరాముని కల్యాణ గుణాలు కీర్తింపబడ్డాయి. వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకాదుల ద్వారా శ్రీరామచంద్రుని ఆశ్రితులు రక్షింపబడడము స్పష్టమైంది. హనుమ తన మనస్సు ద్వారా లంకకు వెళ్లినట్లు భావించుకొన్నాడు.

ఇక ఈ కాండలో శ్రీరామచంద్రుని సర్వశత్రు వినాశక శక్తి రావణుని ముందు రాముని పరాక్రమాన్ని వివరిస్తూ హనుమ పలికిన "బ్రహ్మా స్వయం భూః చతురాననోవా" అనే శ్లోకం ద్వారా తెలుపబడింది.

"తృణమంతరతః కృత్వా" అనే శ్లోకం ద్వారా సీతాదేవి పాతివ్రత్య మహిమ నిరూపించ బడుతున్నది. ఎంత సేపయినా సీతాదేవి కనబడకున్నా, ఆశ విడువక సీతాదేవిని అశోకవనంలో చూడడము, రాక్షసులెవ్వరు గమనించకుండా, సీతాదేవి తనను నమ్మేట్లుగా ఆమెతో సంభాషించడం హనుమ యొక్క దౌత్యనీతికి, శిష్యుని వెదుకుటలో ఆచార్యుని ఓర్పు నేర్పులకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. శ్రీరాముని ఉంగరాన్ని సీతాదేవికి అందించడం, ఆచార్యుడు భగవంతుని అసాధారణ లక్షణాలయిన శంఖచక్రాలను జీవునికి ప్రసాదించడాన్ని సూచిస్తున్నది.

ఇక ఈ మొదటి శ్లోకార్థమును విచారిద్దాము.

తతః = అందువలన, ఆ తరువాత.

జాంబవంతుని ద్వారా స్తోత్రము చేయబడి, వానరులందరికి తన సామర్థ్యాన్ని వివరించిన తరువాత శత్రుహంత అయిన హనుమచారణులనే దేవగాయకులు సంచరించే ఆకాశమార్గం ద్వారా వెళ్లి రావణుని చేత అపహరింపబడి, నిర్బంధింపబడిన సీతాదేవి ఉన్న స్థలాన్ని వెతుకాలని సంకల్పించాడు.

ఇక్కడ హనుమ శత్రుకర్శనుడు. అంటే శత్రువులను (తన పరాక్రమంతో) కృశింపజేసేవాడు. సురస అనే దేవమాతను వశపరచుకోవడం, సింహిక అనే రాక్షసిని సంహరించడం, లంకిణిని పరాభవించడం, అక్షయ కుమారునితో సహా రావణసైన్యాన్ని మట్టుబెట్టడం మొదలయిన పనులన్ని ముందు హనుమను "శత్రుకర్శనుడని" తెలుపుతాయి.

రావణాసురుడు సకల జగత్తును తన పరాక్రమంతో గడగడలాడించిన మహా బలవంతుడు. అహంకారి. ఆయనకు పది తలలు. (ఇరువై కళ్లు) ఇరువై చేతులు. ఆయన ఇరువై ఆయుధాలను ఒకేసారి ప్రయోగించగల్గిన శక్తి సంపన్నుడు. ఆయన సీతాదేవిని

అపహరించాడు. ఆమెను బలవంతంగా శత్రు దుర్భేద్యమైన లంకానగరంలో అనేక భయంకర రాక్షస స్త్రీల మధ్య దాచి ఉంచాడు.

అదిగో ఆ విధంగా దుర్భేద్యమై సీతాబంధన స్థలమైన లంకను వెతుకాలని హనుమ అనుకొన్నాడు. ఇంకా హనుమ ప్రయాణము మొదలే కాలేదు. వెళ్లుదామని హనుమ సంకల్పించుకొన్నాడు. అంతే. అనుకోవడమే ముఖ్యమా? అంటే హనుమ సంకల్పమే ముఖ్యము.

హనుమ ఆచార్యునికి సంకేతము కదా! ఆచార్యుడు కూడ భాగవతోత్తములందరి ప్రోత్సాహాన్ని స్వీకరిస్తాడు. ఆయన కూడ ముముక్షువులైన చేతనులకు భగవద్రక్షణను కలిగించడానికి పరమపదం నుండి ఇక్కడ అవతరించిన దేవదూత.

ఆయన కూడ శత్రుకర్శనుడు. సంసారసాగరమే ప్రబల శత్రువు. ఆ సముద్రం నుండి తనను పరమాత్మ యొక్క చేతి పనిముట్టుగా భావించుకొని దాటగల్గుతాడు (స్వయం తీర్ణః). తనను ఆశ్రయించిన వారిని ఆ సంసార సముద్రాన్నుండి తరింప జేయగల్గుతాడు (తారయతి).

ఆ సంసార సముద్రం దాటడంలో మరికొన్ని శత్రువులెదురవుతాయి. అవే (1) కామ (2) క్రోధ (3) లోభ (4) మోహ (5) మద (6) మాత్సర్యాలు. ఇవి ఆరు. ఈ ఆరు శత్రువులను అరిషడ్వర్గాలు అంటారు. ఆచార్యుడు ఈ అరిషడ్వర్గాలను శమింపజేస్తాడు.

చేతనునికి (మనకు) పది ఇంద్రియాలు, ఒక మనస్సు ఉంటాయి. ఈ పది ఇంద్రియాలు, మనస్సుకు లోబడి ఉంటాయి. పది ఇంద్రియాలతో కూడిన మనస్సే రావణుడు. పది ఇంద్రియాలు కొన్ని పనులను చేస్తాయి. కొన్ని పనులను మానివేస్తాయి. చేయడాన్ని "ప్రవృత్తి" అంటారు. మానడాన్ని "నివృత్తి" అంటారు. ఒక్కొక్క ఇంద్రియము ఈ రెండు స్వభావాలను కలిగి ఉంటుంది. ఈ రెండు స్వభావాలే రెండు చేతులు. మనందరికి ఒకే తల కనుక రెండే చేతులు. రావణాసురునికి పది తలలు కనుక ఇరువై చేతులు, పది తలలు (పది ఇంద్రియాలు) ఇరువై చేతులు (ప్రతి ఇంద్రియానికి ప్రవృత్తి, నివృత్తి అనే రెండు స్వభావాలు) గల మనస్సు అహంకారంతో నిండి ఉంటుంది. అది ఎప్పుడు చెడు పనులనే చేయాలనుకొంటుంది. జీవుని మనస్సులోబరచుకొంటుంది. జీవుని ఇష్టానికి వ్యతిరేకంగా అతనిని ఒక శరీరంలో బంధించి ఉంచుతుంది. జీవుడు (ముముక్షువు) తన భర్త అయిన పరమాత్మకు దూరమై పరితపిస్తూ ఈ శరీరం నుండి విముక్తిని పొంది భగవంతుని చేరుకోవాలనే ఆర్తిని కలిగి ఉంటాడు.

పరమాత్మ ప్రతినిధిగా బయలుదేరిన ఆచార్యుడు జీవుని చేరుకొని, అతనికి పరమాత్మ లక్షణాలను కలుగజేసి, పరమాత్మ అభయాన్ని ఆ జీవునికి అందజేయాలని అనుకొంటాడు. ఆచార్యుడు ముముక్షువైన జీవుని చేరుకోవడానికి చారణులు సంచరించే ఆకాశమార్గంలో వెళ్లుతాడు.

ఇక్కడ "చారణులు" అంటే "ఆచరణము" లేక "ఆచారము" కలిగిన పూర్వాచార్యులు. వారు ఆచరించిన విధానము చారణుల మార్గము. అది ఆకాశమార్గమే. "ఆకాశమ"ంటే భగవంతుడే. భగవంతుడు నిర్దేశించిన, పూర్వాచార్యులు నడచిన మార్గంలోనే వెళ్లి జీవుని ఆదుకోవాలని ఆచార్యుడు సంకల్పిస్తాడు. వెదుకదలచింది "సీతను" అనగా పారతంత్ర్య స్వరూపాన్ని కలిగిన శిష్యుని.

వెళ్లడమైతే బాగానే ఉంటుంది. కాని వెళ్లాలని ఊరకే అనుకొంటే ఏమి లాభము? ఆచార్యుని సంకల్పమే అమోఘమైనది. అది ఆశ్రితులను ఉజ్జీవింపజేస్తుంది.

శ్రీరామానుజుల సంకల్పము పాలు అమ్ముకొనే స్త్రీకి, నంబిళ్లై గారి సంకల్పము – కాలక్షేప మందిర నిర్మాణం కొరకు ఇంటిని దానం చేసిన స్త్రీకి వేంకటేశ్వరుని కృపను, రంగనాథుని యొక్క అనుగ్రహాన్ని కల్పించాయి కదా! అందువలన పెద్దలు తమ మనస్సులలో మనము బాగుపడాలని కోరుకొంటే చాలు. మనము తప్పక ఉజ్జీవిస్తాము.

అందుకే భగవద్రామానుజులు, "యద్వాభాగవతాభిమాన వసతిః" అని భాగవతాభిమానమే సకల శ్రేయస్సులను కలిగిస్తుందని సెలవిచ్చారు. అలాగే ఇక్కడ ఆచార్యుని సంకల్పమే ఆశ్రితులకు విముక్తికి కారణము అవుతుంది.

హనుమ ఇతరులెవ్వరికి సాధ్యము కాని అతి గంభీరమైన సముద్ర తరణానికి పూనుకొని ఆబోతు కోడెవలె ధైర్యంతో తల ఎత్తి నిలిచాడు. సంసార సముద్రాన్ని దాటడానికి స్వాచార్యుడు అనుగ్రహించిన మంత్ర రాజాన్ని ఉపాసిస్తూ మంత్ర స్వరూపుడై ధైర్యంగా తల ఎత్తి నిలిచిన ఆచార్యుని హనుమ స్ఫురింప జేశాడు.

ఆచార్యుడు ప్రాపంచిక భోగాలయందు ఆసక్తుడు కాక భగవద్విషయంలోనే తన దృష్టిని కేంద్రీకరించినట్లు హనుమ ఆ పర్వత సానువులలోని పచ్చిక బయళ్లలో తిరుగుతున్నా వాటి సౌందర్యము పట్ల ఆకర్షితుడు కాకుండా రామకార్యాన్ని గురించే ఆలోచిస్తున్నాడు.

సింహము వంటి ఆయన గంభీర రూపానికి భయపడి పక్షులు పారిపోయాయి, మృగాలు మరణించాయి. ఆయన మడుగులో స్వైర విహారం చేస్తున్న మత్త గజము వలె కనబడుతున్నాడు.

తాను నిర్వహించబోయే కార్యము సిద్ధించడానికి హనుమ సకలలోక సాక్షియైన సూర్యునికి, మూడు లోకాల ప్రభువైన మహేంద్రునికి, తన తండ్రి అయిన వాయుదేవునికి, సృష్టికర్త అయిన బ్రహ్మదేవునికి మనసారా ప్రణమిల్లాడు.

పర్వదినాలలో సముద్రము ఉప్పొంగినట్లు, రామకార్యసిద్ధి కొరకు హనుమ పొంగిపోతున్నాడు.

ఇక ఆ పర్వతం పై నుండి ఆకాశంలోకి ఎగురాలనుకొన్నాడు. ఆ కొండను తన కాళ్లతో చేతులతో బలంగా అదిమాడు. ఆ కొండ కొంత కదిలింది. ముందుగా చెట్ల పూలన్ని జలజల రాలాయి. ఏనుగు తొండాన్నుండి కారే మదధారలవలె ఆ కొండనుండి రంగు రంగుల ధారలు స్రవించసాగాయి. నల్లని మనశ్శిలలు కొండనుండి దొరలి క్రింద పడసాగాయి. కొండల నుండి స్రవించే రంగురంగుల ధారలు మనలోని సత్వ, రజ, స్తమోగుణాలు. ఆచార్యుని శ్రీపాద స్పర్శతో అవి దూరమవుతాయి.

"హనుమ మరింత గట్టిగా కొండను నొక్కాడు. ఆ కొండ గుహలలోని జంతువులు ఆ ఒత్తిడిని తట్టుకోలేక ప్రాణభయంతో బిగ్గరగా అరవసాగాయి. బిలాలలోని సర్పాలు విషాన్ని వెడలగ్రక్కుతూ ఆ పర్వత శిలలను కాటువేయసాగాయి. యోగాభ్యాస క్రమంలో కొన్ని శబ్దాలు వినవస్తాయి. శరీరంలో కొన్ని మార్పులు కలుగుతాయి. వాటిని జంతువుల అరుపులు, పాము కాట్లు సూచిస్తున్నాయి.

ఆ పర్వతముపై విద్యాధరులు తమ తరుణులతో విలాసంగా మద్యపానం చేస్తున్నారు. ఆకస్మికంగా జంతువుల అరుపులు, పడిపోయే కొండ రాళ్లను చూచి ఆ పర్వతము బ్రద్దలవుతున్నదనే భయంతో ఎక్కడి వస్తువులను అక్కడే వదలి ఆకాశంపైకి ఎగిరి ఆశ్చర్యంతో చూడసాగారు.

ఆ మహాపర్వతం పైనున్న మహానుభావులైన మహర్షులు "రామ కార్యార్థమై హనుమ కొండంత శరీరంతో నూరు యోజనాల విశాలమైన సముద్రాన్ని దాటబోతున్నాడ"ని తెలిపారు.

హనుమ తన శరీరాన్ని యోగాభ్యాస వశం చేశాడు, చేతులను కదలకుండా బిగించి, నడుమును సన్నగా చేసి, మెడను సంకోచింప జేసి ఎగరడానికి వీలుగా పాదాలను ముడిచి యోగ నియమాలను పాటించాడు.

"రురోధ హృదయే ప్రాణాన్, ఊర్ధ్వంప్రహితేక్షణః"

కనుబొమ్మల మధ్య దృష్టిని నిలిపి హృదయస్థానంలో ప్రాణాలను బలంగా నిలిపాడు. దీనివలన "ప్రాణాయామాన్ని" సాధించాడు.

పాదాలను కొండపై గట్టిగా పట్టి నిలుచుట చేత "ఆసన" నియమము పాటించాడు.

చెవులను ముడిచి, ఆకాశాన్నే చూస్తూ "ప్రత్యాహారాన్ని" పాటించాడు. ఈ విధంగా సముద్ర తరణ సమయంలో హనుమ పాటించిన యోగశాస్త్ర నియమాలు కొన్ని ఉపలక్షణ విధిగా తెలుపబడ్డాయి.

ఇక ఆంజనేయస్వామి తన లక్ష్యాన్ని ప్రకటిస్తున్నాడు. "శ్రీరామచంద్రస్వామి ప్రయోగించిన బాణము వాయువేగముతో వెళ్లి లక్ష్యాన్ని ఛేదించి తిరిగి వెళ్లి స్వామి అమ్ముల పొదలో చేరుకొన్నట్లే తాను కూడ ఎక్కడ ఆగకుండా అతివేగంగా వెళ్లి సముద్రందాటి, లంకలో ప్రవేశించి సీతాదేవి జాడతెలిసికొని, ఆమెకు శ్రీరాముని అభయాన్ని అందజేసి తిరిగి వచ్చి స్వామి సన్నిధిలో చేరుతానని" తెలిపాడు.

(ఆచార్యుడు కూడ భగవత్సంకల్పంతో భూమండలంపై అవతరించి, ప్రాపంచిక సుఖాలకువేటికి వశం కాకుండా, పరమాత్మ పట్ల ప్రేమగల ఆర్త జనులను సమీపించి వారికి భగవల్లాంఛనాలను అందజేసి తిరిగి స్వామి సన్నిధికే చేరుకొంటాడు)

"ఒకవేళ సీతాదేవి లంకలో లేకుంటే, స్వర్గంలోనైనా రావణుడు ఆమెను దాచే వీలు ఉంది కనుక స్వర్గానికి వెళ్లి ఆమె జాడను కనుగొని వస్తానని, అక్కడ కూడ సీతాదేవి కనబడకపోతే మొత్తము లంకనే పెకిలించి రావణునితో సహా తెచ్చి రామపాదాలపై పడవేస్తానని" హనుమ తన అనుచర వానరుల ముందు ప్రకటించాడు.

ఇంత[illegible]నవారి ముందు హనుమ తన గొప్పదనాన్ని చెప్పుకోవడం అహంకారం కాదా? అంటే ఎంత మాత్రము కాదు. అది ఆయన (ధృతిని) ధైర్యాన్ని తెలుపుతుంది. ఎక్కడి నుండి వచ్చిందాయనకీ ధైర్యము? తనను స్వామి చేతిలోని బాణము వలె భావించు కొన్నప్పుడే, "రామచంద్రస్వామే స్వయంగా ఆయన పనిని తన ద్వారా చేయించు కొంటాడని, భారమంతా రాముని దేనని భావించినప్పుడే హనుమకీ ధైర్యము, ఈ ఆత్మ విశ్వాసము కల్గాయి". మన సర్వభారము స్వామిదే అని నమ్మితే మనకు మాత్రము ధైర్యము రాదా?

హనుమ తనను గరుడపక్షిగా భావించుకొని ఆకాశంలోకి ఎగిరాడు. ఆకాశగమనంలో తనను గరుడునిగా భావించుకోవడం, నీటిలో ప్రయాణంలో తనను చేపగా భావించు కోవడం యోగాభ్యాస నియమాలే.

హనుమ హఠాత్తుగా బలంగా కొండపైనుండి ఆకాశంలోకి ఎగిరినప్పుడు ఆ కొండ కంపించింది. అప్పుడు ఆప్తులు తమ ఇంటికి వచ్చి వెళ్లేప్పుడు వారిని సాగనంపడానికి, వారి వెంట కొంత దూరము నడచి వెళ్లే గృహస్థుల వలె ఆ కొండపై నున్న పూల చెట్లు కొండ నుండి వేరై కొంత దూరం హనుమను అనుసరించి వెళ్లి సముద్రంలో పడిపోయాయి.

బలమైన మరికొన్ని చెట్లు, రాజును అనుసరించి వెళ్లే సైనికులవలె హనుమను మరికొంత దూరము అనుసరించి, తర్వాత సముద్రంలో పడిపోయాయి.

ఆకాశాన్ని, సముద్రాన్ని కూడ త్రాగుతున్నాడా? అన్నట్లుగా హనుమ సమద్రము పై నుండి ఆకాశమార్గంలో వెళ్లుతున్నాడు. ఆయన పచ్చని కళ్లు గుట్టపై మెరసే రెండు అగ్నుల వలె ప్రకాశించాయి. సూర్యచంద్రుల వలె మెరుస్తున్నాయి.

ఆయన తలపై వెనుకకు వంగిన ఆయన తోక ఇంద్రధనుస్సు వలె ఉంది. దక్షిణము వైపు వెళ్లుతున్న ఆయన తలపైకి వంగిన తోక దక్షిణ దిశలో ఉదయించిన తోకచుక్కవలె కనబడుతున్నది. ఆయన తొడల గాలికి తొలిగిన సముద్ర జలములోని జలచరాలు, శరీరము పై వస్త్రము తొలిగినప్పుడు కనపబడే అవయవాలవలె కనబడుతున్నాయి.

ప్రాతఃకాలములో సముద్రాన్ని దాటుతున్న హనుమ శరీరమునీడ సముద్రములో పది యోజనాల వెడల్పు, ముప్పై యోజనాల పొడవుతో పెద్దగా కనబడింది.

రంగు రంగుల మేఘాలను చీల్చుకొంటు వెళ్లుతున్న హనుమ వాటిమధ్య దోబూచులాడే చంద్రుని వలె ప్రకాశించసాగాడు.

హనుమ ప్రయాణాన్ని ఆమోదించిన ఆదిత్యభగవానుడు హనుమకు హాయిని కలిగించే గోరువెచ్చని ఎండను మాత్రమే కాస్తున్నాడు. తన కుమారుని ప్రయాణానికి సహకరించాలనే ఉద్దేశ్యముతో వాయుదేవుడు చల్లని గాలిని వీస్తున్నాడు.

అంతటి అద్భుత రామకార్యాన్ని నెరవేర్చడానికి వెళ్లుతున్న హనుమపై దేవతలు పుష్ప వర్షాన్ని కురిపించారు గంధర్వులు మధుర గానాలను ఆలాపించారు. ఋషులు హనుమను ప్రస్తుతించారు, ఆశీర్వదించారు.

"పవమానుడు సుతు కౌగిలించుకొంచు అంతట వెన్కకేగి
ప్రమదాకృతి ఈలలు వేసికొంచొగిన్" - విశ్వనాథ

# మైనాకుని స్వాగతము-3

హిరణ్యనాభోమైనాకః। నిశమ్య లవణాంభసః।
ఉత్పపాత జలాత్తూర్ణం। మహాద్రుమలతాయుతః॥

హనుమ రామకార్యార్థమై ధైర్యంతో తదేక దృష్టితో సముద్రం పై నుండి ఆకాశ మార్గంలో పయనిస్తున్నాడు.

అప్పుడు సముద్రుని కొక ఆలోచన కలిగింది. "నేను ఏర్పడడానికి సగరపుత్రులు త్రవ్విన గుంటలే కారణము కదా! (ఆ గుంటలలో నీరు నిండితే సముద్రమైంది. సగర పుత్రులు త్రవ్వితే ఏర్పడింది కనుక సాగరమైంది) ఇప్పుడు ఆ సగరుని వంశంలోని వాడైన శ్రీరామచంద్రుని భార్యను వెతుకటానికి హనుమ వెళ్లుతున్నాడు. హనుమకు కొంత విశ్రాంతి సౌఖ్యాన్ని కల్పిస్తే సగర వంశస్థుడైన శ్రీరామచంద్రునికి కొంత సేవ చేసినట్లు అవుతుంది. "కృతేచప్రతికర్తవ్యం। ఏష ధర్మస్సనాతనః" మేలు చేసినవాడికి ఏదైనా మళ్ళీ ఉపకారము చేస్తే మంచిది. అదే వెనుకటి నుండి వస్తున్న ధర్మము" అని సాగరుడు భావించాడు. తన మధ్యలో పాతాళం వరకు వ్యాపించిన మైనాకునితో ఈ విధంగా అన్నాడు.

"పర్వతరాజా! నాకు జన్మనిచ్చిన సాగరుల వంశంలోనివాడైన శ్రీరామునికి మేలు చేయడానికి హనుమ మనపై నుండి వెళ్లుతున్నాడు. ఆయనకు కొంత విశ్రాంతిని కల్పిస్తే శ్రీరామచంద్రుడు తద్వారా పితృలోకంలోని సాగరులు సంతోషిస్తారు. అందుకు నాకు నీ సహాయము అవసరము.

"నీవు ఫలపుష్ప తరువులతో సహా ఆంజనేయుని సమీపించు. ఆంజనేయుడు నీ పర్వత శిఖరాలలో విశ్రాంతిని తీసికొని, ఫలాలను తిని, మధుర జలాలను త్రాగుతాడు.

ఆ విధంగా హనుమను సంతోషపెట్టడం నీకు కూడ ధర్మమే. ఎందుకంటే ఆంజనేయుని తండ్రి అయిన వాయుదేవుడు ఇంద్రుని వజ్రాయుధానికి అందకుండా నిన్ను రక్షించి తెచ్చి నా (సముద్ర) మధ్యలో దాచాడు కదా! ఇప్పుడు హనుమకు సంతోషాన్ని కల్గిస్తే ఒక్క ఆయనే కాక ఆయన తండ్రి వాయుదేవుడు కూడ సంతోషిస్తాడ"ని తెలిపాడు.

మైనాకుడు తనకు చోటిచ్చిన సముద్రుని మాట వింటే సముద్రునికి, తనను సముద్రంలోకి తెచ్చి దాచిన వాయుదేవునికి ప్రత్యుపకారం చేసినట్లవుతుందని భావించాడు.

బంగారు కాంతులీనే తన పర్వతశిఖరాలతో, మహా మధుర ఫలాలతో, స్వచ్ఛ జలాలతో, దివ్యౌషధులతో హనుమ ముందు నిలిచాడు.

రామకార్యంపైననే దృష్టి నిలిపి రామబాణం వలె ఎక్కడ ఆగకుండా అతి వేగంగా లంకకు చేరుకోవాలని అనుకొంటున్న హనుమ మైనాక పర్వతమును తన దారికి అడ్డంగా భావించి తన వక్షస్థలంతోనే దానిని గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకు ఆ కొండ గిరగిర తిరిగి పడిపోయింది. వెంటనే లేచి మానవాకారాన్ని ధరించింది. హనుమతో ఈ విధంగా అంది, "కపిశ్రేష్ఠా! నీవు సముద్రునికి, నాకు కూడ అతిథివి. నీకువిశ్రాంతిని కల్పించడం ద్వారా నిన్ను సన్మానించాలని సముద్రుడు, నేను కూడ అనుకొని, నీ ముందు తరులతా ఫల పుష్పాదులతో నిలిచాను. నా మధుర ఫలాలను ఆరగించి, తీయని పానీయాలను త్రాగి, మా ఆతిథ్యాన్ని స్వీకరించుమ"ని ప్రార్థించి, తిరిగి గిరి రూపాన్ని ధరించాడు.

అపకారి అనుకొన్నది ఉపకారిగా మారడం హనుమకు సంతోషమును కల్గించింది. ఆయన కూడ మైనాకునితో, "మిత్రమా! నేను దారి మధ్యలో ఎక్కడ ఆగకుండా రామబాణము వలె వెళ్లాలనుకొన్నాను. నేనింకా ప్రయాణించాల్సిన దూరం ఎక్కువగా ఉంది. సమయం ఎక్కువ లేదు. తొందరగా వెళ్లాలి. నీవేమి వేరే అనుకోవద్దు సుమా! నీవు చక్కని ఆతిథ్యాన్నిచ్చినట్లే భావిస్తాను" అని తన చేతితో ఆ పర్వతాన్ని స్పృశించి ముందుకు వెళ్లాడు.

ఇది ఒక అద్భుత కార్యము! సుదీర్ఘ ప్రయాణం చేస్తున్నవారికి మధ్యలో ఆగాలని, ఆహారాన్ని, పానీయాలను స్వీకరించాలని, విశ్రాంతి తీసికోవాలని సహజంగా అనిపించి ఏదో ఒక తగిన చోటు కొరకు వెతుకుతుంటారు.

ఆంజనేయునికి ఆ విశ్రాంతి స్థలము ఎదురు చూడకుండానే సహజంగానే లభించింది. ఒక్క స్థలమే కాదు దివ్య ఫలపుష్పాలు, మధుర పానీయాలు, ఎదురుగా నిలిచాయి. ఆ పర్వతము నిజంగా "నా స్వర్గము" "మేనాకః" అన్నట్లు ఉంది. వేరే ఇంకెవ్వరైనా అయితే ఆగి, తగిన ఆహార పానీయాలను స్వీకరించి, తగినంత విశ్రాతి తీసికొన్న తరువాతే ముందుకు వెళ్లేవారు.

కాని హనుమ దానివైపు కన్ను పెట్టకుండా వెళ్లిపోయాడు. ఇది ఆయన కామ విజయాన్ని సమదృష్టిని తెలుపుతుంది.

మైనాకునిపై ఉన్న దివ్య ఫలపుష్ప స్థలాలు "నన్ను అనుభవించు, నన్ను అనుభవించుమని" ఆహ్వానిస్తున్నాయి. వాటిని అనుభవించాలనే కోరిక ఎవ్వరికైనా ఎంతో కలుగుతుంది. కాని హనుమ అంతటి కోరికను అణచిపెట్టి వాటివైపు చూడకుండానే ముందుకు వెళ్లాడు. వాటిపట్ల కోరికను అణచుకోవడం హనుమ యొక్క "కామ విజయం" తనకు మైనాకుడు కలిగించబోయే సన్మానాన్ని కూడ పట్టించుకోకపోవడం హనుమ సమదృష్టికి కూడ నిదర్శనము. మానావమానాలను ఒకే రకంగా చూడడమే సమదృష్టి కదా!.

**మైనాకుని ప్రేమతో స్పృశించుట**

**కపిశ్రేష్ఠా! నీవు సముద్రునికి, నాకు కూడ అతిథివి. నా మధుర ఫలాలను ఆరగించి, తీయని పానీయాలను త్రాగి, "మా ఆతిథ్యాన్ని స్వీకరించుము".**



**"మిత్రమా! నేను దారిలో మధ్యలో ఎక్కడ ఆగకుండా రామబాణము వలె వెళ్లుతున్నాను! వేరే ఏమి అనుకోవచ్చు సుమా!**

# సురస - 4

దేవతలు మరోమారు హనుమను అభినందించారు. ఆయన నిశ్చల దృష్టికి ఆనందించారు.

మైనాకుడిని కూడ మహేంద్రుడు ప్రశంసించాడు. రామచంద్రస్వామికి కైంకర్యమును, సత్కారాన్ని చేయ ప్రయత్నించడాన్ని హర్షిస్తూ దానికి గుర్తింపుగా మైనాకునికి స్వేచ్ఛను ప్రసాదించాడు.

అయినా దేవతలకు హనుమ శక్తి పట్ల విశ్వాసం కుదురలేదు. "సీతాన్వేషణ ఒక మహత్కార్యము. "శ్రేయాంసి బహువిఘ్నాని" అన్నట్లు ఆ ఒక మంచి పని చేయాలంటే ఎన్నో విఘ్నాలు ఎదురవుతాయి. అంతటి తన ప్రయత్నంలో ఎంతటి ఆటంకము కలిగినా హనుమ దానిని తొలగించుకోగలడా? లేదా మధ్యలోనే చేతగాక ఆగిపోతాడా?" అని వారికి సంశయము కలిగింది. ఆ సందేహాన్ని తీర్చుకోవడానికి వారు హనుమకు ఒక పరీక్షను పెట్టాలనుకొన్నారు. వారు అత్యంత శక్తిగల "సురస" అనే నాగమాతను ఆహ్వానించారు. "దేవీ! నీవు హనుమకు అడ్డుగా నిలబడి ఆయనను మ్రింగడానికి సిద్ధమైనట్లు ఉండి, ఆయన ప్రయాణాన్ని అడ్డగించు" హనుమ నిన్ను ఏ విధంగా ఎదుర్కొంటాడో? నిన్ను దాటి ముందుకు వెళ్తాడో లేదో చూద్దాము" అని ప్రార్థించారు.

"తతో దేవాస్సగంధర్వాః। అబ్రువన్ నాగ మాతరం
త్వాం విజేష్యత్యుపాయేన। విషాదం వాగమిష్యతి"

నాగమాత రాక్షసాకారాన్ని ధరించి హనుమకు ఎదురుగా నిలిచింది. హనుమ తనకు దేవతలు అనుగ్రహించిన ఆహారమని, ముందు వెళ్లనీయకుండా అతనిని మ్రింగివేస్తానని ఆయనకు తెలిపింది.

హనుమ ఆమెను రాక్షసాకారంలో ఉన్న నాగమాతగా, దేవతా స్త్రీగా గుర్తించాడు. ఆమెతో పోటీపడి విలువైన కాలాన్ని వ్యర్థం చేసికోదలచుకోలేదు. అందువలన ఆమెను ఈ విధంగా ప్రార్థించాడు.

అమ్మా! దాక్షాయణీ (దక్షపుత్రీ)! నేను రామకార్యార్థము తొందరలో ఉన్నాను. దయచేసి నన్ను విడిచిపెట్టు. లేదు తప్పక నన్ను మ్రింగాలనుకొంటావా? నేనుసీతాదేవి జాడను తెలిసికొని, దాన్ని రామునికి తెలిపి, తప్పక నీ ముందు వచ్చి నిలుస్తాను. అప్పుడు నన్ను తిందువుగాక".

సురస హనుమ మాటలను సరకు చేయలేదు. "నన్ను తప్పించుకొని వెళ్తే కదా! నీవు సీతాదేవి జాడను తెలిసికొని, రామునికి తెలుపడం, తరువాత నా దగ్గరికి రావడము! ఇప్పుడే నిన్ను మ్రింగి నా ఆకలి తీర్చుకొంటాను. నీవు నా నోటిలో పడవలసిందే!" అని పట్టుపట్టి ఆమె తన నోటిని పెద్దగా పెంచింది. హనుమ కూడ తన శరీరాన్ని అంతకంటె ఎక్కువగా పెంచాడు. సురస తన నోటిని మరింత పెంచింది. "ఈ విధంగా ఒకరికంటె ఒకరు పెంచుకొంటూ పోతే దానివలన ఏ ఫలము ఉండదు. పైపెచ్చు సమయము వృధా అవుతుందని" హనుమ భావించి హఠాత్తుగా చాల చిన్నగా తన రూపాన్ని తగ్గించుకొని సురస నోటిలో దూరి ఆమె నోరుమూసే లోగా వెంటనే బయటకు వచ్చాడు".

వెంటనే నాగమాతకు చేతులు జోడించి, "తల్లీ! నన్ను నోట్లో వేసికొంటానన్న నీ మాట నెరవేరింది కదా! ఇక నా ముందు ప్రయాణాన్ని కొనసాగించుటకు అను మతించుమ"ని వేడుకొన్నాడు.

నాగమాత హనుమ చాకచక్యానికి ఆశ్చర్యచకిత అయింది. ఆమె హనుమను రెండు చేతులతో మనఃపూర్వకంగా ఆశీర్వదించింది. "హనుమా! నీ ఓర్పు నేర్పు మెచ్చుకోదగినవి. నీ శ్రద్ధాభక్తులకు సంతోషించాను. నిర్విఘ్నంగా సీతాదేవి జాడను తెలిసికొని శ్రీరామునికి తెలియజేయి. నీకు శుభమగుగాక!" అని తన అమోఘ ఆశీస్సులను అందజేసింది.

హనుమ యొక్క ఈ అద్భుత చాకచక్యానికి దేవతలు మరోమారు ఆశీస్సులను, అభినందనలను అందజేశారు.

1) దేవతలు పంపిన నాగమాత లోభాన్ని ప్రదర్శించింది. "లోభమంటే అంతా తనకే కావాలి" అనుకొనుట. ఆయనను తాను తప్పక తినాలనే పట్టుదల. తప్పిపోనీయ కుండా పట్టుకోవాలనే తపన.

హనుమ నాగమాత నోటిలో ప్రవేశించి, తక్షణమే బయటకు వచ్చి నాగమాత యొక్క లోభాన్ని జయించాడు.

2) సురసా విజయంలో మరొక వేదాంత విషయము దాగి ఉంది. ఆమె నాగమాత కదా! "అగం" అంటే నిశ్చలస్థితి "న" లేకుండా చేసేది. "నాగము" అంటే "హనుమంతుని నిశ్చల దృష్టిని భగ్నపరచేది" అని అర్థము. నాగమాతను జయించాడంటే తన నిశ్చల దృష్టికి కలిగే ఆటంకాన్ని తొలగించుకొన్నాడని అర్థము.


3) అంతేకాదు ఆమె "సురస". "సురస" అంటే చక్కని రుచులను కలిగించేది. శాస్త్రము మానవుల కోరికలు తీరేందుకు కొన్ని కర్మలను సూచించింది. వాటిని "విహిత కర్మలు" అంటారు. కర్మలను ఆచరించడం వలన మనకు కావలసిన పుత్ర, పశు, ధన, స్వర్గాది ఫలాలు కలుగుతాయి. ఆ ఫలాల పట్ల రుచితో కర్మలను మళ్లీ మళ్లీ ఆచరించాలని పిస్తుంది. "కర్మాచరణము - ఫలప్రాప్తి - తిరిగి కర్మాచరణము" ఇది ఒక విష వలయము.

ఈ చక్రబంధాన్నుండి తప్పించుకోవడానికి వీలులేదా? కర్మ-ఫల చక్ర భ్రమణాన్నుండి విడుదల కావడానికి గీతాచార్యుడు ఒక చక్కని మార్గాన్ని సూచించాడు.

"కర్మణ్యేవాధికారస్తే - మాఫలేషు కదాచన".

కర్మలను తప్పక ఆచరించు. కాని వాటి ఫలాన్ని కోరుకోకు. ఫలత్యాగపూర్వకంగా కర్మలను చేయి. దీనినే "నిష్కామకర్మాచరణము" అంటారు. హనుమ ఏ ఫలాన్ని ఆశించకుండానే సురస నోటిలో దూరి, బయటకు వచ్చాడు. నిష్కామ కర్మాచరణము ద్వారా "సురస"ను (కర్మఫలాన్ని) జయించాడు. దానికి చక్కని "మతి" (జ్ఞానము) కావాలి.

**సురస అంటే నాగమాత. నాగము అంటే స్థిరము కానిది. మనస్సుకు అనేక ఫల రుచులను కల్గించి మనస్సును స్థిరంగా ఉండనివ్వని విహిత కర్మే సురస.**



**సురస (నాగమాత) నోటి నుండి బయట పడిన హనుమ**

# సింహిక - 5

"ప్లవమానంతు తంధృష్ట్వా। సింహికానామరాక్షసీ
తదా సంచిత్య మనసా। ఛాయామస్య సమాక్షిపత్"

హనుమ ఇనుమడించిన ఉత్సాహంతో ఆకాశగమనాన్ని కావిస్తున్నాడు. అంతలో హఠాత్తుగా ఆయన బలం క్రమంగా క్షీణింప సాగింది. ఆయనకు దుఃఖము పొంగుకొచ్చింది. తన ఉత్సాహము, బలము, ఎందుకు క్రుంగిపోతున్నాయో ఆయనకు అర్థము కాలేదు.

అయోమయంతో అన్ని వైపుల దృష్టిని ప్రసరింపజేశాడు. తనకు క్రిందుగా సముద్రంలో ఒక భయంకర రాక్షసి అగుపించింది. ఆమే తన బలాన్ని క్షీణింపజేస్తున్న దని తెలిసికొన్నాడు.

తాము కిష్కింధనుండి బయలుదేరే సమయంలోనే దక్షిణ సముద్రంలో "ఛాయాగ్రాహి" అనే ఒక రాక్షసి ఉందని, అది వ్యక్తుల నీడను బట్టి వాళ్ల బలాన్ని హరిస్తుందని సుగ్రీవుడు చెప్పగా విన్నాడు.

ఇప్పుడా ఛాయాగ్రాహే తన బలాన్ని లాగివేస్తుందని తెలిసికొన్నాడు. హనుమ దానిని భయపెట్టుటకు ఒక్కసారి తన శరీరాన్ని పెంచాడు. అప్పుడు సింహిక కూడ పెరిగిన ఆయన శరీరాన్ని మ్రింగేంత పెద్దగా నోరును పెంచింది. హనుమ ఆమె కడుపులోని మర్మస్థానాలను గమనించాడు. వెంటనే తాను చిన్న రూపాన్ని ధరించి ఆమె నోటిలో ప్రవేశించాడు. ఆయనను నోటిలో వేసికొన్నాననే సంతోషము ఆమెకు పూర్తిగా కలుగక ముందే ఆమె మర్మస్థానాలను తన వాడిగోళ్లతో ఛేదించి హనుమ బయటకు వచ్చాడు. సింహిక ఈ విధంగా సంహరింపబడింది.

1) "సింహిక అంటే హింసించేది" అని అర్థము. శాస్త్రము నిషేధించిన కర్మలను ఆచరించి నందువలన ఘోరఫలాలు కలుగుతాయి. నిషిద్ధ కర్మఫలము మనను తీవ్రంగా హింసిస్తుంది. అందువలన నిషిద్ధ కర్మ (ఫల)మే సింహిక.

నిషిద్ధ కర్మఫలాన్ని మనము అనుభవించకుండాలంటే, అది మనను హింసించకుండా ఉండాలంటే – మనస్సులో ఆ కర్మల పట్ల ఇష్టాన్ని సంహరించాలి. సమూలంగా ఆ కర్మలకు మన మనస్సులో స్థానం లేకుండా చేయాలి.

సురస – సింహికల మధ్య తేడాను గమనించాలి. సురస నోటిలో ప్రవేశించి మళ్లీ క్షేమంగా బయటపడి ఆమెకు నమస్కరించాడు. విహిత కర్మలను ఫలాపేక్ష లేకుండా భగవదారాధనా రూపంగా ఆచరించాలి అని సురసా విజయానికి అర్థము.

సింహికను దాని ప్రాణస్థానాలను ఛేదించి, పూర్తిగా సంహరించాడు. నిషద్ధ కర్మలను సమూలంగా వదిలిపెట్టాలి.

అయితే నిషిద్ధ కర్మలను పూర్తిగా వదలడం అంత సులభం కాదు. వాటి ఫలితం ఘోరంగా ఉన్నా, వాటి ఆచరణ మనకెంతో ఇష్టంగా ఉంటుంది. అటువంటి నిషిద్ధ కర్మాచరణను మొదటే పూర్తిగా వదలి వేయాలంటే మనస్సును వాటి వైపు పోనీయకుండా అరికట్టాలి. మనో నిగ్రహానికి ఎంతో "దాక్ష్యము (నేర్పు)" కావాలి.

2) "సింహిక" క్రోధానికి సంకేతము. అది క్రోధంతో హనుమను సంహరించి, భక్షించి, తన ఆకలిని తీర్చుకోవాలని అనుకొంది. క్రోధము రాక్షసుల గుణము. అది తమోగుణము. అది ఇతరులను హింసించే గుణము. అది సింహిక గుణము. సింహికను సంహరించడం ద్వారా హనుమ క్రోధాన్ని జయించాడు.

హనుమ సముద్రాన్ని దాటుతున్నాడు, ఆ సముద్రము నూరు యోజనాలు విస్తరించి ఉంది.

మానవుడు కూడ సంసారమనే సముద్రాన్ని దాటాలి. నూరేండ్లే నూరు యోజనాలు. సంసారం కూడ నూరు సంవత్సరాల ఆయువుతో దాటవలసిందే. అయితే అందరికి నూరేండ్ల ఆయువు ఉండదు. కొందరు తక్కువ కాలము బ్రతుకవచ్చు కొందరు ఎక్కువ కాలము బ్రతుక వచ్చు. అందువలన నూరేండ్లు అంటే భగవంతుడు అనుమతించిన జీవితకాలము అని అర్థము.

నిజానికి పూర్తి జీవిత కాలంలో మనము దాటవలసిన సంసారము సముద్రం కంటే కూడ లోతైనది. జీవించి ఉన్న కాలంలో ఎంత వాడైనా తాను సంసారాన్ని తరించానని చెప్పుకోవడానికి వీలులేదు.

సంసార సముద్రాన్ని దాటాలని అనుకొన్న వాడు అంత సులభంగా దానిని దాటలేడు. "సంసరతీతి సంసారః" అని వ్యుత్పత్తి. చావుపుట్టుకలనే మహాప్రవాహంలో ముంచి తేల్చేది సంసారము.

అయితే దీనిని దాటడానికి అవకాశమేలేదా? ఉంది. తత్వజ్ఞానము కలవాడు సంసార సముద్రాన్ని దాటగల్గుతాడు.

గీతాచార్యుడు తన ప్రకృతులు రెండని అవి తన ఆధీనంలో ఉంటాయని తెలిపాడు.

1) **ప్రకృతి తత్వము:-** ఇది "అష్టధా" అంటే ఎనిమిది విధాలుగా ఉంటుంది. పంచభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారములతో కూడుకొన్నది. ఇది అపరా ప్రకృతి.

2) **పరాప్రకృతి:-** జీవభూతమైనది.

అయితే అపరా ప్రకృతి, ఈ జీవ(పరా) ప్రకృతికి అధీనంగా ఉంటుంది. అందువలననే జీవుడు, తన ఆధీనములోని అష్టవిధ ప్రకృతితో కలిపి తనను అందరికంటె గొప్పవాడుగా (అన్ని సంఖ్యలకంటె గొప్పదైన తొమ్మిదిచే తెలుపబడేవాడుగా) భావించు కొంటాడు. రావణాదులు ఇందుకు ఉదాహరణము.

అయితే భగవత్ (తత్వ) జ్ఞానం కలిగాక, తాను, ప్రకృతి కూడ స్వతంత్రులము కామని, పరమాత్మ ఆధీనులమని తెలిసిన తరువాత పరమాత్మ అందరికంటె మొదటి వాడని మొదటి సంఖ్యచే తెలుపబడవలసిన వాడని, తమకు స్వతంత్రమైన ఉనికి లేదు కనుక జీవుడైన తాను, ప్రకృతి కూడ శూన్యసంఖ్యలచే తెలుపబడవలసిన వారమని అందువలన పరమాత్మతో తాము కలసినందువలన (100) శతమానము (నూరు అని ప్రమాణము) ఏర్పడుతుందని గ్రహిస్తాడు. ఇదే తత్వజ్ఞానము. ఇదే "తత్వత్రయ (చిత్, అచిత్, ఈశ్వర) జ్ఞానము" అనబడుతుంది. ఈ తత్వ (త్రయ) జ్ఞానము కలిగినవాడు, సంసార సముద్రాన్ని సులభంగా తరింపగల్గుతాడు.

సంసారానికి "సమ్యక్సారః" అని మరొక వ్యుత్పత్తి. మంచి సుఖమని అర్థము. భగవత్కృప, ఆచార్య కటాక్షములతో చక్కని కుటుంబము కలిగిననాడు ఈ సంసారము మంచి సుఖమే కదా!

ఈ సంసార సముద్రం దాటడానికి ఆరు సుడులు అడ్డంగా ఉంటాయి. అవే అరిషడ్వర్గాలు. భగవత్కృప, ఆచార్య కటాక్షంతో ఈ సుడుల వంటి కామక్రోధాదులైన ఆరు శత్రువులను జయించాలి.

హనుమకు ఎదురైన మైనాకుడు, సురస, సింహిక, లంకిణి, రాక్షస సైన్యము, ఇంద్రజిత్తు ఈ ఆరుగురు శత్రువులకు గుర్తు. వాటిని ఎదుర్కోవడానికి (చిక్కని) ధైర్యము,

(చక్కని) దృష్టి, (మంచి) మతి, చక్కని (నేర్పు) దాక్షిణ్యము ఉండాలి. హనుమ యొక్క ధృతి, దృష్టి, మతి, దాక్షిణ్యాలను, సకల దేవతలు ప్రశంసిస్తారు.

పరమాత్మ సంసార సముద్రాన్ని దాటడానికి శరీరమనే పడవనిచ్చాడు. విహితకర్మలను ఫలాపేక్ష లేకుండా ఆచరించడం, నిషిద్ధ కర్మలను మనస్సులోకే రానీయకుండా దూరంగా ఉండడం ద్వారా శరీర నౌకతో ఈ ఆరు సుడులను సులభంగా దాటవచ్చు.

భగవంతుడు అత్యంత దయామయుడని మన దుఃఖాలను చూచి సహింప జాలడని, మనను తనతో చేర్చుకోవడానికి ఆచార్యుడనే నావికుని పంపి మనను తప్పక తరింప జేస్తాడని గట్టి నమ్మంతో ఉంటే ఈ సంసార సముద్రాన్ని దాటడం చాలా తేలిక.

**సింహిక అంటే హింసించేది. ఆమె క్రోధానికి సంకేతము; రాక్షస శక్తికి సంకేతము. తత్త్వపరంగా ఆలోచిస్తే సింహిక నిషిద్ధ కర్మలకు సంకేతము. నిషిద్ధ కర్మలు క్రూరమైన ఫలితాలనిస్తాయి.**



**సింహిక కడుపును చీల్చుకొని హనుమ వచ్చుట**

# హనుమ విచారము-6

హనుమ లవణ సముద్రమును దాటి లంకలోని త్రికూట పర్వతముపై వాలాడు. అప్పటికి ఇంకా రాత్రి కాలేదు. చీకటి వ్యాపించలేదు. అప్పుడు ఆ నగరంలో ప్రవేశిస్తే లంకానగరాన్ని కాపలాకాస్తున్న ఆయుధధారులైన రాక్షస వీరుల కండ్లలో పడక తప్పదు. అందువలన రాత్రి అయ్యే దాకా ఎదిరి చూడాలనుకొన్నాడు.

త్రికూట పర్వత శిఖరాన్నుండి హనుమ లంకను చూస్తున్నాడు. ఆయనకు ఆకస్మాత్తుగా భయవిచారాలు కల్గాయి. నిజంగా అంత పెద్ద సముద్రం దాటి ఎంతమంది లంకకు రాగల్గుతారు? లంక సముద్రము మధ్యలో ఉంది. త్రికూట పర్వత శిఖర స్థానంలో ఉంది. మళ్లీ ఆ నగరం చుట్టు మహోన్నత ప్రాకారాలు ఉన్నాయి. చుట్టు కందకముంది. ఎత్తైన అనేక స్థలాలలో ఫిరంగులవంటి శతఘ్నులైన ఆయుధాలు అమర్చబడ్డాయి. అనేక లక్షల రాక్షస వీరులు భయంకరాకారాలతో ఆయుధాలు ధరించి కాపలా కాస్తున్నారు. ఇక్కడకు రామలక్ష్మణులు మాత్రము ఎలా వస్తారు? వచ్చి మాత్రము ఏమి చేస్తారు?

తాను ఒక్కడు ప్రస్తుతానికి ఇక్కడకు రాగల్గాడు. ఇంకొక ముగ్గురు మాత్రమే తనవలె రాగల్గుతారు. వారు. (1) అంగదుడు (2) నీలుడు (3) సుగ్రీవుడు.

1) అంగదుడు: అంగదుడు వాలికుమారుడు. స్వయంగా మహావీరుడు. తండ్రి శిక్షణలో బాగా రాటుదేలినవాడు. సముద్రాన్ని దాటడానికి మిగిలిన వానరులు ముందుకు రాకపోతే తాను దాటుతానని ముందుకు వచ్చాడు. జాంబవంతుని మాటపై తన ప్రయత్నాన్ని విరమించుకొన్నాడు. తన పరాక్రమానికి గుర్తుగా బంగారు భుజకీర్తులను బహుమానంగా ధరించినవాడు. ఆయన సముద్రాన్ని దాటి రాగల్గుతాడు.

"అంగదుడు" అనే పదానికి వేదాంతపరంగా విశేషార్థము ఉంది. "అం" అంటే పరమాత్మను, "గదతి" = కీర్తించేవాడు. భగవన్నామాలను తన్మయంగా పాడుకొంటూ ఆ అమృతమును ఆస్వాదించే అంగదునికి (సంసార) సముద్రం దాటడం ఏమి గొప్ప?

2) నీలుడు:- నీలుడు అగ్నిపుత్రుడు. నీలుడు కూడ వానరులలో మహావీరుడు. సుగ్రీవునికి అభిమానపాత్రుడు. అంగద, హనుమ, జాంబవదాదులతో శ్రీరామ కార్యార్థము సీతాన్వేషణకై దక్షిణ దిశకు బయలు దేరినవాడు. సముద్రాన్ని దాటడం నలునికి కూడ సాధ్యమే.

(2) "అగ్నిః శుచిః" అగ్ని స్వయంగా పవిత్రమైనది. అంతేకాదు తన స్పర్శతో ఇతరులను, ఇతరములను పవిత్రం చేస్తుంది. యజ్ఞ యాగ, వివాహాది పవిత్ర కర్మలన్ని అగ్నిముఖంగానే జరుగుతాయి.

అగ్నిహోత్రుని వలన పవిత్ర కర్మలన్ని కలుగుతాయి. అగ్నిహోత్రుని పుత్రుడైన నీలుడు. అగ్నివలన కలిగే యజ్ఞదాన, తపస్సులు మొదలైన పవిత్ర కర్మలకు సంకేతము. కర్మలు మనస్సులోని మలినాన్ని పోగొట్టి పవిత్రం చేస్తాయి. పవిత్ర మనస్సుతో ఫలాపేక్ష లేకుండా కర్మలను ఆచరించడం వలన భగవత్ప్రీతి కలుగుతుంది.

3) సుగ్రీవుడు:- వానర సామ్రాజ్యాధిపతి. వాలి తర్వాత అంతటి మహావీరుడు శ్రీరామచంద్రుని ఆశ్రయించి, ఆయనకు సీతాన్వేషణలో సహాయం చేస్తానని మాట ఇచ్చినవాడు. రామానుగ్రహంతో వాలిని చంపించి రాజ్యరమను, రుమను స్వంతం చేసికొన్నవాడు. రామునికి మాట ఇచ్చిన ప్రకారము సీతాన్వేషణ కొరకు నాలుగు దిక్కుల వానరవీరులను పంపినవాడు. చండశాసనుడు.

అంతేకాదు. పూర్వము వాలి భయంతో అన్ని దిశలకు వెళ్లినందువలన భౌగోళిక విజ్ఞానమంతటిని కలిగి ఉన్నవాడు.

"సుగ్రీవుడు" అంటే కూడ వేదాంతపరంగా విశేషార్థము ఉంది. "సు" అంటే మంచి "గ్రీవుడు" అంటే కంఠము కలవాడు. స్వరయుక్తంగా వేదాన్ని అధ్యయనం చేయగల్గినవాడు. "వేదయతీతివేదః" అన్నట్లు అతి రహస్యమైన పరమాత్మ విషయాన్ని తెలిపేది వేదం. అందువలననే వేదంచేత తెలుపబడే పరమాత్మ అయిన శ్రీరాముని ఆశ్రయించి సకలశ్రేయస్సులను పొందగల్గినవాడు. ఆయన కూడ సముద్రాన్ని సులభంగా దాటగల్గుతాడు.

4) హనుమ:- పై ముగ్గురు సముద్రాన్ని దాటగల్గిన వారైతే హనుమ సముద్రాన్ని ఇదివరకే దాటినవాడు. ఆయన "అంజనా - వాయుదేవ" పుత్రుడు.

"అంజన అంటే ఆయా శబ్దాలు పలుకుటకు అనువైన నోటిస్థానాలు. అంజన నుండే శబ్దము పుట్టుతుంది. కనుక అంజనకు పుట్టిన హనుమ కూడ శబ్దస్వరూపుడే.

మూలాధార స్థానములో యోగులకు నిర్వికల్ప సమాధిలో వినబడే శబ్దాన్ని వాయువు తన తరంగాలతో నాభిస్థానానికి, హృదయస్థానానికి, నోటిలో ఆయా స్థానాలకు తీసిక

పోగల్గుతుంది. తద్వారా శబ్దము బయటకు రాగల్గుతుంది. అందువలన వాయుపుత్రుడగుటచే కూడ హనుమ శబ్దస్వరూపుడే. అనగా మంత్రస్వరూపుడే. భగవంతుని కూడ మనకు అందింపగల్గిన శక్తిమంత్రానికి ఉంటుంది. అందువలన మంత్ర స్వరూపుడైన హనుమకు సంసార సముద్ర తరణము సులభమే.

తనతోపాటు మరో ముగ్గురికి మాత్రమే రాగల్గినది లంక. ఇక్కడికి రామలక్ష్మణులు మాత్రము ఎలా రాగల్గుతారు? ఎవ్వరు వచ్చినా ఏమి చేయగల్గుతారు? అని హనుమ విచారగ్రస్తుడయ్యాడు.

అయినా రాముడు పరమాత్మ. సకల జగత్తును సృష్టించి, రక్షించి, సంహరింపగల్గిన వాడు. సర్వసమర్థుడు. తాను సముద్రాన్ని దాటడానికి కూడ రామభద్రుని కృపే కారణము. అంతటి జగదేకవీరుడైన రామచంద్రమూర్తి సముద్రాన్ని తన బాణాలతో దహించివేయగల్గుతాడు. లేదా అంతటి సముద్రముపై సేతువును నిర్మింపగల్గుతాడు. ఆయన ఉండగా తనకెందుకు ఈ విచారము? అని నిశ్చయానికి వచ్చి, సీతాన్వేషణ ప్రయత్నానికి ధైర్యోత్సాహాలతో నడుము బిగించాడు.

-- ఓం తత్సత్ --

"తత్త్రికూటగిరి భూమిజాళి, లాజాళి చల్లి పేరింబూజయొచర్చ్చై
పుష్పభర వల్లీ నృత్య మర్యాద సూపె హిమానీ మధుబిందు
పాద్యములు దన్పెన్ కేసరీ సూనునిన్" - శ్రీ విశ్వనాథ

"మారుతి రామలక్ష్మణ మహాద్భుత చాపకళా మహత్త్వమున్
లోన దలంచి ధైర్య విమలుండయ్యె" - శ్రీవిశ్వనాథ.

# లంకిణి విజయము - 7

హనుమ సూర్యాస్తమయం దాకా ఎదిరి చూచాడు. రాత్రికాగానే బయలుదేరాలనుకొన్నాడు. కాని అంత రూపంతో వెళ్తే రాత్రిలో కూడ తనను రాక్షసులు గమనించరా? అందువలన తాను "పిల్లి" అంత చిన్నగా మారిపోయాడు. అద్భుత దర్శనంతో బయలుదేరాడు.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న కలుగుతున్నది. పిల్లి అన్నిటికంటె చిన్న ప్రాణి కాదు కదా! పిల్లి అంత మాత్రమే చిన్నగా ఎందుకయ్యాడు? పిల్లి ప్రాధాన్యమేమిటి?

పిల్లి కళ్లు రేడియం వలె చీకట్లో మెరుస్తుంటాయి, చీకటిలో కూడ ఎంత చిన్న వస్తువు నయినా అవి చూడగల్గుతాయి. అది పిల్లి యొక్క అద్భుత దర్శనము. హనుమ కూడ పిల్లి అంత చిన్న పరిమాణము కలిగి, చిన్న వస్తువునైనా చూడగల్గిన శక్తి కల్గి ఉన్నాడు.

అందువలననే "పృషదంశక మాత్రస్సన్। బభూవాద్భుతదర్శనః" అంటాడు వాల్మీకి మునీంద్రుడు.

చంద్రోదయం కాగానే లంకలో ప్రవేశిద్దామని అనుకొన్నాడు. లంక వెనుక భాగంలో జనులు ఎక్కువగా ఉండరు. కనుక అటువైపునుండి ప్రవేశించాలనుకొన్నాడు.

ఎవ్వరు చూడడం లేదనుకొని లంకలోనికి ప్రవేశించాలనుకొన్న హనుమ ప్రయత్నాన్ని లంకా నగర సంరక్షకి లంకిణి పసిగట్టింది. ఆమె హనుమంతుని అడ్డగించింది. "కస్త్వం? కేనచకార్యేణ ఇహప్రాప్తోవనాలయ।" ఎవ్వరు నీవు? ఓ వనచరా! నీవే పని మీద ఇక్కడికొచ్చావు? అని గద్దించి అడిగింది. నీవు లోపలికి వెళ్లజాలవు" అని పలికింది.

హనుమ లంకిణి మాటలను లక్ష్యం చేయలేదు. "నీవు అడిగిన ప్రశ్నలకు నేను సమాధానం తర్వాత చెప్తుతాను. కాని ముందు నీవెవ్వరు? నన్ను ఎందుకు ఆపావు? ఎందుకు నన్ను బెదిరిస్తున్నావు? అని యుక్తితో ఆ రాక్షసిని అడిగాడు.

"నేను రాక్షస రాజయిన రావణుని ఆజ్ఞతో ఈ లంకానగరాన్ని రక్షిస్తున్నాను. నన్ను కాదని నీవు లోపలికి వెళ్లలేవు. ఒకవేళ నన్ను కాదంటే ప్రాణాలతో ఉండవు" అన్నది.

హనుమ చిరునవ్వుతో "లంకిణీ! నేనేదో దురుద్దేశ్యంతో రాలేదు. అనేక ప్రాకారాలతో, వనాలతో, దుర్గాలతో సుందరమైన లంకానగరాన్ని చూచి వెళ్లుతాను" అన్నాడు.

"దురాత్మా! నన్ను కాదని నీవు లంకను చూస్తావా? ఎలా చూస్తావో చూడు"మని హనుమను ఆగ్రహంతో తన పిడికిలితో కొట్టింది. ఆ బలమైన దెబ్బతో హనుమకు ఆగ్రహము, బాధ కలిగాయి.

అయినా ఒక ఆడదానిపై అంత కోపము పనికిరాదనుకొని తన ఎడమ పిడికిలితో హనుమ మామూలుగానే లంకిణిని కొట్టాడు. ఆ చిన్న దెబ్బే లంకిణికి ప్రాణాంతకమైంది. ఆమె భూమిపై పడిపోయింది.

ఆమె వెంటనే లేచి చేతులు జోడించి, "మహావీరా! కోపమువీడి నన్ను మన్నించు. వానరోత్తమా! ఇప్పుడు నేనొక నిజం చెప్పుతున్నాను. పూర్వం నాకు బ్రహ్మదేవుడు వరమిచ్చి, "నీవు ఈ లంకా నగరాన్ని కాపాడుతు ఉండు. ఎప్పుడైతే ఒక కోతి వచ్చి నిన్ను గెలుస్తాడో, అప్పటి నుండి రాక్షస వినాశము ప్రారంభమవుతుంది" అని తెలిపాడు. ఇప్పుడు సీతాదేవి కారణంగా లంకకు వినాశకాలము దాపురించింది. నీవు నిరాటంకంగా లంకలోనికి వెళ్లి అనుకొన్నవి చూచి తిరిగి వెళ్లు" అని చెప్పింది.

ఇక్కడ హనుమ లంకిణి సంవాదము గమనించదగింది. లంకిణి "కస్త్వం? కేనచ కార్యేణ ఇహ ప్రాప్తోవనాలయ?" అని అడుగుతుంది. ఇక్కడ ఆమె ప్రయోగించిన "వనాలయ!" అనే శబ్దము ముఖ్యమైనది. "వనాలయ!" అంటే వనచరా! అడవిలో ఉండేవాడా?" అని సాధారణార్థము.

కాని "వనాలయా!" అంటె ఇంతకంటె ముఖ్యమైన అర్థము ధ్వనిస్తున్నది. "బ్రహ్మవనం" అని బ్రహ్మను వనంగా పేర్కొంటుంది ఉపనిషత్తు. "వనాలయా!" అంటే భగవంతుని ఆధారంగా కలవాడా! బ్రహ్మనిష్ఠుడా! అని విశేషార్థము.

హనుమ లంకిణిని అడుగుతాడు, "కాత్వం విరూపనయనా?" అని "విరూపనయనా" అంటే "భయంకరమైన కన్నులు గలదానా" అని సామాన్యార్థము.

"విరూపాన్ని (నయనా) పొందించేదానా" వికారాన్ని కలిగించేదానా? అని ధ్వన్యర్థము. వికారాన్ని కలిగించేది శరీరము లేక ప్రకృతి.

లంకిణి, "తనను అహం అహం" నేను, నేను అంటు చెప్పుకొంటుంది. "అహం హి నగరీ లంకా" నేనే లంకానగరాన్ని అంటుంది. "సర్వంహి పరిరక్షామి" స్వయమేవ ప్లవంగమ! నన్ను నేనే కాపాడుకొంటున్నాను అంటుంది. "సాతు తేన ప్రహారేణ! విహ్వలాంగీ నిశాచరీ" ఆ రాక్షసి హనుమ దెబ్బతో వివశురాలయింది అంటాడు వాల్మీకి.

ఇంతకు లంకిణి లంకానగరమా? లేక దానిని కాపాడే నిశాచరా? ఆమె మాటలలో ఆమె తానే నగరాన్ని, తానే దాన్ని కాపాడుతాను అంటుంది. ప్రాణంలేని నగరము కాపాడే రాక్షసి ఎలా కాగలుగుతుంది? రెండు నిజానికి వేరు ఉండాలి కదా! కాపాడబడేది (దేహము) వేరు. కాపాడేది (ఆత్మ) వేరు.

మరి ఆమె తననే లంకానగరమ"ని అనుకొంటుందంటే - తానే దేహాన్ని అనుకొంటుంది అన్న మాట. ఇది "దేహాత్మాభిమానము" అనబడుతుంది. దేహాత్మాభిమానము అవిద్యవలన కలుగుతుంది. అవిద్య అంటె ప్రకృతి. అది "విరూపనయనా" వికారాలను కలిగించుతుంది. అది "నిశాచరి" రాక్షస స్వభావాన్ని (తామసగుణాన్ని) కలిగి ఉంటుంది.

హనుమ బ్రహ్మనిష్ఠుడు. లంకిణి అవిద్యాస్వరూపిణి. అయినప్పుడు హనుమను (బ్రహ్మనిష్ఠుని) లంకిణి (అవిద్య) ఆపగల్గదు కదా!

ఇదే లంకిణీ విజయంలోని పరమార్థము.

-- ఇతిశం --



**లంకిణిని పరాభవించిన హనుమ**

**"నీ వొక్కడు చాలు: నీ యసుర వంశంబెల్లం నెండింపగన్ - లంకిణి" "శ్రీవిశ్వనాథ"**

# లంకా సందర్శనము - 8

రాక్షసి అయిన లంకిణిని జయించిన తరువాత హనుమ నగరంలోకి వెళ్లాలను కొన్నాడు. ఒక ఇంట్లోకి అలాగే ఒక పట్టణంలోకి వెళ్లాలంటే సాధారణంగా ముందు ద్వారం నుండి వెళ్లాలి కదా!

అయితే లంక హనుమకు శత్రుస్థానము. "శత్రువు ఇంటికి వెళ్లేప్పుడు ముందు ద్వారాన్నుండి వెళ్లకూడదు" అనేది ఒక (కూట) నీతి. ముఖ్యద్వారం నుండి వెళ్తే శత్రువుల కంటబడవలసి ఉంటుంది. అప్పుడు శత్రువులకు చిక్కవలసి రావచ్చు. తన పని చెడిపోవచ్చు.

అందువలన "శత్రు గృహములోనికి ప్రవేశించాలంటే పెరటి (వెనుక) వైపు నుండి వెళ్లాలి. వెనుకవైపు తలుపులేకపోతే గోడదుమికిపోవాలి. ఆ ఇంట్లో ముందు ఎడమ కాలు పెట్టాలి". ఇది శత్రునీతి.

అలాగే హనుమ శత్రుస్థానమైన లంకలోకి ప్రవేశిస్తున్నాడు.

"అద్వారేణ మహాబాహుః ప్రాకారమభిపుప్లవే".

హనుమ మహాబాహువు. పెద్ద చేతులు (భుజాలు) కలవాడు. కనుక ఎత్తైన ప్రాకారమును పెద్ద చేతులతో పట్టుకొని ఆ ప్రాకారము గోడనుండి (అభిపుప్లువే) చక్కగా దుమికాడు. చక్కగా అంటే దెబ్బలు తగులకుండా లోపలికి దుమికాడు. "అద్వారేణ" అంటే ద్వారమునుండి కాక గోడ దుమికి వెళ్లాడు.

ఇక్కడ వాల్మీకి భగవానుడు రెండు ముఖ్య శబ్దాలను వాడాడు. (1) అద్వారేణ (2) మహాబాహుః

హనుమ లంకలోనికి ప్రవేశించింది (అద్వారేణ) ద్వారము నుండి కాదు. అని ఒక సాధారణార్థము.

కాని "అద్వారేణ" అంటే "అ" కార వాచ్యుడైన పరమాత్మ ద్వారా. పరమాత్మ సంకల్పం ద్వారా హనుమ వెళ్లాడు అని ధ్వన్యర్థము.

"హనుమ తాను సముద్రాన్ని దాటినా, లంకలోకి ప్రవేశించినా, సీతాదేవిని చూచినా, సైన్యాన్ని సంహరించినా ఇవన్నీ (యథారాఘవనిర్ముక్తః శరః) శ్రీరామచంద్రుని చేతిలో

పనిముట్టువలె చేశాను" అనుకొంటున్నాడు. అప్పుడు ఆయన చేసే పనులన్ని పరమాత్మ ద్వారానే (అద్వారేణ) జరుగుతున్నాయనే అనుకొంటాడు కదా!

హనుమ లాగే మనము కూడ (అద్వారేణ) పరమాత్మ తన సంకల్పం ద్వారా మనతో పనులను చేయించుకొంటున్నాడనుకోవాలి కదా!

(2) మహాబాహుః- పెద్ద చేతులు గలవాడు హనుమ. పెద్ద చేతులతో ప్రాకారము చివరను పట్టుకొని లోపలికి దుమికాడు.

చేతులు (కర్మలను) పనులను చేయడానికి సాధనాలు. సాధారణంగా ఏదో ఒక ఫలము కొరకు పనులను (కర్మలను) చేస్తే ఆ చేతులు సామాన్యమైనవి. కాని శాస్త్ర విహిత కర్మలను (శాస్త్రము తెలిపిన పనులను) ఫలాపేక్ష లేకుండా కేవలము "భగవదారాధనము కొరకు" అని చేస్తే వాటి ఫలాల బంధాలలో మనము చిక్కుకోక భగవదనుగ్రహాన్ని పొందుతాము. ఆ విధంగా ఫలాపేక్ష లేకుండా, భగవంతుని కృప కొరకు కర్మలను చేసే చేతులు పెద్ద చేతులు (మహాబాహువులు).

హనుమ తాను చేసిన పనులన్ని రామానుగ్రహం కొరకే చేశాడు. కనుక ఆయన మహాబాహువు.

లంకానగరము శత్రుస్థానము కనుక హనుమ ప్రాకారము గోడ దూకి ముందుగా తన ఎడమ కాలుమోపాడు.

సీతాదేవి కొరకు హనుమ లంకలో ఇంటింటిని గాలిస్తున్నాడు లంకలో భవనాలు చాల సుందరంగా ఉన్నాయి. కొన్ని పద్మమువంటి ఆకారముతో ఉన్నాయి. కొన్ని స్వస్తి కాకారముతో ఉన్నాయి. రంగురంగుల వజ్రాలతో చేయబడిన కిటికీలతో తెల్లని మేఘముల వలె ఉన్న ఎత్తైన తెల్లని భవనాలను చూచాడు.

కొన్ని గృహాల నుండి స్త్రీల మధుర గానాలు మంద్రమధ్యమ స్థాయిలో వినవస్తున్నాయి. కొన్ని ఇండ్లలో నుండి నాట్యధ్వనులు, ఒడ్డాణాలు ధ్వనులు, అంగదాల ధ్వనులు వినవస్తున్నాయి. కొన్ని భవనాలలో నుండి మంత్ర జపాలు, వేదాధ్యయనాలు వినవస్తున్నాయి. జడలను తాల్చినవారు బోడి తలలవారు కనబడుతున్నారు.

వీధులలో మల్లవీరులు తమ పరాక్రమాలకు గుర్తుగా భుజాలను చరచుకొంటున్నారు. ధనుర్ధరులు, ఖడ్గధరులు, ముద్గర, తోమర, శూలాది ఆయుధ ధరులు సంఖ్యాతీతంగా ఉన్నారు.

రావణుని మహాభవనము త్రికూట పర్వత శిఖరమునకు ఆనుకొని ఎత్తుగా ఉంది. చుట్టు పెద్ద కందకము ఉంది. చుట్టు పెద్ద పెద్ద ప్రాకారాలు ఉన్నాయి. రధ, గజ, తురగ పదాతి దళాలు అనేక సంఖ్యలో ఉన్నాయి. లక్షల సంఖ్యలో మూల (సైన్య) బలము ఉంది.

రాత్రి సమయం కనుక ఎవ్వరి ఇండ్లలో వారు వినోదాలలో మునిగి ఉన్నారు. మదిరాపానమదంతో ఒకరినొకరు ఆక్షేపించుకొంటున్నారు. పరిహసించుకొంటున్నారు, భయపెట్టుకొంటున్నారు.

కొందరు స్త్రీలు తమ భర్తలతో కలసి నిద్రిస్తున్నారు. కొందరు అలంకరించుకొంటు న్నారు, కొందరు నవ్వుతున్నారు, కొందరు దీర్ఘంగా నిట్టూరుస్తున్నారు.

కొందరు స్త్రీల ముఖాలు చంద్రబింబాలవలె అందంగా ఉన్నాయి. కన్నులు అందమైన కనుబొమ్మలతో సుందరంగా ఉన్నాయి. వారి ఆభరణాలు మెరుపులతో సమానంగా మెరుస్తున్నాయి.

హనుమ స్త్రీల ముఖాలను, కనుబొమ్మలను, ఆభరణాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. ముఖాల వలన, నేత్రాల వలన రాక్షస స్త్రీలు ఎవ్వరో, ఎవ్వరు కారో తెలుస్తుంది.

ఆభరణాల వలన అవి సీతాదేవివి అవునో కాదో తెలుస్తుంది. హనుమ ఋష్యమూక పర్వతంపైన శ్రీరాముని సమక్షంలో సీతాదేవి నగలను కొన్ని చూచి ఉన్నాడు. మరికొన్నిటిని శ్రీరాముడు వివరించాడు. వాటి సహాయంతో ఇప్పుడు వీరు ధరించిన నగలను బట్టి సీతాదేవి ఎవ్వరో తెలిసి కోవడానికి వీలు అవుతుంది.

హనుమ ముందు సీతను వెతుకుతున్నాడు. తరువాత ఒంటరిగా చూడాలని అనుకొంటున్నాడు. ఆ తరువాత సీతాదేవి బాధలకు కారణమైన రావణ సైన్యాన్ని చంపాలను కొంటున్నాడు. కనుక హనుమ తాను నిర్వహించాలనుకొన్న కార్యాలు మూడు. (1) అన్వేషణము (2) దర్శనము (3) శత్రు సంహారము. ఆచార్యుడు కూడ ముముక్షువులను అన్వేషిస్తాడు. ఆ అన్వేషణలో కూడ ఆచార్యుడు జనుల ముఖాలను, కన్నులను, సొమ్ములను గమనిస్తాడు. భగవంతుడు సౌమ్యుడు కనుక ఆయనను కోరుకొనే వారి ముఖాలు సౌమ్యంగా ఉంటాయి.

కన్నుల ద్వారా వ్యక్తులను, విషయాలను చూచి తెలిసికోవచ్చు. అందువలన కన్నులు జ్ఞానానికి సంకేతము. భక్తుల కన్నులు భగవత్ జ్ఞానంతో ప్రకాశిస్తుంటాయి.

ఇక స్త్రీల ఆభరణాలు అంటే శమదమాది ఆత్మగుణాలు. అనన్యార్హ శేషత్వ, శరణత్వ, భోగ్యత్వములనెడు పారతంత్ర్య గుణాలు.

# రావణ భవనము - 9

రావణుడు త్రిలోక విజేత. ఆయన మూడులోకాలలోని అందమైన భవనాలెన్నో చూచాడు. వాటన్నిటికంటే వైభవము గల సుందర హర్మ్యాన్ని మయుని చేత నిర్మింప జేసికొన్నాడు.

మయుడు దానవ శిల్పి. లంకానగరాన్ని అతిలోకసుందరంగా నిర్మించాడు. రావణుని మామ కనుక, "మనసేవ కృతాలంకా" అన్నట్లు మనస్సులో అత్యద్భుతంగా ఊహించి, ఆ ఊహకు తగినట్లుగా లంకనునిర్మించాడు.

ఇక అల్లుడైన రాక్షసేశ్వరుని మహా భవనము గురించి ఏమి చెప్పాలి? రావణుని భవనము చుట్టు సూర్యకాంతి వలన మెరుస్తున్న బంగారు ప్రాకారము ఉంది. భవన ద్వార, తోరణాలు వెండితో చేయబడి బంగారుచే అలంకరింపబడ్డాయి.

ఆ భవనము ముందు కొండల వంటి ఎత్తైన నల్లని మహాగజాలు, వివిధ వర్ణాలతో మెరిసే అశ్వరాజాలు ఉన్నాయి.

ఏనుగు దంతాలు, బంగారు, వెండిచే చేయబడిన మహారథాలు ఉన్నాయి. సింహాల వంటి భయంకర పరాక్రమం కల రాక్షసవీరులు ఆ భవనాన్ని రెప్పపాటు లేకుండా రాత్రింబవళ్లు కాపలాకాస్తున్నారు.

ఎల్లవేళలలో భేరీ, మృదంగ, కాహళ, శంఖధ్వనులు మారుమ్రోగుతుంటాయి.

ఆ మహారాజ భవనంలో అనేక కక్ష్యలు ఉన్నాయి. ఒక కక్ష్యలో రథ, గజ, తురగాలు, మరొక కక్ష్యలో వీరసైనికులు వేరొక కక్ష్యలో పరిమళ ద్రవ్యాల రాశులు ఉన్నాయి. ఈ విధంగా భవనము వెలుపలి కక్ష్యలు జనసందోహంతో కోలాహలంగా ఉన్నాయి.

కాని లోపల రావణుడు, ఆయన స్త్రీలు నిద్రావశులై ఉన్నారు. కనుక వాళ్ల నిద్రకు భంగం కల్గించకుండా లోపలి కక్ష్యలు నిశ్శబ్దంగా ఉన్నాయి. రావణుడి అంతఃపురాన్ని అనేక విధాయుధాలను ధరించి భయంకరులైన రాక్షస స్త్రీలు రక్షిస్తున్నారు.

రత్నాలరాశులతో, అమూల్యనిధులతో ఆ మహాభవనం పరమేశ్వర భవనంతో పోటీపడేలా ఉంది. మహామణులతో, కుబేరభవనాన్ని మరిపిస్తున్నది.

అక్కడ పాత్రలు, ఆసనాలు, శయ్యలు అన్ని బంగారువే. రత్నరాశులు, మణి మాణిక్యాలు, వెండి బంగారులు ఆ భవనాన్ని ఒక వైపు నుండి మెరిపిస్తు ఉంటే రావణాసురుని అసమానతేజస్సు ఆ భవన వైభవాన్ని మరింత ప్రకాశింపజేస్తుంది.

ఆ భవన శిఖరముపై కుబేరుని జయించి తెచ్చిన పుష్పకవిమానము ఉంచబడింది. రావణుని గర్వానికి ఆ విమానము ఒక ప్రతీక. దానికి సాటి ఏ లోకంలోను లేదు. సుందరమైన రాజహంసలు దానిని మోస్తున్నాయి.

ఆ విమానాన్ని విశ్వకర్మ బ్రహ్మకొరకు నిర్మించి ఇచ్చాడు. కుబేరుడు తన తపోబలంతో బ్రహ్మను మెప్పించి, దానిని వరంగా పొందాడు. రావణుడు తన బలపరాక్రమాలతో కుబేరుని జయించి దానిని తన భవనంలో ఉంచాడు.

ఆ విమానం యొక్క వెలుపలి, లోపలి భాగాలు అందమైన చిత్రాలతో, శిల్పాలతో అలంకరింపబడి ఉన్నాయి.

ఆ విమానంలో భూమి చిత్రించబడింది. దానిపై పర్వతాల వరుస, పర్వతాల వరుసలపై చెట్ల వరుస, చెట్ల వరుసపై పుష్పాల వరుస, పుష్పాల వరుసపై కేసర పత్రాల వరుస మనోహరంగా ఉన్నాయి.

వాల్మీకి యొక్క అద్భుత శబ్దసౌందర్యము ఈ శ్లోకంలో కనబడుతుంది.

"మహీకృతా పర్వతరాజిపూర్ణా। శైలాఃకృతాః వృక్షవితానపూర్ణాః।

వృక్షాఃకృతాః పుష్పవితాన పూర్ణాః। పుష్పం కృతం కేసరపత్ర పూర్ణం॥""

కృతాః పూర్ణాః శబ్దాలు మాటిమాటికి ఆవృత్తాలు అయ్యాయి. రెండవ చరణంలో వృక్షము, మూడవ చరణంలో, మూడవ చరణంలో పుష్ప శబ్దము నాలుగవ చరణంలో వచ్చాయి.

"ముక్తపదగ్రస్త" అలంకారంతో ఈ శ్లోకం అందంతో నిండి ఉంది. ఆ విమానము చాల విశాలమైనది. అందులో తెల్లని మందిరాలు ఉన్నాయి. పూల సరస్సులు ఉన్నాయి. ఆ విమానం రత్నకాంతులతో విరాజిల్లుతుంది.

దానిలో వెండితో, వైడూర్యాలతో, పగడాలతో పక్షులు చేయబడ్డాయి. అనేక రత్నాలతో గుఱ్ఱాల, పాముల ప్రతిమలు నిర్మించబడ్డాయి.

ఆ విమానంలో ఒక తామర కొలను ఉంది. అందులో ఒక పద్మంలో లక్ష్మీదేవి ఆసీనురాలై ఉంది. ఆ కొలనులో పెద్ద పెద్ద ఏనుగులు తమ తొండాలతో కలువరేకుల జలాలతో లక్ష్మీదేవికి అభిషేకం చేస్తున్నాయి.

రావణుని శయనమందిరము ఆయన ప్రియురాలివలె సర్వాభరణాలతో అలంకరింప బడి ఉంది.

అందులో మణులమెట్లు, బంగారు కిటికీలు, స్ఫటికముతో నిర్మింపబడిన నేల శోభాయామానంగా ఉన్నాయి.

ఆ నేలపై పెద్ద తివాచి పరుచబడింది. దానిపై భూమండలం చిత్రించబడింది. ఆ తివాచిపై విలువగల పాన్పులు ఉన్నాయి. అగరు ధూపాల సువాసనలతో ఆ భవనము నిండి ఉంది.

ఆ మందిరములో దీపాల వెలుగు, రావణుని తేజస్సు, ఆయన ఆభరణాల కాంతి ప్రతిఫలిస్తున్నాయి.

మందిరంలోని దీపాలు వెలుగులను నిర్విరామంగా విరజిమ్ముతున్నాయి. అవి రెప్పపాటు లేక తపస్సు చేస్తున్న మహర్షులవలె ఉన్నాయి. జూదంలో సర్వము కోల్పోయిన జూదరుల కళ్లవలె ఉన్నాయి.

స్త్రీలు కదలకుండా పడుకొని ఉన్నందువలన భూషణాల ధ్వనిలేక ఆ మందిరము నిశ్శబ్ద పద్మవనం వలె ఉంది.

ఆ స్త్రీలు ఆకాశం నుండి రాలిన తారల వలె మెరుస్తున్నారు. వారి మధ్య రావణుడు చంద్రుని వలె వెలుగుతున్నాడు.

నిద్రిస్తున్న ఆ స్త్రీలు అస్తవ్యస్తంగా పడుకొన్నారు. బొట్లు చెదిరి, అందెలు తొలగి, వస్త్ర, హారాలు జారి, పూలమాలలు నలిగి ఉన్నాయి.

వారందరు ఒకే దగ్గర కలిసి పడుకొని ఉన్నందువలన "పూలమాల" వలె వారు కనబడుతూ ఉన్నారు.

వారినందరిని చూడగానే హనుమంతుని మదిలో "సీతాదేవి కూడ ఇలాగే సుఖంగా ఉంటే బాగుండేది కదా!" అనే ఆలోచన కలిగింది.

అయితే ఈ ఆలోచన అనేకార్థాలను కలిగి ఉంది. ఈ స్త్రీలందరు రావణునితో కలసి ఎలా సుఖంగా నిద్రిస్తున్నారో, సీతాదేవి కూడ శ్రీరామచంద్రునితో కలసి అలాగే సుఖనిద్రను కలిగి ఉంటే రావణునికి ఎంతో బాగుండేది అని హనుమ అభిప్రాయము. "యదీదృశీ రాఘవ ధర్మపత్నీ। ఇమాయథారాక్షసరాజభార్యాః। సుజాతమస్యేతి' కాని ఈ ఆలోచనలో ఒక అశ్లీల అర్థము స్ఫురించే అవకాశము ఉంది.

ఈ రాక్షస స్త్రీల వలె, సీతాదేవి కూడ (శ్రీరామునిపై ఆశ వదలుకొని) రావణునితో కలసి సుఖంగా నిద్రిస్తే ఆయన కెంత బాగుండేది? అనే చెడు అర్థము కలిగే ప్రమాదము ఉంది.

హనుమ తన ఆలోచన విషయంలో ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. ఛీఛీ! మహాపతివ్రత అయిన సీతాదేవికి - ఈ రాక్షస స్త్రీలతో పోలిక ఉంటుందా? అని అమితంగా బాధపడ్డాడు.

"పునశ్చ సోఽ2 చింతయదార్త రూపః।
ధృవం విశిష్టా గుణతోహి సీతా!"

"ఎంతటి ఉత్తమురాలు సీతాదేవి"! అనుకొన్నాడు.

హనుమ దృష్టి తెల్లని పాన్పుపై నల్లటి మబ్బువలె నిద్రిస్తున్న రావణునిపై పడింది. ఆయన నిద్రిస్తున్న మహాపర్వతము వలె ఉన్నాడు. ఆయనను చూడగానే హనుమ ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. "ఓహో! ఏమి రావణుని తేజస్సు!" అని ఆశ్చర్యము చెందాడు.

రావణుడు బంగారు అంగదాలను ధరించిన తన రెండు భుజాలను రెండు ఇంద్ర ధనుస్సులవలె చాచిపడుకొన్నాడు. ఆ బాహువులు సామాన్యమైనవి కావు. ఐరావతము యొక్క కోరల కాట్లను ఎదుర్కొన్నవి! విష్ణుచక్రము దెబ్బలను కాచుకొన్నవి! ఇంద్రుని వజ్రాయుధం ధాటికి తొణక కుండా ఎదురునిలిచినవి!

ముత్యములతో అలంకరింపబడ్డ ఆయన కాంచన కిరీటము తల ప్రక్క ఉంది. ముఖము కుండలాలతో వెలిగిపోతున్నది. ఆయన విశాల వక్షస్థలముపై హారము విరాజిల్లుతున్నది. పాన్పుపై పడుకొన్న రావణుడు పాములవలె బుస కొట్టుతున్నాడు. ఇసుక తిన్నెలపై పడుకొన్న మదపుటేనుగు వలె ప్రశాంతంగా ఉన్నాడు.

మకుటేనాపవృత్తేన। కుండలోజ్జ్వలితాననం
విక్షిప్తౌ రాక్షసేంద్రస్య। భుజావింద్రధ్వజోపమౌ।

రావణుడు కిరీటము తొలిగి, కుండలములతో ప్రకాశించే ముఖము కల్గి ఉన్నాడు. రాక్షసేంద్రుని రెండు భుజాలు ఇంద్రధనుస్సుల వలె చాచుకొని ఉన్నాయి.

ఈ మాటలు రావణునికి ఒకే వదనము, రెండే బాహువులు ఉన్నాయని తెలుపుతున్నాయి. నిద్రాదశలో ఎల్లప్పుడు సహజ రూపమే ఉంటుంది. రావణుడు మేల్కొని ఉన్నప్పుడు పదితలలతో, ఇరువై చేతులతో ఉంటాడు.

ఇందులో ఒక పరమార్థము ఉంది. నిద్రాదశలో మన బాహ్యేంద్రియాలు పనిచేయవు. ఒక్క మనస్సు మాత్రమే పనిచేస్తుంది. అలాగే రావణునికి మనస్సనే ఒకే తల ప్రకాశిస్తున్నది. అప్పుడు చేతులు కూడ రెండే ఉంటాయి.

మెలుకువతో ఉన్నప్పుడాయనకు పది తలలు. పది ఇంద్రియాలే పది తలలు. పది తలలు ఉంటే ఆ తలలు పనిచేయాలా? వద్దా? అనే రెండు రకాల ఆలోచనలను కలిగి ఉంటాయి. ఒక్కొక్క తల ఆలోచనలు రెండు అయితే మొత్తము పది తలల ఆలోచనలు ఇరువై. ఇరువై ఆలోచనలకు సంకేతము ఇరువై చేతులు. చేయాలనే ఆలోచనను "ప్రవృత్తి", వద్దనే "ఆలోచనను" నివృత్తి అంటారు.

రావణాసురునితో సుఖాన్ని అనుభవించిన రమణీమణులు ఆయనకు సమీపంలోనే ఉన్నారు. కొందరు కూచున్నారు. అలసినవారు పడుకొన్నారు.

తాసామేకాంత విన్యస్తే। శయానాం శయనే శుభే।

దదర్శ రూపసంపన్నా। మపరాం సకపిస్త్రియం।

ఆ రాక్షస స్త్రీలకు దూరంగా ఒంటరిగా ఒక అందమైన శయ్యలో రూప సంపన్నురాలైన మరొక స్త్రీని హనుమ చూచాడు.

ఆమె అద్భుత సౌందర్యవతి. సర్వాభరణ భూషిత. రాజలక్షణ లక్షిత. ఆమె రావణుని పట్టపురాణి మండోదరి.

హనుమ ఆ అతిలోక సుందరిని చూచి సీతాదేవే అనుకొన్నాడు. "ఓహో! నా ప్రయత్నము ఫలించింది! నా అన్వేషణ (వెతుకుట) నెరవేరింది! సీతాదేవి నాకు కనబడింది" అని అత్యంత హర్షాన్ని పొందాడు.

ఆ ఆనందము పట్టలేకపోయాడు. తన భుజాలను, తొడలను చరచుకొన్నాడు. తన తోకను ముద్దుపెట్టుకొన్నాడు. నవ్వుతున్నాడు. ఆడుతున్నాడు. ఇటు వెళ్లాడు. అటు వెళ్లాడు. ఆ భవనములోని స్థంభాలపై పాకుతూ ఎక్కాడు. వాటినుండి జారి భూమిపై పడ్డాడు.

"ఆస్ఫోటయామాస - చుచుంబ పుచ్ఛం।
ననంద, చిక్రీడ, జగౌ, జగామ।
స్థంభానరోహత్, నిపపాత భూమౌ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనాం॥

హనుమ తన కోతి స్వభావాన్ని ప్రదర్శించాడు అంటాడు వాల్మీకి.

మనుష్యులమైన మనమే కోతి చేష్టలను చేస్తుంటే నిజంగా కోతి అయిన హనుమ సహజమైన కోతి చేష్టలను చేస్తే కోతి బుద్ధిని చూపితే తప్పేమిటి?

హనుమ నిజంగా కోతి మాత్రమే కాదు. బుద్ధిమతాం వరిష్ఠుడు. అంటే బుద్ధిమంతులలో గొప్పవాడు.

అందువలన హనుమ నిజంగా తన ఆలోచనకు మరొకసారి సిగ్గుపడ్డాడు. "ఛీఛీ ఎంత పాడు ఆలోచన!" అని తనను తానే అసహ్యించుకొన్నాడు.

"న రామేణ వియుక్తాసా। స్వప్తు మర్హతి భామినీ।
న భోక్తుం నాప్యలంకర్తుం। నపానముపసేవితుం।"

శ్రీరాముని ఎడబాసి నిరంతరము దుఃఖించే సీతామతల్లి నిద్రబోగల్గుతుందా? ఆమెకు తిండి సహిస్తుందా? పానీయాన్ని ఆమె సేవిస్తుందా? ఆమెకు అలంకారాలు ఇష్టమవుతాయా?

"నాన్యం వరముపస్థాతుం। సురాణామపిచేశ్వరం॥"

ఆమె అన్యుడైన పురుషుని మహేంద్రుని సైతము సమీపిస్తుందా?

"అన్యేయమితి నిశ్చిత్య। పానభూమౌ చచారసః।"

అందువలన ఈమె సీత కాదు. వేరే ఏ స్త్రీయో? అని నిశ్చయించుకొని పానభూమిలో సంచరించాడు.

హనుమకు మరొక విచారము ఆయన మనస్సులో బాధించడం మొదలుపెట్టింది.

"సాధారణంగా స్త్రీలను దగ్గరినుండి చూడకూడదు కదా! అందులో నిద్రిస్తున్న వారిని దగ్గరగా చూడడం మరింత పనికిరాదు కదా! మరి నేనిప్పుడు చేసిన పనేమిటి? బొట్టు చెదిరి, అందెలు తొలిగి, హారాలు, చీరలు జారిన ఆడవాళ్లను నిద్రిస్తుండగా దగ్గరి నుండి చూచానే? ఇది పాపం కాదా?"

హనుమ కొంతసేపటికి ఒక నిశ్చయానికి వచ్చాడు. తనకు తానే సమాధానం చెప్పుకొన్నాడు.

"మనము ఏ పనిచేసినా ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నామన్నదే ముఖ్యము. నేను దురుద్దేశ్యంతో ఈ స్త్రీలను గమనించలేదు. వీరు ఇంత అస్తవ్యస్తంగా పడుకొని ఉన్నా,

వీరిని చూచినప్పుడు నా మనస్సు చెడు ఆలోచనలకు చోటివ్వలేదు. ఇంద్రియాలు చెడుగా ప్రవర్తించాలన్నా, మంచిగా నడుచుకోవాలన్నా మనస్సే కారణము. వీరిని ఈ స్థితిలో చూచినా నా మనస్సు చక్కగానే ఉంది. అయినా సీతాదేవి కూడ ఒక స్త్రీయే కదా! ఆమెను స్త్రీల మధ్యలోకాక పోతే ఇంకెక్కడ వెతుకుతాము?

స్త్రీలలో వారు మెలుకువతో ఉన్నప్పుడు సీతాదేవిని వెతుకడం వీలవుతుందా? మెలుకువ ఉన్న స్త్రీలను సమీపంగా గమనిస్తే వారు ఊరకుంటారా? ఆ విషయాన్ని వింటే రావణుడు ఊరకే వదలిపెడుతాడా?”.

అందువలన నేను చేసిన పని తప్పుకాదు. శుద్ధమైన మనస్సుతో వెతికాను. కనుక అందులో దోషము లేదని తీర్మానించుకొన్నాడు.

-- ఇతిశం --

‘సీత కోసమ్మై శ్రీయుతమూర్తి జూచు, కపి చిన్నారి గోడల
గూండ్లయందునన్” - విశ్వనాథ

“ఇంతటి దుర్జనత్వమున కింతటి లక్ష్మికి నెట్లు గూర్చునో?”
- శ్రీ విశ్వనాథ

“నిలువున జూచినంతట, నీరయి పోయెడునట్లు
గుండెంయున్” - శ్రీ విశ్వనాథ

‘సీతగాంచి తినంచు నెంచుచు
కపిశ్రేష్ఠుండు లాంగూలమున్
చేతంగైకొని ముద్దుగొంచు
చెగిరి గంతుల్ వేసె” - శ్రీ విశ్వనాథ

“ఎంత ఆలోచనా పరుండేని సుంత తొందర పడు తానుమ” - శ్రీవిశ్వనాథ

# హనుమ నిర్వేదము - 10

"స చింతయామాస తతో మహాకపిః ప్రియామపశ్యన్ రఘునందనస్యతాం।
ధ్రువం హి సీతాప్రియతే యథా నమే। విచిన్వతో దర్శనమేతి మైథిలీ।".

హనుమ తన శక్తి కొలది లంకనంతా గాలించాడు. ఇల్లిల్లు వెతికాడు. చుట్టు ప్రక్కల తోటలలో, లతాగృహాలలో, కనబడ్డచోటల్లా కళ్లల్లో వత్తులు వేసికొని అన్వేషించాడు. సీతాదేవి ఆయనకు కనబడలేదు. ఇంకెక్కడ వెతుకాలి? ఆమె ఇంకెక్కడ కనబడుతుంది?

లాభము లేదు. ఇక ఆమెను చూచే భాగ్యం తనకు లేదు. ఎక్కడా లేదంటే ఎంత వెతికినా కనబడలేదంటే ఏమర్థము? ఆమె జీవించే లేదనా?

బహుశః కావచ్చు. ఆమె చనిపోయి ఉండవచ్చు.

ఆమె పతివ్రత. శీలమే ఆమె ప్రాణము. అటువంటి శీలానికే రావణాసురుని వలన ప్రమాదం కలుగుతుందనే అనుమానము కలిగినప్పుడు ఆమె ఇంకా జీవించి ఉంటుందా? అసంభవము!

భయంకరులైన రాక్షసులను చూడగానే, వారు పెట్టే చిత్రహింసలను ఊహించుకోగానే ఆమె గుండె ఆగిపోయి ఉండవచ్చు.

సీతాదేవిని చూడకుండా, వానరులతో కలసి సుగ్రీవుడు పెట్టిన కాలవ్యవధిని మీరి, నేను సుగ్రీవుని దగ్గరకు ఎలా వెళ్లగల్గుతాను?

మా వానర మిత్రులు ఏమంటారు? "హనుమా! అన్ని ప్రగల్భాలు పలికి సముద్రము దాటి లంకకు వెళ్లి నీవు సాధించిందేమిటి?" అని పరిహసించరా?

సుగ్రీవుడు చండశాసనుడే. గడువు మీరి, సీతను చూడకుండా వెళ్తే నన్ను, నా మిత్రులను వదులుతాడా? మా అందరికి మరణమే కదా శిక్ష?

ఈ విధంగా హనుమకు సీతాదేవి దర్శనం కానందువలన, దుఃఖము భయము కలిగాయి. అంతలోనే తన దుఃఖాన్ని తగ్గించుకొన్నాడు. ధైర్యాన్ని తెచ్చుకొన్నాడు.

"ధైర్యమే అన్ని శ్రేయస్సులకు మూలము. ధైర్యమే సుఖాన్ని కల్గిస్తుంది. ధైర్యమే అన్ని వేళలలో అన్ని కోరికలను సాధించిపెట్టుతుంద"ని అనుకొన్నాడు.

"అందువలన ధైర్యాన్ని (అనిర్వేదాన్ని) తెచ్చుకొని మళ్లీ ప్రయత్నాన్ని సాగిస్తాను" అనుకొన్నాడు.

మళ్లీ క్రీడాగృహాలను, పుష్పగృహాలను వెతుకుతున్నాడు. గోడల పైకి ఎక్కి చూస్తున్నాడు. దిగి క్రింద చూస్తున్నాడు. ద్వారాలను తెరచి చూస్తున్నాడు. అవకాశము ఉన్నంత వరకు మళ్లీ మళ్లీ వెతికాడు. నాలుగు అంగుళాలస్థలాన్ని కూడ వదలిపెట్టలేదు.

విద్యాధర స్త్రీలను, నాగకన్యలను, రాజకన్యలను, రాక్షస స్త్రీలను అందరిని గమనించాడు. కానివారిలో సీతాదేవి లేదు.

సీతాదేవి ఎక్కడా కనబడలేదు. మళ్లీ ఆయనకు దుఃఖము పొంగుకొచ్చింది.

సంపాతి – "తాను సీతాదేవిని లంకలో స్వయంగా చూస్తున్నట్లే చెప్పాడే! మరి ఆయన చూచిన సీత తనకు కనబడడం లేదెందుకు?"

విదేహ రాజపుత్రి, మిథిలానగర సంవర్ధిత సీత రావణాసురునితో కలసిందా? ఆమె రావణునికి లోబడకపోవచ్చు. స్నేహంతో నైనా కలసిందా? అది అసాధ్యము. మరి ఏమైంది?

రావణాసురుడు సీతను లంకకు తీసికొని వస్తుండగా ఆమె సముద్రము మధ్యలో భయంతో పడిపోయిందా? అలా జరుగదు. రావణాసురుడు సీతాదేవి పట్ల అత్యంత జాగ్రత్తను కల్గి ఉంటాడు. ఆమెను సముద్రములో పడనీయడు.

ఎంతజేసినా సీత తనకు లొంగడం లేదనే కోపముతో రావణుడు ఆమెను మ్రింగి వేశాడా? అలా కూడ జరుగదు. తన ప్రాణాలకంటే అధికంగా ప్రేమించే సీతాదేవి అనుగ్రహానికై ఎంతకాలమైనా వేచి ఉంటాడు. కాని ఆమెను చంపబోడు.

పోనీ రాక్షస స్త్రీలు ఆమెను సంహరించి ఉంటారా? అది కూడ సాధ్యము కాదు. ఆమెను సంహరిస్తే రావణుడు తమనెవ్వరిని బ్రతుకనివ్వడనే భయంతో వారా పనికి సాహసించరు.

అదీ కాకుంటే – రామ విరహాన్ని భరింపలేక సీతాదేవే స్వయంగానే మరణించి ఉంటుందా? అది కూడా అసాధ్యమే. ఆమెకు రాముని పట్ల అత్యధిక ప్రేమ ఉంది. ఆయన రక్షణ పట్ల విశ్వాసము ఉంది. ఎంతకాలమైనా తన ప్రాణాలను నిలుపుకొని ఆయన కొరకు ఎదురుచూస్తుంటుంది. కాని చావదు.

అయితే అణువణువు లంక అంతా గాలించినా ఆమె ఎందుకు కనబడడం లేదు? ఆమె కొరకు ఎంత కాలము వెతకాలి? ఆమె ఎన్నటికి కనబడకపోతే ఏమి చేయాలి? తాను కిష్కింధకు తిరిగి పోవాలా? వద్దా?

ఆమె కనబడక పోయిన తరువాత ఇక్కడ ఉంటే మాత్రము ఏమి లాభము? పోనీ తిరిగి వెళ్దామంటే, వెళ్లి ఏమి చేయాలి? ఎవ్వరికి ఏమి చెప్పాలి?

సీత ఎంత వెదికినా కనబడలేదంటే శ్రీరాముడు బ్రతికి ఉంటాడా? రాముడు లేకుంటే లక్ష్మణుడు జీవించి ఉంటాడా? వీరిద్దరు మరణించారని తెలిస్తే భరతశత్రుఘ్నులు బ్రతికి ఉంటారా? వాళ్లు మరణిస్తే వాళ్ల తల్లులు బ్రతుకుతారా?

శ్రీరాముని పరిస్థితిని చూచిన తరువాత సుగ్రీవుడు జీవించి ఉంటాడా? సుగ్రీవుడు లేకుండా, తారా రుమలు బ్రతుకుతారా? రాజులేక వానరులు జీవిస్తారా?

అందువలన తన కిష్కింధా ప్రయాణము శ్రీరాముని వంశాన్ని, సుగ్రీవ పరివారాన్ని నశింపజేస్తుంది. కనుక తాను కిష్కింధకు వెళ్లకుంటేనే మేలు. తాను వెళ్లనంత వరకు రామ లక్ష్మణులు, సుగ్రీవాదులు ఆశతో ఎదురుచూస్తుంటారు.

నేనిక్కడనే ఉండి, ఆకులు అలములు తింటూ వానప్రస్థుడనై జీవిస్తాను. లేదా నా శరీరాన్ని ప్రాయోపవేశంతో క్రూరమృగాలకు బలి ఇస్తాను. లేదా చితిని పేర్చుకొని కాలిపోతాను. అదికాకపోతే నీటిలోపడి మరణిస్తాను.

నీటిలో పడి శరీరాన్ని వదలడం వానప్రస్థులకు దోషము కాదు.

అయితే చచ్చి సాధించేది ఏముంటుంది? జీవించి ఉంటే ఏదో ఒకప్పుడు శుభాన్ని చూడవచ్చు.

"వినాశే బహవో దోషాః - జీవన్ భద్రాణి పశ్యతి"

ఈ విధంగా బహు విధాల చింతిస్తుంటే హనుమకు హఠాత్తుగా నగరము వెనుక వైపు ఉండే అశోకవనముపై దృష్టి పడింది.

-- ఇతిశం --

రామకార్య ప్రశాంతమునందు - చెట్టుపురుగై తొడిమన్ తిను
రీతి నయ్యెదన్" - శ్రీ విశ్వనాథ.

"కడుకొని దైవమెట్లు చనగా దగియున్నదో" - శ్రీ విశ్వనాథ

కట్టద్దితిజేంద్రు పట్టణమునందు నింకెక్కడ జూడగా వలెన్.
- శ్రీ విశ్వనాథ

# అశోకవనము - 11

లంకలో రావణునికి అత్యంత ఇష్టమైన వనము అశోకవనము. ఇంద్రుని నందనవనం కంటే, కుబేరుని చైత్రరథము కంటే అత్యంత సుందరమైంది ఈ అశోకవనము.

రావణాసురుడు తాను సంచరించిన అన్ని స్థలాలలోని అపురూపమైన మొక్కలను తెచ్చి తన వనంలో నాటాడు. అందుకే అశోకవనము అన్ని లోకాలలో ప్రసిద్ధమైనది, అత్యంత మనోహరమైనది.

ఈ అశోకవనము ఇంతవరకు హనుమకంటబడలేదు. దైవికంగా ఇప్పుడు ఆయనకు కనబడింది. అశోకవనాన్ని చూడగానే హనుమ శోకము తొలగిపోయింది. “శోకాన్ని పోగొట్టుతుంది, సంతోషాన్ని కల్గిస్తుంది కనుకే ఆ వనానికి అశోకవనము” అని పేరు. దీనికి అందుకే “ప్రమదావనము” అని మరొక పేరు.

అశోకవనాన్ని చూడగానే హనుమ మనస్సులో సంతోషోత్సాహాలు మొలకెత్తాయి. ఆయనకు ఆశ్చర్యము కలిగింది. “నేనింతవరకు ఈ వనాన్ని చూడలేదే? బహుశః ఇందులో జానకీదేవి నాకు దర్శనాన్ని ప్రసాదించవచ్చు” అని సంతోషించాడు హనుమ.

ఆయన మనస్సులో రామలక్ష్మణులు మెదిలారు. వారిద్దరికి మనస్సులోనే ప్రణామాలను సమర్పించుకొన్నాడు.

“నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ”

లక్ష్మణునితో కూడిన రామునికి నమస్కరించాడు. శ్రీరాముడు పరమాత్మ. పరమాత్మకు ఒక్కనికే నమస్కరిస్తే సరిపోదు. లక్ష్మణుడు శ్రీరాముని అరక్షణమైనా విడిచి ఉండలేని భాగవతోత్తముడు. భగవంతుడు తనకు సేవలు చేసిన వారికంటే, తన భక్తులకు సేవలు చేసిన వారినే అధికంగా ప్రేమిస్తాడు. భగవంతునితో పాటు భాగవతోత్తములను కూడ ప్రేమించాలి. “భాగవత పర్యంతమాక అనుసంధిక్కేయం” అంటారు లోక గురువులు. తన కెవ్వరైనా అపరాధాలు చేస్తే పరమాత్మ సహిస్తాడు. కాని తనకు ప్రాణప్రియులైన భాగవతోత్తములకు అపచారము చేస్తే ఎంత మాత్రము సహించడు.

తనను సీతాదేవి “నీవు నిజంగా మగవాడివా? మగవేషము వేసికొన్న స్త్రీవే కదా?” అని అపహాస్యం చేసినా సీతాదేవిని రాముడు మన్నించి, ఆమెను తన వెంట వనానికి రావడానికి అనుమతించాడు.

కాని లక్ష్మణుని దూషించాక ఆమెను రాముడు మన్నించలేదు. కనుక ఆమె ఎంత వేడినా ఇంతవరకు తన దర్శనాన్ని ఇవ్వలేదు.

భగవదపచారం కంటే భాగవతాపచారమే భయంకరమైనది. భగవంతునికి మనను దూరం చేస్తుంది.

అలాగే శ్రీరాముని మాత్రమే ఆదరించి, లక్ష్మణుని నిరాదరించిన సుగ్రీవుని శ్రీరాముడు క్షమించలేదు. వాలిచేతిలో సుగ్రీవునికి ఘోరావమానాన్ని కలిగించాడు.

తిరిగి లక్ష్మణానుగ్రహాన్ని సంపాదించిన తరువాతే సుగ్రీవుని చేరదీసి ఆయనకు భార్యను, రాజ్యలక్ష్మిని ప్రసాదించాడు.

హనుమ సీతాదేవి అపచారాన్ని అర్థం చేసికొన్నాడు. సుగ్రీవుని అపచారాన్ని కళ్లారా చూచాడు.

అందువలననే "నమో2స్తు రామాయ సలక్ష్మణాయ" అని రాముని తరువాత లక్ష్మణునికి కూడ ప్రణమిల్లాడు.

కాని అంతటితో హనుమకు తృప్తి కలుగలేదు. సీతాదేవి స్వభావము ఆయనకు బాగా తెలుసు. ఎవ్వరోకనుక్కుంటే ఆమె కనబడలేదు. స్వయంగా తానే జనకునికి యజ్ఞభూమిలో దర్శనమిచ్చింది.

"యమేవైష వృణుతే తేన లభ్యః।

తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వాం" అంటుంది శ్రుతి.

పరమాత్మ కేవల శ్రవణ, మనన, నిధి ధ్యాసాదుల ద్వారా లభింపదు. తాను వరించిన వారికే తన స్వరూపాన్ని ప్రకాశింపజేస్తాడు.

పరమాత్మ స్వభావము, అమ్మవారి స్వభావము వేర్వేరు కాదు. రెండు ఒకటే. అందువలననే సీతాదేవి కూడ తాను అభిమానించిన వారికే తన స్వరూపాన్ని ప్రకాశింపజేస్తుంది.

కనుక రామలక్ష్మణులకు మాత్రమే నమస్కరించి, తృప్తి పడక అమ్మవారికి కూడ అంజలి ఘటించాడు హనుమ.

"నమోస్తు దేవ్యై, జనకాత్మజాయై"

సీతకు (సీతాయై) నమస్కారమనలేదు. దేవికి నమస్కారము అన్నాడు. ఆయనకు "సీత అంటే సాక్షాత్తుగా శ్రీదేవే" అని తెలుసు.

పరమాత్మ రాముడైతే (రాఘవత్వే2భవత్ సీతా) ఆ(శ్రీ) దేవే తాను సీతాదేవిగా జనకునికి యాగభూమిలో దర్శనమిచ్చింది.

అందుకే "దేవ్యై....... జనకాత్మజాయై" అని ప్రణమిల్లాడు హనుమ.

"దివ్ = క్రీడాయాం" దేవి అంటే క్రీడించేది. కనుపించడం, కనుపించకపోవడం, ఆమెకు క్రీడయే.

సీతాదేవి అనుగ్రహాన్ని ముందుగా ప్రణామంతో సంపాదించుకొని, అశోకవనంలో ఆమెను వెతకడం ప్రారంభించాడు హనుమ.

"సీత" అంటే కుండలినీ శక్తి. అంటే కుండలాకారంలో గుండ్రంగా (మూడున్నర చుట్టలు చుట్టుకొని) పడుకొని ఉన్న శక్తి. ఆమె ఉన్న స్థానము లంక. లంక క్రింది (దక్షిణ) దిశలో ఉన్నది కనుక మూలాధార చక్రానికి గుర్తు.

మూలాధార చక్రంలో (లంకలో) ఉన్న కుండలినీ శక్తిని (సీతా దేవిని) ప్రబుద్ధం చేసి, కుంభకవాయువు (వాయుపుత్రుడైన హనుమ) ఆ శక్తిని పై పై చక్రాలకు ఆకర్షించి (శ్రీరామచంద్రుని సంజీవన వార్తను ఆమెకు తెలిపి, ఆమెలో నమ్మకాన్ని కల్గించి) సహస్రార చక్రానికి (శ్రీరామపరమాత్మ స్థానానికి) చేర్చడమే ముఖ్యమైన మహాయోగి హనుమ కర్తవ్యము.

"కుండలినీ" కుం = భూమిని (మూలాధారాన్ని)

దడయోరభేదః దళినీ = ఛేదించుకొని పైకి వచ్చేది.

"సార్ధత్రివలయాకుండలినీ". మూడున్నర చుట్ల సర్పాకారంలో మూలాధారంలో కుండలినీ శక్తి చుట్టలు చుట్టుకొని ఉంటుంది. ఇందులో మూడు చుట్లు – సత్వరజస్తమస్సు లనే త్రిగుణాలకు సంకేతము. మిగిలిన సగము చుట్ట ఆ శక్తి త్రిగుణాలకు కూడ అతీతమని తెలుపుతుంది.

కనుక "సీతాదేవి" అంటే త్రిగుణాతీత.

సీత అంటే నాగలి చాలు. నాగటి చాలులో పడిన విత్తనము మొలకెత్తి ఫలిస్తుంది. అలాగే సీతాదేవి విషయంలో హనుమ చేసే ప్రయత్నము (విత్తనము) శ్రీరామునితో ఆమెను చేర్చి ఫలవంతమవుతుంది.

అశోకవనము కోకిలల, "కూకూ" ధ్వనుల చేత, పక్షుల కిలాకిలారావము చేత, మృగముల అరుపులచేత నిండి ఉంది. అది మరొక గంధమాదన పర్వతమా అన్నట్లు సువాసనల వెదజల్లుతూ ఉంది.

దానికి దగ్గరలో ఒక వేయి స్థంభాల చైత్యభవనము ఉన్నది. ఆ భవనము మెట్లు పగడాలతో కట్టబడ్డాయి. వేదికలు బంగారుతో నిర్మింపబడ్డాయి. ఆకాశాన్ని ముద్దాడే ఆ భవనము కైలాస పర్వతమువలె శోభాయమానంగా ఉంది. ఆ భవనం దగ్గర లోని ఒక వేదికపై సీతాదేవి కూచొని ఉంది. ఆమెను అల్లంత దూరంలో ఒక శింశుపావృక్షము కొమ్మల మాటున కూర్చున్న మారుతి గమనించాడు.

ఆమె ఒకే జడ ధరించి ఉంది. ఆ జడను మళ్లీ దువ్వుకోలేదు. శ్రీరామునితో ఉన్నప్పుడు కట్టుకొన్న చీరనే ధరించింది. ఆ చీర పాతదైంది. మాసిపోయింది. ఆమె మరో చీరను మార్చనేలేదు.

ఆమె ఉపవాసాలతో, దుఃఖముతో కృశించి ఉంది. దుఃఖాన్ని నిగ్రహించుకోలేక గాఢమైన నిట్టూర్పులను వదలుతున్నది. ఎంతోసేపు జాగ్రత్తగా చూస్తే తప్ప గుర్తు పట్టలేకుండా ఉంది.

ఆమె పాడ్యమి నాటి చంద్రరేఖవలె, కృశించి గుర్తించరాకుండా ఉంది. పొగనిండిన అగ్ని జ్వాల వలె కాంతి తగ్గి ఉంది. బురద నిండి పూలు లేని తామర తీగ వలె అలంకార శూన్యమై ఉంది.

క్రూరమైన కుజగ్రహము చేత పీడింపబడుతున్న రోహిణీ నక్షత్రము వలె దీనంగా ఉంది.

ఆమె శ్రీరాముని వియోగ దుఃఖముతో కన్నీళ్లతో శ్రీరామునే ధ్యానిస్తూ ఉంది. తాపసి వలె నియమశీలగా ఉంది.

సీతాదేవి విఫలమైన ఆశవలె, విఘ్నములెదురైన సిద్ధివలె. కలుషిత బుద్ధివలె. భ్రష్టైశ్వర్యమువలె, అవిశ్వాసమువలన చెడిన శ్రద్ధవలె. నీలాపనిందవలన చెడిన కీర్తివలె, అస్పష్టార్థముగల మన్వాది స్మృతి వలె, పునశ్చరణ లేని విద్యవలె కాంతి రహితయై ఉంది.

హనుమ ఆమెను చూచి చాలసేపటి వరకు గుర్తు పట్టలేదు. అయితే ఆమె సీతయే అని గుర్తుపట్టడానికి ఆరు గుర్తులు కనబడ్డాయి.

(1) శ్రీరాముడు తెలిపిన సీతాదేవి ఆభరణాలు ఆమె ఉన్న దగ్గర చెట్టుకొమ్మలపై వేలాడుతున్నాయి.

(2) ఆమె చాల కాలమునుండి ధరించినవి కనుక అవి చెమటతో నలుపెక్కాయి.

(3) ఋష్యమూకమున పడవేసిన ఒక ప్రక్క ఆభరణాలు ఇక్కడ లేవు.

(4) ఇక్కడ కనిపిస్తున్న మరొక ప్రక్క ఆభరణాలు ఆమె పడవేసిన నగలలో లేవు.

(5) అంతేకాదు. ఆమె పడవేసిన నగలను కట్టిన చీరభాగము సీతాదేవి ధరించిన చీరలో నుండి చించినదే.

(6) అప్పటి నుండి ఒకే చీర ధరిస్తున్నది. కనుక అది మాసిపోయింది.

సీతాదేవి విషయములో శ్రీరాముడు దుఃఖించడానికి నాలుగు కారణాలు ఉన్నాయి:-

1) స్వయంగా రక్షణ చేసికోజాలని స్త్రీ అపహరింపబడింది కదా! అయ్యో ఆమెను నేను కాపాడలేకపోయానే అనే కరుణ (కారుణ్యము)

2) నన్ను ఆశ్రయించి, నన్నే నమ్ముకొని, సర్వాన్ని పరిత్యజించి, నా వెంట కఠినారణ్యాలకు కూడ వచ్చింది కదా! అటువంటి ఆశ్రితురాలిని రక్షించుకోలేక పోయానే అనే జాలి (ఆనృశంస్యము)

3) నన్ను అగ్నిసాక్షిగా పెండ్లాడిన ధర్మపత్నిని కాపాడుకోలేక అధర్మము పాలయ్యానే అనే దుఃఖము (శోకము)

4) నన్ను అహోరాత్రులు తన ప్రేమ చేత ముంచెత్తి, రాజ్యాన్ని, నా వాళ్లను వదలి వచ్చానే అనే దుఃఖాన్ని ఎంత మాత్రము కలుగనీయని ప్రాణప్రియ నాకు దూరమైందే అనే ప్రేమావేశము (మదనము).

హనుమ సీతను ప్రత్యక్షంగా చూస్తున్నాడు. రాముని రూపాన్ని మనస్సులోకి తెచ్చుకొంటున్నాడు. నిజంగా ఆమెను రావణుడు అపహరించాడని తెలియగానే శ్రీరాముడు మరణించి ఉండాలి. అలాగే శ్రీరామునికి దూరమైన మరుక్షణమే సీతాదేవి మరణించి ఉండాలి. మరెలా ఇన్ని రోజులు జీవించి ఉన్నారు? కారణమేమిటంటే సీతాదేవి మనస్సు సీత దగ్గర లేదు. శ్రీరాముని దగ్గర ఉంది.

అలాగే శ్రీరాముని మనస్సు ఆయన దగ్గరలేదు. సీతాదేవి దగ్గర ఉంది.

ఎవ్వరి మనస్సు వారి దగ్గర ఉంటే ఇది వరకే గుండె పగిలి ఇద్దరు చచ్చేవారే. కాని ఒకరి మనస్సు మరొకరి దగ్గర ఉంది. అందువలన జీవించి ఉన్నారు.

"అస్యా దేవ్యా మనస్తస్మిన్। తస్య చాస్యాం ప్రతిష్ఠితం
తేనేయం సచధర్మాత్మా। ముహూర్తమపి జీవతి"

ఇంతకుముందు కిష్కింధలో శ్రీరాముని దుర్భర దుఃఖాన్ని చూచాడు. ఆ దుఃఖ రహస్యము అప్పుడు ఆయనకు అర్థము కాలేదు. అందువలన ఆయన రాముని చూచి విసుగుకొనేవాడు.

"వశిష్ట మహాముని అంతరంగ శిష్యుడు, స్వయంగా అంతటి మహానుభావుడైన శ్రీరామచంద్రుడు ఒక్క ఆడదాని కొరకు అహోరాత్రులు అంత అమితంగా దుఃఖించాలా?" అని మనస్సులో హనుమ రాముని అపహసించేవాడు. కాని ఈనాడు ఆ దేవి సౌందర్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించాక రాముని పట్ల హనుమకు కోపం కలుగుతుంది.

"అతిరూపవతీ సీతా" సీతాదేవి సౌందర్యము సర్వలోకాతీతము. ఆమె రామునికి ప్రాణం కంటే ఎక్కువగా ప్రియమైనది. అంతటి సర్వాతిశయసౌందర్యము కలిగి, తనకు ప్రాణాధిక ప్రియ అయిన సీతాదేవిని వదలి ఇంతకాలము రాముడు ఎలా బ్రతికి ఉన్నాడు? ఎంతటి కఠినచిత్తుడు రాముడు!

"దుష్కరం కృతవాన్ రామః। య ఇమాం మత్తకాశినీం

సీతాం వినా మహా బాహుః। ముహూర్తమపి జీవతి".

సీతను విడిచాక ఒక క్షణం కూడ రాముడు జీవించి ఉండకూడదే. ఇంకా జీవించి ఉన్నాడంటే ఆయన కఠినచిత్తుడే.

"దుష్కరం కృతవాన్రామో। హీనో యదనయా ప్రభుః

ధారయత్యాత్మనోదేహం। నశోకేనావసీదతి"

సీతాదేవి లేకున్నా రాముడు ఇంకా ప్రాణాలను నిలుపుకొని ఉన్నాడే. అంతటి శోకము ఆయనను ఎలా బ్రతుకనిచ్చిందో?

ఇక్కడ ఈ రెండు శ్లోకాలలో వాల్మీకి రెండు పదాలు వాడాడు.

1) మహాబాహుః 2) ప్రభుః

1) రాముడు మహాబాహువు. ఆయన తాను కూడ అందరివలె కర్మలను ఆచరిస్తాడు. కాని వాటి ఫలితాలను ఆశించికాదు. కర్మఫలము సుఖమైనా, దుఃఖమైనా ఆయనను బంధించదు.

2) శ్రీరామచంద్రుడు ప్రభువు. ఆయనకు ప్రజలు ప్రధానము. పరిపాలన ప్రధానము. ఆశ్రిత సంరక్షణము ప్రధానము. వ్యక్తిగత సంబంధాలు అంత ముఖ్యమైనవి కావు.

అందువలననే,

"అప్యహం జీవితం జహ్యాం।
త్వాం వా సీతే సలక్ష్మణాం
నతుప్రతిజ్ఞాం సంశ్రుత్య
బ్రాహ్మణేభ్యో విశేషతః॥
"అధవాజానకీమపి ఆరాధనాయలోకానాం
ముంచతోనా2స్తిమేవ్యధా"

సీతా లోకంలో నా ఆశ్రితులే నాకు సర్వము. వాళ్ల ఆరాధనే నాకు ముఖ్యము. ఆ విషయంలో నా ప్రాణాలు పోయినా ఫరవాలేదు. నిన్నైనా, లక్ష్మణుని అయినా మీ ఇద్దరిని అయినా ఆ విషయంలో వదులుకోవడానికి కూడ సిద్ధమే" అంటాడు అరణ్యంలో - మరొక మారు "లోకము యొక్క ఆరాధన విషయంలో సీతాదేవిని కూడ వదులుకొన్నా నాకు బాధలేదు" అంటాడు రామప్రభువు. ప్రభువుగా లోకారాధన, మహాబాహువుగా కర్మ ఫలాల పట్ల సమత్వము సీతాదేవిని విడిచి ఉండడానికి కారణాలని వాల్మీకి అభిప్రాయం.

ఓం తత్సత్

తమ్ముడెదురు తిరుగు. తనయాలు నిందించు,
ఏది చేయబోవ నెదురు వచ్చు
పట్టు దొలగి నీళ్లపై రాలును తేలును,
గ్రహచయంబు చెడ్డగా తిరిగిన" - శ్రీ విశ్వనాథ

పతికనరామిచే, విరహభావ విషణ్ణత జేసి భూషణ ప్రతతులు
రాల్చినట్లు, తరురాజి లతాంతముల నెల్ల రాల్చెడున్
- శ్రీ విశ్వనాథ

"ఆమె పదంబులన్ గనిన యంతన: పాదములందు వ్రాలి
తలంపు గలుగు" - శ్రీ విశ్వనాథ

# సీతాదేవి దీన స్వరూపము - 12

హనుమ శింశుపా వృక్షం నుండి సీతాదేవిని గమనిస్తున్నాడు. ఆమె అతిలోక సౌందర్యాన్ని గమనిస్తున్నాడు.

ఇంతవరకు కిష్కింధలో ఉన్నప్పుడు హనుమ శ్రీరాముడు సీతకొరకు విలపించడం చూసి విసుగుకొన్నాడు. "ఒక సామాన్య స్త్రీ కొరకు సర్వలోక ప్రభువైన శ్రీరామచంద్రస్వామి ఇంతగా పరితపించడమా?" అని మనస్సులో ఈసడించుకొన్నాడు. కాని ఇప్పుడు అర్థమైంది రామ దుఃఖానికి కారణము "అతిరూపవతీ సీతా". సీతాదేవి యొక్క సౌందర్యము అద్వితీయమైంది.

హనుమ శ్రీరామచంద్రస్వామి యొక్క సౌందర్యాన్ని గుర్తుచేసికొంటున్నాడు. సర్వప్రాణి మనోహరమైనది రామసౌందర్యము.

ఇప్పుడు సీతారాముల గొప్పదనాన్ని తులదూస్తున్నాడు.

"తుల్యశీలవయోవృత్తాం। తుల్యాభిజన లక్షణాం
రాఘవోఽర్హతి వైదేహీం। తంచేయమసితేక్షణా"

సీతారాముల శీల, వయో, వృత్తాలు, అభిజన లక్షణాలు పరస్పరము తగినట్లుగా ఉన్నాయి.

1. శ్రీరామశీలము: శ్రీరామచంద్రుడు ధర్మస్వరూపుడు. ఆయనకు ధర్మాచరణమే ముఖ్యము. రాజ్య సంపదలు ఆయనకు తృణప్రాయాలు.

పట్టాభిషేకానికి సర్వసన్నద్ధుడైన రాముని పిలిచి, "రాజ్యాన్ని వదలి వెంటనే అడవికి వెళ్లుమ"ని కైక ఆదేశించినప్పుడు, "తల్లీ! నాకు రాజ్యభోగాలపట్ల వ్యామోహం ఏ మాత్రము లేదు. నేను ఋషి వంటి వాడిని" అని ఆమెతో అని వెంటనే అక్కడి నుండి అడవికి ప్రయాణానికి సిద్ధమయ్యాడు. ఆయన మనస్సులో ఏ మాత్రము వికారము కలుగలేదు.

సీతాశీలము:- తన భర్త ఆయన తండ్రిని సత్యవాక్య పాలకుని కావించడానికి అడవులకు వెళ్తున్నాడని తెలిసిన తక్షణమే తాను కూడ అడవులకు వెళ్లడానికి తయారయింది. అయోధ్యా సౌఖ్యాలు, అత్తమామల ఆదరణలు అన్ని ఆమెకు తృణప్రాయం అనిపించాయి.

"యస్త్వయాసహసస్స్వర్గో। నిరయోయస్త్వయావినా"

"రామచంద్రా! నీ వెంట ఉండడమే నాకు స్వర్గము. నీ విరహమే నాకు నిరయము (నరకము)" అని తెలిపి, భర్తను ఒప్పించి, ఆయనను అనుసరించింది.

2) వయస్సు:-భర్తామే పంచ వింశకః।

మమాష్టాదశ గణ్యతే॥

శ్రీరామచంద్రుడు అడవులకు బయలుదేరినప్పుడు ఆయన వయస్సు ఇరువై అయిదు సంవత్సరాలు. సీతాదేవి వయస్సు (18) పద్దెనిమిది సంవత్సరాలు. అది భార్యాభర్తలకు ఆనాడు తగిన ఈడు.

3) వృత్తము:- శ్రీరామచంద్రుడు ఆశ్రిత రక్షా దీక్షితుడు. తనను ఆశ్రయించిన వారిని ఎవ్వరినైనా రక్షించే దీక్ష గలవాడు. ఒక బోయవానిని దగ్గరికి తీసికొన్నాడు. ఒక గ్రద్దకు పరమపదాన్నే ఇచ్చాడు. ఒక కోతికి ఆశ్రయమిచ్చాడు. ఒక రాక్షసునికి అభయమిచ్చాడు.

సీతాదేవి కూడ ఆశ్రిత రక్షా దీక్షితురాలే. తనను భయపెట్టి బెదిరించి, నానా బాధలకు గురిచేసిన రాక్షస స్త్రీలకు కూడ అభయాన్నిచ్చిన ఉదారురాలు ఆ ఉవిద.

"భవేయం శరణం హి వః"

"మీ అందరిని రాముని నుండి రక్షిస్తాను" అని అభయమిచ్చింది ఆ తల్లి.

(4) అభిజన లక్షణము:- శ్రీరాముడు సూర్యవంశ సంజాతుడు. ఇక్ష్వాకు కులవర్ధనుడు. సీతాదేవి విదేహ రాజపుత్రి.

"తంచేయం. అసితీక్షణా"

రాముడు "తత్ శబ్దము। ("తం") తో పరామర్శింపబడిన పరమాత్మ.

సీతాదేవి "ఇయం" శబ్దముచేత తెలుపబడిన "లక్ష్మీదేవి".

ఈ విధంగా అన్ని రకాల సీతారాములు ఒకరికొరకు తగినవారే. కాని సీతాదేవి విషయంలో ఆమెకు ఇంకొక అతిశయం ఉంది.

ఆమె అసితేక్షణ. కలువరేకుల వంటి కన్నులు గలది. రాముడు కనుల సౌందర్యములో సాటిలేనివాడే. ఆయన కనులు కమల పత్రములవలె విశాలములైనవి.

కాబట్టి కన్నుల వైశాల్యాన్ని బట్టి ఇద్దరు సమానులే. అయినా రాముడు కమలముల వలె ఎఱ్ఱని కన్నులు గలవాడు. ఎరుప్రదనము అనురాగానికి ఆగ్రహానికి రెండింటికి సమానమే. కనుక రాముడు నిగ్రహానుగ్రహ సమర్థుడు.

సీతాదేవి కలువల వలె నల్లని, చల్లని కన్నులు గలది. ఆమె కన్నులు ఎప్పుడు కూడ ఎఱ్ఱబారవు. ఆమె ఎప్పుడు కరుణామయే. ఇది ఆమెకు రామునికంటె మించి ఉన్న గొప్పదనము. కరుణాపూరితములైన నల్లని కన్నులే తల్లికి సౌందర్య కారకములు కదా!

"రాజ్యం వా త్రిషులోకేషు। సీతావాజనకాత్మజా।
త్రైలోక్యం రాజ్యం సకలం। సీతాయానాప్నుయాత్కలాం"

మూడులోకాల మహా సామ్రాజ్యమును - త్రాసులో ఒకవైపు ఉంచి సీతాదేవిని మరొక వైపు ఉంచి, తూస్తే - ఆ త్రైలోక్య సామ్రాజ్యము మొత్తము సీతాదేవి యొక్క ఒక కళకు (అంశకు) కూడ సాటిరాదు. అంతటి మహిమాన్వితురాలు ఆ దేవి. అంతటి వైభవోపేత ఆ తల్లి.

(1) అందుకే ఆమెను సంతోషపెట్టడానికి జనస్థానంలోని 14 వేల రాక్షసులను, మహా పరాక్రమవంతులైన ఖర, దూషణ, త్రిశిర స్కులను మూడు గడియలలో మట్టు పెట్టాడు. తన భర్త యొక్క అతిలోక పౌరుషానికి ఆశ్చర్యము చెందిన సీతాదేవి ఆయనను బిగ్గరగా కౌగిలించుకొంది.

"బభూవహృష్టావైదేహీ। భర్తారం పరిషస్వజే".

(2) సీతాదేవిని సంరక్షించడానికే ఇంద్రవిరోధి అయిన విరాధుని ఘోరంగా వధించాడు.

(3) తనకు దూరమైన సీతాదేవిని తిరిగి పొందడానికే మహేంద్ర తనయుడు, మహా బలి అయిన వాలిని ఒకే శరంతో హతమార్చాడు.

(4) సీతాదేవిని సాధించుకోవడానికే ప్రబల ప్రతిబంధుడైన కబంధుని పరిమార్చాడు.

దశదిశలలో తన పరాక్రమాన్ని ప్రకాశింపజేసిన దశరథ సార్వభౌముని ముద్దుల పెద్ద కోడలు, దేవతల ప్రార్థనపై రావణసంహారము కొరకు ఈ అవనీ మండలంపై అవతరించిన రామచంద్రస్వామి ప్రాణప్రియ, ధర్మపత్ని, పతివ్రతామతల్లి అయిన సీతాదేవి ఒక రాక్షసునిచే అపహరింపబడి, ఒంటరిగా పెద్ద పులుల మధ్య చిక్కుపడ్డ లేడిపిల్లవలె బాధలకు గురికావడం, నిరంతర శోక నిమగ్న కావడం ఎంత అన్యాయమో కదా? కాలమెంత విపరీతమైనది? అని హనుమ ఆవేదనకు లోనయ్యాడు.

"రామస్య వ్యవసాయజ్ఞా। లక్ష్మణస్యచధీమతః
నాత్యర్థం క్షుభ్యతే దేవీ - గంగేవ జలదాగమే"

రామునికి దూరమై, శత్రుస్థానంలో ఉండి కూడ సీత జీవించి ఉండుటకు కారణాలను హనుమ విచారిస్తున్నాడు.

1) రామస్య వ్యవసాయజ్ఞా:-

సీతాదేవికి శ్రీరాముని వ్యవసాయము (పట్టుదల) గురించి బాగా తెలుసు. శ్రీరాముడు ఆశ్రిత రక్షణనే దీక్షగా కలవాడు. ఆయన తన ఆశ్రితులనెప్పుడు అసహాయంగా వదలిపెట్టడు.

"పదునాల్గు సంవత్సరాలు ప్రశాంతంగా గడుపుకొని, ఆ తరువాత అయోధ్యకు తిరిగి వెళ్లక, ఋషులను రక్షిస్తానని, రాక్షసులను సంహరిస్తానని ఎందుకు ప్రతిజ్ఞ చేశావు? దుర్మార్గులైన రాక్షసులతో అకారణ వైరమెందుకు?" అని తాను అడిగితే "సీతా! ఆశ్రిత రక్షణే నా వ్రతము. అందుకు అవసరమైతే నా ప్రాణాలనైనా వదలుతాను. నిన్ను, లక్ష్మణుని కూడ వదలుకొంటాను" అని బదులు పలికిన శరణత్రాణ పరాయణుడు స్వామి. రాముని పట్టుదల చక్కగా తెలిసింది కనుకే ఆయన ఎలాగైనా వచ్చి తనను తప్పక రక్షిస్తాడనే నమ్మకంతో కళ్లల్లో ప్రాణాలను పెట్టుకొని ఆయన రాక కొరకు కాచుకొని ఉంది.

2) లక్ష్మణస్యచధీమతః:- రాముడు ఏవో పనుల ఒత్తిడిలో ఉండి, తనను మరచిపోయినా, బుద్ధిశాలి అయిన లక్ష్మణుడు ఆయన ప్రక్కలోనే ఉన్నాడు కదా! ఆయన మరవనిస్తాడా?

తాను మారీచ మృగమును నిజమైన "బంగారులేడి" అనుకొని, అది తనకు తెచ్చి ఇవ్వమని రాముని కోరినప్పుడు, రాముడు కూడ "అది బంగారు లేడే కావచ్చు" అనుకొని దానిని అనుసరించడానికి తయారయినప్పుడు, "అన్నా! నీవు కూడ అది నిజమైన లేడే అనుకొంటున్నావా? ప్రపంచంలో ఎక్కడైనా, ఎప్పుడైనా నిజమైన "స్వర్ణ హరిణము" ఉంటుందా? అది మారీచుడనే రాక్షసుని మాయా రూపము. దాని వెంట వెళ్లితే మనకు తప్పక ఆపద కలుగుతుంద"ని హెచ్చరించిన ధీశాలి లక్ష్మణుడు.

అటువంటి బుద్ధిమంతుడైన లక్ష్మణుడు, తనను కన్నతల్లికంటే మిన్నగా ఆదరించిన లక్ష్మణుడు, తాను నిండు ప్రమాదంలో చిక్కుకొని ఉన్నప్పుడు ఆయన హాయిగా ఊపిరి పీల్చుకొని ఉండగల్గుతాడా? అన్నను ఊరుకోనిస్తాడా? ఇప్పటికే అన్నతో కలసి ఆయన నన్ను వెతుకుతునే ఉంటాడు" అని నమ్మకంతో ప్రాణాలను బిగపట్టుకొని జీవించి ఉంది.

"నిరంతర వర్షధారలతో మహా ప్రవాహము ముంచెత్తుతున్నా గంగానది కలత చెందదు. ఆ ప్రవాహాన్నంతటిని తనలో ఇముడ్చుకొని ఉంటుంది. అలాగే సీతాదేవి కూడ అంతటి దుఃఖ ప్రవాహాన్ని భరించి ఉంది" అనుకొన్నాడు హనుమ.

సీతాదేవి ముందుగా శ్రీరాముని పట్టుదల పట్ల, ఆయన ఆశ్రిత రక్షా దీక్ష పట్ల విశ్వాసంతో ఉంది. కాని శ్రీరాముడు (పరమాత్మ) స్వతంత్రుడు. "రక్షిష్యతి వా, నవేతి। సంశయోఽచ్యుతసేవినాం" అయ్యో! సర్వాన్ని పరిత్యజించి, నన్నే నమ్ముకొని, నా వెంట కఠిన కాంతారాలకు కూడ తరలివచ్చిందే? ఆమెను వెంటనే వెళ్లి రక్షించాలి" అని తొందరగా వచ్చి రక్షించవచ్చు.

లేదా "నన్ను కాదని ఒక క్షుద్రమైన లేడిని కోరుకొని, దాన్ని తెచ్చి ఇమ్మని బలవంతంగా దానివెంట నన్ను తరిమిందే, అటువంటి సీత ఎక్కడికి వెళ్లితే నాకేమిటి? ఏమైపోతే నాకేమిటి" అని ఊరకుండ వచ్చు.

కాని లక్ష్మణుడు అటువంటివాడు కాదు. "అన్నా! వదిన నిజంగా అది బంగారు లేడే అనుకొంది. దానిని నీకిష్టమైన తోటలో నీ వినోదం కొరకు పెంచుకోవాలని అనుకొని ఉంటుంది. అలాగే ఆ జింక ప్రాణంతో దొరకకున్నా దాన్ని చంపితెస్తే దాని చర్మముపై నీవు కూర్చొని ఉంటే చూడాలని ముచ్చటపడి ఉంటుంది. అందువలన దాన్ని తెచ్చి ఇమ్మని నిన్ను కోరింది. అంతే కాని నీకు దూరము అవుతానని తాను అనుకొంటుందా? నిన్ను ఎడబాసి తాను జీవించగల్గుతుందా? ఇప్పటికే ఆమె నీకు దూరమై ఎంత పరితపిస్తూ ఉంటుందో? ప్రాణాలతో కూడ ఉందో? లేదో" అని అన్న వెంట పడి తనను రక్షించే ప్రయత్నంలో ఉంటాడు అని గట్టి నమ్మకంతో సీత జీవించి ఉంది అనుకొంటాడు హనుమ.

రాముని పట్టుదల కంటె లక్ష్మణుని బుద్ధినే ఎక్కువగా నమ్ముకొని సీతాదేవి జీవించి ఉంటుంది.

"న సంశయోఽస్తితద్భక్త। పరిచర్య రతాత్మనాం"

"అదేమిటండీ! లక్ష్మణుని మంచిదనము పైననే సీతాదేవి ఎక్కువగా నమ్మకంతో ఉన్నదంటారు. అదెలా కుదురుతుందండీ? ఆమె లక్ష్మణుని ఎంత నీచంగా దూషించింది? వాటిని వినలేక చెవులు మూసుకొని అంత కోపంతో వెళ్లినవాడు ఆమె తిట్లను మరచి, నిందను భరించి, తిరిగి ఆమెను అన్వేషించడానికి, రక్షించడానికి ప్రయత్నిస్తాడా?" అని కొందరు సామాన్యులు అనుకోవచ్చు.

కాని భాగవతోత్తములు నిందలను పట్టించుకొనేవారు కాదు. "తుల్య నిందాస్తుతిర్మౌనీ" నిందాస్తుతులు రెండు వారికి సమానమే. తమను నిందించిన వారైనా ఆపదలలో ఉన్నప్పుడు వారిని ఆదుకోవాలని వారు తహ తహ చెందుతారు. "నిందు మనంబు,

నవ్య నవనీత సమానము". క్రొత్తగా తీసిన వెన్న కొంచెము వేడికే కరిగినట్లు తమ వారు ఏ కొంచెము బాధపడినా, భరించని దయాహృదయులు వారు.

తమ వారి బాధలను తీర్చుమని భగవంతుని మెప్పించి ఒప్పించే "పురుష కార స్వరూపులు" భాగవతోత్తములు. లక్ష్మణుడు వారందరికంటే వరిష్ఠుడు కదా!

"ఋషా నిరస్తోऽపి శిశుస్తనంధయో। న జాతు మాతుశ్చరణౌ జిహాసతి"

కనుక తల్లి తిట్టినా, కొట్టినా, తల్లి పాదాలనే విడువని తనయుని వంటి వాడు లక్ష్మణుడని సీతకు తెలుసు. తన అపరాధాన్ని మరచిపోతాడని తనను మన్నిస్తాడని కన్న కొడుకువలె తన పట్ల ఆప్యాయతను కనబరుస్తాడని ఆ తల్లికి తెలుసు. అందువలననే లక్ష్మణుని పురుషకారం పట్ల పూర్తి నమ్మకంతో ఆమె ప్రాణాలతో ఉంది.

"నైషా పశ్యతి రాక్షస్యః। నేమాన్ పుష్ప ఫలద్రుమాన్
ఏకస్థ హృదయా నిత్యం। రామమేవానుపశ్యతి".

సీతాదేవి మనస్సు స్థితిని వాల్మీకి భగవానుడు విచిత్రంగా చిత్రీకరించాడు.

సీతాదేవిని రావణుడు ఆత్మ నుండి శరీరాన్ని వేరు చేసినట్లుగా అత్యంత క్రూరంగా శ్రీరాముని నుండి దూరము చేసి, శతయోజన సముద్రము తరువాత ఉన్న లంకలోనికి తెచ్చి ఉంచాడు. అయిదు వందల మంది భయంకర రాక్షస స్త్రీలను ఆమెకు కాపలా ఉంచాడు. పెద్ద పులుల మధ్య చిక్కిన ఒంటరి లేడిపిల్ల వలె దయనీయంగా ఉంది ఆమె స్థితి.

ఎప్పటికప్పుడు రావణుని వికృత యాచనలు, రాక్షస స్త్రీల బెదిరింపులు ఆ తల్లి మనస్సును తొలచివేస్తున్నాయి. సీతాదేవి స్థానంలో ఏ ఇతర స్త్రీ ఉన్నా ఆ పరిస్థితికి గుండె పగిలి మరణించి ఉండేది.

కాని అంతటి భయం కూడ ఆమె ధైర్యాన్ని చెక్కు చెదరనీయలేదు.

ఆమె నిద్రాహారాలను మానివేసింది. ఆకలి దప్పులతో అల్లల్లాడిపోతుంది. అటువంటి పరిస్థితిలో ఆమెకు ఎదురుగానే వివిధ తరువులు ఉన్నాయి. కొన్ని అనేక మధుర ఫలాలతో నోరూరిస్తున్నాయి. కొన్ని మనోహరపుష్పాలతో వాసనలను వెదజల్లుతున్నాయి. అమృతము వంటి, మధువు వంటి మధుర జలప్రవాహాలతో కొన్ని సెలయేళ్లు మనస్సును హరిస్తున్నాయి.

సీతాదేవి స్థానంలో ఏ అన్య వనిత ఉన్నా అదే పనిగా ఆ చెట్లపైబడి, వీలయినన్ని పక్వ ఫలాలను తిని, మధుర జలాలను త్రాగి కడుపునింపుకొని, పూలవాసనలతో మత్తెక్కి ఒళ్లు తెలియకుండా పడి నిద్రపోయేదే!

కాని అంతటి ప్రలోభాలు కూడ ఆమె మనస్సును వశపరచుకోలేదు. సాధారణంగా మానవులు లొంగిపోయేది రెండింటిలో ఏదో ఒక దానికే. (1) భయం (2) ప్రలోభము.

"బలవాన్ ఇంద్రియగ్రామో। విద్వాంసమపికర్షతి" – (భగవద్గీత). ఎంతటి విద్వాంసునైనా, ఎంతటి నిగ్రహం కలవాడినైనా ఇంద్రియాలు వశపరచుకొంటాయి. నిరంతర తపోనిష్ఠుడైన విశ్వామిత్ర మహాముని కూడ మేనకా సౌందర్యానికి దాసుడయ్యాడు కదా! కాని సీతాదేవి ఇంద్రియ ప్రాబల్యానికి చలించలేదు.

"ఏకస్థ హృదయానిత్యం రామమేవానుపశ్యతి".

ఆమె మనోరథము వేరు వేరు దిక్కులలో పయనిస్తే కదా ఇంద్రియ బలానికి ఆమె లొంగిపోయేది. "ఏకస్థ హృదయా".

ఆమె మనస్సులో ఉంది ఒకటే – అది రాముని రూపమే. ఆ రాముని రూపము కూడ ఆమె మనస్సులో కొంత సమయము ఉండి, తరువాత మాయం కావడం లేదు.

"నిత్యం రామమేవానుపశ్యతి"

నిరంతరము రాముని రూపాన్నే చూస్తున్నది. చూచినా కొద్ది మరింత, మరింత చూడాలనిపించేది శ్రీరాముని మనోహర రూపము. అప్పటికప్పుడు మరింత ఆకర్షణను కలిగించేది ఆ రాముని సుందరము.

"అప్పొజుదుకప్పొజుదు ఎన్నారావముదే" అంటారు నమ్మాళ్వారు.

అమృతాన్ని ఎంత అనుభవించినా తృప్తి కలుగదు. రామసౌందర్యాన్ని ఎంత సేవించినా తనివితీరదు. "అతృప్తామృత రూపుడు శ్రీరాముడు".

సీతాదేవికి శ్రీరామచంద్రుని సౌందర్యాన్ని అనుభవించడం చక్కగా తెలుసు. "సుఖసుప్తః పరంతపః". అడవిలో తన తొడపై హాయిగా పడుకొని నిద్రిస్తున్న తన స్వామిని సేవిస్తూ తాను తన్మయురాలైంది. కాకాసురుడు తన వక్షస్థలాన్ని క్రూరంగా చీలుస్తున్నా, రక్తధారలు కారుతున్నా ఆ తల్లి పట్టించుకోలేదు.

ఇప్పుడు కూడ తన మనస్సులో పుంసాంమోహనమైన తన స్వామి రూపాన్ని నింపుకొంది. తన మనోనేత్రంతో స్వామి సుందరమూర్తినే అనుభవిస్తున్నది. ఆమె ఆ

ఆనందానుభవ సమాధిలో లీనమైంది. ఇది మహాయోగులు, మహర్షులు, పరమహంసలు చేరుకొనే అత్యున్నత తపస్సమాధి స్థితి.

ఇక అటువంటి మహా తల్లి మనస్సును ఏ భయం ఏమి చేస్తుంది? ఏ ప్రలోభం ఏమి సాధించగల్గుతుంది? అదిగో ఆ ధ్యాన దశే. ఆ తన్మయ స్థితే సీతను ప్రాణాలతో ఉంచిందని హనుమ భావించాడు.

"హిమ హత నళినీ నష్టశోభా।
వ్యసన పరంపరయాతి పీడ్యమానా।
సహచర రహితేవ చక్రవాకీ।
జనక సుతా కృపణాం దశాంప్రపన్నా"

శ్రీరామునికి దూరమైన సీతాదేవి ఇంతవరకు జీవించి ఉండడానికి గల కారణాలను హనుమ మనస్సులో విచారిస్తున్నాడు.

ఇప్పుడు మళ్లీ ఒకసారి ఆయన దృష్టి ఆ తల్లి దీనస్థితిపై పడింది.

సీతాదేవి సుకుమారమైన తామర కుసుమము వంటిది. అదెప్పుడు నీటి పదనుతో తళతళలాడుతు ఉంటుంది. మెత్తదనముతో మెరసిపోతుంది.

అలాగే సీతాదేవి కూడ శ్రీరామచంద్ర ప్రభువు సాహచర్యంలో సంతోషంతో జీవితాన్ని గడుపుకొంది. లక్ష్మణుడు, మిగిలిన మరుదులు, చెల్లెళ్లు, అత్తలు, అయోధ్య ప్రజల పట్ల ఆమె హృదయం ప్రేమతో పొంగి పోయింది.

శరత్కాలంలో సంపూర్ణంగా వికసించిన సరోజము, (చలికాలము) హేమంతము రాగానే, మంచు బిందువుల తాకిడికి తట్టుకోలేక ఒక్కొక్క రెక్కనే రాల్చుకొని కాంతి హీనమవుతుంది.

అలాగే పరిణయమైనప్పటినుండి ప్రతి క్షణము పతి సన్నిధిలోనే సీతాదేవి స్వామితో సమానంగా సంతోషాన్ని పంచుకొంది. రావణుడు తనను అపహరించి లంకకు తెచ్చి ఉంచినప్పటి నుండి రావణుని దుర్మార్గాన్ని, రాక్షసుల బాధలను తట్టుకోలేక ఆమె తన జీవితం పట్ల ఆశలను ఒక్కొక్క దానినే వదలుకొంటూ కళావిహీనంగా ఉంది. దుఃఖపరంపరలతో కృశించి పోతుంది.

చక్రవాక పక్షులు ఎప్పుడు జంటగానే విడువడకుండా దాంపత్య మధువును ఆనందంగా ఆస్వాదిస్తూ ఉంటాయి.

నమ్మాళ్వార్లు చక్రవాక పక్షిని ఉద్దేశించి ఓ చక్రవాకీ! "అంశిరై శేవలు మాయ్" నీ అందమైన రెక్కలతో నీ జంట పక్షితో ఆనందంగా విహరిస్తున్నావే! నన్ను కూడ నా స్వామితో కలిపి, మేమిద్దరము ఆనందంగా జీవించే విధంగా దౌత్యం చేసి పుణ్యం కట్టుకోరాదా?" అని ఆ పక్షిని యాచిస్తారు.

అదిగో అవిధంగా విడువకుండా జంటగా జీవించే ఆడ జక్కువ పక్షి హఠాత్తుగా ఒక క్రూరుడైన వేటగాని బాణానికి వేటుపడి ప్రాణాలను కోల్పోయిన తన జంట పక్షిని చూస్తే తట్టుకోలేక తన ప్రాణాలు పోయేలా దుఃఖంతో విలవిలలాడుతుందో అదే విధంగా రావణుడనే వేటగాని వేటుతో వేరుపడి స్వామికి అత్యంత దూరమైన సీతాదేవి స్వామిని తలచుకొని విలవిలలాడిపోతుంది.

అయితే ఆమె ఎవ్వరో ఒక సామాన్యురాలు అనుకొంటున్నారా? కాదు. ఆమె జనక సుత. జనక మహారాజు యొక్క నిరంతర యజ్ఞ ఫలము. ఆమె తనకు యజ్ఞ భూమిలో లభించినప్పటి నుండి ఆమెను జనకుడు తన ప్రాణాలకంటె పదిలంగా కాపాడుకొన్నాడు. అదిగో అటువంటి మహారాజు పుత్రిక, అసూర్యంపశ్య, సూర్యవంశ మణిదీపం ఇప్పుడింత దీనావస్థలో పడి ఉంది. కాలమెంత కుటిలమైనదో అనుకొన్నాడు హనుమ.

అయ్యో! తామర రేకుల వంటి కన్నులు గలిగి, నల్లని నాగసర్పము వంటి జడను గల్గి, సర్వ సుఖాలను అనుభవించవలసిన సీతాదేవిని ఇంతటి దీనావస్థలో చూడటం వలన ఒక కోతినైన నాకే, జితేంద్రియుడనైన నాకే మనస్సు పగిలిపోతున్నదే" అని హనుమ అత్యంత వ్యాకుల చిత్తుడయ్యాడు.

ఓం తత్సత్.

సీతనెరుగకుండ రఘుశేఖరుడర్థముగాడు పూర్తిగా
ఏకస్థ హృదయా నిత్యం రామమేవానుపశ్యతి
ఒకే ఆలోచనతో ఆమె మనస్సులో రామునే చూస్తున్నది.

సంపన్నుడైన యజమానిని సేవించడానికి ముందు ముందుకు వచ్చే అనేక సేవకుల వలె ఆమెకు శుభశకునాలు ఆగకుండా అగుపించాయి.

ఆమె మనస్సులో శోకము తొలిగింది. సంతోషం కలిగింది. శుక్ల పక్ష చంద్రోదయము వలన రాత్రి మెరసినట్లు ఆమె ముఖము కాంతిని సంతరించుకొంది.

ఆమెకు పతితో కలియక కలిగినట్లే అనిపించింది. ఆమె ముఖము రాహువిముక్త చంద్రబింబము వలె కాంతితో తేజరిల్లింది.

# రావణుని రాక - 13

"యానిశా సర్వభూతానాం। తస్యాం జాగర్తి సంయమీ

యస్యాం జాగ్రతి భూతాని। సా నిశా పశ్యతో మునేః"

ఇంతవరకు సీతాదేవి శ్రీరాముని ధ్యానంలో తన్మయురాలై ఉంది. హనుమ సీతాదేవిని చూస్తూ ఆమె దైన్యానికి కరిగిపోతూ, ఆమె నిశ్చల స్థితికి ఆశ్చర్యపడుతూ శింశుపా వృక్షము ఆకుల మధ్య అణగి ఉన్నాడు. వారిద్దరు ఒకేరకమైన తపస్థితిలో ఉన్నారు. వారిద్దరు తపస్వులే. వారిద్దరు పరమాత్మ విషయంలో మేల్కొని ఉన్నవారే.

అయితే ఆ సమయం రాక్షసులందరికి రాత్రి సమయం. వారందరు గాఢంగా నిద్రించే సమయము.

హఠాత్తుగా ఆ సమయం ముగిసింది. రాక్షసులకు రాత్రి గడచి పోయింది. వారికి తెల్లవారింది. వారందరు మేల్కొన్నారు.

కాని హనుమకు, సీతాదేవికి కాళరాత్రి ప్రారంభమైంది. వారి తపస్సమాధి స్థితికి తీవ్ర భంగం కలిగింది. వారి ప్రశాంతత చెడి పోయింది. సీతాదేవికి మళ్లీ శరీర బాధలు మొదలయ్యాయి.

అంతవరకు రాజమందిరములో హంసతూలికాతల్పంపైన గాఢనిద్రా స్థితిలో ఉన్న రావణునికి నిద్రామత్తు వీడింది. ఒక్కసారిగా మేల్కొన్నాడు. వెంటనే ఆయన ఇంద్రియాలు ఆవురావురు అన్నాయి. ఆయన మనస్సులో సీతాదేవి పట్ల కామవాంఛ బలంగా మేల్కొంది. ఆ వాంఛ ఆయనను రాజమహలులో ఉండనీయలేదు.

లేచిందే తడవుగా ఆయన అశోకవనానికి పరుగులెత్తాడు. రాజొక్కడే వెళ్లుతాడా ఎక్కడికైనా? ఆయన వెంట పరివారమంతా పరుగు పెట్టింది.

దీపాలకాంతిలో రావణునికి త్రోవ చూపేవారు, భోజన పానీయ పాత్రలను పట్టుకొని వెంట నడిచేవారు, అగరు ధూపాలతో అత్తరు పన్నీరులతో పరిమళాలను మోసుక వెళ్లేవారు, ఛత్ర చామరాలనుతెచ్చేవారు, అంతఃపురకాంతలు ఒక్కరేమిటి? అంతఃపురమంతా రావణుని వెంట నడిచింది.

రావణుడు ధవళ వస్త్రాలతో, రాజభూషణాలతో తళుకు లీనుతున్నాడు. హనుమ రావణుని చెట్టు కొమ్మల మధ్య నుండి చూచాడు. రావణుడు సీతాదేవిని సమీపించాడు.

పర పురుషుని స్పర్శను సహించని సీతాదేవి గాలికి ఊగిపోయిన అరటి ఆకువలె, రావణుని చూచి వణికి పోయింది. మణిమంత్రాదులతో బంధింపబడిన నాగుబాములవలె గిలగిల కొట్టుకొంది. బురద నిండిన పద్మమువలె, సహజ కాంతి కల్గి కూడ, కాంతిని కోల్పోయింది. కేతు గ్రహము చుట్టుముట్టిన రోహిణీ నక్షత్రమువలె పరితపిస్తున్నది. అనుకోని అపనింద వలన క్షీణించిన కీర్తివలె ఉంది. అభ్యాసము లేని విద్య వలె శిథిలమైంది. తామరపూలు లేక బురదతో నిండిన చెరువు వలె అలంకారము కోల్పోయింది.

ఆమె రావణునికి కనబడకుండాలని తన వక్షోజాలను బాహువులతో, కడుపును తొడలతో కప్పి కఠిన భూమిపై తెగిన కొమ్మవలె కూచొని ఉంది. రామునికి భోగ్యమైన తన నాభి, ఉదరము, పయోధరాలు, ఊరువులు, కళ్లపై రావణుని విషదృష్టి పడకుండా వాటిని కప్పుకొంది.

రావణుడు అటువంటి స్థితిలో సీతాదేవిని చూచి, "ఓ సుందరాంగీ! నీ శరీరాన్ని ఎందుకు దాచుకుంటావు? ఇక్కడ పరపురుషులెవ్వరు లేరు. నేను నీ కామానికి వివశుడైన దాసుడను. నీకు భయమక్కరలేదు. సందేహమక్కరలేదు.

జానకీదేవీ! నేను అధర్మపరుడను కాదు. మా రాక్షసజాతికి ఇతర స్త్రీలతో సుఖించడం తప్పు కాదు. అలాగే పరస్త్రీలను అపహరించడం, వారిని బలాత్కరించడం నేరం కాదు. ఇందులో అనుమానమే లేదు.

"స్వధర్మో రక్షసాం భీరు। సర్వథైవ న సంశయః
గమనంవా పరస్త్రీణాం। హరణం సంప్రమథ్యవా"

చూచారా? రావణుడెంత గర్వంతో తన రాక్షస జాతి ధర్మాలను చెప్పుకొంటున్నాడో, పరస్త్రీ గమనం, అపహరణము, బలాత్కారము తప్పులే కావట. అందువలన ఆయనలో అధర్మమేమి లేదట.

ఈ విధంగా ఎవరి జాతిధర్మాలు వారికే గొప్ప అయితే, అధర్మాలు కూడ వారికి ధర్మాలైతే, ఇక ధర్మము యొక్క పవిత్రత ఎక్కడ ఉండాలి? పరహింసే వారి ధర్మమైతే సమాజంలో శాంతిభద్రతలు ఎక్కడ ఉండాలి?

రావణుడు "ఇవి రాక్షస ధర్మాలు" అన్నాడు. అంటే బలవంతుల, క్రూరుల ధర్మాలు అన్న మాట. ఈనాడు కూడ ధనము కలవానిదే మాట. అధికారము కలవానిదే ఆట. వారి ధన బలాన్ని, అధికారబలాన్ని ధిక్కరించిన వారికి, నామ రూపాలే ఉండవు కదా!

సీతాదేవితో రావణుడు తన సంభాషణను కొనసాగిస్తున్నాడు. "సీతా! బలాత్కరించడం మా ధర్మమే. అయినా సుందర సుకుమార గాత్రివైన నిన్ను నేను బలాత్కరించను. బలవంతంగా నీతో రమించి రాక్షసానందం పొందడం నా అభిమతం కూడ కాదు.

నన్ను మన్నించు। నన్ను ప్రేమించు। నాతో స్వేచ్ఛగా రమించు। నీ మనస్సును నావైపు త్రిప్పుకో. అంతవరకు నాలో కామము ఎంత విజృంభించినా నన్ను నేను నిగ్రహించు కొంటాను బలవంతంగా నిన్ను తాకను.

"ఏవం చైతదకామాంతు। నత్వాం స్పృక్ష్యామిమైథిలీ"

ఇక్కడ రావణుడు: సీతా। "అకామవైన నిన్ను నేను బలవంతంగా తాకను" అన్నాడు.

"అకామ" అంటే :- (1) కామములేనిది (2) "అ" పరమాత్మ పట్ల కోరికగలది.

రావణుడంటే మనస్సు కదా! "మనస్సులో కామము లేని సీతాదేవిని నేను స్పృశింపను" అన్నాడు.

దీనిని బట్టి "కామమే బంధహేతువు" అని తెలుస్తున్నది. సీతాదేవికి మారీచ-మృగము పట్ల కామము కలిగింది. అందువలన రామునికి దూరంగా రావణునిచే అపహరింపబడింది.

అలాగే ఇప్పుడు రావణుని పట్ల ఆమె కామంతో లేదు. అందుకే రావణుని బంధంలో చిక్కుకోలేదు.

అంతేకాదు "అకామ" అంటే పరమాత్మ పట్ల కోరిక గలది. పరమాత్మ పట్ల కోరిక గలవానిని మనస్సు బంధింపజాలదు. రంభా, పుంజికలను బలాత్కారంగా అనుభవించిన రావణునికి నలకూబరుడు, బ్రహ్మదేవుడు శాపాలను పెట్టారు. "నీ పట్ల కోరికలేని స్త్రీని నీవు బలాత్కరిస్తే నీవు హతమగుదువు గాక" అని.

సీతాదేవిని బలాత్కరించకపోవడానికి వీళ్ల శాపాలు కూడ ఒక కారణం. బలవంతంగా అనుభవించిన ఆనందంకంటె సుందర సుకుమారి అయిన సీతాదేవిని ఆమె అంగీకారముతోనే అనుభవిస్తే మరింత సుఖమని కూడ కావచ్చు.

అందువలన ఆమెను బలాత్కరించడానికి ఇష్టపడక, ఆమెను అనేక విధాలుగా అనునయించి ఆమె మనస్సును తనవైపు ఆకర్షించడానికి పూనుకొన్నాడు.

మొదట యౌవనము యొక్క అస్థిరత్వాన్ని గురించి ఆమెకు తెలుపుతున్నాడు. "సీతా! ఏ వ్యక్తి అయినా యౌవనంలో ఉన్నంత వరకే ఏ సుఖాన్ని అయినా అనుభవింప

గల్గుతాడు. యౌవనమా! చిల్లుకుండలో నీరు వంటిది. క్షణక్షణానికి క్షీణించి పోతుంది. వయస్సు మెరుపుతీగ వంటిది. తృటిలో మాయమవుతుంది. అది చంచలమైంది.

యౌవనము గడచిపోయిన తరువాత దేహము, సౌందర్యము, ధనము అన్ని నీరు కారిపోయిన చిల్లి కుండవంటివి. అవి వ్యర్థాలు.

అందువలన యౌవనంలో అనుభవించవలసిన సుఖాలను అనుభవించకపోవడం, తరువాత అనుభవించాలని కోరుకోవడం గతజలసేతుబంధము వలె నిష్ప్రయోజనము.

ఇక నీ సౌందర్యము లోకోత్తరమైనది. నీ ప్రత్యంగం సౌందర్య భరితమే. ఏ అవయవాన్ని చూచినా అది మనస్సును తక్షణమే బంధిస్తుంది. బ్రహ్మదేవుడు కూడ నీ అందానికి బానిస కావలసిందే. నేను అనేక స్త్రీలను చూచాను. అనేకులను అనుభవించాను. కాని ఏ స్త్రీలో లేని అందము, ఆకర్షణ నీ అంగాంగంలో ఉన్నాయి.

నన్ను కరుణించు. నన్ను వరించు. నీ వానిగా అంగీకరించు. ఇది వరకు నా ఆధీనంలో ఉన్న స్త్రీలందరు మండోదరీదేవితో సహా నీకు దాసులవుతారు. నీ కనుసన్నలలో మెదులుతారు. నీ ఆజ్ఞలను శిరసావహిస్తారు.

నిన్ను పట్టపురాణిని చేస్తాను. నీ తండ్రికి ఈ భూమండలమంతా జయించి ఇస్తాను. నీ మొత్తము శరీరాన్ని అలంకారమయంగా చేస్తాను.

ఇక రాముడంటావా? ఇంకెక్కడి రాముడు? రాజ్యాన్ని కోల్పోయాడు. అడవుల పాలయ్యాడు. అన్నిటికంటె ఎక్కువగా ప్రాణానికి ప్రాణమైన నిన్నే కోల్పోయాడు. ఇంకా జీవించి ఉంటాడా?

"రాజ్యాద్భ్రష్టో, వనేవాసో, త్వయాహీనో శంకే జీవతి వా నవా?"

ఒకవేళ జీవించి ఉన్నా, ఒక్క తమ్మునితో మాత్రమే ఉన్నవాడు, మానవమాత్రుడు, ఏ సహాయము లేనివాడు, ఏ బలము లేనివాడు సముద్రము దాటి ఎలా వస్తాడు? అందువలన ఆయన పైన ఆశలు వదలుకొని, మనస్సును మరల్చుకొని నన్ను వరించు.

మత్తుపానీయాలను త్రాగు. నాతో విహరించు. ఆనందించు. సౌఖ్యాలను అనుభవించు.

ధనరాశులు నీ ముందు ధారపోస్తాను. భూమండలాన్నంతా జయించి నీ సౌందర్యానికి కానుకగా సమర్పించుకొంటాను. లలనా! నన్ను లాలించు. నాతో రమించు. నీ బంధువులందరు నీ వలన సమస్త సుఖాలను అనుభవింతురు గాక!

"పిబ। విహర। రమస్వ। భుంక్ష్వ భోగాన్
ధన నిచయం ప్రదిశామి, మేదినీంచ
మయిలల లలనే యధాసుఖంత్వం
త్వయచ సమేత్య లలంతు బాంధవాస్తే"

ఎంతటి ప్రలోభమిది। ఎవ్వరైనా ఈ ప్రలోభాన్ని తట్టుకోగలుగుతారా? ఏమి పదప్రయోగమది।

"మయ లల లలనే...... లలంతు బాంధవాస్తే"

త్రాగిన వాడు మత్తుతో ఊగుతూ, తూగుతూ మాట్లాడే మాటలు. ఎదుటి వారిని కూడ మత్తులో ముంచెత్తే మాటలు.

ఒకవైపు రాముడు, మరొకవైపు రావణుడు.

ఒకవైపు నిరాశా నిస్పృహలు,

మరొకవైపు మత్తెక్కించే భోగాలు.

ఇది ప్రకృతి మనను వశపరుచుకొనే విధానము. ప్రకృతి తననే అనుభవించాలని, తననే అనుభవించాలని రారమ్మని మాటిమాటికి పిలుస్తుంది. తన పిలుపుతో తన తలపుతో మనకు మత్తెక్కిస్తుంది.

భగవంతుని మన మనస్సు నుండి మటుమాయం చేస్తుంది.

"భగవత్తిరోధానకరీ, స్వభోక్తృ బుద్ధిజననీ"

రావణుడు మత్తెక్కించే ఆ ప్రకృతి పిలుపుకు ప్రతీక.

"ఒక సెలయేరు వంటిది - సితోత్పలలోచన। యౌవనంబు"
- శ్రీ విశ్వనాథ

"కామము జూడ సృష్టి ప్రథమాతింకారమే జానకీ"
- శ్రీ విశ్వనాథ

# సీతాదేవి హితోపదేశము

# "తృణమంతరతః కృత్వా" - 14

సీతాదేవి యజ్ఞభూమి నుండి స్వయంగా ఉద్భవించిన ధర్మదేవత. పరమాత్మ రాముడు అయితే, ఆయనను విడిచి ఉండజాలని శ్రీదేవి సీతాదేవిగా అవతరించింది.

"రాఘవత్వే2భవత్ సీతా......విష్ణోరేషా2నపాయినీ".

"ప్రణవ రూపమైన శివధనస్సును భంగం చేసిన శ్రీరాముడు సాక్షాత్తుగా పరమాత్మే" అని గ్రహించి ఆయన అర్ధాంగి అయింది.

అయోధ్యలో మామగారింట మానుష భోగాలన్ని అనుభవించింది. పితృాజ్ఞా పరిపాలనం కొరకు రాముడు రాజ్యాన్ని త్యాగం చేస్తే, "అంతటి రాజ్యసంపదను ఎందుకు వదలిపెట్టావు?" అని ఒక్కమాటైనా అనని అర్ధాంగి.

శ్రీరామునితో అరణ్యాలకు వెళ్లడమే స్వర్గమని, ఆయన లేని అయోధ్య నరకమని నిశ్చయించిన ధీశాలిని.

"యస్త్వయా సహ సస్స్వర్గో। నిరయోయస్త్వయా వినా".

అంతటి లక్ష్మీస్వరూపిణి, పతివ్రతామతల్లి రావణుని ప్రలోభాలకు ఆశపడుతుందా? వశపడుతుందా?

సీతాదేవి తన దగ్గరకు వచ్చిన రావణునికి, తనకు మధ్య ఒక గడ్డిపోచను పడవేసింది. పవిత్రంగా చిరునవ్వు నవ్వింది. తల్లి వలె పవిత్రంగా పలికింది.

I. "తృణమంతరతః కృత్వా। ప్రత్యువాచ శుచిస్మితా।
నివర్తయ మనోమత్తః। స్వజనేక్రియతాం మనః।"

"రావణా। దురాశవద్దు। నేను నీకు లొంగను. కనుక నీ మనస్సును నా నుండి మరల్చుకో। నీ భార్యలతో సర్వసౌఖ్యాలు అనుభవించు।"

చూడడానికి చాల సులభమైన మాటలు. కాని ఎన్ని అర్థాలు! ఎన్ని పరమార్థాల మూటలో! అల్పాక్షరాలలో అనల్పార్థాలను సూచించడం వాల్మీకి కవీంద్రునికి వెన్నతో పెట్టిన విద్య.

ఇక ఈ శ్లోకార్థాన్ని సమగ్రంగా సందర్శిద్దామా।

"తృణమంతరతః కృత్వా। ప్రత్యువాచ శుచిస్మితా।
నివర్తయ మనోమత్తః। స్వజనేక్రియతాం మనః"

1) తృణమంతరతః కృత్వా: (1) రావణుడు దుర్మార్గుడైనా రాక్షసరాజు! ఆయన తన దగ్గరికి వచ్చినప్పుడు ఏదో ఒక ఆసనం వేయడం మర్యాద.

"ఆసనమన్నముదకం దేయం" వచ్చిన వారికి ఆసనము ఇవ్వడం, త్రాగడానికి నీరు ఇవ్వడం, అన్నము పెట్టడం అతిథి మర్యాద కదా!" అభావే భూమిరుదకం తృణం"

ఆసనం లేకపోతే కనీసము నీరివ్వాలి, భూమిపై చోటో, గడ్డిపోచో వేయాలి. అయితే మొదటివి అన్నీ ఇస్తే తాను ఆయనకు వశమవుతానని భ్రమ పడుతాడేమో అనుకొని ఒక గడ్డిపోచను మధ్యలో వేసింది.

2) సమీపముపసంక్రాంతం: రావణుడు తన దగ్గరకు వచ్చాడు. ఆయన మరీ తనను తాకకుండా ఉండాలంటే ఆయనకు తనకు మధ్య కొంత దూరము ఉండడానికి ఒక గడ్డిపోచను అడ్డంగా వేసింది "పంక్తిభేదోऽభి జాయతే స్థంభేన, సలిలేనవా", పంక్తి మధ్య ఓ గడ్డిపోచో, ఓ స్థంభమో, ఓ నీటిచాలో ఉంటే పంక్తి భేదము కల్గుతుంది.

3) న పరముఖ నిరీక్షణం, నాపి సంభాషణం:- పరపురుషుని ముఖాన్ని సూటిగా చూడడం, ఆయనతో సూటిగా సంభాషించడం స్త్రీలకు పనికిరాదు. ఏదో ఒకటి మధ్యలో ఉండాలని;

4) పథ్యముక్తం విచక్షణైః। రాక్షసానామభావాయ త్వంవా న ప్రతిపద్యసే" -

ఇదివరకు అకంపన, మారీచాదులు నీకు హితోపదేశం చేసినా వారి మాటలు పట్టించుకోలేదు. నీ మూర్ఖత్వమే సర్వరాక్షస వినాశానికి కారణమవుతుంది. ఇదిగో! ఇప్పుడు నేను చెప్పబోయే మాటలను కూడ "గడ్డిపోచ" వలె భావించి వినకుంటే నీకు సర్వనాశనం తప్పదని;

5) తనతో మాట్లాడడానికి ఇష్టపడక, సీతాదేవి (గడ్డిపోచను వేయడం వంటి) ఇతర పనులను చేస్తుందని తలచి, నిరాశతో రావణుడు వెనుతిరిగి పోవాలని;

6) ఈ గడ్డిపోచకు నేనెంత విలువ ఇస్తానో, నీకు అంతే ఇస్తానని తెలుపడానికి;

7) "ఈ గడ్డిపోచలో కూడ ప్రాణము తెప్పిస్తుంది ఈమె శక్తి" అని భయపడిపోతాడేమో అని

8) నీవు "గడ్డి తినెడు పశువు" వని,

9) నీకు అనుభవానికి యోగ్యమయింది గడ్డే కాని నేను (నీకు అర్హురాలిని) కాదని,

10) నీవు ఇస్తానన్న సంపదలు నాకు గడ్డిపోచతో సమానమని,

(11) నీ ప్రాణము తీయుట ఈ గడ్డిపోచను విరుచుట అంత తేలిక అని

(12) రామబాణాగ్నికి నీలంక సర్వనాశనమైన తరువాత ఈ గడ్డితోనే గుడిశెలు వేసికొంటారని

(13) సాగరమధ్యంలో దీనిని వేస్తే ఇది తీరందాకా వెళ్లి చేరే తీరుగా, నీవు కూడ నడుమంత్రపు సిరితో కొట్టుమిట్టాడక రాఘవుని శరణువేడుమని,

(14) ఆనాడు స్థంభాన్ని చీల్చుకొని నృసింహస్వామి ఆవిర్భవించినట్లు ఈనాడు కూడ ఇప్పుడే రాముడు తలచుకొంటే ఈ గడ్డినుండే ఆవిర్భవిస్తాడని,

(15) కాకాసురునిపై ఈ గడ్డిపోచనే బ్రహ్మాస్త్రంగా రామభద్రుడు ప్రయోగించాడని నీపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించదానికి కూడ ఈ గడ్డిపోచ చాలునని,

16) ఆనాడు కాకాసురుని రక్షింపజాలక బ్రహ్మ, రుద్రేంద్రాదులు చేతులెత్తి వేసినట్లే, ఈనాడు నిన్ను కూడ ఎవ్వరు కాపాడజాలరని,

17) రాముడు కరుణించి శరణాగతుడైన కాకాసురుని ఒక కన్ను మాత్రమే తీసివేసి కాపాడినట్లు, ఆయనను శరణువేడితే నిన్ను కూడ కొద్ది శిక్షతో వదిలివేస్తాడని,

18) ఈ గడ్డిపోచను మాడ్చుట ఎంత సులభమో, నా పాతివ్రత్యాగ్నితో నిన్ను కూడ అంత సులభంగా భస్మం చేయగల్గుతానని,

ఇలా సీతాదేవి మధ్యలో గడ్డి పరకను వేయుటలో ఎన్నో, మరెన్నో విశేషార్థాలు ఉన్నాయి.

2) ప్రత్యువాచ శుచిస్మితా:- రావణుడు కామంతో కళ్లగానక మాట్లాడితే కన్న తల్లి కొడుకుతో మాట్లాడినట్లు పవిత్రమైన చిరునవ్వు నవ్వి బదులు పలికింది.

(3) నివర్తయమనోమత్తః- నా నుండి నీ మనస్సును మరల్చుకో. నేను రామునికి మాత్రమే అర్హురాలను. నీకు లొంగే దానిని కాదు.

సంస్కృతంలో మనస్సును "మనః" అంటారు. "మనః" త్రిప్పితే "నమః" అవుతుంది. నా నుండి నీ కామబుద్ధిగల మనస్సును మార్చుకొంటే నీకు నేను నమస్కరించ దగిన దానిని (పూజ్యురాలిని) అవుతాను.

4) స్వజనే క్రియతాం మనః : నా పై కామాన్ని నీ భార్యల విషయంలోకి మరలిస్తే నీకు పుణ్యము, పురుషార్థము (సుఖము) రెండు కలుగుతాయి" అని సీతాదేవి హితోపదేశం చేసింది.

II. "యథా తవ తథా2న్యేషాం। రక్ష్యా దారా నిశాచర।
ఆత్మాన ముపమాంకృత్వా స్వేషు దారేషు రమ్యతాం॥" (21-7)

రావణా! పరుల భార్యలను కోరడం మహాపాపము. అది ఆ స్త్రీలకు, వారి భర్తలకు కూడ అనిష్టమైంది.

నీవు ఇతరుల భార్యలను బలవంతంగా అపహరించి తెచ్చి, అనుభవించి, ఆనందించాలనుకొంటున్నావు కదా! మరి నీ భార్యలు కూడ ఇతరులతో రమించడాన్ని నీవు అంగీకరిస్తావా? ఇతర పురుషులు నీ భార్యలను బలవంతంగా అపహరించి, అనుభవిస్తే నీవు సహిస్తావా?

కాబట్టి నీ భార్యలు నీకే స్వంతమని ఎలా భావిస్తావో, ఇతర స్త్రీలు కూడ వారి భర్తలకే స్వంతము కదా! అందువలన నీ భార్యలను నీవెలా రక్షించుకొంటావో, పర భార్యలను కూడ నీవు గౌరవంతో అలాగే రక్షించాలి.

అందువలన అన్యస్త్రీలను అపహరించి తెచ్చేప్పుడు, వారిని అనుభవించాలని అనుకొన్నప్పుడు నీ భార్యల గురించి ఆలోచించు. అప్పుడు నీ మనస్సు పరస్త్రీల వైపు పరుగులెత్తదు. నీ భార్యల పట్లనే మనస్సు నిలిచి ఉంటుంది. అప్పుడు మనఃపూర్వకంగా నీ భార్యలతో నీవు ఆనందాన్ని పూర్తిగా పంచుకోవచ్చు.

అలా కాక పరస్త్రీ చాంచల్యముతో నీవు ఉంటే ఆ స్త్రీల తిరస్కారానికి, వారి భర్తల ప్రతీకారానికి నీవు గురి అవుతావు. అంతేకాదు నీ భార్యలు కూడ నిండు మనస్సుతో నీకు ఆనందాన్ని అందివ్వరు.

కామ కలుషితచిత్తుడైన రావణుని కన్న కొడుకుగా భావించి ఆ జగన్మాత చేసిన మాతృపదేశము ఎంత చక్కగా, ఎంత పవిత్రంగా ఉందోకదా!

III. "ఇహసంతో న వా సంతి। సతోవా నానువర్తసే
తథాహి విపరీతాతే। బుద్ధి రాచార వర్జితా॥" (21-9)

ఇంత చెప్పినా వినని రావణుని దురాచారానికి కారణమేమై ఉంటుందో? అని సీతాదేవి విచారిస్తున్నది.

"ఇహ":- రావణా! నీ దేశంలో సత్పురుషులే లేరా! రాక్షసులతో నిండి ఉందే! అప్రయోజకులు కోట్లకొద్దీ ఉన్నారే?

జనులు కోట్ల కొద్దీ ఉన్నారే? రాజధాని నగరము, మిగిలిన ప్రాంతము, దేరాలతో (పల్లెలతో) పాలెలతో ఆవరించి నీ దేశము అతి విస్తారంగా ఉందే? తినేవారు, వస్త్రధారులు, అలంకార ప్రియులు మంచి, చెడ్డ అన్నీ ఉన్న దేశమే కదా?

మంచే లేదా అంటే "అగ్నిహోత్రాశ్చ। వేదాశ్చ రాక్షసానాం గృహేగృహే" "రాక్షసుల గృహాలలో యజ్ఞాగ్ని హోత్రాలు వెలుగుతున్నాయి, వేదాధ్యయనాలు వినవస్తున్నాయి" అన్నట్లు, "శుశ్రావ బ్రహ్మఘోషాంశ్చ విరాత్రే బ్రహ్మరక్షసాం" బ్రహ్మరాక్షసుల వేద ఘోషలను విన్నాడు" అన్నట్లు వైదిక మర్యాద కూడ చిక్కగా నడిచే దేశమిది.

"తపస్సంతాప లబ్ధిస్తే సోఽయం ధర్మ పరిగ్రహః" నీ అధికమైన తపస్సును ధర్మఫలంగా పొందిన వైభవము గల దేశమిది.

రాజులు, మంత్రులు, పురోహితులు, కర్మములను అనుష్ఠించేవారు, భట్టారకులు మొదలైన శిష్టులు కూడ విస్తారంగా గల దేశమిది.

అయితే, ఇప్పుడేమైంది? అంటే (సంతోన):- సత్పురుషులు లేదు. అజ్ఞానుల కావాసంగా ఉందే కాని సత్పురుషులు కనబడడం లేదు. ఇతరులకు హాని కలిగించే ప్రహస్తుడు, ధూమ్రాక్షుడు, వజ్రదంష్ట్రుడు మొదలైన దుర్మార్గులు అనేకులు కనబడు తున్నారు కాని పరుల మేలుకోరే సత్పురుషులు కానరావడం లేదు. "బ్రహ్మ ఉన్నాడని భావించేవారు ఉజ్జీవిస్తారు (అస్తి బ్రహ్మేతి చేద్వేద సంతమేనం తతో విదుః)" అన్నట్లు భగవత్ జ్ఞానము వలన తాము బాగుపడి ఇతరులను బాగుపరచే వారున్నట్టు లేదు.

ఒకవేళ ఎవ్వరైనా ఒకరో ఇద్దరో ఉన్నా, "త్వాంతుధిక్కులపాంసనం" అన్నట్లు "ఛీ! కులద్రోహీ!" అని వారిని తన్ని తలుపు మూసుకొని ఉంటావు. సత్పురుషులు అధికంగా ఉంటే కదా నీవు వారి ప్రభావం చేత బాగుపడవచ్చు.

"తం సంతః శ్రోతుమర్హంతి సదసద్వ్యక్తి హేతవః" సత్పురుషుని ఆశ్రయించిన వారే సారాసారములను గుర్తింపగల్గుతారు. అటువంటి వారు లేనే లేరా?

బొత్తిగా లేరని అనడానికి కూడ వీలులేదు. (సంతి):- ఉండి ఉంటారు. సత్పురుషులు ఎవ్వరు లేకపోతే నీకు ఈ విజయము, ఈ సంపద, ఈ పుత్రాది సమృద్ధి ఇవన్నీ ఉండేవి కావు. ఇవన్నీ ఉన్నాయంటే ఈ లంకలో ఇంకా కొంత మంది సజ్జనులు తప్పక ఉండి ఉంటారు. సజ్జనులు లేక సుఖ సమృద్ధులు ఉంటాయంటే "కారణములేకుండానే కార్యము ఉండగల్గాలి" అది అసంభవము.

సత్పురుషులు అంటే వారిదొక ప్రత్యేక జాతి కాదు. అన్ని జాతులలో కూడ అవినీతిని ఉపదేశించే వారు. ఆచరించేవారు. దుర్జనులు కదా! అలాగే మంచిని చెప్పేవారు, చేసేవారు సజ్జనులు. నీకు హితాన్ని ఉపదేశించిన మాల్యవంతుడు, కుంభకర్ణుడు, విభీషణుడు మొదలైన వారు సజ్జనులే. అందువలన హితం కావాలనుకొంటే చెప్పేవారు నీ ప్రక్కలోనే ఉన్నారు.

సతోవానానువర్తసే:- "ఇందరు మంచివారు ఉన్నారు అంటున్నావు కదా! ఉంటే వారు మంచి ఎందుకు చెప్పరు?" అంటే "నాపృష్టః కస్య చిద్బ్రూయాత్' నీవు అడిగితే కదా వారు చెప్పేది. అడుగకుండా చెప్పితే నీవు కోపగిస్తావేమో?

నిజానికి సత్పురుషుల దగ్గరికి వెళ్లి ఆశ్రయించి, వారికి సేవలు చేసి, సమయోచితంగా ప్రశ్నలు వేస్తే వారు మంచిని ఉపదేశిస్తారు. నీవు ఆ విధంగా వారిని సేవించలేదే?

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన, సేవయా
ఉపదేక్ష్యంతి తేజ్ఞానం జ్ఞానినస్తత్వదర్శినః"

మంచి వారిని నీవు అనుసరించడమే లేదే? "త్రివర్ష పూర్వ శ్రోత్రియోఽభివాదన మర్హతి" అన్నట్లు మూడుసంవత్సరాలు వేదాధ్యయనము చేసిన బ్రాహ్మణుడు పూజార్హుడు.

జ్ఞానవిజ్ఞాన సంపన్నాః। భక్తిమంతోజనార్దనే
ప్రణంతవ్యా విశేషేణ। సాత్వికైర్ధర్మ చారిభిః"

సాత్వికులకు, ధర్మాన్ని ఆచరించే వారికి భక్తులు. జ్ఞాన విజ్ఞాన సంపన్నులు పూజనీయులు కదా!

"అప్రియస్యచపథ్యస్యవక్తా మచశ్రోతాచదుర్లభః" వినేవారికిష్టము కాని మంచి మాటలను చెప్పడానికి ధైర్యము చేసేవారు ఉండరు. ఒకవేళ వారు ధైర్యము చేసి చెప్పినా వారి మాటలను వినేవారు కూడ ఉండరు.

మంచివారిని అనుసరించడమంటే - ఉపదేశము పొందకముందు వారికి నమస్కారాభివాదాలను చేయడము, ఉపదేశము పొందాక "త్వత్తోఽపివేదాధ్యయన మధీత మఖిలం" మీ ద్వారా సమస్త వేదాన్ని అధ్యయనం చేశాను. "ఎన్నైతీమనం

కెడుత్తాయ్" నా దుర్బుద్ధిని పోగొట్టారు కదా! "ఉనక్కెన్‌శెయ్‌కేన్" మీకు నేను ఏమి ప్రత్యుపకారము చేయగల్గుతాను? అని కృతజ్ఞతను చూపడం.

ఆచార్యులను వారి ముందు స్తుతించడం ధర్మము. మిత్రులను చాటుకు మెచ్చుకోవడం ధర్మము.

పోనీ ఇవన్నీ లేకున్నా "యథాతేతేషు వర్తేరన్, తథాత్వం తేషు వర్తేథాః" సత్పురుషులు వారి ఆచార్యుల విషయంలో ఎలా ప్రవర్తిస్తారో నీవు కూడ సత్పురుషులతో అలాగే మెదులుకో".

"యద్యదాచరతి శ్రేష్ఠః - తత్తదేవేతరోజనః" శ్రేష్ఠుడు ఎలా, ఎంతవరకు ఆచరిస్తాడో, అలాగే, అంతవరకే ఇతర జనులు వారిని అనుసరిస్తారు.

"సత్పురుషులు ఉండి కూడ మంచి చెప్పలేదు" అనడానికి కూడ వీలు కాదు. ఎందుకంటే వారు మంచి చెప్పకుండా ఉండలేరు.

అయినా సత్పురుషులు నీ లంకలో ఉన్నా, ఇంకా నీవు చెడు పనులను చేస్తున్నావు. అంటే వారు చెప్పింది నీవు వినడం లేదు. విన్నా వారు చెప్పిన మంచి పనులను చేయడం లేదని అర్థము.

అదేమిటి "నేను మంచి మాటలు వినడం లేదు" అని నీకు ఎలా తెలుసు? నీవేమైనా అంతర్యామివా? నా మనస్సు నీకు ఎలా తెలుస్తుందంటావా?

నీవు చేసే ఆలోచనలను బట్టి నీవు మంచి వినడం లేదని తెలియడం లేదా? "తథాహి విపరీతాతే బుద్ధిః" - నీ బుద్ధి విపరీతంగా ఉంది కదా? నదులన్ని జలప్రవాహంతో నిండి ప్రవహిస్తు ఉంటే - పర్వతాలలో వర్షాలు పడ్డాయి అని ఊహించవచ్చు కదా!

"బుద్ధిమాన్‌మధురాభాషీ" బుద్ధిమంతుడెప్పుడు మంచిగానే మధురంగానే మాట్లాడుతాడు. "సోహం పరుషితస్తేన। దాసవచ్చావమానితః" నేను చాల నీచమైన మాటలను పడ్డాను. సేవకునివలె అవమానింపబడ్డాను" అన్నట్లు నీ దగ్గర సత్పురుషులు నీ నీచమైన నిందలకు, అవమానాలకు గురి అవుతారు.

బుద్ధినాశాత్ప్రణశ్యతి:- "వినాశకాలే విపరీత బుద్ధిః" అన్నట్లు నీ విపరీత బుద్ధి నీ వినాశానికి కారణమవుతుంది.

బుద్ధిరాచారవర్జితా: ఇంతకు నాది విపరీత బుద్ధి అంటున్నావే! ఎందుకు విపరీతమంటావా? పరదార, పరద్రవ్యములను దొంగిలించి బలాత్కారంగా

అనుభవించాలనుకోవడం, పరులను అన్యాయంగా క్రూరంగా హింసించడం ఇవన్ని విపరీత బుద్ధికి ఉదాహరణలు కావా?

'నీతిమాన్, బుద్ధి సంపన్నో, ధీరో, దక్షః, శుచిర్నృపః" అని రాజు నీతివంతుడు బుద్ధిమంతుడు, ధైర్యవంతుడు, నేర్పరి, పవిత్రుడై ఉండాలని శాస్త్రాలు తెలుపుతున్నాయి. ఇక నీవా? "ప్రకృత్యా రాక్షసోహ్యేషః" విపరీతస్తథా2సురః "నీ శరీరము రాక్షస శరీరమే, నీ బుద్ధి అసురబుద్ధే".

నీ దగ్గర వర్ణాశ్రమాచార ధర్మాలు ఏవి కనబడడం లేదు. అంతే కాదు. పరదార, పరదేవతా ద్రోహాలు ప్రత్యక్షంగా కంటికి కనబడుతునే ఉన్నాయి.

"అదేమిటి? బ్రహ్మదేవుణ్ణి తపస్సుతో మెప్పించి వరాలను పొందాను. పరమేశ్వరుడిని ప్రసన్నుడిని చేసికొని పంచకాలాలలో పూజా పరాయణుడనయ్యాను" అంటావా? నీకు ఐశ్వర్యము, అవధ్యత్వము కావాలని నీవు వారి కొరకు తపస్సు చేశావు. నీటికి వేడి అగ్ని వలన కలుగుతుంది. అలాగే నీ పూజలు వరాల కొరకే, కాని అవి నీకు సద్బుద్ధిని సదాచారాన్ని కలిగించలేదు.

పైపెచ్చు నీ వరాలు నీకు అహంకారాన్ని, దుర్బుద్ధిని, దురాచారాన్ని కల్గిస్తున్నాయి. ఇంతకంటె చెడు ఇంకేమి కావాలి?

IV. "శక్యా లోభయితుం నాహం। ఐశ్వర్యేణ ధనేనవా।
అనన్యా రాఘవేణాహం। భాస్కరేణయథాప్రభా" (21-15)

రావణా! నన్ను అపహరించి తెచ్చింది మొదలు నన్ను డబ్బుతోనో, అధికారంతోనో లొంగదీసుకోవాలని అనుకొంటున్నావు. నన్ను ఏమని అనుకొంటున్నావు?

నాకు ధనము క్రొత్తా? సకల సంపదలకు నిలయమైన మిథిలా నగరానికి అధిపతి అయిన జనకచక్రవర్తి గారాబాల కూతురును.

అయోధ్యాధిపతి అయిన దశరథ సార్వభౌముని ముద్దుల పెద్ద కోడలును.

"సమాద్వాదశ తత్రాహం। ఇక్ష్వాకూణాం నివేశనే
భుంజానామానుషాన్ భోగాన్। సర్వకామ సమృద్ధినీ".

నా వివాహానంతరము మా మామగారి ఇంట్లో మనుష్యులు అనుభవించదగిన సౌఖ్యాలన్నిటిని అనుభవించాను. నా కోరికలన్ని సమృద్ధంగా తీరాయి. ఇక నాకు నీ ధనము ఒక లెక్కా?

ఇక ఐశ్వర్యమంటావా? నా భర్త ఈశ్వరులకే ఈశ్వరుడు. ధరామండలంలోని మహారాజులెవ్వరు తాకడానికి కూడ సాహసించని శివధనుస్సును చెరుకు గడలాగా అవలీలగా ఎత్తాడు. ఆయన మహాబలం ముందు అంతటి మహాబలిష్ఠమైన మహాశివుని ధనస్సు కూడ నిలువలేక రెండు ముక్కలైంది.

పరశురాముడంతటి తపోబల వీర్యబల సంపన్నుడు నా భర్త తేజస్సును అర్థం చేసికొని మోకరిల్లాడు.

"ఇక్ష్వాకూణాం ఇయం భూమిః సశైల వన కాననా" నవద్వీపాలతో కూడిన ఈ ధరణి సమస్తము మా ఇక్ష్వాకు మహారాజుల ఆధీనంలోనిదే. అంతటి ఐశ్వర్యాన్ని పితృవాక్య పాలనమనే ధర్మపరిరక్షణ కొరకు తృణప్రాయంగా పరిత్యజించిన త్యాగధనుడు నా భర్త. నా పతి దేవుని పాదానుసరణలోనే స్వర్గసౌఖ్యాలను చూచుకొని అరణ్యాలకు అనుసరించిన పతివ్రతను నేను.

"సీతా! అవన్ని పాత మాటలు". చనిపోయిన గేదె పగిలిపోయిన బుద్దెడు పాలిచ్చింది" అన్నట్లు ఉన్నాయి నీ మాటలు. అన్ని కోల్పోయిన నీవు అభాగ్యురాలివే కదా! ఇప్పుడు నన్ను వరిస్తే అంతకంటే ఎక్కువగా ధనాన్ని, ఐశ్వర్యాన్ని అనుభవిస్తావు. అంతేకాదు నీవు భ్రష్ట ఐశ్వర్యురాలివి కదా! నీకు మళ్లీ సంపదలు కావాలని మనస్సు అఱ్ఱులు చాస్తుంది కదా!" అంటావా?

నా మనస్సు ఐశ్వర్య సంపదలకు అఱ్ఱులు చాచేదైతే నేను అయోధ్యలోనే ఉండే దానిని. నేనేదో క్షణికావేశములో వాటిని వదలుకోలేదు. నా భర్త నన్ను అడవుల ఇడుమలను, అయోధ్యా ఆనందాన్ని అనేక పర్యాయాలు విడమరచి చెప్పాడు. రాగల ప్రమాదాలను కూడ హెచ్చరించాడు.

అయినా ఆనాడు, ఈనాడు కూడ ధనము, ఐశ్వర్యము, వేరే ఏది కూడ నన్ను నా భర్త నుండి వేరుచేయజాలదు. నిజానికి మేము వేరైతే కదా మమ్మల్ని ఇద్దరిని వేరే ఎవ్వరైనా ఏ కారణం కొరకైనా వేరు చేయగల్గేది.

మేమిద్దరము ఒకటే – ఒకే వస్తువు రెండు లక్షణాలను కల్గి ఉంటుంది. ఒకటి రూపము. 2) ధర్మము. ఆ రెండింటిని ఎవ్వరు వేరు చేయజాలరు.

ఉదాహరణకు భాస్కరునికి సప్తాశ్వ రథముపై ప్రయాణం చేసే దివ్యపురుషుని రూపముంది. ఆయనకు ప్రకాశమనే ధర్మము ఉంది. ఈ రెండింటిని వేరు చేయలేము. ఒక రకంగా ప్రకాశము సూర్యుని రూపమని కూడ చెప్పవచ్చు.

అలాగే పుష్పానికి ఒక రూపము ఉంటుంది. వాసన అనే ఒక ధర్మము ఉంది. పుష్పాన్నుండి పరిమళాన్ని వేరుచేయలేము.

అలాగే మణికి ఒక రూపము ఉంటుంది. కాంతి దాని ధర్మము. మణి నుండి కాంతిని ఎవ్వరైనా వేరు చేయగల్గుతారా?

అలాగే శ్రీరామచంద్రుడు సూర్యుడు. నేను ఆయన ప్రభను. శ్రీరామచంద్రుడు ఒక దివ్య పుష్పము. నేను ఆయన పరిమళాన్ని. ఆయన ఒక దివ్యమైన మణి. నేను ఆయన కాంతిని. ఆయన ఆత్మ. నేను దేహాన్ని. మేమిద్దరము అనన్యులము. వేరు చేయరాని వారము. నన్ను శారీరకంగా బలవంతంగా దొంగలా అపహరించి తెచ్చినంత మాత్రాన మా మనస్సులను వేరు చేయగల్గుతావా? నన్ను వశపర్చుకోగల్గుతావా? నీ ఆశలు, ప్రలోభాలు నాకు గడ్డిపోచతో సమానము" అని సీతాదేవి రావణుని విదిలించి వేసింది.

భగవంతుని ఆశ్రయించిన వారికి ఐశ్వర్యము, అధికారము, ఈ ఐహిక సంపదలు తృణప్రాయాలే కదా! "తృణీకృత విరించాది। నిరంకుశ విభూతయః రామానుజపదాంభోజ సమాశ్రయణ శాలినః" రామానుజుల దివ్యపాదారవిందములను ఆశ్రయించిన వారికి బ్రహ్మాది విభూతులు గడ్డిపోచతో సమానమే కదా.

V. "మిత్రమౌపయికం కర్తుం। రామః స్థానం పరీప్సితా
వధంచానిచ్ఛతాఘోరం। త్వయాసౌ పురుషర్షభః" 21-19

రావణాసురుడు బలవంతంగా శరీరం నుండి ఆత్మను వేరు చేసినట్లు తనను నీచంగా అపహరించి రాముని నుండి వేరు చేశాడు. ఆ వియోగ దుఃఖమే తనకు భరింపరాకుండా ఉంది. అంతేకాక దేవతల కొరకు ఉద్దేశించిన పురోడాశాన్ని కుక్క అపహరించి తానే తినడానికి ప్రయత్నించినట్లు శ్రీరామచంద్రస్వామికే ఆకారత్రయంతో అత్యంత విధేయమైన తనను భయంతోనో ప్రలోభాలతోనో వశం చేసికోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అటువంటి నీచుడు, అత్యంత కాముకుడైన రావణాసురుని, చెడ్డ పనులకు అలవాటు పడ్డ కన్న కొడుకును బాగుపరుచుకోవాలనుకొనే కన్నతల్లివలె, సీతాదేవి తన హితోపదేశంతో బాగుచేయాలని అనుకొంది. ఆ ప్రయత్నంలోని భాగమే ఈ హితోపదేశ శ్లోకము.

"రావణా! నీకు రామునితో శత్రుత్వమేర్పడితే నీవు బ్రతికి బట్ట కట్టజాలవు. అందువలన ఆయనతో విరోధాన్ని కోరుకోకు.

"మిత్రం":- మహా క్రూరమైన పాపం చేసిన నీకు రామచంద్రస్వామి యొక్క శ్రీపాదాలే శరణము. ఆయన మైత్రే నీకు కావలసింది అనక ఆయన శరణమే నీకు కావాలని ఎందుకంటారంటే మైత్రి సమానుల మధ్యే ఉంటుంది. రక్షణ కోరేవారు చేయవలసింది శరణాగతే.

అయితే తమను గొప్పగా భావించుకొని ఇతరులను తక్కువ వారుగా భావించే స్వభావము ఆమెకు లేదు కనుక సీతాదేవి మైత్రినే శరణముతో సమానంగా భావించింది. ఈమె ఒక్కతే కాదు రామచంద్రుడు కూడ "మిత్రభావంతో వచ్చిన వారిని నేను త్యజించను" అన్నాడు కదా!

"న నమేయం" నేను ఎవ్వరికి నమస్కరించను అనడం రావణుని స్వభావము. అటువంటి అహంకారితో "శరణు వేడుమంటే ఆయన అంగీకరించడని తలచి మైత్రి చేయుమం"టున్నది.

"మితాత్ త్రాయత ఇతి మిత్రం" కొద్ది మంచి చేసినా రక్షించేవాడు మిత్రుడు. అందువలన నీవు రామచంద్రుని విషయములో కొంచెము సుముఖంగా ఉన్నా నిన్ను రక్షిస్తాడని సీతాదేవి తెలుపుతున్నది.

'ఔపయికం':- అంటే "ఉపాయః నిమిత్తకారణమ్" అన్నట్లు ఉపాయమని అర్థము.

"నేనెందుకు రామునితో మైత్రి చేయాలి?" అంటావా "స్థానంపరీప్సితా" నీ స్థానాన్ని కాపాడుకోవాలని అనుకొంటే మైత్రి చేయాలి" అంటుంది. ప్రస్తుతము నీవు, నీ మిత్రులు, లంకానగర వాసులు అత్యంత సుఖసంతోషాలతో ఉన్నారు. మీరు ఇలాగే ఉండాలంటే రామునితో మైత్రి తప్పనిసరి.

"నేను మైత్రి చేసికోకుంటే ఏమవుతుందంటావా?" నీవు చేసిన ఘోరాపరాధానికి రాముడు నిన్ను ఘోరంగా దండించకుండా వదలిపెట్టడు. క్రూరంగా నిన్ను ముక్కలు ముక్కలుగా నరకి చంపుతాడు.

"వధించానిచ్ఛతా ఘోరం" అటువంటి ఘోర వధను నీవు వద్దనుకొంటే నీవు తప్పక మైత్రో, శరణాగతో చేయవలసి ఉంటుంది.

రామః : "అది సరే! కాని నేను ఎంతో మహాపాపం చేశాను అంటున్నావు కదా! అంత మహాపాపం చేసిన నేను రామునితో మైత్రి చేస్తే మాత్రము ఆయన నన్ను మన్నిస్తాడా?" అంటావా? ఆయన రాముడు. ఆయన అందరిని రమింపజేసే వాడు. అందరిని అంటే తనకు అపరాధం చేసిన వారినైనా ఆనందింపజేస్తాడు.

నీవాతని దగ్గరకు వెళ్తే నిన్ను కాదనకుండా చేరదీసే సులభుడాయన. ఒక బోయవానితో, ఒక కోతితో ప్రాణ స్నేహం చేసిన సుశీలుడు ఇంత యోగ్యతగల నిన్ను వదలుకొంటాడా?

నీవు ఆశ్రయించడానికి సందేహించినా "యదివా రావణస్స్వయం" అని తన అంగీకారాన్ని ముందుగానే తెలిపే మహోదారుడు రాముడు.

నీవు ప్రాణాలను కోల్పోయే పరిస్థితిలో యుద్ధరంగంలో ఉన్నప్పుడు "ప్రవిశ్య రాత్రించర రాజలంకాం!" అని రాక్షసరాజా! లంకలోకి వెళ్లవయ్యా! అని భయంకర శత్రువని కూడ చూడక ప్రాణాలతో నిన్ను సగౌరవంగా వదలి పెట్టగల కరుణామయుడు రాముడు.

"సుహృదం సర్వభూతానాం" అన్నట్లు సర్వప్రాణులకు స్నేహితుడు శ్రీరాముడు. "నివాసఃశరణం సుహృత్".

స్థానంచపరీప్సితా:- నేను రామునితో మైత్రి చేస్తే కొత్తగా నాకు వచ్చేదేముంటుంది అంటే ఉన్న వాటిని రక్షించుకోవడం కూడ ముఖ్యమే కదా! నీవు నీ లంకా నగర వైభవాన్ని కాపాడుకోవాలంటే రామునితో స్నేహం చేయవలసిందే.

"అభిషిచ్య చ లంకాయాం రాక్షసేంద్రం విభీషణమ్" నీవు రాముని తో మైత్రిని కోరుకోకుంటే నీవు మరణించక తప్పదు. ముందుగానే రాముడు మాట ఇచ్చిన ప్రకారము నీ తమ్మునికి రాజ్యాభిషేకం తప్పదు.

"ఒకవేళ రాముడు మాట ఇస్తే, నేను మైత్రిని చేస్తే మాత్రము రాముడు నాకు రాజ్యాన్ని దక్కనిస్తాడా?" అంటే అవును మీ అన్నదమ్ములలో ఒకరికి లంకా నగరాన్ని, మరొకరికి అయోధ్యా నగరాన్ని ఇచ్చి నీకేమి ప్రమాదం రాకుండానే ఆయన తన మాటను నిలబెట్టుకుంటాడు.

"నేను రామునికి శరణాగతి చేయకపోతే నన్ను రక్షించేవారే ఉండరా?" అంటే "త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః" అన్నట్లు నీకంటే ముందుగా కాకాసురుడు ఘోరాపరాధము చేసి రాముని ఆగ్రహానికి గురి అయ్యాడు. రామాస్త్రాన్నుండి బయటపడడానికి ఆయన తిరుగని చోటే లేదు. తొక్కని కడపే లేదు. మూడు లోకాలలో ఆయన తల్లిదండ్రులు, మహర్షులు, దేవతలు ఎవ్వరు కూడ ఆయనకు రక్షణను ఇచ్చే శక్తి లేక వదిలి వేశారు. మూడు లోకాలు మళ్లీ మళ్లీ తిరిగి, దిక్కులేక చివరకు ఆ కరుణామయుడైన రాముని కాళ్లపైననే పడ్డాడు.

నీవు అట్లా కనబడ్డవాళ్లందరి కాళ్లు పట్టుకోకుండానే రాముని శరణువేడితే నీ స్థానం నీకు దక్కుతుంది.

"వధించానిచ్ఛతా ఘోరం" నీ స్థాన రక్షణము మాట అటుంచు. ముందు నీవు జీవించి ఉండాలి కదా.

"రసాతలంవా ప్రవిశేత్ - పాతాళం వాపి రావణః।
పితామహ సకాశంవా। నమే జీవన్ హి మోక్ష్యతే॥".

రావణా! నీవు ఈ లంకానగరాన్ని ప్రాణభయంతో విడిచి రసాతలానికి పారిపోయినా, రాక్షసులకు మూలబలస్థానమైన పాతాళంలో ప్రవేశించినా, అది ఇది అని కాక నీకు పితామహుడు, వరప్రదాత అయిన బ్రహ్మదేవుని దగ్గరికి వెళ్లి దాగి ఉన్నా రామబాణాన్నుండి తప్పుకొని ప్రాణాలతో ఉండజాలవు.

"ఇవన్ని ప్రసిద్ధ స్థలాలు. వీటిలో ఎక్కడికి వెళ్లినా నన్ను గుర్తించి ఆయన వధించవచ్చు. కాని ఎవ్వరికి తెలియని చోటుకు అజ్ఞాత స్థలానికి (1) వెళ్లి దాగి ఉంటే నన్ను రాముడు ఎలా వెతికి పట్టుకొంటాడంటావా?

నిన్ను ప్రాణాలతో వదిలితే కదా నీవు ఎక్కడికోపోయి అజ్ఞాతంగా ఉండగలిగేది? రాముని బాణానికి తెలియని చోటు లేదు. అది నిన్ను వదలిపెట్టదు.

ఏదో ఒక రోగం వచ్చి చనిపోతే ఫరవాలేదు. కాని శత్రుహస్తంలో భయంకర మరణాన్ని పొందడం కంటే పరాభవం మరేముంటుంది? లోకులవలె సాధారణ మరణము కావాలంటే ఆయనను ఆశ్రయించాలి సుమా!

నీవు రాముని ఎదిరించి నిలబడితే ఆయన నిన్ను ఊరకే వదలుతాడా? జలదుర్గము వంటి సముద్రంలో రాళ్లతో అడ్డకట్ట కట్టి, నడిచే త్రోవగా మార్చి, కోతులను కాలినడకతోనే లంకలో ప్రవేశింపజేసి, నీ రాజధాని ప్రాకారాలను పడగొట్టి, నీ బలాన్నంతటిని చవిటినేలవలె నిర్వీర్యము చేసి, నీ బంధువుల మూకల భుజాలను తెగగొట్టి, కాళ్లను విరగగొట్టి, తలను నరికి, నీ తలలను త్రెంచి, భుజాలను నరకి, శరీరాన్ని ముక్కలు జేసి - నీ రక్త ప్రవాహాన్ని నీ భార్యలు చూచి దుఃఖించే విధంగా నిన్ను "గచ్ఛ" అని వదిలి వేసి చిత్రవధ కావిస్తాడు, సుమా! ఈ విధమైన చిత్రవధ వద్దనుకొంటే ఆయనను ఆశ్రయించు.

ఈ విధంగా ఘోరవధ అనుభవించిన వారు ఇంతకు ముందు ఉన్నారా అంటే నీ అంత మహాపాపం చేసిన వారు ఇంతకు ముందు లేరు. అంత శిక్షను అనుభవించిన వారు కూడ ఇంతకు ముందు లేరు.

"ఈ రాముని ఆశ్రయించు" మంటున్నది సీతాదేవి. రాముడిక్కడే సీతాదేవి ఎదుటే ఉన్నాడా? అంటే "రామమేవాను పశ్యతి" ఆమె కళ్లు రామునే చూస్తున్నాయి. "రామేతి రామేతి సదైవ బుద్ధ్యావిచింత్య" అన్నట్లు ఎప్పుడు రామునే మనస్సులో భావించు కొంటున్నందువలన దగ్గరలోనే ఉన్నాడనుకొని "ఈ రాముని" ఆశ్రయించు మంటున్నది.

ఈ రాముడు అనడానికి కారణము రాముడు సీతాదేవి మనస్సులో స్థిరంగా ఉండిపోవడమే "అస్యాదేవ్యాః మనస్తస్మిన్. తస్య చాస్యాం ప్రతిష్ఠితం' 'సీతాదేవి మనస్సు రాముని దగ్గరే ఉంది. రాముని మనస్సు సీతాదేవి దగ్గరే ఉంది" అంటాడు వాల్మీకి మునీంద్రుడు.

ఇంతకు పూర్వము రాముని చూచి, మాట్లాడనందువలన రావణునికి తెలియడం లేదు. కాని ఒకసారి రామునికి ఎదురుపడ్డాక రాముని మరచిపోయేవారు ఉండరు కదా!

మారీచుడు "వృక్షే వృక్షేచ పశ్యామి" అన్నట్లు భయం కారణంగా రాముని చెట్టు చెట్టులో చూచాడు కదా!

రావణుడు కూడ రామబాణాల చేత తీవ్రంగా బాధపడ్డాక "స్మరన్ రాఘవ బాణానాం" రాముని భయంకర బాణాలను స్మరిస్తునే ఉండి పోయాడు.

సీతా! నీవన్నట్లు నేను నా స్థానాన్ని కాపాడుకోవడానికి, ఘోరవధను తప్పించు కోవడానికి రాముని శరణువేడినా ఆయన నన్ను మన్నిస్తాడా?

పురుషర్షభః:- ఆయన అందరు పురుషుల ఎంటి ప్రతీకార చింతగలవాడు కాదు. ఆయన పురుషశ్రేష్ఠుడు. ఆయన ఆశ్రితుల దోషాలను గుర్తించేవాడు కాదు (అవిజ్ఞాతా) "న స్మరత్యపకారాణాం శతమపి ఆత్మవత్తయా" కావాలని మనః పూర్వకంగా వందలాది అపకారాలను చేసినా జ్ఞాపకము ఉంచుకొనేవాడు కాదు.

"అపరాధానభిజ్ఞస్సన్ సదైవ కురుతే దయాం" అపరాధాలను గమనించక ఎల్లప్పుడు దయను చూపేవాడు రాముడు.

"యదివారావణ స్స్వయం" - నీవు ఆశ్రయించకముందే అభయమిచ్చిన మహోదారుడు, ఆశ్రయించాక నిన్ను కోపగిస్తాడా?

నీవు పురుషులలో ఎంత నీచుడవో - ఆయన పురుషులలో అంత శ్రేష్ఠుడు సుమా! పురుషులలో సామాన్యుడు శత్రువు చేసిన తప్పులను మరవనివాడు. మధ్య

ముడు రోజులు గడచిన కొలది మరచిపోయేవాడు. ఉత్తముడు దోషాలను గమనించని వాడు. రాముడు ఉత్తమ పురుషుడు సుమా.

ఈ విధంగా తనకు సహించరాని అపచారము చేసిన రావణునికి కూడ హితోపదేశం చేయగల సీతాదేవి మాతృకరుణ ఈ శ్లోకంలో స్పష్టమవుతున్నది.

VI. "విదితః సహి ధర్మజ్ఞః। శరణాగతవత్సలః
తేన మైత్రీ భవతు తే। యది జీవితుమిచ్ఛసి". (21-20)

సీతోపదేశము వలన రావణాసురునికి మతి పోయింది. "ఎవ్వరి పేరు చెప్పితే మూడు లోకాలు గడగడ వణుకుతాయో? అటువంటినేను ఒక మానవ మాత్రుడైన రామునికి నీచంగా శరణాగతి చేయడమా? అని ఒకవైపు ఆగ్రహము, మరొకవైపు పదునాల్గువేలమహావీర రాక్షసులను మూడు గడియలలో మాడ్చివేసిన రాముని పరాక్రమాగ్నిని ఎదిరిస్తే ఎలా ఉంటుంది?" అనే అనుమానము రావణుని మేధస్సును పురుగువలె తొలువసాగాయి. ఆయన పరిస్థితిని గ్రహించిన సీతాదేవి తన ఉపదేశాన్ని మరింత కొనసాగించింది.

రావణా! శ్రీరాముని శరణాగత దర్మ దీక్షను గురించి సందేహించకు। శత్రువైనా తనను శరణువేడితే, తన ప్రాణాలిచ్చి, అయినా కాపాడాలనే నీతి గలవాడు. ఆయనను ఆశ్రయిస్తే నిన్ను ఎన్నడు వదలుకోడు. నిన్ను తప్పక కాపాడి తీరుతాడు.

"శత్రువైన నన్నెలా కాపాడుతాడ"ని ఆందోళన చెందకు. ఆయన శరణాగత వత్సలుడు. "త్వయికించిత్సమాపన్నే। కింకార్యం సీతయామమ" అన్నట్లు ఆశ్రితులకు ఏ కొంచెము (కించిత్) ప్రమాదము కలిగినా, "సీతాదేవితో కూడ నాకు అవసరము లేదని" నన్ను కూడ వదలుకొనే త్యాగశీలి. శరణాగత రక్షా దీక్షితుడు ఆ స్వామి.

"సీతా! నన్ను శరణు వేడుమంటావా? ఒక సాధారణ మనుష్యుని నా అంతటి సుప్రసిద్ధ వీరుడు శరణువేడడం నాకు అవమానకరం కాదా?" అంటావా?

ఒకవేళ శరణువేడడం నీకు సిగ్గుగా అనిపిస్తే కనీసము స్నేహమైనా చేయి. ఆ మహాత్మునితో నీకు పోలికే లేదు. అయినా నీవు ఆయనను సమానం అనుకొని మైత్రి చేసినా, ఆ మహావీరుడు నిన్ను తప్పక మన్నిస్తాడు.

ఆయనతో మైత్రి నీ ప్రాణాలను నిలుపుతుంది. నీకు సకల శుభముల నిస్తుంది.

-- ఇతిశం --

# సీతాదేవి పాతివ్రత్యము-15

చూచి చెడిపోతున్న కొడుకును బాగుచేయడానికి తల్లి చేసే సదుపదేశం వలె (శుచిస్మితా) పవిత్రమైన చిరునవ్వుతో ప్రశాంతంగా సీతాదేవి రావణునికి రామతత్వాన్ని గురించి ఉపదేశించింది.

అయితే రావణుడు అత్యంత దుర్మార్గుడు. తన శత్రువు గురించి, అడవి పాలైన ఒక సామాన్య మానవుని గురించి, తన ఆధీనంలో చిక్కుకున్న ఒక ఆడది తనకు ఉపదేశం చేయడమా? ఆయన ఘోరావమానంగా భావించాడు. ఆ అవమానంతో ఆయన కోపాగ్నిని తన మనస్సులో దాచుకోలేక పోయాడు. ఆయన కళ్లు కోపంతో చంద్ర నిప్పు కణికలవలె మండుతున్నాయి. ఆగ్రహంతో ఆయన శరీరమంతా ఊగిపోతుంది.

"సీతా! పురుషుడు బ్రతిమాలిన కొద్దీ స్త్రీ బిగుసుకుపోతుంది. ఆ పురుషుని తన కంటె తక్కువాడనుకొంటుంది. ఆయనను అవమానిస్తుంది.

నిజానికి నీవన్న మాటలు మరొక వ్యక్తి అని ఉంటే నాలుకను తెగకోసేవాడిని. తలనునరికే వాడిని.

నీ సౌందర్యము నీ పట్ల నా కామాన్ని క్షణక్షణం పెంచి వేస్తుంది. ఎంత కోపం కల్గినా తాను కామించిన స్త్రీని పురుషుడు ఏమి అనలేడు కదా! ఇది కామము వలన కలిగే జాలి, బలహీనత.

ఇక నీకు చివర అవకాశాన్ని ఇస్తున్నాను. నేను నిన్ను అపహరించి తెచ్చినప్పుడే నీ మనస్సును నా వైపు మరల్చుకోవడానికి ఒక ఏడాది గడువునిచ్చాను. ఇప్పటికే పదినెలలు గడచిపోయాయి. ఇక రెండు నెలలు మాత్రమే మిగిలాయి.

ఈ రెండు నెలల లోపు నీ మనస్సును మార్చుకొని నన్ను వరిస్తావా? నాతో స్వర్గసౌఖ్యాలను అనుభవిస్తావు లేక నీ మొండితనంతో నన్ను కాదంటావా? నీవు దిక్కులేని చావు చస్తావు. బాగా ఆలోచించుకో.

రెండు నెలలు పూర్తి అయిన తెల్లవారే వంటవాళ్లు నీ శరీరాన్ని ముక్కలు ముక్కలుగా కోసి వండి నా ఉదయకాల భోజనానికి పంపుతారు" అని బెదిరించాడు.

సీతాదేవి రావణాసురుని మహోగ్రరూపాన్ని చూచి కొంత బెదిరిపోయింది. ఒక్క అడుగు వెనుకకు వేసింది.

కాని అంతలోనే ఆమెకు తెగింపు కల్గింది. ఆవేశము ఆవహించింది. ఆగ్రహంతో తన పాతివ్రత్య బలంతో రావణుని హెచ్చరింపసాగింది.

"రావణా! నీకు ఎవ్వరు సరి అయిన హితాన్ని చెప్పడానికి ముందుకు రావడం లేదు. అందువలన నీ దురాచారాలకు హద్దు లేకుండా పోయింది.

నేనెటువంటి దాననో తెలుసా? ఇంద్రుని ధర్మపత్ని అయిన శచీదేవి వంటి దానిని. వశిష్ఠుని వీడని అరుంధతి వంటి దానిని, అగస్త్యునికి మాత్రమే అర్హమైన లోపాముద్రతో సమానురాలిని. సూర్యుని అనుసరించే సువర్చల సమను. సగరుని భార్య సుకేశిని వంటి దానను. హరిశ్చంద్రుడు అమ్మినా అంగీకరించిన చంద్రమతి వంటి దానను.

ధర్మమూర్తి అయిన రామచంద్రుని ధర్మపత్నినైన నన్ను నీ కామంతో, దుష్ట దృష్టితో చూస్తావా? ఒక పతివ్రతను పరాభవించిన మహాపాపాగ్ని నిన్ను భస్మము చేయకమానదు.

రామునికి నీకు పోలికా? ఆయన ఒక మహామదగజము. నీవొక చిన్న చెవుల పిల్లివి (కుందేలు పిల్లవు).

"రాముడు అడవి పాలయ్యాడు. మానవ మాత్రుడు. నిస్సహాయుడు. ఆయన నన్నేమి చేయగల్గుతాడు?" అనుకోకు. ఆయన బాణాల వాడి, వేడి నీకు తెలియక అలా అనుకొంటున్నావు. నిన్ను నీళ్లు త్రాగించిన మహాబలులను కూడ మట్టి కరిపించగలిగిన మహావీరుడు రాముడు. రామలక్ష్మణులిద్దరు ఇంట్లో లేనప్పుడు నీచంగా ఒక్క నక్కవలె నన్ను అపహరించిన నీకు ఆ పెద్ద పులుల పరాక్రమము ఎలా తెలుస్తుంది?

దశరథ సార్వభౌముడి పెద్ద కోడలును. ధర్మస్వరూపుడైన అయిన రామభద్రుని ధర్మపత్నిని అయిన నా ముందు అనేక పాప వాక్యాలను పలికిన నీ నాలుక వేయి ముక్కలు అవుతుంది.

"అయినా ఒక ఆడది. ఒంటరిది. నిస్సహాయురాలు. ఆమెను బలాత్కరిస్తే ఏమవుతుంది అనుకొంటున్నావేమో? నిన్ను శిక్షించడానికి రాముడు ఇంత దూరము రావలసిన అవసరము లేదు. నేనే నిన్ను నా పాతివ్రత్యాగ్నితో భస్మము చేయగల్గుతాను.

"అసందేశాత్తు రామస్య। తపసశ్చానుపాలనాత్
నత్వాకుర్మి దశగ్రీవ। భస్మ భస్మార్హతేజసా।"

"సీతా! నీవు నన్ను భస్మం చేయ గల్గుతావా? బెదిరిస్తున్నావా? త్రిలోక విజేతను, మహా వరప్రసాదిని నన్ను భస్మం చేస్తానంటావా? ఏది చేయి చూద్దాము? ఒట్టి మాటలు కట్టిపెట్టు. నీ గాలి బెదిరింపులకు నేను భయపడుతానా?" అంటావా? నావి ఒట్టి మాటలు

కావు. నిజాలే. అయితే ఇంతవరకు ఎందుకు నిన్ను భస్మము చేయలేదంటావా? కారణము విను.

"అసందేశాత్తు రామస్య":- రావణా! నేను శ్రీరామునితో కలసి ఉన్న రోజులలో ఒక మాట అడుగలేదు. "రామభద్రా! నన్ను నేను స్వయంగా రక్షించుకోవచ్చునా" అని. ఎందుకంటే అలా అడుగడం రామచంద్రుని అవమానించినట్లే అవుతుంది కాదా?" సీతా! నా రక్షణ పట్ల నీకు విశ్వాసము లేదా? నిన్ను నీవే రక్షించుకోవాలనుకొంటున్నావా?" అని ఆ మహావీరుడు అడిగితే బదులేమి చెప్పాలి? - అందువలన నేను నా రక్షణ విషయాన్ని అడుగలేదు.

"తపసశ్చ అనుపాలనాత్":- "అవును అప్పుడు అడగలేదు. మీరిద్దరు విడిపోతారని మీరుఅనుకోలేదు కదా! అందువలన అడిగి ఉండవు. అడక్కపోతే ఏమైంది? ఇప్పుడు నీవు ప్రాణాపాయంలో ఉన్నావు కదా! ఇప్పుడు నీ రక్షను నీవే చేసి కొంటే మాత్రమేమి తప్పు?" అంటావా?

ఆయనను అడుగకుండా అణువంత చిన్న పనినయినా నేను స్వయంగా చేయలేను. రాముని ఆజ్ఞ లేకుండా స్వతంత్రంగా ఏ పని చేసికోకూడదని నా తపస్సు. ఎంత ప్రమాదము వచ్చినా నా తపస్సును పాలించడమే నా ధర్మము.

"నత్వా కుర్మి దశగ్రీవ। భస్మ":- "సీతా నీవు రాముని ఒకవేళ ఇంతకు ముందే అడిగి నీ రక్షణ విషయంలో ఆయన అనుమతిని పొందావే అనుకో! అయినా మహాతపో బల సంపన్నుడనైన నన్ను నీవేమి చేయగల్గుతావు?" అంటావా? రావణా! నాకు ఆగ్రహము వస్తే నిన్ను భస్మం చేస్తాను? నన్నేమనుకొంటున్నావు? "ఒక సామాన్య స్త్రీ" అనుకొంటున్నావా? అనాథను అనుకొంటున్నావా? అబలను అనుకొంటున్నావా?

"భస్మార్హ తేజసా":- నా పాతివ్రత్య తేజస్సు ఎటువంటిదో నీకు తెలియదు. ఆ అగ్ని ముందు నీవు నీ తపోబలము మాడిపోవలసిందే?" అని సీతాదేవి రావణుని హెచ్చరించింది.

అయితే రావణునికి వచ్చిన అనుమానము మనకు కూడ వస్తుంది. "సీతా! నీకవసరము కలిగినప్పుడు నీ ఆత్మ రక్షణను నీవు చేసికో అది నాకు సమ్మతమే" అని ఒకవేళ రాముడు సీతాదేవికి ముందుగానే అనుమతి ఇచ్చినా, అప్పుడు మాత్రము సీతాదేవి ఏమి చేయగల్గేది? అసామాన్య తపోబలసంపన్నుడైన రావణాసురుని సీతాదేవి నిజంగా భస్మము చేయగల్గేదా?

మన అనుమానాన్ని ముందుగానే పసిగట్టి, పెద్దలు ఒక సమాధానము కృప జేశారు.

లంకలో అశోకవనాన్ని భగ్నం చేసి, అసంఖ్యాకమైన రాక్షస సేనను హతమార్చిన హనుమను ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రంచే బంధించి రావణుని ముందు నిలిపాక, రావణాజ్ఞతో హనుమ తోకను బట్టలతో చుట్టి, నేయిలో ముంచి నిప్పంటిస్తారు రాక్షస సేవకులు.

ఆ వార్త విన్న సీతాదేవి ఏమి చేస్తుంది? అగ్నిదేవునే ఆజ్ఞాపిస్తుంది. "అగ్నిదేవా? ("శీతో భవ హనూమతః") హనుమంతుని తోకను కాల్చకు. జ్వాలలు ఎగిసి పడుతున్నా, నీవు మాత్రము ఆయనకు చందనము వలె చల్లగా నుండు".

"సీతాదేవి ఆజ్ఞను అగ్నిదేవుడు వింటాడు. ఆమె చెప్పినట్లు చేయకపోతే, ఆమె పాతివ్రత్యాగ్నితోతననే భస్మము చేస్తుందని" భయపడ్డాడు. వెంటనే మంచువలె చల్లబడ్డాడు.

అంతవరకు తన తోకకు తీవ్రమైన బాధను కలిగించిన అగ్ని అప్పుడు ఒకేసారి చందనము వలె ఎలా చల్లబడిందో తెలియక హనుమకు మొదట ఆశ్చర్యము కలుగుతుంది. బుద్ధిమంతుడైన హనుమంతునికి వెంటనే విషయము అర్థమౌతుంది.

తన లంకా ప్రయాణానికి అమోఘమైన ఆశీస్సులను, తన అంగుళీయకాన్ని కృప జేసిన శ్రీరామచంద్రుని అనుగ్రహము, సీతాదేవి చల్లని దయ, ఆ తరువాత తన తండ్రి వాయుదేవుని అనురాగము తనను అగ్నిబాధనుండి కాపాడాయని గ్రహిస్తాడు.

ఇప్పుడు విషయమేమిటంటే "శీతో భవ హనూమతః" అని అగ్ని దేవుని సైతము శాసింపగల సీతాదేవి, "దగ్ధో భవ రావణ!" అని తన పాతివ్రత్య మహత్తుతో శపించిందనుకొండి. అప్పుడు రావణుడు ఒక పెద్ద భస్మరాశిగా మాడిపోయే వాడే కదా!

అందువలన "రావణుని బూడిద చేయగల శక్తి సీతాదేవికి ఉంది" అనడం యదార్థము. అందులో అనుమానమే లేదు. ఆమె తెలిపినట్లు శ్రీరాముని అనుమతి లేనందువలన రావణుని శపించలేదేమో? లేదా సీతాదేవి చల్లని తల్లి కనుక తన బాధలను అన్నిటిని తన పంటి వెనుక దాచుకొని, జాలితో రావణుని భస్మము చేయలేదో?

× × ×

సీతాదేవి విషయం ద్వారా మనకొక ముఖ్య విషయము అర్థమవుతున్నది. జీవులమైన మనకు "ఆకార త్రయమే" ముఖ్యసంపద. "అనన్య శరణత్వము" వేరెవరిని రక్షించుమని కోరకుండడము, ఆకారత్రయములో ముఖ్య భాగము. వేరెవరిని కోరకపోవడంలో – తనకు తాను కూడ తన రక్షణకు పూనుకోకపోవడం ఒక భాగమే. "తదేక రక్ష్యత్వము" భగవంతుని చేతనే రక్షింపబడడము జీవుని లక్షణము అదే సంపద. అదే తన తపస్సు అని సీతాదేవి పేర్కొన్నది.

# రావణాగ్రహము - 16

సీతాదేవి రావణాసురుని హితాన్ని కోరి శ్రీరామునితో మైత్రి చేసికొమ్మని ఉపదేశించింది. ఒకవేళ ఆయన దురభిమానంతో అందుకు అంగీకరించకపోతే రాముని చేతిలో ఘోరమైన వధ తప్పదని తెలిపింది.

ఇంకెక్కడ రాముడు? ఆయన బ్రతికి ఉండడము కల్ల. ఇక్కడికి రావడం అంతకంటే కల్ల. ఇప్పుడైతే సీత తన వంటి ఇంటి కుందేలు. ఆమెకు అనేక ఆశలను చూపి, తన వైభవాన్ని తెలిపి, తనను చేబడితే సీతకు లభించే సుఖాలు, సౌకర్యాలు, అధికారాలు, అన్ని తెలిపి, అవలీలగా ఆమెను వశం చేసికోవాలనుకొన్నాడు. అలా తనంతట తాను సీత తనకు వశం కాకపోతే ఆమె శరీరం ముక్కలు ముక్కలు అవుతుందని హెచ్చరించాడు.

సీతాదేవి రావణుని ప్రలోభాలు తృణప్రాయాలు అని తెలిపింది. తనను అబల, అనాథ అనుకోవద్దని రావణుని శిక్షించడానికి రాముడే రావలసిన అవసరం లేదని, తాను స్వయంగా అతనిని భస్మం చేయగలనని, రామాజ్ఞ లేనందువలన ఆగిపోయావని, ఆయనకు దీటుగా నిర్భయంగా తన శక్తి సామర్థ్యాలను, తన పాతివ్రత్య మహిమను తెలిపింది.

అయితే రావణుడు మూర్ఖుడు. అత్యంత దురభిమాని. ఒక్క ఆడది, అది కూడ అరిపత్ని, తన చేతికి చిక్కి విలవిలలాడుతున్న ఒక అసహాయ తనను అంత నిర్లక్ష్యం చేయడం, తన మాటను ధిక్కరించడం ఆ మూఢునికి నచ్చలేదు. వరిగడ్డి మంటలా ఆయనలోని క్రోధాగ్ని ఒక్కసారి భగ్గుమంది. అప్పుడాయన శ్మశానంలోని చైత్య ప్రతిమ వలె భయంకరంగా కనపడసాగాడు. ఒక్క అబల తనను భస్మం చేయగలుగుతా నంటుందా? ఇక ఆమెను బ్రతుకనీయవద్దు. తన కరవాలానికి ఆమెను బలి ఇవ్వాలి అనుకొని రక్త నేత్రాలతో తన ఖడ్గాన్ని పైకి దూశాడు. ఒక క్షణమాగితే ఏమయ్యేదో?

కాని అంతలోనే రావణుని ధర్మపత్ని మండోదరి ఆయనను ఆలింగనం చేసికొని ఒక్క నరాంగనతో ఆయనకేమి పని అని - ఆయనను కామకేళిలో ఓలలాడించడానికి అనేక సుందరాంగనలు వేయికళ్లతో ఎదిరిచూస్తున్నారని తెలిపింది. ఆమె సాంత్వనంతో రావణాగ్రహాగ్ని చల్లబడింది.

ఆయన రాక్షస పరిచారికలతో సీతాదేవిని జాగ్రత్తగా కాపలాకాయుమని, నయానినో, భయాననో, ఆమె మనస్సును మార్చడానికి ప్రయత్నించుమని ఆదేశించి రాక్షసాంగనలతో తిరిగి వెళ్లాడు.

సూచన:- ఇక్కడ రావణుని లాలించింది "ధాన్యమాలిని అనే అసురస్త్రీ" అని "రావణుని ప్రేయసి" అని ఉంది. కాని హనుమ వానరులతో ఈ సంఘటనను వివరిస్తూ "రావణుని శాంతింపజేసింది మండోదరి" అని తెలిపాడు. ఇద్దరు ఒక్కరేనేమో. రెండు పేర్లు ఒక్కరివేమేనేమో?

-- ఇతిశం --



సీతను బెదిరిస్తున్న రావణుడు

రక్కసి మీది మీదికిని రాకుము - కాకుమంబూది ప్రేమగా - శ్రీ విశ్వనాథ

ఖడ్గంబో యున్నది నీ చేతను - నా యీ యెడ సాచెదను తృణాహిత ఫణితిన్"

- శ్రీ విశ్వనాథ

# సీతాదేవి విషాదము - 17

రాక్షస రాజు ఆజ్ఞననుసరించి ఆయన పరిచారికలు సీతాదేవి మనస్సును మార్చడానికి అనేక రకాల ప్రయత్నించారు. వారందరు - రావణుసురుని మాటను మన్నించక పోవడం సీతాదేవికి ప్రాణాంతకమే అని వివరించారు.

"ఏక జట" అనే రాక్షసి రావణాసురుని వంశగౌరవాన్ని ప్రస్తుతించింది "సీతా! ప్రజా పతులలో నాల్గవవాడు పులస్త్యుడు. ఆయన పౌత్రుడే, విశ్రవసుని కుమారుడే రావణుడు. అటువంటి ఉత్తమ కుల సంజాతుని వరించకపోవడం ఆయుక్తమే" అంది.

ఆ తరువాత "హరిజట" అనే రాక్షసాంగన తన పిల్లి గుడ్లను భయంకరంగా త్రిప్పుతూ "అసమాన పరాక్రముడు, సమర రంగంలో ఓటమి ఎరుగని రావణునికి భార్య కావడం సీతాదేవి అదృష్టమే" అని తెలిపింది.

"వికట" అనే అసురాంగన, "దేవ దానవ గంధర్వాది సమస్త దేవతా విజేత అయిన రావణ ప్రభువు మాట మన్నించక పోవడం మహానేరము" అంది.

"దుర్ముఖి" అనే దైత్యాంగన రావణుని ప్రభావాన్ని వివరించింది. "సీతా! సూర్యుడు, వాయువు, సముద్రుడు, సమస్త భూతాలు రావణుని ఆజ్ఞను మీరకుండా ఉంటాయి. ప్రభువాజ్ఞను మీరితే బ్రతుకడమే దుర్లభమ"ని తెలిపింది.

సీతాదేవి రామచంద్రునే ధ్యానిస్తూ, రాక్షసుల మాటలను పట్టించుకోలేదు. అయినా రాక్షస స్త్రీలు ఆమెను వదలలేదు. "సీతా! నీ భర్త గురించి ఆలోచనలు మాను. మానవ మాత్రుడు, రాజ్యహీనుడు, అటవీ వాసి అయిన నీ మగని గురించి విచారించడం ఆపి, త్రిభువన విజేత అయిన మా ప్రభువు కోరికను మన్నించి అతిలోక అంతఃపుర సౌఖ్యాలను అనుభవించుమ"ని ఒత్తిడి చేయసాగారు.

అప్పుడు పరమపావని అయిన జానకీదేవి, "రాక్షసాంగనలారా! నేను ఒక మానవకాంతను. నా భర్త పురుషశ్రేష్ఠుడు. ఇప్పుడాయన దీనుడు కావచ్చు, రాజ్యహీనుడు కావచ్చు. కాని ఎల్లవేళలా ఆయనే నా భర్త, నా గురువు, నా దేవత".

"దీనోవా, రాజ్యహీనోవా, యోమేభర్తా, సమే గురుః"

లోకంలో పతివ్రతలందరు తమ భర్తలు సంపన్నులైనా, దీనులైనా వారినే అనుసరిస్తారు. ఇంద్రపత్ని శచీదేవి, వశిష్ఠుని ధర్మపత్ని అరుంధతి, చంద్రుని అర్ధాంగి

రోహిణి, సూర్యుని పత్ని సువర్చల, చ్యవనుని భార్య సుకన్య, నలుని ప్రియపత్ని దమయంతి, అగస్త్యుని ప్రియసతి లోపాముద్ర, సత్యవంతుని ప్రియ భార్య సావిత్రి, కపిలుని అర్ధాంగి శ్రీమతి, సౌదాముని సత్పత్ని మదయంతి, సగరుని ధర్మపత్ని కేశిని, వీరందరు పతివ్రతలు. కష్టాల్లో సుఖాల్లో నీడలా భర్తలను అనుసరించారు. నేను కూడ నా భర్తతోనే కలసి జీవించాలనే కోరికతో, తల్లి దండ్రులను, అత్తమామలను, రాజ్యాన్ని, సుఖాలను గడ్డిపోచలా భావించాను. నేనాయనను వదలి మరొక పురుషుని వరించజాలన"ని తెలిపింది.

అప్పుడు వినత అనే మరొక అసురాంగన, "సీతా! నీ పతిభక్తి మెచ్చుకోదగిందే. కాని ఏ విషయమైనా ఒక పరిమితిలో ఉన్నంతవరకు మంచిదే. కాని ఏది అతి అయినా ప్రమాదకరమే.

"సర్వత్రాతికృతం భద్రే। వ్యసనాయోపకల్పతే"

అందువలన మనుష్యమాత్రుడు, నిన్నింతవరకు పట్టించుకోజాలని పౌరుషహీనుడైన భర్తను వదలి రాక్షస భర్తను వరించు లేదా మేమందరము నిన్ను చంపి, ముక్కలు, ముక్కలు చేసి తింటాము" అన్నది.

వికట అనే మరొక వనిత పిడికిలిని బిగించి బెదిరిస్తూ, "సీతా! నూరు యోజనాల దూరంలో, మా అందరి కాపలా మధ్య బద్ధురాలైన నిన్ను దేవేంద్రుడు కూడ రక్షింప జాలడు. అందువలన రావణుని వరించు. ఆయనతో అతిలోక భోగాలను అనుభవించు. అందుకు అంగీకరించక పోతే నీ గుండెలను పెకిలించి తింటాము" అంది.

చండోదరి అనే అంగన, "లేడి పిల్ల వంటి ఈ సీత అవయవాలన్ని నాకు నోరూరిస్తున్నాయి. ఒక్కొక్క దాన్నే ఆరగించాలని ఉంది" అని శూలము త్రిప్పుతూ అంది.

ప్రఘస అనే రాక్షసి, "ఇంకా ఎందుకు ఊరకుండడము? ఈమె గొంతి పిసికి, "చనిపోయిందని", మన ప్రభువుకు చెప్పితే "ఆ శవాన్ని మీరే తినండని మనకు ఆయన అప్పగిస్తాడు. అందులో అనుమానమే ఉండద"ంది.

అజాముఖి, "ఇంకా వాదమెందుకు? ఈమెను చంపి, ముక్కలు చేసి కల్లులో ముంచి, వాటిని తినివేద్దాము" అంది.

శూర్పణఖ – అజాముఖి మాటలను సమర్థించింది. "సురలోముంచి ఈమె శవం ముక్కలను తింటూ, నికుంభిలాదేవి సమక్షంలో నృత్యం చేద్దామ"ని ప్రతిపాదించింది.

ఈ విధంగా భయంకరమైన వారి బెదిరింపు మాటలు వింటూ సీతాదేవి విపరీతంగా విలపించసాగింది.

సీతాదేవి రామ పరమాత్మనే వరించిన ప్రపన్నురాలు. ఆమెను ప్రలోభాలు, బెదిరింపులు ఏమి చేయలేవు. అయినా రాముని నుండి ఆమె మనస్సును మరలించి, రావణుని పట్ల అనుకూలంగా మార్చడానికి రావణుడు, ఆయన పరిచారికలు చేయని ప్రయత్నము లేదు. ఇప్పటి వరకు ఆమెకు రాముని విషయమే తెలియదు. ఇంతటి నిరాశా నిస్పృహల మధ్య కూడ, ఇంతటి విషాదంలో కూడ ఆమె రాముని తప్ప ఇతర విషయాల గురించి ఆలోచించడం లేదు. ఇదే ప్రపన్నుల లక్షణము.

సీతాదేవి ఒకవైపు రాక్షస స్త్రీల మాటలను లక్ష్యం చేయడం లేదు. మరొక వైపు "రామభద్రుడు తననెందుకు కరుణించడం లేదో" అని దుఃఖిస్తుంది. రామలక్ష్మణుల పేర్లను మాటి మాటికి స్మరిస్తూ ఉంది. వాళ్ల తల్లులను కౌసల్యా సుమిత్రలను జ్ఞాపకం చేసికొంటూ ఉంది.

"మృత్యువైనా వస్తే బాగుండేది" అనుకొంటున్నది. "కాని అది కూడ కాలాను కూలంగానే వస్తుంది కదా!" అని నిట్టూరుస్తు ఉంది. శ్రీరాముని విడిచి తాను ఇంతకాలము బ్రతికి ఉన్నానే అని బాధపడుతుంది.

అయ్యో స్త్రీ జన్మ పరతంత్రము కదా! నాథుని అనుమతి లేకుండా ప్రాణాలను వదలానికి కూడ వీలులేదు కదా" అని కుమిలి పోతుంది.

తనను రావణుడు అపహరించి తేవడం, ఆయనతో పాటు ఈ రాక్షసాంగనలు తనని అపరిమితంగా బాధపెడుతుండడము చూచి బాధపడసాగింది.

తాను రావణుని తన వామపాదంతో కూడ తాకబోనని స్పష్టం చేసింది.

జనస్థానంలో దుర్మార్గులైన పద్నాల్గువేల రాక్షసులను మూడు గడియలలో మసి చేసిన మహావీరుడైన రాముడు సముద్రం అవుతల ఉన్న లంకలోకి రాలేడా? తనను రక్షింప జాలడా? ఈ సముద్రము ఆయన బాణాలకు అడ్డమా? ఇంతవరకు నా జాడ తెలియక ఉపేక్షించాడు కాని, జాడ తెలిశాక రావణుని ఉపేక్షిస్తాడా? అని బాధపడ సాగింది.

ఆయన లంకలోకి వచ్చి రావణాదులను హతమారిస్తే రాక్షసపత్నులందరు తన వలె ఏడుస్తుంటారు అనుకొంది.

కాని "అంతదాకా తనను ఈ రాక్షసాంగనలు వదలిపెట్టుతారా? గడువు పూర్తి కాగానే తనను ముక్కలు చేసి వంటవారు రావణాసురుని ప్రాతర్భోజనానికి పంపరా?" అని భయపడింది. అంతవరకు ఆగడం కంటే తానే స్వయంగా మరణిస్తే బాగుంటుండేమో అనుకొంది. కాని తన ఆత్మహత్య ఎలా జరుగగల్గుతుంది? తనకెవ్వరైనా విషమిస్తే బాగుండేది కదా? అనుకొంది. కాని మనుష్యులకు అందులో స్త్రీలకు స్వతంత్రంగా చావడం కూడ నేరమే కదా!" అని వాపోయింది.

ఆత్మహత్య మహాపాపము. అది మరుజన్మలో మరింత అధిక దుఃఖానికి కారణమవుతుంది.

మనము పూర్వజన్మలలో కొన్ని పాపాలు, కొన్ని పుణ్యాలను చేసి ఉంటాము. వాటిని "సంచితకర్మలు" అంటారు. వాటిలో కొన్నిటిని ఈ జన్మతో అనుభవించుమని భగవంతుడు మనను ఈ లోకంలోకి పంపించాడు. వాటినే "ప్రారబ్ధ కర్మలు" అంటారు.

సాధారణంగా సుఖాలను అనుభవించడానికి సంతోషంగా ముందుకు వస్తాము. కాని కష్టాలను అనుభవించడానికి అంగీకరించము.

కాని సుఖదుఃఖాలు ద్వంద్వాలు. వాటిలో ఒకటి తర్వాత మరొకటి తప్పక వస్తుంది. చీకటి వెలుగుల లాంటివి. "ఏదో ఒకటి అనుభవిస్తాము. కాని మరొకటి అనుభవించము" అనడానికి వీలు లేదు.

"శీతోష్ణ సుఖదుఃఖదాః – ఆగమాపాయినో2 నిత్యాః

తాన్ తితిక్షస్వ భారత" అని కృష్ణభగవానుడు అర్జునునికి బోధిస్తాడు.

ఈ రహస్యము తెలిసిన వారు జ్ఞానులు. వారే ప్రపన్నులు. సుఖాలను అనుభవించడంలో సంతోషము ఉండవచ్చు. దుఃఖానుభవం కష్టంగా ఉండవచ్చు. కాని రెండింటిని అనుభవించే తీరాలి. ఆ రెండింటిని కూడ భగవత్కృపే "అతువుం ఆవన్ తిన్నరుళే" అనుకోవాలి. అలా అనుకొని దుఃఖానుభవానికి వెనుదీయని వారు శ్రేష్ఠులు. అటువంటి వారు భగవంతుడు విధించిన ఈ జీవిత పరీక్షలో ఉత్తీర్ణులై భగవత్ప్రియు లౌతారు.

కష్టాలకు భయపడి, వాటిని అనుభవించకుండా ప్రాణాలను బలవంతంగా తీసికొనేవారు ఈ జీవిత పరీక్షలో ఉత్తీర్ణులు కాలేక మరుజన్మలలో భగవంతుని కృపకు దూరులై, మరిన్ని కఠిన పరీక్షలకు, మరిన్ని భయంకర కష్టాలకు గురి అవుతారు.

అంతేకాదు తమకు ఈ కష్టాలు రావలసినవి కావని, భగవంతుడు తమకు అన్యాయం చేస్తున్నాడని, దయాహీనుడని కొందరు అజ్ఞానులు అనుకొంటారు "నైర్ఘృణ్య మారోప్యతే".

కాని భగవంతుడు సర్వోన్నత న్యాయమూర్తి మాత్రమే కాదు. సర్వోత్తమ న్యాయమూర్తి కూడ.

"నమే ద్వేష్యోఽస్తి, నప్రియః" తనకు ఎవ్వరు ప్రత్యేకంగా దగ్గరివారు కారు, ఎవ్వరు దూరం కాదు" అంటాడు గీతాచార్యుడు.

"గతిర్భర్తాప్రభుస్సాక్షీ, నివాసశ్శరణం సుహృత్" అంటుంది స్మృతి "సుహృత్, గతిర్నారాయణః" అంటుంది శ్రుతి.

ఆయన అందరి పట్ల దయగలవాడే. కాని మన కర్మలు అలా ఉంటే ఆయన మాత్రము ఏమి చేస్తాడు? "రోగగ్రస్తుడైన కొడుకును చూచి కన్నీరు కార్చే తండ్రి లాగా మన దుఃఖాలను చూచి బాధపడుతాడు దయామయుడైన సర్వలోకపిత.

-- ఇతిశం --

"కామిను లొక్కని వీడి, యొక్కనిం గదిసెదరు
ఏమి సేసెదరు? కాని పరిస్థితులేగు దెంచినన్" - విశ్వనాథ

జలధులేడును ఇంకిన, జలజబంధుడొక్క
మసి బొగ్గుగానైన - నుర్వియెల్ల చిల్లిపెంకుగా
నగు స్థితియునైన నతడు పతి, నేను భార్యనే" - విశ్వనాథ

మానవ కాంతలన్న జన మానసులౌటయులేదు - విశ్వనాథ

"రాముడు సాలంబు; నేను లతను
రాముడు వీణియ - నేను తీగ
తాను సూర్యుడు - నేను వెలుగ
అతండు దైవము - భక్తురాలను నేనున్"
- విశ్వనాథ

# త్రిజటాస్వప్నము - 18

సీతాదేవి "తాను రావణుని కొనకంటితో కూడ చూడను, కాలుగోటితో కూడ తాకను" అని తన నిశ్చయాన్ని తెలిపింది. ఈ విషయాన్ని ప్రభువుకు నివేదించాలని కొందరు రాక్షస స్త్రీలు, రావణుని దగ్గరకువెళ్లారు.

మరికొందరు సీతాదేవి ఏడ్పును కూడ పట్టించుకోక మరింతగా బెదిరించసాగారు.

అంతవరకు "త్రిజట" అనే రాక్షసాంగన నిద్రా స్థితిలో ఉండి పోయింది. అప్పుడే నిద్ర నుండి లేచి ఆ రాక్షసాంగనలకు తన భయంకర స్వప్నాన్ని తెలుపసాగింది.

"ఓ దుష్టులారా! ఆగండి, సీతాదేవిని ఏమి అనకండి. మీకు నిజంగా తినాలని ఉంటే నన్ను తినండి. కాని మీరు ఆ దేవిని మరొకమాట అన్నారో, మీ ప్రాణాలు నిలువవు. నేనీ విధంగా మీతో అనడానికి కారణము ఇంతవరకు నేను కన్న కలే" అని తెలిపింది.

రాక్షస స్త్రీలు సీతాదేవిని బాధించడం ఆపి, త్రిజట వైపు తిరిగి "నీవేమి కలకన్నావో అది మాకు కూడ స్పష్టంగా చెప్పుమని" నిర్బంధించారు.

త్రిజట తన స్వప్న వృత్తాంతాన్ని తెలుపడం ఆరంభించింది. "స్నేహితులారా! నేనింతవరకు రాక్షస వినాశసూచకమైన ఒక భయంకర స్వప్నాన్ని అనుభవించాను.

ముందుగా నా కలలో రామలక్ష్మణులు కనబడ్డారు. వారు తెల్లని వస్త్రాలు ధరించి వేయి హంసలు మోస్తున్న ఒక పల్లకిలో కూచొన్నారు.

సీతాదేవి సముద్ర మధ్యలో ఒక పర్వతముపై ధవళ వస్త్రాలను ధరించి కూచొని ఉంది.

రామలక్ష్మణులు పల్లకిలో సీతాదేవి వద్దకు వచ్చారు. సీతాదేవి రామునితో ప్రభసూర్యుని కలసినట్లు కలిసింది" అని ఆపింది.

ఆమె మళ్లీ తన కలను తెలుపసాగింది "నాలుగు దంతాలు గల ఒక ఏనుగుపై తెల్లని బట్టలుగల రామలక్ష్మణులు కూచొని వచ్చారు. కొండ శిఖరముపైనున్న సీతాదేవి వద్దకు ఆ ఏనుగు రాగానే, సీతాదేవిని ఆ ఏనుగుపైకి రాముడు ఎక్కించుకొన్నాడు. అప్పుడు సీతాదేవి సంతోషంతో ఆకాశంలో సూర్యచంద్రులిద్దరిని తన చేతులతో ముట్టుకొంది" అని ఆపింది.

తరువాతి స్వప్నభాగాన్ని తిరిగి త్రిజట వివరింపసాగింది: "సీతారామలక్ష్మణులు ఎనిమిది ఎద్దు లాగే రథముపై కూచొన్నారు. తరువాత వారే పుష్పక విమానమెక్కి ఉత్తరము వైపు వెళ్లసాగారు. రాముడు సురాసురులెవ్వరికి జయింప శక్యమైన వాడు కాదు" అని ఆపింది.

"ఇక మన ప్రభువు రావణుడు, ఆయన కొడుకు ఇంద్రజిత్తు, సోదర విభీషణ, కుంభకర్ణుల గురించి కలలో చూచింది చెప్పుతున్నాను వినండి"

"రావణుడు నేలపై ఎఱ్ఱని బట్టలు కట్టుకొని, త్రాగి, మదించి, ఎఱ్ఱని గన్నేరు పూలదండను ధరించి నూనెలో పడిపోయాడు. పుష్పక విమానం నుండి తోయబడి నూనెలో పడిపోయాడు".

"రావణుని నున్నని గుండు, నల్లని బట్టలు గల ఒక ఆడది ఈడ్చుకొంటూ వెళ్లింది".

"గాడిదల రథములో ఎఱ్ఱని బట్టలు ధరించి, ఎఱ్ఱని చందనాన్ని పూసుకొని త్రాగుతూ, రావణ ప్రభువు నవ్వుతూ, తూలుతూ, తేలుతూ దక్షిణ దిశకు పోయాడు".

మళ్లీ గాడిదల నెక్కి దక్షిణం వైపు వెళ్లుతుండగా భయంతో గాడిదపై నుండి తలక్రిందులుగా పడిపోయాడు.

మళ్లీ లేచి పిచ్చివానివలె బట్టలు ఊడిపోగా దిగంబరుడై నీచమైన మాటలు మాట్లాడుతూ దుర్గంధముతో నిండిన ఒక మలకూపంలో పడి మునిగిపోయాడు. నల్లని ఎఱ్ఱని బట్టలను కట్టుకొని, బురద పూసుకొన్న ఒక ఆడది ఆయనను ఈడ్చుకొని దక్షిణం వైపు వెళ్లింది.

నూనెను పూసుకొని రావణుడు పందిపై, ఇంద్రజిత్తు శింశుమారంపై, కుంభకర్ణుడు ఒంటెపైనెక్కి దక్షిణం వైపు వెళ్లారు.

ఒక్క విభీషణుడు మాత్రమే తెల్లని బట్టలు, తెల్లని గొడుగును ధరించి, తెల్ల చందనాన్ని పూసుకొని, మంగళ వాద్యములైన శంఖ, దుందుభుల ధ్వనులతో, నృత్తగీతాలతో, పర్వతముపై నాలుగు కోరలు గల ఏనుగుపై ఎక్కి ఉన్నాడు. నలుగురు మంత్రులు, ఆయనతో కలసి ఆకాశంలో నిలబడ్డారు.

గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలు, గోపురాలు, తోరణాలు అన్నీ విరిగి తెగి సముద్రంలో పడిపోయాయి.

రాముని దూత అయిన ఒక కోతి లంకను కాల్చివేశాడు. నూనెత్రాగి, నృత్యం చేస్తూ, నవ్వుతూ రాక్షసాంగనలు లంకలో తిరుగుతున్నారు. కుంభకర్ణాదులు రక్త వస్త్రాలను ధరించి గోవు యొక్క పెండమడుగులో పడిపోయారు" ఇదిగో! ఇంతటి చెడ్డ కల వచ్చింది చూచారా? ఇప్పుడైనా అర్థమైందా సీతాదేవి మహిమ? ఆమె శుభ భవిష్యత్తు ఇప్పుడైనా! అర్థమైందా మనకు దాపురించబోయే దుస్థితి?

అందువలన సీతాదేవిని భయపెట్టడం మాని, ఆమె దయకై ప్రార్థించండి. ఆ తల్లి చల్లని తల్లి. శరణు వేడిన వారిని కాపాడే దయామయి.

"ప్రణిపాత ప్రసన్నాహి। మైథిలీ జనకాత్మజా

అలమేషా పరిత్రాతుం। రాక్షస్యో మహతోభయాత్"

ఒక్క నమస్కారం చేస్తే చాలు. కరిగిపోయి, మనందరిని మహద్భయాన్నుండి కాపాడగల్గుతుంద"ని తెలిపింది.

-- ఓం తత్సత్ --

త్రిగలేని పిల్లి - తా పాల బోర్ల ్రోసి కొన్నదట - విశ్వనాథ

తిమ్మిరివాయ, గోసికొని తిందుమెు, నిన్నిపు దోసియోసి,
నీ యమ్మ మగండొ? నీ మొగండొ? అడ్డము వచ్చెదుచూతమీ
- శ్రీ విశ్వనాథ

"ప్రాణములెట్లు బోవునవె, ప్రాణములేగక మున్ను
రామ భుజాని మనోహరాంగమెుకసారి కనుంగొని
పోవ బాధ లేదు" - శ్రీ విశ్వనాథ

"రాముడు ప్రయోజకులందు ప్రథమమూర్తి" - విశ్వనాథ

# స్వప్న విశ్లేషణము - 19

త్రిజట విభీషణుని కూతురు. విభీషణుడు రహస్యంగా రామభక్తుడు. రామపత్నిని రావణుడు అపహరించి తేవడం విభీషణునికి ఇష్టం లేదు. ఆ విషయంలో ఆయన తన అన్న అయిన రావణునికి అనేక విధాలుగా చెప్పి చూచాడు. కాని నిరంకుశుడైన రావణుడు విభీషణుని మాటవినలేదు. తనకు ఇష్టం గాని మాటలను ఎవ్వరు చెప్పినా రావణుడు వినడు. అందువలన ఆ విషయంలో ప్రస్తుతానికి తన ప్రయత్నాన్ని విభీషణుడు మానుకొన్నాడు.

అశోకవనంలో ఉన్న సీతాదేవి దగ్గరకు తన కూతురు త్రిజటను పంపి సీతాదేవికి ఎల్లవేళలా చేదోడువాదోడుగా ఉండి ఆమె దుఃఖాన్ని కొంతవరకైనా తగ్గించుమని త్రిజటకు విభీషణుడు తెలిపాడు.

త్రిజటకు రావణుడు పెద్దనాన్న. అయినా ఆయన తమోగుణము ఆమెకు నచ్చలేదు. "త్రిజట" అంటే మూడు జడ (పాయ)లు కలది. ఆమెకు తన తల దువ్వుకొని వెంట్రుకలను చక్కగా ముడుచుకోవడం అంత ఇష్టమైనది కాదు. అందువలన తన తల వెంట్రుకలను ఊరకే వదలివేసింది. అవి మూడు జడలుగా కట్టాయి.

మూడు జడలు అంటే మూడు గుణాలు అవే (1) సత్వము (2) రజస్సు (3) తమస్సు. ఈ మూడు గుణాలు జడలు కట్టాయి అంటే అవి తమ ప్రకాశాన్ని, ప్రభావాన్ని కోల్పోయాయి. అందువలన "త్రిజట" అంటే "త్రిగుణాతీత" అని అర్థము.

ఆమెకు రామలక్ష్మణులు వేయిహంసలు మోసే పల్లకి పై వచ్చి సీతాదేవితో కలసినట్లు, భద్రగజముపై వచ్చి సీతాదేవిని వారు ఎక్కించుకొన్నట్లు, ఎనిమిది ఎద్దులాగే రథముపై ఆమెతో సహా అధిరోహించినట్లు. పుష్పకవిమానంపై వారు ముగ్గురు కలసి ఉత్తర (అయోధ్యా) దిశకు వెళ్లిపోయినట్లు కలవచ్చింది.

అంటే లంకలో రావణుని సంహారము తరువాత సీతారామలక్ష్మణులు పుష్పక విమానంలో అయోధ్యకు చేరుకొంటారని అర్థము.

రథముపై, నాలుగు దంతాలుగల భద్రగజముపై ఎక్కివెళ్లారు అంటే సీతారామచంద్రులకు పట్టాభిషేకం జరుగుతుందన్నమాట.

అలాగే విభీషణుడు ధవళ (తెల్లని) వస్త్రాలను ధరించి తెల్లని గొడుగు ధరించాడంటే "శ్వేతచ్ఛత్రము" రాజలాంఛనం కనుక రావణ వధానంతరము లంకా సామ్రాజ్య

పట్టాభిషేకము జరిపించుకొంటాడని అర్థము. ఇది రామభక్తుడుగా విభీషణుడు రామభద్రుని నుండి అందుకోబోయే సన్మానానికి సూచకము.

ఇక రావణుడు, ఇంద్రజిత్తు, కుంభకర్ణుడు ఎఱ్ఱని వస్త్రాలు, గన్నెరుపూల మాలలను వేసికొని, నూనె త్రాగుతూ, దక్షిణ దిశకు ఒక వికృత స్త్రీతో ఈడ్చుకపోబడుతున్నారంటే మృత్యుదేవత చేతిలో చిక్కుకుంటున్నారని, దక్షిణ దిశలో ఉండే శ్మశానానికి వెళ్లుతారని అర్థము.

ఇది సంగ్రహంగా త్రిజటా స్వప్న విశ్లేషణ.

అయితే కల అంటే కల్లలేక అసత్యమని అంటారు కదా! మరి త్రిజటా స్వప్నానికి అంత ప్రాధాన్యం ఇవ్వడం దేనికి? అనే ప్రశ్న కలుగుతుంది. అందువలన కలయొక్క విశేషాలు. కలలోని విషయాల వాస్తవత, అవాస్తవతల గురించి కొంత పరిశీలిద్దాము.

"స్వప్నము యొక్క ఫలితాలు నిద్ర లేచిన తరువాత నిజంగా జరుగుతాయా లేదా?" అనే విషయము స్వప్న సమయాన్ని బట్టి ఉంటుంది. కల ఏ మధ్యరాత్రో లేదా అంతకు ముందో వచ్చిందనుకొంటే ఆ ఫలితాలు నిజమయ్యే అవకాశాలు లేనట్టే.

మధ్యరాత్రి తరువాత వస్తే అవి నిజం కావచ్చు. అయితే తెల్లవారడానికి చాల ముందు వస్తే ఫలితాలు నిజం కావచ్చు. కాని అవి తొందరగా కలుగకపోవచ్చు. తెల్లవారేముందే కలవస్తే దాని ఫలితాలు నిజమవడమే కాక అవి తొందరలోనే కల్గుతాయి. ఇవి స్వప్న శాస్త్ర నియమాలు.

త్రిజటకు వచ్చిన కల తెల్లవారే సమయంలో వచ్చింది. అందువలన ఆ స్వప్న ఫలము యదార్థము. అంతేకాదు ఆ ఫలితాలు కొద్ది కాలంలోనే కలుగుతాయని అర్థము.

1) ఇక స్వప్నమంటే అది ఎప్పుడు వచ్చినా అసత్యమని నాస్తికులు అంటారు. అద్వైత వేదాంతులు కూడ అదే అంటారు. "కల ఎలా అసత్యమో, ప్రపంచం కూడ అలాగే అసత్యమని" జగన్మిథ్యావాదులు అంటారు.

2) మనము తెలివితో (జాగ్రత్ దశలో) ఉన్నప్పుడు ఏవేవి బలంగా అనుకొంటామో, కోరుకొంటామో అవే స్వప్నంలో కనబడుతాయని మరికొందరు అంటారు.

ఏనుగు ఎక్కి ఊరేగినట్లు కలవస్తే ఏనుగును ఎక్కి రాజుగా ఊరేగాలని మనకు మనస్సులో చాల బలంగా ఆ కోరిక నాటుకొందని అర్థము. ఆ కోరిక కలలో వచ్చి తీరింది.

3) "స్వప్నము కూడ యదార్థమే" అని మరికొంతమంది (విశిష్టాద్వైత వేదాంతుల) అభిమతము.

స్వప్నంలో చూచినవి తెలివికి వచ్చాక ఉండవు కదా. అటువంటప్పుడు స్వాప్నిక విషయాలు సత్యమని ఎలా చెప్పడమని ప్రశ్న?

దానికి సమాధానమేమిటంటే – అన్ని విషయాలు అన్ని కాలాలలో సత్యం కావలసిన అవసరము లేదు. అంతమాత్రాన ఆ కాలంలో జరిగినవి అబద్ధాలు అనడానికి వీలు లేదు.

ఉదా:- తల్లి కడుపులో పిండాకారంగా ఉన్నప్పటి దశ శిశువు జన్మించినప్పుడు ఉంటుందా? అలాగే బాల్యదశలోని స్థితి, కౌమార, యౌవన, వృద్ధాప్య దశలలో ఉండదు కదా! అంతమాత్రాన పిండదశ, బాల్యము అసత్యమా? కాదు కదా! బాల్య, కౌమార, యౌవన, వృద్ధాప్యాలు అన్ని సత్యమే.

అలాగే మనము తెలివితో ఉండే జాగ్రద్దశ, స్వప్నదశ, గాఢనిద్రా (సుషుప్తి) దశ అన్ని నిజాలే. అయితే అవి ఆ యాదశల వరకే పరిమితము. స్వప్నదశలో కూడ జాగ్రద్దశలోని పరిస్థితులు ఉండవు. అంతమాత్రాన జాగ్రద్దశ కూడ అసత్యమేనా? కాదు కదా! జాగ్రద్దశ ఎలా సత్యమో, స్వప్నదశ, సుషుప్తి దశలు కూడ అలాగే సత్యములే.

సత్యములైనవన్ని నిత్యాలు కూడ కావాలని ఎక్కడా నియమము లేదు. భగవంతుడొక్కడే సత్యము, నిత్యము కూడ. ప్రాపంచిక విషయాలు సత్యాలు కావచ్చు. కాని నిత్యాలు కావు.

అందువలన స్వప్న విషయాలు కూడ సత్యాలే. కాని నిత్యాలు కావు. అందువలననే స్వప్న విషయాలు మెలుకువ వచ్చాక ఉండవు.

4) I) ఇక స్వప్న విషయాలు కొన్ని మెలకువ వచ్చాక కూడ నిజంగా జరుగవచ్చు. ఉదాహరణకు భరతునికి దశరథ మహారాజు చనిపోయినట్లు కేకయ రాజ్యంలో కలవచ్చింది. ఆ విషయం కల తరువాత కూడ సత్యమైంది.

II) పాశ్చాత్యులు కూడ కలలు నిజమే అని అంగీకరిస్తారు. వారి సాహిత్యము ఆ విషయాన్ని ధృవపరుస్తుంది. ఉదా:- జూలియస్ సీజరు భార్యకు ఒక దుస్స్వప్నము వస్తుంది. అందులో తన భర్త పార్లమెంటులో పొడవబడి మరణిస్తాడని ఉంటుంది. అందువలన ఆమె తన భర్త సీజర్‌ను పార్లమెంటుకు వెళ్లవద్దని బలవంతం చేస్తుంది.

పార్లమెంటులో ఆయనను చంపాలనుకొనే వారిలో బ్రూటస్ అనే సీజర్ మిత్రుడు కూడ ఉంటాడు. బ్రూటస్ సీజర్ ఇంటికి వచ్చి కల విషయం విని నవ్వి, సీజర్ భార్య వద్దని వారించినా వినక సీజర్‌ను తీసికవెళ్లి ముందుగా అనుకొన్నట్లే పార్లమెంటులో అందరితో కలసి చంపుతాడు.

ఇప్పుడు చెప్పండి. సీజర్ భార్య కల నిజమా? అబద్ధమా? భరతుని స్వప్నము అసత్యమా? సత్యమా? సత్యమే కదా! అలాగే త్రిజటా స్వప్నము కూడ త్వరలోనే సత్యము కాబోతుంది. "సూచకశ్చ" అన్నట్లు కొన్ని కలలు భవిష్యత్తును సూచిస్తాయి.

5) స్వప్న విషయాలన్ని మెలకువ వచ్చాక నిజం కానక్కర లేదు. అయితే అటువంటి స్వప్నాలకు ఏ విలువ లేదా? అప్పుడు కూడ స్వప్నానికి ఒక పరమార్థము ఉందంటారు పెద్దలు.

మనము కొన్ని చిన్న పాపాలు, కొన్ని చిన్న పుణ్యాలు కూడ చేస్తాము. ఆ చిన్న కర్మల ఫలము అనుభవించడానికి మరొక జన్మ అక్కరలేదు. ఆ కొద్ది అనుభవాన్ని స్వప్నము ద్వారా అనుభవిస్తాము.

కలలో పాము కాటువేయడం, ఏనుగు పూల మాల వేయడం మొదలైన స్వప్నానుభవాలు అటువంటివే. స్వప్నాల అనుభవము భగవదధీనమే.

-- ఇతిశం --

"స్వప్నమంటే అదెప్పుడు వచ్చినా అసత్యమే"

"స్వప్నమెలా అసత్యమో, జగత్తు కూడ అలా అసత్యమే"

"స్వప్నము కూడ యదార్థమే"

"సత్యాలన్ని, నిత్యాలు కావలసిన అవసరం లేదు"

"త్రిజట అంటే త్రిగుణాతీత"

# శుభ శకునాలు - ౨౦

త్రిజట తన కలలోని విషయాలు చెప్పి రాక్షసులందరితో కలసి సీతాదేవిని శరణు వేడింది. త్రిజటా స్వప్నము విన్నాక సీతాదేవికి కొంత దుఃఖము తగ్గింది.

“భవేద్యది తత్తథ్యం - శరణం హి భవేయంవః” త్రిజటా! “నిజంగా నీ స్వప్నము యదార్థమే అయితే మీకు ఏ ఆపద రాకుండా నేను కాపాడుతాను” అంది. వాళ్లందరికి అభయమిచ్చింది, ఆ దయామయి.

త్రిజట సీతాదేవి గురించి ఇంకా వివరిస్తున్నది. సీతాదేవి శరీరంలో దుఃఖము వలన కొంత కాంతి తగ్గినా ఆమె అవయవాలలో ఏ మార్పు రాలేదు. ఇవన్ని శుభసూచకాలే.

అంతేకాదు అదిగో ఆ చెట్ల కొమ్మల మీద శుభసూచకంగా పింగళ పక్షి అరుస్తున్నది. ఆ పక్షి కూత “సీతా! నీ భర్త త్వరలో వచ్చి నీతో కలుస్తాడు. నీకు శుభము కలుగుతుంది. ఇక నీకు విచారము అక్కరలేదని ఓదారుస్తున్నట్లు ఉంది. అంతేకాదు లంకలోనికి రాబోయే రామచంద్రునికి స్వాగతము పలుకుతున్నట్లు ఉంది కదా!” అని త్రిజట వివరించింది.

పింగళ పక్షి కూతను వాల్మీకి కవీంద్రుడు అత్యంత సుందరంగా వర్ణించాడు.

“పక్షీచ శాఖా నిలయః ప్రహృష్టః పునః పునశ్చోత్తమ సాంత్వవాదీ।
సుస్వాగతాం వాచ ముదీరయానః పునః పునశ్చోదయతీవ హృష్టః”

పింగళపక్షి ప్రహృష్టంగా (అత్యంత సంతోషంగా) శాఖా నిలయంగా (చెట్టు కొమ్మపై కూచొని) ఉంది. సీతాదేవికి సాంత్వ (ఓదార్పు) వాక్యాలను పునః పునః పలుకుతున్నది. (రామభద్రునికి) స్వాగత వాక్యాలను కూడ మాటి మాటికి పలుకుతున్నట్లున్నది. ఇది ఈ శ్లోకం యొక్క సాధారణ అర్థము.

అయితే ఈ పక్షి పలుకులకు ఇంతే అర్థమయితే ఈ శ్లోకాన్ని వ్రాయడానికి వాల్మీకి అంతటి కవి అవసరము లేదు. అంటే వాల్మీకి శ్లోకానికి ఇంతకంటే విశేషార్థము తప్పక ఉండాలి కదా!

ఈ శ్లోకంలో "శాఖానిలయమైన పక్షి" అని ఉంది కదా! ఇప్పుడు

1) పక్షీ అంటే – "శాఖా నిలయః" అంటే విశేషార్థము ఏమిటి? "శాఖానిలయపక్షి" అనే శబ్దాలు శింశుపా వృక్షముపై కూచొని ఉన్న హనుమను సూచిస్తున్నాయి. రామ పరమాత్మ పంపిన దూత అయిన ఆచార్య హనుమను సూచిస్తున్నాయి.

ఆచార్యుడు కూడ పక్షియే. పక్షి అంటే రెక్కలు (పక్షములు) కలది అని అర్థము కదా! ఆచార్యునికి రెక్కలు అంటే జ్ఞానానుష్ఠానాలు అని అర్థము. పక్షి రెక్కలతో ఆకాశంలో ఎలా ఎగురగల్గుతుందో, ఆచార్యుడు కూడ జ్ఞానానుష్ఠానాలతో (ఆకాశంలో) భగవద్విషయంలో అలాగే విహరించగల్గుతాడు.

"పక్షీ" అంటే ఆచార్యుడని అర్థమైతే "శాఖానిలయః" అంటే విశేషార్థమేమిటి? ఆచార్యుడు వేదాన్ని అధ్యయనం చేస్తాడు. అయితే వేదము అనంతమైనది. అందువలన అనంతమైన వేదాన్ని అందరు పూర్తిగా అధ్యయనం చేయడం సాధ్యము కాదు. మరి మొత్తము వేదము ఎలా నిలువాలి? దీనికి సమాధానంగా ప్రతి బ్రాహ్మణుడు వేదంలోని తన ఒక్క శాఖనైనా అధ్యయనం చేయాలనే నియమము ఏర్పడింది. అందువలన "ఋక్ శాఖా ధ్యాయీ", యజుశ్శాఖాధ్యాయీ" అనే పేర్లు ఏర్పడ్డాయి.

ఇప్పుడు "శాఖానిలయః" అంటే స్వశాఖను అధ్యయనం చేసినవాడు అని అర్థము. మొత్తము "శాఖానిలయః పక్షీ" అంటే స్వంత శాఖను అధ్యయనం చేసిన ఆచార్యుడు అని అర్థము.

హనుమ సూర్యభగవానుని వద్ద వేదాన్ని అధ్యయనం చేశాడు. రాముని దూతగా వచ్చాడు. కనుక "పక్షీచ శాఖానిలయః" అంటే వేదాధ్యయనం చేసిన హనుమ అని అర్థము.

"ఆచార్యోవేద సంపన్నః", "శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం" అనే శబ్దాలు ఆచార్యుడు వేదాధ్యయన సంపన్నుడు కావాలని తెలుపుతాయి.

3) ప్రహృష్టః :– ఆచార్యుడు భగవంతుని స్మరిస్తూ – ఆ ఆనందంలోనే తన్మయుడై ఉంటాడు. సంసారంలో సుఖదుఃఖాలు రెండు రకాలు ఉన్నా వాటిని అంతగా పట్టించుకోడు. కనుక అవి ఆయనను అంతగా ప్రభావితుని చేయవు.

ఆచార్యుడు భగవదానందంలో తన్మయంగా ఉంటాడని స్మృతి వివరిస్తుంది.

"అహ్లాద శీతనేత్రాంబుః। పులకీకృత గాత్రవాన్।
సదాపరగుణావిష్టః। ద్రష్టవ్యః సర్వదేహిభిః"।

ఆచార్యుడు పరుడైన భగవంతుని గుణానుభవంతోనే ఉంటాడు. ఆ గుణానుభవము ఆయన కళ్లల్లో ఆనందాశ్రువులను నింపుతుంది. ఆయన శరీరంలో పులకాంకురాలను కలిగిస్తుంది.

ఇప్పుడు సీతాదేవిని అశోకవనంలో కనులార చూచిన ఆనందంలో సంతోషంతో హనుమ ఉన్నాడు. కనుక ఆయన ప్రహృష్టుడు. అత్యధిక సంతోషంతో ఉన్నాడు. అలాగే రాముని రూపాన్ని, నామాన్ని అనుసంధించుకొంటూ ఆనందంతో ఉన్నాడు.

4) పునః పునశ్చోత్తమ సాంత్వవాదీ:- మాటిమాటికి ఓదారుస్తు ఉన్నాడు.

ఆచార్యుడు సంసారుల దుఃఖాన్ని చూచి భగవత్కృప వలన వారి దుఃఖము ఇంకెంతో కాలము ఉండని, తగ్గిపోతుందని ఓదారుస్తాడు.

హనుమ కూడ శ్రీరాముని వార్తను తెలిపి సీతాదేవిని ఓదార్చబోతున్నాడు.

5) సుస్వాగతం వాచం ఉదీరయానః:- స్వాగత వాక్యాలను పక్షి పలుకుతుంది.

ఆచార్యుడు కూడ భగవంతుని ఆశ్రయించే సంసారులకు స్వాగత వాక్యాలను పలుకుతాడు. లేదా తనకు చక్కగా సంప్రదాయంగా వచ్చిన మంత్రాన్ని శిష్యులకు ఉపదేశిస్తాడు.

హనుమ "సీతారాముల" కలయిక జరుగబోతుందని తెలిపి వారి కలయికకు స్వాగత వచనాలను పలుకబోతున్నాడు.

హృష్టః:- శిష్యుల ఆనందాన్ని కోరుకొని సంతోషించేవాడు ఆచార్యుడు. హనుమ సీతాదేవి ఆనందాన్ని కోరుకున్నాడు.

సీతాదేవికి చెట్టు కొమ్మపై పింగళపక్షి కూస్తుంటే ఆమె ఎడమ కన్ను, ఎడమ భుజము, ఎడమ తొడ అదురుతున్నాయి. ఆడవాళ్లకు వామభాగము స్ఫురించడం శుభసూచకం కదా!

అలాగే ఆచార్యుడు (రాముని దూత) అయిన హనుమ వాక్యాలతో రామసమాచారము తెలిసి, సీతాదేవికి శుభం కలుగుబోతున్నదని ఆమె వామ భాగస్పందనము సూచిస్తున్నది.

-- ఇతిశం --

# సీతాదేవి పరితాపము-21

సీతాదేవికి పింగళ పక్షి కూజితము కొంత ఉత్సాహాన్ని కలిగించింది. అలాగే వామాంగ స్ఫురణము (ఎడమ భాగము అదురుట) మనస్సులో సంతోషాన్ని కలిగించింది.

అయితే ఆ సంతోషోత్సాహాలు కొద్దికాలమే ఉన్నాయి. రావణుని మాటలు, రాక్షస స్త్రీల బెదిరింపులు జ్ఞాపకం రాగానే ఆమె సంతోషోత్సాహాలు ఆవిరి అయిపోయాయి. అనంతమైన దుఃఖసాగరాన్ని తరించడం ఎలాగో ఆమెకు అర్థం కాలేదు. ఆ మార్గము ఆమెకు కనుచూపు మేరలో కనబడలేదు.

మళ్ళీ ఆమె బాధపడసాగింది. పోనీ మరణము కల్గినా ఈ సమస్యకు ఏదో విధంగా పరిష్కారము లభించేది. కాని మృత్యుదేవతకు కూడ కరుణ కలుగలేదు.

అంతటి దుఃఖములో కూడ హృదయము బ్రద్దలు కావడం లేదు. పోనీ రావణుని మాటను మన్నిద్దామంటే ఆమె మనస్సు ఆ ఊహనే భరించే స్థితిలో లేదు.

ఇక గడువు ఎంతో దూరంలో లేదు. రావణుని ఆజ్ఞను ఈ రాక్షస స్త్రీలు పాటించి సంతోషంగా తనను ముక్కలు ముక్కలుగా నరికి, వండి ఆయన ఉషః కాలభోజనానికి పంపుతారు.

అయ్యో! ఈ చావు కూడ దిక్కులేని పరిస్థితులలో వస్తున్నదే? మా రామ లక్ష్మణులు, మా అత్తగార్లు ఎవ్వరు దగ్గరలో లేరే? మృత్యువే మాయాలేడి రూపంలో వచ్చి, ఆ పురుష సింహులిద్దరిని బలిగా తీసికొందా? అయ్యో! నేను ఎంత మూఢురాలను? క్షణకాలం నా భర్తను విడిచి ఉండజాలని నేను మొగమాటమైనా లేకుండా నా రాముని ఆ మృగము వెంట పరుగులెత్తించానే? కన్నతల్లివలె నన్ను భావించి, కనురెప్ప వలె కాపాడిన మా లక్ష్మణుని అనరాని మాటలను అని నాకు దూరం చేసికొన్నానే? "రామానుజుని, లక్ష్మణ పూర్వజుని" ఇద్దరిని కోల్పోయి దిక్కులేని దాననయినానే? అని ఘోరంగా సీతాదేవి విలపించ సాగింది.

అయ్యో! నేను నా రామునే దైవంగా భావించానే? నేను రాముని కొరకు ఎంతో ఓపికతో ఎదురుచూస్తున్నానే? కఠినమైన నేలపై పడుకొంటున్నానే? నా పాతివ్రత్య ధర్మాన్ని అసిధారావ్రతంగా కాపాడుకొంటున్నానే? ధర్మాన్ని క్రమం తప్పకుండా పాటిస్తున్నానే? ఏమయ్యాయి ఇవన్ని? ఒక్కటి నాకు రక్షణను కల్పించడం లేదే? అన్ని "బూడిదలో పోసిన పన్నీరు" వలె వ్యర్థమయ్యాయే? మా రాముని దర్శనమే కరువైందే?

ఇక నాకు బలవన్మరణమే (ఆత్మహత్యే) శరణ్యము. "రామా! నా ప్రేమ, నా అనురాగము ఎల్లవేళలా నీ పట్లనే స్థిరంగా ఉన్నాయి. నా పారతంత్ర్యము అనే తపస్సును జాగ్రత్తగా కొనసాగిస్తున్నాను. అయినా ఫలితం లేదు. ఇక నిన్ను కలిసికోగలననే ఆశ లేదు. అందువలన నీవు దగ్గరలో లేకుండానే, నీ ఆజ్ఞ లేకుండానే నా ప్రాణాలను వదలాలనుకొంటున్నాను. నా స్వాతంత్ర్యాన్ని మన్నించు".

అయినా నేను మరణించడం ఎలాగా? కత్తితో మెడ కోసికొందామంటే కత్తి దగ్గరలో లేదు. విషముతో ప్రాణాలను తీసికొందామంటే; విషాన్ని ఇచ్చేవారు ఎవ్వరు లేరు.

ఇక ఒకే మార్గము మిగిలింది. ఉరి బిగించుకోవడమే మిగిలిన పద్ధతి. ఈ నా పొడువు జడతో శింశుపావృక్షానికి, నా మెడకు బిగించుకొని ఉరి పోసికొంటాను" అని నిశ్చయించుకొని శింశుపావృక్షము క్రిందకు వచ్చి నిలిచింది.

ఇక్కడ రెండు విషయాలు ముఖ్యమైనవి. (1) సీతాదేవి నిరాశతో ఆత్మహత్యకు సిద్ధం కావడం (2) రామ లక్ష్మణులను జ్ఞాపకం చేసికోవడం.

ఆత్మహత్య మహాపాపము. ఈ శరీరము, భగవంతుని ఆధీనములోనిది. దీనిని ఇచ్చిన వాడు ఆయన. దీనిని కాపాడేవాడు ఆయన. దీనికి మృత్యువును కలిగించేవాడు ఆయనే. మన శరీరానికి సంబంధించిన సృష్టి, స్థితి, లయాలు ఆయన పనులే.

ఆయన ఆధీనంలో ఉన్న శరీరము నాది అనుకోవడం, ఆయన మృత్యువు కలిగించే దాక ఎదురు చూడకుండా, మధ్యలోనే ప్రాణాలను తీసికోవాలనుకోవడం మహాపాపము. తనది కాని వస్తువును తనది అనుకొని, తన ఇష్టం వచ్చినట్లుగా వాడుకోవడం దొంగతనము. ఆత్మాపహారమునేరము. అది మహా పాపము. అదే ప్రస్తుత సమస్యలకు పరిష్కారము అని అజ్ఞానులు అనుకోవచ్చు. కాని నిజానికి ఆత్మహత్య మరింత నీచజన్మకు, మరిన్ని కష్టాలకు కారణమవుతుంది.

ఈ విషయాలన్ని సీతాదేవికి తెలియనివి కావు. కాని ప్రస్తుతము భరింప రాని కష్టాలు ఆమెను ఆత్మహత్య వైపు పురికొల్పుతున్నాయి.

ఇక రెండవది ఈ విపత్కర పరిస్థితిలో ఆమె జ్ఞాపకం చేసికొంటున్నది. అత్తగారిని శ్రీరాముని, లక్ష్మణుని. వాళ్లను స్మరించడంలో ఒక పరమ రహస్యము దాగి ఉంది.

1) తన భర్త రామభద్రుడు సాక్షాత్తుగా పరమాత్మ. తన అత్తగారు కౌసల్యాదేవి రామచంద్రుని పన్నెండు మాసములు కడుపులో పెట్టుకొని ధరించి, భరించి లోకభర్తను జనులందరికి అందించిన తల్లి.

పరమాత్మను మనకు అందించేది మంత్రము. పరమాత్మ మంత్రాధీనంగా ఉంటాడు. "మంత్రాధీనంతుదైవతం". కౌసల్యాదేవి మంత్రస్వరూపిణి. భగవన్మంత్రమే కౌసల్య.

2) ఇక భగవంతుడు ఎప్పుడు ఒంటరిగా ఉండడు. ఆయన ఎప్పుడు పరివార సమేతుడై ఉంటాడు.

"ఆస్తే విష్ణుః అచింత్యాత్మా। భక్తైః భాగవతైస్సహ।

భగవంతుడెప్పుడు, భాగవతాచార్య సమేతంగా ఉంటాడు.

లక్ష్మణుడు "బాల్యాత్ప్రభృతి సుస్నిగ్ధః" అన్నట్లు చిన్నప్పటి నుండి శ్రీరాముని విడిచి ఉండలేదు. నీడవలె ఆయనను అనుసరించి ఉన్నాడు. కనుక లక్ష్మణుడు అంటే (రామపరమాత్మను విడిచి ఉండజాలని) భాగవతోత్తముడు. తాను మాయామృగము వెంట వెళ్తూ రాముడు సీతాదేవికి రక్షకునిగా లక్ష్మణుని ఉంచి వెళ్లాడు. అందువలన లక్ష్మణుడు శ్రీరాముని ప్రతినిధి. పరమాత్మ ప్రతినిధి ఆచార్యుడే.

అందువలన రామలక్ష్మణులు అంటే పరమాత్మ ఆచార్యులు. వారి స్మరణ సకల ఆపదలను నివారిస్తుంది.

ఇక వాల్మీకి భగవానుడు "రామలక్ష్మణులని" సాధారణంగా అనలేదు. "రామానుజం, లక్ష్మణ పూర్వజంచ" అన్నాడు. "రాముని తమ్ముడు", "లక్ష్మణుని అన్న" అన్నాడు. ఇదేమిటి ఈ త్రిప్పి చెప్పడం దేనికి? అంటే ఆ విధంగా త్రిప్పి చెప్పడంలో ఒక క్రమము ఉంది కనుక.

ఏమిటా క్రమము? ఆ క్రమాన్ని పిళ్లైలోకాచార్య స్వామి వివరిస్తారు.

"భగవల్లాభమ్ ఆచార్యనాలే; ఆచార్య లాభం భగవానాలే". భగవంతుడెంత జ్ఞానులకైనా, భక్తులకైనా స్వయంగా లభించడు. ఆచార్యుని ఆశ్రయించి, అతని ద్వారా మంత్రాది పంచసంస్కారాలను పొందిన ప్రపన్నులకే భగవంతుడు లభిస్తాడు.

అష్టాక్షరి, ద్వయ, చరమశ్లోకాలనే మంత్రాలు గ్రంథాలలో లభిస్తాయి కదా! ఆచార్యుడు లేకుండానే వాటిని మనము చదువుకొంటే భగవంతుడు లభించడా? అనుకొంటే దాని వలన భగవంతుని అనుగ్రహము లభించదు. కాని భగవంతుని నిగ్రహము (ఆగ్రహము) కలుగుతుంది.

"ప్రత్యుతః అనర్థో భవేత్"

సరే! భగవంతుని ఆచార్య సంస్కారాల ద్వారానే పొందుతాము. అయితే ఆచార్యులు లోకంలో ఎంతమంది లేరు? డబ్బిస్తే ఏ ఆచార్యుడైనా లభించడా? అంటే ఆ ఊహే ప్రమాదకరము. ఆచార్యులు డబ్బుకు ఆశపడేవారు కారు.

ఆచార్యులలో అనువంశిక ఆచార్యులను ఆశ్రయించుట ఉత్తమము. వారు తమ తండ్రి, తాత, ముత్తాతల కాలం నుండి భగవంతుని ఆశ్రయించి "ఓరాణ్ వజియాయ్ ఉపదేశిత్తార్" అన్నట్లు పరంపరా ప్రాప్తంగా భగవన్మంత్రములను ఉపదేశంగా పొంది, వాటి అనుసంధానముతో పవిత్రులై, అటువంటి భగవన్మంత్రాలను తమ ఆశ్రితులకు ఉపదేశిస్తారు. అందువలన ఆచార్యుల వంశంలోని ఆచార్యులను ఆశ్రయించుటే ఉత్తమము.

అయితే ఆచార్య వంశంలోని ప్రస్తుత తరం వ్యక్తులలో, పూర్వతరంలోని వారి వలె జ్ఞానానుష్ఠానాలు పుష్కలంగా లేకపోవచ్చు. అట్లా లేనివారిని వదలి వేయడమేనా? వారిని కూడ వదల కూడదు.

మన గురుపరంపరలోని ఆచార్యులందరు సమాన జ్ఞాన, నిష్ఠాగరిష్ఠులా? కాదు. నమ్మాళ్వార్, నాథముని, యామున, రామానుజ, భట్టర్, నంబిళ్లై, పిళ్లైలోకాచార్య, మణవాళ మహామునుల కున్న జ్ఞానానుష్ఠాన గరిమ, మధ్యలోనున్న వారికి లేదే? మరి వారు మధ్యలో లేకుండానే వీరు వచ్చారా? రామానుజులకున్న మహిమాతిశయము మహాపూర్ణులకు లేదు. అయినా రామానుజులు మహాపూర్ణుల నాశ్రయించే పంచ సంస్కారాలను పొందారు.

అలాగే మన పూర్వులు ఆశ్రయించిన ఆచార్య పరంపరలోని వ్యక్తులనే ఆశ్రయించడం సంప్రదాయ పద్ధతి.

2) అయితే మన ఆచార్య వంశంలోని వ్యక్తులు స్వయంగానే తమకు సంప్రదాయంలో సరియైన నిష్ఠలేదని, అందువలన తాము పంచ సంస్కారాలను అనుగ్రహించలేమని, అందువలన మరెవ్వరినైనా ఆశ్రయించుమని వారే ఆజ్ఞ ఇస్తే, ఆ విధంగా ఆజ్ఞను పొంది వేరే ఎవ్వరినైనా ఆశ్రయింప వచ్చు. అయితే స్వాచార్య వంశంలోని వ్యక్తులను ఆశ్రయించడం మనకే ఇష్టం లేక, వారిని నిర్బంధించి, వేరెవ్వరినైనా ఆశ్రయించడానికి బలవంతమైన ఆజ్ఞను పొందడము కూడ పద్ధతి కాదు. అది మహా పాపము.

సారాంశమేమిటంటే స్వాచార్య వంశంలోని ఆచార్యులైనా, వేరే వారైనా – తమకు ఆ ఆచార్యులు భగవదనుగ్రహంతో లభించారని వారి పట్ల ఆదర విశ్వాసాలను కలిగి ఉండడము మనను తరింపజేస్తుంది.

అందువలననే పిళ్లైలోకాచార్య స్వామి వారు ఆచార్య లాభము కూడ భగవంతుని కృపా ఫలమే, "ఆచార్య లాభం భగవానాలే" అని సెలవిచ్చారు.

లక్ష్మణుడేమో రామానుజుడు. అంటే రాముని ఆధీనములోని వాడు. రాముని (పరమాత్మ) వలన లభించినవాడు (ఆచార్యుడు).

ఇక రాముడేమో "లక్ష్మణ పూర్వజుడు" లక్ష్మణుని అన్న. అంటే లక్ష్మణ (ఆచార్య) సంబంధము వలన లభించేవాడు (పరమాత్మ).

చూచారా? వాల్మీక మహాముని పదప్రయోగ వైలక్షిణ్యము! చూచారా రామాయణ దివ్యప్రబంధ సౌందర్యము!

ఈ కాండలో సీతాదేవి స్థితిని జాగ్రత్తగా గమనిస్తే పరమప్రపన్నుని అయిదు ముఖ్య లక్షణాలు కనిపిస్తాయి. అవి (1) అనన్యకామము (2) ఆర్తి (3) అధ్యవసాయం (4) ఆదరము (5) అనసూయ.

1) సీతాదేవి రాముని సన్నిధానాన్నే కోరుకొంది. "యస్త్వయాసహసస్స్వర్గో" అని అరణ్యాలకు బయలుదేరక ముందు ఆమెకు ఉన్న అనన్య కామము లంకలో కూడ చెదిరిపోలేదు. రావణుడెన్ని ఆకర్షణలను చూపెట్టినా, వాటిని గడ్డిపోచలవలె చూచింది. అది ఆమె అనన్యకామత్వము.

2) రాముడు లేనిదే తాను సుఖించకూడదని, నిరాహారము, భూశయనము, దైన్యము మొదలైన పతివ్రతానియమాలను పాటించడం సీతాదేవి "ఆర్తిని" తెలుపుతున్నాయి.

3) రాముడు లభించని నాడు తాను ప్రాణాలతో ఉండడము వ్యర్థము అని భావించి రామస్మరణతోనే ఉరివేసుకొని చనిపోవడానికి సిద్ధము కావడం ఆమె అధ్యవసాయాన్ని సూచిస్తుంది.

4) ఎక్కడ నుండైనా రామనామము వినవస్తుందేమో అని ఎదురు చూడడము, హనుమ శింశుపావృక్షం నుండి రామగానాన్ని ఆరంభించగానే అత్యంతాసక్తితో వినడానికి సిద్ధపడడం ఆమె ఆదరానికి సూచకము.

5) తాను ఇన్ని కష్టాలను, ఇన్ని బాధలను అనుభవిస్తున్నా వీటిని తొలగించడము లేదని రాముని నిందింపకుండుట ఆమె "అనసూయ" స్వభావానికి నిదర్శనము.

-- ఇతిశం --

# మళ్లీ శుభశకునాలు - 22

సీతాదేవికి తిరిగి శుభశకునాలు కలుగసాగాయి. ఈసారి ఆ శకునాలు చాల బలంగా కనిపించాయి. సంపన్నుడైన యజమానిని సేవించడానికి ముందుకు వచ్చే అనేక సేవకులవలె శుభశకునాలు ఆగకుండా అగుపించాయి.

ఈసారి కూడ ఆమె ఎడమకన్ను, ఎడమ భుజము, ఎడమ తొడ కంపించాయి. శింశుపా వృక్షం క్రింద నిలుచున్న సీతాదేవి (బంగారు రంగుగల) చీర క్రొద్దిగా క్రిందికి జారింది. ఆమె ముఖము అనుకోకుండా రాహువు తొలగిన చంద్రబింబము వలె కళామయ మైంది. ఈసారి ఆమెకు రాముడు తనకు ఎదురుగా ఉన్నట్లే అనిపించసాగింది.

వర్షాలు బొత్తిగాలేక ఎండిపోయిన విత్తనము వర్షాలు కురవడం వలన మళ్లీ మొలకెత్తినట్లు ఈసారి ఆమెకు ఆశ బలంగా అంకురించింది.

ఆమెలోని శోకము నశించింది. జాడ్యము తొలిగింది. జ్వరము శమించింది. ఆమె మనస్సు హర్ష పరవశమైంది. ముఖము కాంతిమయమైంది. చంద్రుడు ఉదయించిన రాత్రివలె ప్రకాశింపసాగింది. "సావీతశోకావ్యపనీత తంద్రీ! శాంత జ్వరాహర్ష వివృద్ధ సత్త్వా! అశోభతార్యా వదనేన శుక్లే! శీతాంశునా రాత్రిరివోదితేన॥

ఇంతకు ముందు కూడ సీతాదేవికి శుభశకునాలు కనిపించాయి. అయితే అవి ఇంత బలంగా లేవు. వామభాగము అదిరింది. పింగళ పక్షి కూజితము ఆమెను ఓదార్చింది. ఆమె కలుగబోయే శుభానికి స్వాగతము పలికింది. ఆ పింగళ పక్షి ఒక శాఖపై కూచొని వుంది.

అప్పుడు కలిగిన శుభ శకునాలు హనుమ శింశుపావృక్షంపై ఉన్నాడని మాత్రమే సూచించాయి.

ఇక ఇప్పుడు కలిగిన శుభ శకునాలు ఆమెకు మనస్సులో శోకాన్ని తొలగించి, సంతోషాన్ని నింపాయి. శుక్లపక్ష చంద్రోదయము వలన రాత్రి మెరిసి పోయినట్లు ఆమె ముఖము కాంతిని సంతరించుకొంది.

హనుమ శింశుపా వృక్షం నుండి దిగివచ్చి ఆమెను కలువబోవడం, శ్రీరాముని యోగక్షేమాలను తెలుపబోవడం, రామాంగుళీయకాన్ని ఆమెకు ఇవ్వబోవడం మొదలైన శుభ సంఘటలన్నిటిని ఇప్పుడు కలిగిన శుభ శకునాలు సూచిస్తున్నాయి. ఆమెకు తన పతితో కలయిక జరిగినట్లే అనిపించింది. ఆ అనుభూతితోనే ఆమెకు చీర కూడ కొంత జారింది.

ఆమెకు మనస్సులో అలసత్వము, శోకము, వేదన తొలగి పోయాయి. వాటి స్థానంలో ఆనందోత్సాహాలు నిండాయి. ఆమె ముఖము రాహు విముక్త చంద్రబింబము వలె కాంతితో తేజరిల్లింది.

-- ఇతిశం --

"వినతాసుతుండు వేల్పుల బువ్వ కనుగొన్నయట్లుగా!
కనుగొంటి జానకీదేవి" - శ్రీ విశ్వనాథ

"ఈ మనసు తీరికగా ఒక వేయి కవుల సృష్టించుకొనున్"
- విశ్వనాథ.

"మరుత్సుతుడు తానై లంకలో జొబ "మరుత్పుతుడు తానై
లంకలో జొచ్చుచో, వేళ దుష్టముగాన కనంబడి మదిన్ వేల్పున్..
ఆలస్యంబు ఘటింపనెంచి సురసాఖ్యన్..ప్రార్థించిరాబద్ధులై"
- శ్రీ విశ్వనాథ

"ఊరక వందయోజనములు పెరిగి కాలు లంక బెట్టుట
జాలదే!" హనుమ కొక్క యూహదనరారె" - శ్రీ విశ్వనాథ

సర్వదేవతా భావములాశలు మూటగట్టి 'ప్రజ్వలితముగా
నౌచు కపిసత్తము రూపుగట్టె.

# శింశుపా వృక్షంపై హనుమస్వామి-23

శింశుపా వృక్షంపై కూచొని వున్న హనుమ, రావణుడు వచ్చి సీతాదేవిని ఆశపెట్టుట, భయపెట్టుట, రావణాసురుని పరిచారికలు సీతాదేవిని అనేక విధాలుగా బెదిరించుట సీతాదేవి అమితంగా దుఃఖించుట, ప్రాణత్యాగానికి సిద్ధమగుట మొదలైన సంఘటనలన్ని స్వయంగా కనులార చూచాడు.

ఆయనకు రావణుని దుర్భాషలు అత్యధిక ఆగ్రహాన్ని కలిగించాయి. చెట్టుపై నుండి అమాంతంగా క్రిందకు దుమికి రావణుని గుండెను నలిపివేయాలనిపించింది. కాని తొందరపడితే కార్యము చెడుతుందని ఇంతవరకు ఊరకున్నాడు.

హనుమ సీతాదేవిని చూచాడు. రావణుని, ఆయన పరివారాన్ని చూచాడు. పరిస్థితులన్ని ఆయనకు అర్థమయ్యాయి. దీనితో తను వచ్చిన పని ఒక రకంగా పూర్తి అయింది. సీతాదేవి ఎక్కడ ఉన్నదో కనుక్కొని వెళ్లి రామునికి తెలుపడమే తన పని. ఆ పని పూర్తి అయింది. ఇప్పుడు ఇక తిరిగి వెళ్లిపోవచ్చు.

త్రిజట తన స్వప్న వృత్తాంతాన్ని తెలిపాక, రాక్షసులందరికి సీతాదేవి పట్ల గౌరవభక్తులు కలిగాయి. తమ బెదిరింపులతో ఇంకా ఆమె దుఃఖాన్ని పెంచకూడదని తీర్మానించుకొని ఆమెను ఒంటరిగా వదలివేశారు. నిద్రకు ఉపక్రమించారు.

ఈ సమయం తగిందని హనుమ నిశ్చయించుకొన్నాడు. సీతాదేవిని పలుకరించాలను కొన్నాడు. తాను సీతాదేవితో కలసి మాట్లాడకపోతే ఆమెకు రామవృత్తాంతము ఎలా తెలుస్తుంది? తెలియకపోతే ఆమె శోకము ఎలా తొలగుతుంది? తొలగకపోతే ఎంత కాలము ఈ నిరాశా, నిస్పృహలతో జీవింప గల్గుతుంది? ఆమె జీవించకపోతే – తాను సీతాదేవి వివరాలను తెలిపిన తరువాత రామలక్ష్మణులు ససైన్యంగా వచ్చి కూడ ఏమి చేయగల్గుతారు? సీతాదేవి చనిపోయిన వార్తను విని వారు బ్రతుక గల్గుతారా? వారు లేక భరత శత్రుఘ్నులు, రాజమాతలు, అయోధ్యాపౌరులు, సుగ్రీవాది వానరులు జీవించి ఉండగలుగుతారా? ఇంత ప్రయత్నము చేసి, సముద్రాన్ని దాటి, లంకలోకి వచ్చి సీతాదేవిని చూచి మాత్రము ఏమి ప్రయోజనము?

పోనీ ఇంత దాకా ఓర్చుకొన్నట్లు ఇక ముందు కూడ అన్ని బాధలు భరించి సీతాదేవి రామునిపై ఆశతో జీవించి ఉంటుందని అనుకొందాము.

"అయినా హనుమా! సీతను చూచానంటున్నావు కదా! ఆమెతో మాట్లాడావా? ఆమె ఏమి మాట్లాడింది?" అని రామలక్ష్మణులు అడిగితే ఏమి చెప్పాలి? తన సహచరులైన వానరులు, జాంబవంతుడు అడిగితే ఏమి చెప్పాలి?"

"నేను సీతను చూచాను. కాని పలుకరించలేదంటే హనుమా! నీవు క్రొత్తగా సాధించిందేమిటి?" సీతాదేవి లంకలో ఉందని సంపాతి ఎప్పుడో చెప్పాడు కదా? ఆ విషయాన్నే కదా నీవు చెప్పేది. ఇందులో గొప్పేమిటి? అని మావారు నన్ను చూచి నవ్విపోరా?

అందువలన సీతాదేవిని పలుకరించి, ఆమె యోగక్షేమాలను విచారించి, రామాంగుళీయకాన్ని ఇచ్చి ఆమెను ఓదార్చి పోవడమే మంచిదని నిర్ణయించుకొన్నాడు హనుమ.

"అయితే సీతాదేవితో ఎప్పుడు మాట్లాడాలి? ఏ భాషలో మాట్లాడాలి? "మానవభాష, కోతిరూపము" ఈ రెండింటిని చూచి సీతాదేవి ఏమనుకొంటుంది? రావణుడని అనుమానించదా? ఆమె భయపడదా? కేకవేయదా? ఆమె కేకవిని రాక్షసులందరు ఆమె చుట్టు చేరరా? వారందరు సాయుధులై వచ్చి నన్ను చూచి ఊరకే వదలుతారా? ఆ యుద్ధము ఏ విధమైన ఫలితాన్ని కలిగిస్తుందో?

లేక సీతతో మాట్లాడుతుండగా నన్ను చూచి సీతాదేవిని హింసిస్తారేమో? ఎలాగా నేను మాట్లాడితే? మాట్లాడకపోతే ఎలాగా? అని తీవ్రంగా ఆలోచించాడు. తాను ఎక్కడ తొందరపడ్డా కార్యము చెడిపోతుంది.

అవివేకి అయిన దూత వలన ఫలించే పనులు కూడ పాడయిపోతాయి. యజమాని ఎంత చక్కగా ఆలోచించి నిర్ణయాలు తీసికొన్నా వివేక శూన్యుడైన దూత కార్యము వలన అవి "బూడిదలో పోసిన పన్నీరు" అవుతాయి. తనను తానే పండితుడనని గర్వించే దూత స్వామి కార్యాన్ని సర్వనాశనం చేస్తాడు.

"భూతాశ్చార్థావినశ్యంతి। దేశకాలవిరోధితాః।

విక్లబం దూత మాసాద్య। తమః సూర్యోదయేయధా। (30-37)

అర్థానర్థాంతరే బుద్ధిః। నిశ్చితాపి న శోభతే

ఘాతయంతి హి కార్యాణి। దూతాః పండితమానినః (30-38)

అందువలన దేశ, కాల పరిస్థితులకు అనుగుణంగా సీతాదేవికి ఆసక్తిని కల్గించే విధంగా మాట్లాడాలి అని నిశ్చయించుకొన్నాడు.

"ఇతి బహువిధం మహానుభావః।
జగతి పతేః ప్రమదామవేక్షమాణః।
మధురమవితథం జగామ వాక్యం
ద్రుమ విటపాంతర స్థితో మహాన్"

శింశుపా వృక్ష శాఖపై ఆకుల మధ్యలో అణగి కూచొన్న హనుమ జగదీశ్వరుడైన రామచంద్రుని పత్ని అయిన సీతాదేవిని చూస్తూ, మధురము, సత్యమైన మాటను మాట్లాడాడు. రామాయణము వినడానికి మధురమైనది. లోతుగా విచారిస్తే ఉపనిషత్తులకు అర్థరూపమై సత్యమైనది.

'ఏవం బహువిధాం చింతాం! చింతయిత్వా మహాకపిః
సంశ్రవే మధురం వాక్యం। వైదేహ్యా వాజహారహ।"

ఈ రకంగా అనేక విధాలుగా ఆలోచనలు చేసి మహాభక్తుడైన హనుమ సీతమ్మ వినేంత స్వరంలో మధురముగా మాట్లాడాడు - "హ" ఏమి ఆశ్చర్యము? వాల్మీకికి ఆశ్చర్యం కలిగినప్పుడల్లా "హ" అనే పదం వాడుతాడు.

"వ్యాజహార" అంటూ పలికాడని మాత్రమే అర్థము కాదు. సీతాదేవికి ప్రస్తుతము "శరీరస్పృహ" లేదు. ఆమె ఇంద్రియాలకు మనస్సుకు మధ్య సంబంధము తెగిపోయింది. ఆమె మనస్సు రాముని చుట్టు తిరుగుతున్నది.

తాను చెప్పింది సీతకు అర్థం కావాలంటే ముందుగా వినాలి. వినాలంటే చెవులు పనిచేయాలి? చెవులు పనిచేయాలంటే వాటికి మనస్సుతో సంబంధము మళ్లీ కలుగాలి.

హనుమ పలికిన వాక్యము మధురమైందే కాక చెవులకు మనస్సుకు సంబంధాన్ని పునరుద్ధరించింది - "హ" ఎంత ఆశ్చర్యము। అని వాల్మీకి మునీంద్రుడు విస్మితుడయ్యాడు. అంటే హనుమ మాటలు నిరాసక్తురాలైన సీతాదేవికి ఆసక్తిని కలిగించాయి అని అర్థము.

"ఆజహార" తెచ్చాయి. వి = విశేషంగా

"వ్యాజహార" చెవులకు మనస్సుకు సంబంధాన్ని ఆసక్తికరంగా తిరిగి కల్పించాయి.

హనుమ సంగీత విద్వాంసుడు. మనోహరమైన వాక్యాన్ని స్వరంతో ఆలాపించాడు. ఆయన సంగీత స్వరాలాపన సీతాదేవికి చెవులకు, మనస్సుకు ఆనందాన్ని కల్పించాయి.

ఇక మృతసంజీవనమైన (చనిపోయేవారిని బ్రతికింపజేసే) రామవృత్తాంతాన్ని హనుమ సీతాదేవికి తెలుపుతున్నాడు.

"రాజా దశరధోనామ। రథకుంజర వాజిమాన్
పుణ్యశీలో మహాకీర్తిః। ఋజురాసీన్మహాయశాః। (31-2)
తస్య పుత్రః ప్రియో జ్యేష్ఠః। తారాధిపనిభాననః।
రామోనామ విశేషజ్ఞః। శ్రేష్ఠస్సర్వధనుష్మతాం। (31-6)
రక్షితాస్వస్య ధర్మస్య। స్వజనస్యచ రక్షితా।
రక్షితా జీవలోకస్య। ధర్మస్యచ పరంతపః। (31-7)

"రాజా దశరథః" అనే మాటలు వినడంతోనే ఆమె ప్రాణాలు లేచి వచ్చాయి. ఆమెకు మామగారంటే మహాభిమానము. అందువలన అరణ్యకాండలో రావణునితో ఆమె తనను గురించి చెప్పుకోవాలని మొట్టమొదట "స్నుషాదశరథస్యాహం శత్రుసైన్య ప్రతాపినః" నేను శత్రు సేనలను నిర్మూలించగల మహాపరాక్రమం కలిగిన దశరధుని కోడలును అని చెప్పి, జనకుని కూతురుని, ధీమంతుడైన శ్రీరాముని భార్యనని తరువాత తెలిపింది.

తాను అమితంగా అభిమానించే మామగారైన దశరధుని పేరు వినగానే ఆమె తబ్బిబ్బ యింది. తన మామగారే జీవించి ఉంటే తాను లంకలో ఉండే దానినే కాదని ఆమె అభిప్రాయం.

అట్టి దశరథుని జ్యేష్ఠపుత్రుడు ప్రియపుత్రుడు శ్రీరాముడని చెప్పి, ఆయన మహిమను హనుమ తెలుపసాగాడు.

"రాముడు ధనుర్ధరులందరిలో శ్రేష్ఠుడు" అని తెలిపి ఆయన రక్షకత్వాన్ని వివరింప సాగాడు. ముందు రాముడు స్వధర్మ రక్షకుడు. ఎవ్వరు స్వధర్మాన్ని రక్షించుకొంటారో, వారిని తరువాత ధర్మమే రక్షిస్తుంది.

"ధర్మోరక్షతి రక్షితః"

స్వధర్మాన్ని రక్షించాక, రాముడు స్వజనాన్ని కూడ రక్షిస్తాడు. రక్షణ అంటే ఇష్టాన్ని కలిగించి, అయిష్టాన్ని తొలగించడం. రాముని ఈ రక్షణ లక్షణాన్ని కీర్తిస్తూ అయోధ్యా పౌరులు:-

"వ్యసనేషు మనుష్యాణాం। భృశం భవతి దుఃఖితః
ఉత్సవేషుచ సర్వేషు। పితేవ పరితుష్యతి" అంటారు.

రాముడు పౌరుల దుఃఖాన్ని తొలగించడమే కాదు. వారి దుఃఖానికి కారణం తెలసికొని తాను కూడ వారికంటే అధికంగా దుఃఖించేవాడు. పండుగలలో వారికి సంతోషాన్ని

కల్గించడమే కాదు. వారి సంతోషములో తాను వారికంటె అధికంగా ఆనందించేవాడు. ఇంతకంటె మించిన రక్షణ ఇంకేమి ఉంటుంది?

"కేవలము స్వజనాన్ని రక్షించడం ఏమి గొప్ప విషయము? రక్షకులందరు (తండ్రులు, భర్తలు, రాజులు మొదలైన వారందరు) చేసే పనే కదా!" అంటావా?

అంతేకాదు రాముడు సకల జీవులను సంరక్షించేవాడు. వారి వారి ధర్మాలను కూడ పరిరక్షించేవాడు" అని రాముని రక్షకత్వ లక్షణాన్ని తెలిపాడు.

అటువంటి రామచంద్రుడు పినతల్లి కైక వరాల కారణంగా సీతా లక్ష్మణులతో కలసి అడవులకు బయలుదేరాడు. పంచవటిలో రావణుడు శ్రీరామపత్ని అయిన సీతాదేవిని అపహరించాడు. ఇంతవరకు చెప్పి కొంతసేపు ఆగి, మళ్లీ కొనసాగించాడు.

సీతాన్వేషణను కావిస్తూ రామలక్ష్మణులు కిష్కింధకు చేరుకొన్నారు. వాలిని వధించి, సుగ్రీవునికి రాముడు రాజ్యాన్ని ఇప్పించాడు. తాను ఇచ్చిన మాటను పాలించి సుగ్రీవుడు నాలుగు దిక్కులకు సీతాదేవిని వెతుకడానికి సేనలను పంపాడు. దక్షిణ దిక్కుకు బయలుదేరిన వానరులలో సంపాతి చెప్పిన మాటను బట్టి నేను సముద్రాన్ని దాటి లంకలోకి వచ్చాను. సీతాదేవిని చూస్తున్నాను.

'యథా రూపాం యథా వర్ణాం। యథా లక్ష్మీంచ నిశ్చితాం
అశ్రౌషం రాఘవస్యాహం। సేయమాసాదితామయా' (31-11)

రాముడు చెప్పిన రూపము, రంగు, కాంతిగల సీతాదేవిని నేను చూడగల్గానని చెప్పి హనుమ ఊరకున్నాడు.

శబ్దము వచ్చింది ఎక్కడ నుండి అని సీతాదేవి పైకి, క్రిందికి, ఈ ప్రక్క ఆ ప్రక్క అన్ని వైపుల చూడసాగింది. మళ్లీ మళ్లీ తిరిగి చూడసాగింది. ఆమె ఆశ్చర్యంతో అన్ని వైపుల జాగ్రత్తగా గమనించింది. హనుమ చెప్పిన రామకథలో తాను రావణునిచే అపహరింపబడేవరకు జరిగిన విషయాలన్ని తనకు తెలిసినవే. ఈ విషయాలన్ని తెలిసినవారు ఇక్కడ ఎవ్వరు లేరు. ఇన్ని విషయాలు ఉన్నవి ఉన్నట్లుగా చెప్పిన వ్యక్తి ఎవ్వరో తనకు కావలసిన వాడే? ఎవ్వరాతడు?

ఆమె ముఖము పైకెత్తి తాను నిలుచున్న స్థలంపైన ఉండే శింశుపా వృక్షాన్ని గమనించింది. చీకటిలో కాంతి రేఖవలె శింశుపా వృక్షశాఖపై గుబురాకుల మధ్య మెరుస్తుండే హనుమను చూచింది.

హనుమ చెప్పిన రామ వృత్తాంతాన్ని మళ్లీ మళ్లీ నెమరు వేసుకొంటుంది. ఆమె మనస్సు సంతోషంతో ఊయలవలె ఊగిపోసాగింది.

రామచంద్రుని గురించి హనుమ పలికిన పలుకులు గమనించదగినవి. ఆయన రాముని రక్షకత్వాన్ని గురించి తెలిపాడు.

రాముడు స్వధర్మాన్ని, స్వజనులను, సర్వజనులను, వారి వారి ధర్మాలన్నింటిని రక్షించే వాడని హనుమ తెలిపాడు.

నిజంగా ధర్మాన్ని రక్షించేది పరమాత్మే – "యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత। అభ్యుత్థాన మధర్మస్య। తదాత్మానం సృజామ్యహం" అంటాడు కృష్ణభగవానుడు. "ధర్మానికి హాని ఏర్పడి, అధర్మానికి వృద్ధి ఏర్పడితే, అధర్మాన్ని రూపుమాపి ధర్మాన్ని రక్షించడానికి నేను నా సంకల్పంతో ఆవిర్భవిస్తాను" అని ఆయన తెలిపాడు.

రాముడు సర్వదేవతల ప్రార్థనలపై మానవ స్వరూపునిగా అవతరించిన పరమాత్మ. అందువలన రాముని గుణాలన్నిటిలో స్వధర్మ, సర్వధర్మ, రక్షణను, స్వజన, సర్వజన సంరక్షణను వివరించాడు హనుమ.

పరిత్రాణాయ సాధూనాం। వినాశాచయ దుష్కృతాం

ధర్మసంస్థాపనార్థాయ। సంభవామి యుగేయుగే"

"సజ్జన సంరక్షణ – దుర్జన సంహారము – ధర్మ సంస్థాపనములు అనే పరమాత్మ కార్యాలను నెరవేర్చడానికి భూమండలానికి దిగివచ్చిన ధర్మమూర్తి రామచంద్రమూర్తి.

సూచన:– తులసీ రామాయణంలో హనుమ సీతాదేవితో మాట్లాడక ముందే రాముని ఉంగరాన్ని క్రింద పడవేశాడని, దానిని తీసికొని సీతాదేవి హనుమను నమ్మిందని వ్రాయబడింది. కాని అది సరి అయినది కాదు. ఎందుకంటే అంతవరకే సీతాదేవికి హనుమ లంకకు వచ్చి శింశుపావృక్షంపై కూచొని ఉన్నాడని తెలియదు. అంతేకాదు ఆమె దుఃఖంతో ఉంది. ప్రాణాలు తీసికోవాలని అనుకొంది. అటువంటి సమయంలో హనుమ క్రింద నిశ్శబ్దంగా పడవేసిన ఉంగరాన్ని ఆమె గమనించి తీసికొంటుందా? ఒకవేళ ఆమె తీసికోక ఎవ్వరైనా రాక్షసులు దాన్ని చూచి తీసికొని రావణునికి అందజేస్తే

అది ఎంత ప్రమాదము? అందువలన హనుమ ఉంగరాన్ని క్రింద పడవేశాడు అనేది ఒక కల్పన. ఆ కల్పన కూడ ప్రమాదకరమైనది. అందువలన ఆ విషయాన్ని పట్టించుకోవలసిన అవసరం లేదు.

సా తిర్యగూర్ధ్వంచ। తథాప్యధస్తాత్।
నిరీక్షమాణా తమచింత్య బుద్ధిం।
దదర్శ పింగాధిపతే రమాత్యం।
వాతాత్మజం సూర్యమివోదయస్థం॥ (31-19)

సా:- మారీచుని వ్యామోహంలో చిక్కుకొన్న తనను రావణుడు అపహరించిన నాటి నుండి రాముని వార్త ఏది తెలియక సీతాదేవి దుఃఖంతో ఉంది. దగ్గరలో ఆకు చప్పుడైనా ఆమె గుండె భయంతో కొట్టుకొంటుంది. రావణుడు అపహరించి తెచ్చిన నాటి నుండి ఆమె కన్నులకు నిద్ర కరువైంది. ఆ విధంగా రాముని వియోగ దుఃఖాన్ని రాక్షసుల బాధలను తట్టుకోలేక బలవంతంగా తన ప్రాణాలను తీసికోవాలనుకొన్న సీతాదేవి:-

తిర్యక్:- అంతవరకు ఎటువైపు దేన్ని సరిగా చూడని ఆమె ఇప్పుడు చుట్టు ప్రక్కల అంతా చూడసాగింది. అంతవరకు తనమెడకు పని చెప్పని ఆమె ఇప్పుడు అన్ని వైపుల తన మెడను త్రిప్పి చూడసాగింది. "ఆడవారి బాధలను ఆడవారే గుర్తిస్తారు. కనుక దిక్కుల కాంతలు ఎటువైపు నుండి ఏమి చెప్పుతారో అని అన్ని వైపుల తిరిగి తిరిగి చూచింది.

ఊర్ధ్వంచ:- పై లోకాలలో శచీదేవి వంటి దేవకాంతలు తమ భర్తలకు దూరమై తన వలెనే తమ ప్రాణాలను తీసికోవాలని ప్రయత్నించారు. కొంతకాలానికి తిరిగి తమ భర్తలను కలుసుకొన్నారు. కనుక వారెవ్వరైనా తన ప్రయత్నాన్ని వారించదానికి ఏమైనా చెప్పుతారేమో అని పైకి చూచింది.

ఆకాశము యొక్క గుణము శబ్దము. పై నుండి శబ్దము వినవచ్చింది కనుక ఆకాశంలో ఎక్కడినుండి వచ్చిందో ఏమో అని ఆకాశమువైపు చూడసాగింది.

తథా2ప్యధస్తాత్:- అలాగే క్రిందివైపు చూచింది. భూదేవి తన తల్లి. తన దుఃఖము చూడలేక తనకు ఓదార్పు మాటలు ఏమైనా చెప్పుతుందో అని మాటి మాటికి క్రిందివైపు చూచింది.

నిరీక్షమాణా:- ఆశతో అన్నివైపుల ఎదిరి చూడసాగింది.

తథా2పి:- అలాగే చూచినవైపే మళ్లీ మళ్లీ ఆశతో చూడసాగింది.

తమచింత్యబుద్ధిం:- ఊహించడానికి వీలులేనంత గొప్ప బుద్ధి కలవానిని. ఆయన మనస్సులోని బుద్ధి శరీరంలో ప్రతిఫలిస్తున్నది.

పింగాధిపతేరమాత్యం:- తన రాజు ఆజ్ఞను అనుసరించి, కష్టపడి ఇంత దూరము వచ్చిన వానిని. శ్రీరాముని కృపాకటాక్షంతో తన రాజుకు (సుగ్రీవునికి) రాజ్యాన్ని, భార్యను ఇప్పించిన మహామంత్రిని.

వాతాత్మజం:- సీతాదేవి ప్రాణాలు పై పైకి వచ్చి కంఠంలో నిలిచి ఉన్నాయి. ఆమె ప్రాణవాయువులను శరీరం అంతా ప్రసరింపజేయగల వాయుపుత్రుడు అని వాల్మీకి మహర్షి తెలుపుతున్నాడు. అట్టి వాయుపుత్రుని హనుమను

(సా)దదర్శ:- కష్టపడి నూరు యోజనాల విస్తారమైన సముద్రమును దాటి వచ్చుటలో అతని శ్రమ అంతా తొలిగి పోయేట్లు ప్రేమతో కటాక్షించింది.

-- ఓం తత్సత్ --

"మేము శాఖామృగంబులము మాకు నిద్దియూరని
యుండునా? ఇద్ది గృహామటంచుచుండునా"
- శ్రీ విశ్వనాథ

"వృష దంశక మాత్రస్సన్ బభూవాద్భుత దర్శనః" - శ్రీ వాల్మీకి

"ధర్మోరక్షతి రక్షితః"
మనము ధర్మాన్ని రక్షిస్తే మనను ధర్మం రక్షిస్తుంది.

# హనుమ సందర్శనము - 24

తాను నిలుచున్న స్థలానికి పైగల శింశుపావృక్షం కొమ్మపై గుబురాకుల మధ్య హనుమ కూచొని ఉన్నాడు. పైకి చూచినప్పుడు సీతాదేవికి హనుమ కనబడ్డాడు. హఠాత్తుగా హనుమ కనబడేసరికి సీతాదేవి చలించిపోయింది.

ఆయన తెల్లని ధోవతిని కట్టుకొని ఉన్నాడు. ఆయన బంగారు రంగుతో ప్రకాశిస్తున్నాడు. ఆయన కళ్లు బంగారు రంగుతో మెరిసిపోతున్నాయి.

సీతాదేవికి అయోమయము ఏర్పడింది. నిజంగా చెట్టుకొమ్మపై ఒక కోతి ఉందా? ఒక కోతి రూపం ఇంత అద్భుతంగా ఉంటుందా? ఆయన ఎవ్వరు? ఒకవైపు ఆశ్చర్యము, మరొకవైపు అయోమయం వలన దుఃఖము కలిగాయి.

భయాశ్చర్యాలకు, దుఃఖానికి విరుగుడు మందు రామనామమే. అందువలన "రామ! రామ, రామ" అని మాటికి మాటికి రామనామాన్ని అనుసంధించుకొంటూ, విలపించింది.

సీతాదేవి దుఃఖాన్ని పోగొట్టడానికి వచ్చిన హనుమ, తనను చూచి భయంతో దుఃఖించే సీతాదేవిని చూడగానే ఆయన తన రెండు చేతులను జోడించాడు.

సీతాదేవికి హనుమ సందర్శనము నిజమా? కలా? తెలియడం లేదు.

ఒకవేళ కలే అయితే కలలో కోతి కనబడడం మంచిది కాదు. రామ లక్ష్మణులకు, తన తండ్రి జనక చక్రవర్తికి ఏ అపాయము కలుగకుండుగాక అని పరమాత్మకు మనస్సులోనే ప్రణమిల్లింది.

అయితే ఆ వానర దర్శనము కల కావడానికి వీలులేదు. లంకలోకి వచ్చిన నాటినుండి ఆమె కన్నులకు నిద్ర అనేదే తెలియదు. అందువలన కల కాదు. కల కాకుంటే ఏమిటిది?

తాను "రామచంద్రుని నామాన్ని నిరంతరము అనుసంధిస్తున్నది. ఆ రామవృత్తాంతమే తనకు ఎవ్వరో వినిపిస్తున్నట్లు భ్రమ కలిగి ఉండవచ్చు.

సరే రామనామము తాను అనుకొంటున్నదే తనకు వినిపించింది. అంతవరకు బాగానే ఉంది. కాని తాను వానర రూపాన్ని ఊహించుకోలేదే? తనకీ రూపము తెలియనే తెలియదే. తనకు తెలియని రూపం కనబడుతున్నది అంటే అది కల కాదు, నిజమే. వానరుడు వినిపించిన రామకథ కూడ నిజమే.

వానర సందర్శనము తనకు శుభప్రదం కావాలని, ఆమె వాచస్పతికి (మాటలకు అధిపతి అయిన బృహస్పతికి) త్రిలోకాధిపతి ఇంద్రునికి, సృష్టికర్త అయిన బ్రహ్మకు, సన్నిహిత దైవమైన అగ్నిదేవునికి ప్రణమిల్లింది. హనుమ చెప్పిన రామవృత్తాంతము సత్యము కావాలని వారిని ప్రార్థించింది.

-- ఓం తత్సత్ --

నన్ను నిట్లు శంకించుటకును - దానవుల మాయ నెంత
నవసినావొ? - విశ్వనాథ

"అత్తకు కొప్పులోని లేమల్లెను"

"నాదేసం జెల్లినదల్ల పట్ట మహోషత్వము"

"సర్వభయాలకు, సర్వదుఃఖాలకు
విరుగుడు మందు రామనామమే"

కలలో కోతి కనబడడం మంచిది కాదు. కాని వానర
సందర్శనం తనకు శుభప్రదం కావాలని వాచస్పతికి
ఇంద్రునికి, బ్రహ్మకు, అగ్ని దేవునికి సీతాదేవి ప్రణమిల్లింది.

# సీతా-హనుమల సంభాషణము-25

పాటల పుష్పము వలె, పగడము వలె ఎఱ్ఱని ముఖముగల హనుమ వినయంతో శిరస్సుపై చేతులు జోడించి చెట్టుదిగి క్రిందికి వచ్చి సీతాదేవిని ఈ విధంగా అడిగాడు-

"అమ్మా! కమల దళములవలె విశాలములైన కన్నులు గలదానా? మాసిన పట్టుబట్టను ధరించినదానా! ఈ చెట్టు కొమ్మను పట్టుకొని ఎందుకు నిలుచున్నావు? నీవెవ్వరు? నీవు ఎందుకు విలపిస్తున్నావు?

నీవు దేవతా స్త్రీవా? నాగకన్యవా? గంధర్వ వనితవా? యక్ష, కిన్నరాంగనవా?

చంద్రునితో పోరాడి భూమిపైకి దిగి వచ్చిన రోహిణివా?

వశిష్టుని వీడి వచ్చిన అరుంధతీదేవివా?

నీవు భూమిని అంటుకొని నిలుచొని ఉన్నందువలన, నీ విలాపము వలన, నీ నిట్టూర్పుల వలన నీవు మానవ వనితవే.

నీ అవయవ సంపద, నీ రాజలక్షణాల వలన నీవు ఒక రాణివో, రాజకన్యవో అని తెలుస్తున్నది.

నీ అతిలోక సౌందర్యము, నీ తపస్సు, నీ దైన్యము చూస్తే నీవు శ్రీరామపత్ని అయిన సీతాదేవివి అని తోస్తున్నది. అరణ్యములో రావణాపహృతవైన సీతాదేవివేనా తెలుపు తల్లీ!" అని హనుమ అడిగాడు.

సీతాదేవి హనుమను విశ్వసించి తన వృత్తాంతాన్ని తెలుపుతున్నది –

"పృథివ్యాం రాజసింహానాం। ముఖ్యస్య విదితాత్మనః॥
స్నుషా దశరథస్యాహం। శత్రుసైన్య ప్రతాపినః॥
దుహితా జనకస్యాహం। వైదేహస్య మహాత్మనః
సీతాచ నామనామ్నాహం। భార్యా రామస్య ధీమతః॥

సీతాదేవికి మామగారైన దశరథుడంటె అందరికంటే అధిక అభిమానము. ఆయనకు రాజసింహులలో ముఖ్యుడు, విదితాత్ముడు, "శత్రుసైన్య ప్రతాపి" అని మూడు విశేషణాలను ప్రయోగించింది.

స్త్రీలకు అత్తవారింటి గొప్పదనమే ముఖ్యము. అక్కడే కదా తాను జీవితాంతము నివసించేది. అందువలన అత్తగారింటి వైభవమే తన వైభము. కనుక మామగారి గొప్పదనాన్ని ప్రధానంగా ముందుగా సీతాదేవి వివరిస్తున్నది.

తన మామగారు రాజసింహులలో ముఖ్యుడు. అంటే మహా సార్వభౌముడు. ఆయన దశదిశలలో ఎదురులేకుండా తన రథాన్ని పరుగెత్తించేవాడు. అత్యంత సుప్రసిద్ధుడు.

ఆయన శత్రు భయంకర మహావీరుడు. ఈ విశేషణాలన్ని కావాలని సీతాదేవి ప్రయోగించింది. ఆమె అయోధ్యలో పన్నెండు సంవత్సరాలు మామగారి రక్షణలో ఉన్నప్పుడు ఆమెకు చీపురు పుల్ల అంత కష్టమైనా కలుగలేదు. అన్ని రకాల సౌఖ్యాలను హాయిగా అనుభవించింది.

ఆయనను వదలి అడవి లోకి వచ్చాకే అన్ని కష్టాలు దాపురించాయి. అంతటి మామగారి తోడే ఉంటే ఈ రావణుడు నన్ను దొంగతనంగా తెచ్చి, ఈ లంకలో దిక్కులేని దానివలె ఉంచగల్గేవాడా? మా మామగారు చనిపోయినందు వలననే కదా మా కిన్ని కష్టాలు" అని మామగారి గురించి ముందుగా తెలిపింది.

చావు బ్రతుకులు మన చేతిలోవా తల్లీ! మీ మామగారు లేకపోతే మీ నాన్నగారు జనక చక్రవర్తి ఉన్నాడు కదమ్మా! అంటే మా నాన్నగారు మొదటినుండి అంతే. ఆయన విదేహులు. దేహముపై స్పృహలేదు వారికి. శరీరంలో ఉండికూడ శరీర సుఖదుఃఖాలను పట్టించుకోని వారెవ్వరైనా ఉంటారా? మా నాన్నగారు మహాత్ములు. అందులో ఆయన తమ అల్లుడు బుద్ధిమంతుడు. "బుద్ధిమంతుడైన అల్లుడి చేతిలో బిడ్డను పెట్టాక ఇక కూతురు బాధ్యత మనకెందుకు" అని అందరు ఆడపిల్లల తండ్రులవలె మా నాన్నగారు కూడ నన్ను పట్టించుకోవడం మానివేశారు.

ఇక నా పేరు సీత. నేను ఏ స్త్రీకి పుట్టినదాన్ని కాదు. యాగభూమిలో మా తండ్రిగారికి లభించినదానను. అయోనిజను. అందువలన నాకు దేహాభిమానము మొదటి నుండి లేదు. అందువలన నా రక్షణ నేనే చేసికోలేదు.

నేను బుద్ధిమంతుడైన రాముని భార్యను. నా భర్త ధీమంతుడు. అన్ని విషయాలు పూర్తిగా తెలిసినవాడు. నేను ఆయన భార్యను. భార్యా రక్షణ భర్త బాధ్యతే కదా! ఈ చిన్న విషయము నా భర్తకు తెలియదా? తెలిసికూడ తన బాధ్యతను మరచాడు నా భర్త చూచావా? హనుమా! అని తన భర్తను అభిమానంతో ఆక్షేపించింది.

ఈ శ్లోకము చాల విశేషమైంది: ఇందులో కేవలము ఒక సామాన్య స్త్రీగా సీతాదేవి తన గురించి చెప్పుకోవడం పైకి కనిపిస్తున్నది. కాని లోతుగా చూస్తే మన అందరి ఆధ్యాత్మిక జీవన విధానము గోచరిస్తున్నది.

మనకు ఆధ్యాత్మిక జీవితంలో పరమాత్మ లాభాన్ని అందించేవాడు ఆచార్యుడు. ఆయన పరమాత్మను మనకు అందిస్తాడు కనుక పరమాత్మకు పిత.

అటువంటి ఆచార్యునికి మనము అన్ని వేళలలో కృతజ్ఞతను తెలుపుకోవాలి. ఆయన వైభవాన్ని మనము లోకానికి చాటి చెప్పాలి.

"గురుం ప్రకాశయేత్ ధీమాన్"

దశరథుడు సీతాదేవికి మామగారు. ఆయన రాజసింహులలో ముఖ్యుడు. రాజు అంటే రంజింపజేసేవాడు. 'రంజయతీతి రాజా!" మన తాపత్రయాలను పోగొట్టి బ్రహ్మానందాన్ని అందించే ఆచార్యుడే రాజసింహులలో ముఖ్యుడు.

ఆయన విదితాత్ముడు. సుప్రసిద్ధుడు. "అసావసావిత్యా భగవత్తః" శ్రియఃపతి, లక్ష్మీనాథుని నుండి ప్రారంభమైన గురుపరంపరలో ప్రముఖ స్థానాన్ని అలంకరించినవాడు.

ఆయన శత్రుసైన్య ప్రతాపి. భగవద్రామానుజులవలె, చార్వాక, జైన, బౌద్ధాది అవైదికులను, న్యాయ, సాంఖ్య, పూర్వామీమాంసాది తటస్థులను, వైదికులైన మాయావాదులనే ప్రతిపక్షుల విషయములో భయంకరుడు. శ్రీరంగేశునికి జయధ్వజము అయినవాడు.

ఆయన దశరథుడు. దశదిశలలో ఎదురులేకుండా తన సిద్ధాంత రథాన్ని పరుగెత్తించే వాడు.

అటువంటి మహామహిములైన ఆచార్యులే దశరథులే మనమామగారు. ఇక మన తండ్రిగారు విదేహులు. సంసారంలో ఉండి "తామరాకులోని నీటి బిందువు వలె" సంసార తాపత్రయాలకు అంటుకోక పరమాత్మ పైననే తన భారాన్ని (న్యాసము చేసిన) వదలిన మహాత్ములు. సీతాదేవి జనకులే మనకు జన్మనిచ్చిన జనకులు, భాగవతోత్తములు.

ఇక మనము భార్యలము. భగవంతుని చేత భరింపబడ వలసిన వారము. ఆయననే ఆశ్రయించి ఆయన రక్షణనే కోరుకొని, ఆయన ఆనందమే మనదిగా భావించుకొనే వారము. "ఆకారత్రయ సంపన్నులము".

సీతలము. మనము శరీరములు కాము. చావు పుట్టుకలు, ఇతర వికారాలు లేని వారము. జీవాత్మలము.

మన భర్త రాముడు. మనను ఆనందింపజేసేవాడు. ధీమంతుడు. "యస్సర్వజ్ఞః సర్వవిత్" మన అన్ని విషయాలు మనము చెప్పవలసిన అవసరం లేకుండానే తెలిసినవాడు. మన అందరితో నవవిధ సంబంధాలు గల పరమాత్మ. ఈ విధంగా తన భౌతిక విషయాలను మాత్రమే తెలుపుతున్నట్లున్న సీతాదేవి మన అందరికి ఆదర్శంగా ఆధ్యాత్మిక జీవనసంపదను రామ భక్తుడు (భాగవతోత్తముడు) అయిన హనుమకు తెలియజేసింది.

"సమా ద్వాదశ తత్రా2హం। రాఘవస్యనివేశనే

భుంజానా మానుషాన్ భోగాన్। సర్వకామ సమృద్ధినీ".

వివాహమైన తరువాత రాఘవునితో కూడ మా మామగారింట్లో పన్నెండు సంవత్సరాల సుదీర్ఘకాలము (ఒక తరం కాలము। ఒక తపం కాలము) నేను మనుష్యులు అనుభవించదగిన సర్వసౌఖ్యాలతో ఆనందంగా గడిపాను. నా కోరికలన్ని పూర్తిగా తీరాయి. అంతటి ఆనందము మనస్సు నిండా ఉండగా, రావణుని ప్రలోభాలు నన్నెలావశం చేసికొంటాయి?

పదమూడవ ఏట మా మామగారు పెద్దకొడుకైన నా భర్తకు యౌవరాజ్య పట్టాభిషేకం చేయాలని సంకల్పించారు.

దాసి అయిన మందర దుర్బోధవలన మా చిన్నత్త అయిన కైకేయి తన కొడుకైన భరతునికే రాజ్యము కావాలని అడిగింది. రాముని అడవికి పంపుమని కోరింది.

నా భర్త రాముడు ఒకరికి ఇచ్చేవాడే కాని, ఒకరి దగ్గర దేన్ని పుచ్చుకొనేవాడు కాదు. తన ప్రాణరక్షణావసరంలో కూడ ఎవ్వరితోనైనా కొంచెమైనా అప్రియము పలికేవాడు కాదు.

"దద్యాత్ న ప్రతిగృహ్ణీయాత్। న బ్రూయాత్కించిదప్రియం।

అపి జీవిత హేతోర్వా। రామః సత్యపరాక్రమః"

మా రాముడు సత్యపరాక్రముడు. సత్యమే పరాక్రమంగా కలవాడు. సత్యమైన (మొక్కవోని) పరాక్రమం కలవాడు. "సత్యేన జయతి లోకాన్" అన్నట్లు తన సత్యవ్రతంతో పరలోకాలన్నిటిని ఆక్రమించుకోగలిగినవాడు.

ఆయన రాజ్యపాలన కంటే వనవాసమే మహోదయంగా భావించి రాజ్యాన్ని తృణప్రాయంగా భావించి, తన పినతల్లికి సంతోషాన్ని కల్గించడం కొరకు అడవులకు బయలు దేరాడు.

నేను రామునితో ఉండడమే స్వర్గంగా భావించి, నా భర్తను అనుసరించాను. మా మరిది మా కంటే ముందే నారచీరలను ధరించి, నా ద్వారా అన్నను ఒప్పించి, మాతో అడవులకు బయలుదేరాడు. కన్నతండ్రివలె (మా కన్న తండ్రివలె, రాముని కన్నతండ్రి వలె) పదమూడు సంవత్సరాలలో మేము పడుకొన్నప్పుడు, లేచినప్పుడు తాను నిద్రాహారాలు మాని మాకు అన్ని సౌకర్యాలను కల్పించాడు.

నా "మాయామృగ వ్యామోహం" వలన నేను రామలక్ష్మణులకు దూరంగా రావణాసురునిచే అపహరింపబడి ఇక్కడ అనాధవలె ఉన్నాను. ఇక రెండు నెలల తరువాత నేను జీవించి ఉండజాలను" అని సీతాదేవి తెలిపింది.

సీతాదేవి తాను రామునితో గడిపిన బ్రహ్మానందాన్ని, ఇప్పుడు రావణుని వలన పొందుతున్న నరక బాధలను హనుమకు తెలిపి తాను అంతులేని చింతను పొందసాగింది.

ఆమెకు రామునివార్త తెలుపకపోతే - ఆ దుఃఖంతో ఆమె ఏమి అయిపోతుందో అని భయపడి హనుమ బదులు పలికాడు:-

"అమ్మా! రాముడు కుశలంగా ఉన్నాడమ్మా! నీ కుశలం తెలిసికొని రమ్మని నన్ను పంపాడు.

ఆ వేదవిదుని అనుజుడు, మహాతేజశ్శాలి అయిన, సౌమిత్రి, అన్నగారి దుఃఖాన్ని పంచుకొంటూ, నీకు తలవంచి నమస్కరించాడు" అని హనుమ తెలిపాడు.

రామలక్ష్మణుల క్షేమవార్త విని సీతాదేవి సంతోషంతో పొంగిపోయింది. అప్పుడామె కొక సామెత గుర్తుకు వచ్చి సామీరి (హనుమ)తో ఈ విధంగా అంది.

"కల్యాణీ బత గాథేయం। లౌకికీ ప్రతిభాతిమాం
ఏతి జీవంతం ఆనందో। నరం వర్షశతాదపి"

"హనుమా! నాకొక లౌకికమైన సామెత గుర్తుకొచ్చింది" మనిషి ఓపిక పట్టి జీవించి ఉంటే నూరేండ్లకైనా ఆనందాన్ని పొందుతాడు" అని. ఆ సామెత ఇప్పుడు నా జీవితంలో సత్యమైంది సుమా" అంది.

"బ్రతికి ఉండిన సుఖముల బడయవచ్చు", "బ్రతికి ఉండిన బలుసాకు బడయవచ్చు" నని అటువంటి సామెతలే ఉన్నాయి.

సీతాదేవి యొక్క సంతోషాన్ని గమనించిన హనుమ ఆమెతో ఇంకా మాట్లాడాలను కొని మరింత దగ్గరకు రాసాగాడు.

ఆయన దగ్గరకు వస్తుంటే సీతాదేవికి మళ్లీ అనుమానము మొదలైంది. "అయ్యో! ఈయనను నమ్మి నా చరిత్ర అంతా ఈయన ముందు విప్పాను కదా! ఈయన రామభక్తుడను కొన్నాను. కాని రావణుడే కావచ్చు. ఆయన సహజరూపంతో నేను ఆయనకు లోబడలేదని అనుకొని ఇప్పుడు రూపము మార్చి ఈ విధంగా నన్ను లోబరుచుకోవాలని నా దగ్గరకు వస్తున్నాడేమో" అని భయపడసాగింది.

"రావణా! ఇదివరకు సన్యాసి రూపంలో మా ఆశ్రమానికి వచ్చి నన్ను అపహరించి తెచ్చావు. ఇప్పుడు వానర రూపంలో నన్ను వశపరుచుకోవాలని చూస్తున్నావు. ఇదివరకే నేను చచ్చిన పామును. నా నాధునికి దూరమైన జీవచ్ఛవాన్ని. ఇప్పుడు నన్నింకా బాధపెట్టడం నీకు న్యాయం కాదు" అని చెట్టుకొమ్మను వదలి, నిలుచున్నది నిలుచున్నట్లుగానే నేలకూలింది.

హనుమకు ఏమి చేయాలో తోచడం లేదు. ఆయన కూడ కన్నీరు కారుతున్న కళ్లతో ఆమెకు అంజలి ఘటించాడు.

సీతాదేవి మనస్సులో మారు ఆలోచనలు మొదలయ్యాయి "ఈయన నేను భయపడ్డట్లుగా రావణుడు కాకపోవచ్చు. ఎందుకంటే రావణుడు ఎప్పుడు నా దగ్గరకు వచ్చినా నా మనస్సులో ఆందోళన, భయభ్రాంతులు చోటు చేసికొన్నాయి.

మరి ఇప్పుడేమో ఈయన దగ్గరలో ఉన్నా నా మనస్సు సంతోషమయంగా ఉంది. నాకు భయం కలుగడం లేదు.

"ఓ వానరోత్తమా! నిజంగా నీవు రాముని దూతవైన హనుమవే అయితే నీకు శుభమగు గాక! కపిశ్రేష్ఠా! వర్షకాలంలో ప్రవాహము ఎక్కువైనా కొద్ది ఒడ్డు ఎలా తరిగిపోతుందో అలాగే రాముని వృత్తాంతము నా దుఃఖాన్ని తగ్గిస్తుంది. ఏదీ నా రాముని కల్యాణ గుణగణాలను తెలుపు" మంది.

"అంతలోనే రామదూత ఎక్కడో కిష్కింధ నుండి ఇక్కడ దాకా రావడం ఎలా సాధ్యము? ఇది నిజం కాదేమో కలేమో? ఒకవేళ కలవచ్చినా బాగుండేది కలలో నైనా నా రాముని కనులారా చూచేదాన్ని కదా! నాకంతటి అదృష్టమా?

రావణుడు నన్ను బలవంతంగా ఇక్కడికి తెచ్చిన నాటినుండి నా కళ్లు మూతపడడమే లేదుకదా! నాకు కలలు మాత్రము ఎలా వస్తాయి?

ఒకవేళ ఇది కలే అయితే కలలో ఒక కోతి కనబడితే అది అంత మంచిది కాదు. కాని నాకు ఈ కలలో హనుమ వలన చనిపోయే వాళ్లను కూడ బ్రతికించే సుధామధురమైన రామ వృత్తాంతాన్ని వినే అదృష్టము కలిగింది.

ఇది కల కూడ కాకపోవచ్చు. నిజం కాకపోవచ్చు. మరి ఇంకేమిటి ఇది? ఇది కేవలము నా భ్రమ కావచ్చు. రామనామాన్ని నిరంతరము అనుసంధిస్తున్న నాకు, రామ స్వరూపాన్నే అనవరతము ఆరాధిస్తున్న, ధ్యానిస్తున్న నాకు, రామనామము, రామకథాగానము వినిపిస్తున్నట్లు అనిపిస్తున్నదేమో? ఈ భ్రమకు కారణము నా నిరతోప వాసాల వలన కలిగిన పైత్యము కావచ్చు. నా మనస్సులో మనస్సులేక పోవడం కావచ్చు. రామునిపై నా ప్రేమోన్మాదము కావచ్చు. ఎండమావిలో నీరున్నట్లు భ్రమ కలిగినట్లు నాకు భ్రమ కలిగిఉండవచ్చు.

ఇది పైత్యము కాదు. ఉన్మాదము కాదు, మోహము కాదు. భ్రమ కూడ కాదు. నా ఎదుట వానరుడు నిలుచొని ఉన్నాడు. నేను ఉన్నాను. నాకు శరీర స్పృహ కూడ ఉంది. అంటే ఇది నిజమే కావచ్చు. నిజమే అయితే ఇది ఎట్లా నిజం కావడానికి వీలు ఉంటుంది? ఇది రాక్షసమాయే కావాలి. ఈయన వానర రూపంలో ఉన్న రావణుడే. కామరూపుడైన రావణుడే వానర రూపంతో నా దగ్గరికి వచ్చి ఉంటాడు అని తీర్మానించుకొని ఆయనకు దూరంగా మాటాడకుండా ఉండిపోయింది.

పరుల మనస్సులను బాగా అర్థం చేసికోగల హనుమ సీతాదేవి యొక్క మనోవిచారాన్ని అంతా ఊహించి, అర్థము చేసికొని, ఆమెకు మనఃప్రియంగా రామవృత్తాంతాన్ని తిరిగి వివరింపసాగాడు.

"తల్లీ! రాముడు సర్వదేవతల స్వభావాలను స్వయంగా కలిగి ఉన్నాడు. ఆయన సూర్యుని వంటి తేజశ్శాలి. చంద్రునివలె ఆహ్లాదాన్ని (హాయిని) కలిగిస్తాడు. కుబేరుని వలె నిత్యసంపన్నుడు. బృహస్పతి వలె సత్యవచనుడు. మన్మథుని వలె సౌందర్యమయుడు.

ఆయన ఓపికలో భూదేవత. కోపంలో కాలాగ్నిసముడు. ఆయన బలిష్ఠములైన బాహువుల నీడలో సకల లోకాలు శాశ్వతంగా సంతోషంగా ఉంటాయి.

అటువంటి రాముని మాయామృగ కారణంగా నీకు దూరం చేసి శూన్యమైన ఆశ్రమం నుండి నిన్ను రావణుడు అపహరించి తెచ్చాడు కదా! దానికి ఫలముగా ఆయన అనుభవించబోయే ఘోర నరకాన్ని నీవు స్వయంగా చూస్తావు.

రామచంద్రస్వామి రామనామాంకితాలైన భయంకర బాణాలతో రావణుని పుత్ర, మిత్ర, పరివార సమేతంగా సంహరిస్తాడు.

ఆ రాముడు నీ వివరాలు తెలిసికోవడానికి, నన్ను పంపగా వచ్చిన వాడిని. నేను ఆయన ప్రతినిధిని. ఆయన దూతను.

నీవు దగ్గరలో లేనందువలన రాముడు దుఃఖముతో తపిస్తున్నాడు. ఆయన, ఆయన తమ్ముడు లక్ష్మణుడు, రాముని మిత్రుడు, మా మహారాజు అయిన సుగ్రీవుడు నీ కుశలమడిగారు.

రామలక్ష్మణుల మనస్సులలో నీవే కొలువై ఉన్నావు. వాళ్లు నిన్ను స్మరించని నిమిషమే లేదు.

నేను సుగ్రీవ సచివుడను. హనుమను. నేను నిజంగా వానరుడనే. నేను రాముని దయతో అపారమైన అర్ణవాన్ని (సముద్రాన్ని) దాటి లంకలోకి వచ్చాను. రావణుని సైతము నిర్లక్ష్యం చేసి, నిన్ను చూచాను. అమ్మా! నేను కామరూపుడైన రావణుడను కాను. నా మాట నమ్ము తల్లీ!

"అమ్మా! వేలకొలది వానరులు ఎవ్వరి దర్శనం కొరకు తపిస్తున్నారో అటువంటి నీ దర్శనాన్ని నా అదృష్ట కారణంగా పొందాను తల్లీ!" అని విన్నవించుకొన్నాడు.

ఈ సర్గలో సీతాదేవి ఒక సామెతను శ్లోకరూపంలో తెలిపింది. అది చాల ముఖ్యమైంది. సుఖసంతోషాలకు దూరమైన వారందరు తెలిసికోదగినది.

"ఏతి జీవంత మానందో। నరం వర్షశతాదపి"

జీవితాన్ని ఓపికతో గడుపుకొనే వారికి నూరేండ్లకైనా (ఎంత కాలానికైనా) ఆనందము కలుగుతుంది".

సాధారణంగా మనుష్యులమైన మనకు ఓపిక అనేది ఉండదు. "ఎప్పుడు సుఖసంతోషాలే కలుగాలి" అని కోరుకొంటాము. దుఃఖాలు వస్తే సహించలేము.

అయితే ఎప్పుడూ సుఖాలే కావాలి, సంతోషమే కలుగాలంటే వీలు ఉంటుందా? మనం చేసే పనులన్ని పుణ్యాలేనా? కావుకదా! చేసేవి పుణ్యపాపాలు రెండు అయితే వచ్చేవి సుఖాలే కావాలి అంటే వీలు ఉంటుందా? పాపఫలము అనుభవించకుండా తప్పుతుందా?

కష్టాలు రాగానే, అనుకొన్నవి జరుగకపోగానే ఈ రోజులలో మనుషులు అధికంగా అనుకొనేది బలవంతంగా చావాలని. ఎంతోమంది యువతీ యువకులు ఆత్మహత్య చేసికోవడం ప్రతిరోజు మనము వార్తాపత్రికలలో చూచేదే.

సీతాదేవి కూడ మనవంటి జీవే. ఆమె రామునికి దూరమై, ఇక ఎన్నడు ఆయనతో కలయికకు అవకాశములేదని రావణాది రాక్షసులు బెదిరిస్తే, అది నిజమే కావచ్చునని,

ఇక తాను రామునితో కలిసే అవకాశమే కలుగదని భావించి, "శింశుపా" వృక్షం కొమ్మను పట్టుకొని, దానికి తన జడను బిగించి ఉరివేసుకొందామని భావించింది.

హనుమ తనకు ఆ శింశుపా వృక్షంపై నుండే కనిపించి, రామకథామృతాన్ని గానం చేస్తుంటే, అప్పుడామెకు తన ఆత్మహత్యా ప్రయత్నం ఎంత తప్పో తెలియవచ్చింది. ఓపికతో ఉంటే ఎప్పుడో ఒకసారి తప్పక సంతోషము కలుగుతుందని ఆమె తెలుసుకొంది.

ఈ శరీరాన్ని మనం సృష్టించుకోలేదు. భగవంతుడు ఇచ్చాడు. మన తల్లిదండ్రులు కష్టపడి కన్నారు. కన్నతల్లి నవమాసాలు మోసి కన్నది. మన తల్లిదండ్రులు పూలమొక్కలను నాటి పెంచే తోటమాలుల వలె అనేక కష్టాలను భరించి, పెంచి, చదివించి ఇంతవాళ్లను చేశారు. ఇందులో మనం చేసిందేమైనా ఉందా? ఇప్పుడు ఈ శరీరముపై అధికారము మనకు ఏమైనా ఉంటుందా?

ఈ ఆలోచన ఏది లేక ఆత్మహత్యకు పాలుపడడం ఎంతవరకు మంచిది? భగవత్సం కల్పాన్ని, తల్లిదండ్రుల సంతోషాన్ని వమ్ము చేయటం కాదా? వాళ్లకు ద్రోహం చేయడం కాదా? తమ పిల్లలు సుఖ సంతోషాలతో బ్రతుకాలని కలలు కనే వాళ్ల కలలను కల్ల చేయడం కాదా? ఇది మహా పాపం కాదా?

"జిజీవిషేత్ శతగ్ం సమాః" అంటుంది వేదము. నూరేండ్లు కష్టమైనా, సుఖమైనా బ్రతుకాలని కోరుకోవాలని వేదమాత వివరిస్తున్నది.

ఈ సామెత లౌకికమైనా, ఆధ్యాత్మికంగా కూడ వర్తిస్తుంది.

"ఏతి జీవంతం ఆనందోనరం వర్షశతాదపి" – నూరేండ్లకైనా నరునికి ఆనందం కలుగుతుంది.

ఆనందమంటే ఏమిటి? భార్యానందమా? పుత్రానందమా? గృహానందమా? అధికారానందమా?

ఆనందమంటే ఇవి ఏవి కావు. ఇవి కొంతవరకు కొంత ఆనందాన్ని కలిగిస్తే కలిగించ వచ్చుకాక! కాని ఈ ఆనందము అల్పమైంది, అస్థిరమైంది. ఈ ఆనందం కేవల ఆనందం కాదు. దుఃఖంతో కూడకొన్నది.

ఈ ప్రాపంచికానందాలకంటే స్వర్గలోక, బ్రహ్మలోకానందాలు కొంత అధికంగా ఉండవచ్చు. కొంత ఎక్కువ కాలము ఉండవచ్చు.

కాని నిజంగా ఆనందం అంటే పరమాత్మ ఆనందమే. అది అపరిమితమైంది. శాశ్వతమైంది. ఆ భగవదానందాన్ని ఇంత అని మనస్సు ద్వారా నిర్ణయించడానికి వేదమే ప్రయత్నించి, స్వయంగా సాధ్యంకాక, ఊరకుంది.

"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ ఆనందం బ్రహ్మణః" అంటుంది శ్రుతి.

ఆ భగవదానందాన్ని మనము స్వప్రయత్నంతో సాధించుకోలేము. అందువలననే వాల్మీకి భగవానుడు "నరః ఆనందమేతి" నరుడు ఆనందాన్ని పొందుతాడు" అనలేదు. "ఆనందో నరమేతి" ఆనందము నరునికి కలుగుతుంది అన్నాడు. ఎలా కలుగుతుంది. ఈ ఆనందము? భగవత్కృప వలన. దీనికి మనమేమి చేయాలి?

ఈ (మానవ) శరీరము భగవత్ప్రసాదము, మాతాపితృ ప్రసాదము అనుకోవాలి. మనకు సుఖం కలిగితే ఎలా ఉంటామో? కష్టము కలిగితే అలాగే ఉండాలి. సంతోషానికి పొంగిపోకూడదు. దుఃఖానికి క్రుంగిపోవద్దు.

సుఖము కలుగడానికి మన గొప్పదనమే కారణమని, దుఃఖము కలుగడానికి భగవంతుని దయారాహిత్యమే కారణమని అనుకోవద్దు.

అయితే ఈ సుఖదుఃఖాలకు మనము చేసిన పుణ్యపాపాలే కారణమని ఊరుకోవాలి. లేదా ఈ రెండు భగవత్ ప్రసాదాలే అనుకోవాలి. కష్టాలు, దుఃఖాలు కూడ "అతువుం అవన్ తిన్ అరుళే" అంటారు మన పెద్దలు. అంటే అవి కూడ భగవంతుని అనుగ్రహ ఫలితాలే అంటారు.

"దుఃఖము, కష్టము భగవదనుగ్రహ ఫలితాలు ఎలా అవుతాయి?" అంటే వాటివలన మన పాపానుభవం కొంత తగ్గిపోతుంది కదా! పాపానుభవం తగ్గడం భగవత్కృపా ఫలం కాదా?

అప్పుడు ఈ శరీరము భగవత్ప్రసాదము. ఈ జీవితము భగవత్ప్రసాదము. ఈ సంసారము భగవత్ప్రసాదము అని విశ్వసిస్తే ఈ సుఖ దుఃఖాలు రెండు సమానమే అవుతాయి.

"సుఖ దుఃఖః సమః స్వస్థః"

అప్పుడు ఈ జీవితాన్ని కొనసాగించడం ఒక తపస్సు అవుతుంది. ఎప్పుడు ఏ పని చేసినా భగవత్కైంకర్యమే అనుకొని చేస్తాము. బరువు బాధ్యతలన్ని, భగవంతుని పైననే వేస్తాము.

భగవంతునిపై భారాన్ని వేయడాన్ని "సతి న్యాసః" అంటారు. అదే "సన్యాసము" అనబడుతుంది.

సన్యాసమంటే భార్యాపుత్రాదులను (కుటుంబాన్ని) వదలి కాషాయాన్ని ధరించడం కాదు. కుటుంబాన్ని వదలినంత మాత్రాన భగవంతునిపైన భారము వేసి, నిశ్చింతగా ఉండడము అందరికి సాధ్యము కాదు. కుటుంబంతో ఉన్నంత మాత్రాన భగవంతునిపైన భారము వేయడం అసాధ్యం కూడ కాదు. మన పూర్వాచార్యులలో కొంతమంది గృహస్థులు కూడ ఉన్నారు. నాథమునులు, మహాపూర్ణులు, కూరేశులు మొదలైన వాళ్లు ఎందరో ఉన్నారు. సంసారాన్ని వదలిన వారు కూడ వీరినే ఆశ్రయించి తరించారు.

ఈ విధంగా భగవంతునిపైననే సర్వ భారము వేయడాన్ని, "సన్యాసము", "న్యాసము" అంటారు. అదే గొప్ప తపస్సు అంటారు.

"న్యాసమేషాం తపసాం వరిష్ఠ మాహుః"

ఇటువంటి ప్రపన్నులను తన వద్దకు ఎప్పుడు తీసిక వెళ్లాలా? ఎప్పుడు వీరిని ఈ కష్టాల నుండి శాశ్వతంగా దూరము చేయాలా! అని భగవంతుడే ఆలోచిస్తాడు. ఆయన మనను తన దగ్గరకు చేర్చుకోవాలని అనుకొన్నప్పుడు మన హృదయంలోనే నిత్య నివాసం చేసే ఆయన మనకు దారి చూపుతాడు.

"హార్దానుగ్రహలబ్ధ మధ్య ధమని ద్వారాత్ బహిర్నిర్గతః" అంటారు పెద్దలు శ్రీవాత్స్య వరదులు. అర్చిరాది మార్గంగా సకల దేవతలతో సన్మానాలను చేయించి తన పరమపదానందాన్ని కృప జేస్తాడు.

నిజంగా భగవంతుడు వేరు, ఆనందం వేరు కూడ కాదు. "ఆనందోబ్రహ్మ" అంటుంది శ్రుతి.

"ఏతి జీవంతమానందో" - అంటే తన ఆజ్ఞ ప్రకారము ఈ జీవితం గడుపుకొనే నరుని తానే పొందుతాడు. భగవంతుడిని చేరుకోవడం నరునికి ఆనందము కాదు. నరుని తాను పొందడం నారాయణునికే ఆనందము.

"తనక్కేయాగ ఏనై కొళ్లు మీదే" తన ఆనందం కొరకే నన్ను తీసిక వెళ్తున్నాడు ఆశ్రియః పతి" అంటారు నమ్మాళ్వారు. భగవదానందం కొరకే తన ఉనికి అనుకోవడం "పరగత స్వీకారము" అనబడుతుంది.

"మరుందే నంగళ్ పోకమకి జిచ్చిక్కు" - నా సుఖం కొరకే నా ఆనందం కొరకే అనే రోగానికి మందైన వాడా!" అంటారు లోక గురువులు.

"వర్షశతాదపి" అంటే నూరేండ్లకు అని మాత్రమే అర్థం కాదు. కొందరు నూరేండ్ల కంటె ఎక్కువ బ్రతుకవచ్చు. కొందరు ముందే పోవచ్చు. "శతమానము" అనేది ఒక సాధారణ గడవు.

విద్యార్థులకు నూరు మార్కుల పేపరు ఉండవచ్చు. అంతమాత్రాన పరీక్ష వ్రాసిన వారికి అందరికి నూటికి నూరుమార్కులు వస్తాయా? రావు కదా! ఎవ్వరికో ఒక్కరికి పరీక్షాపత్రము చాలా బాగా వ్రాసినవారికి రావచ్చు. నిజంగా వ్రాసినవారికి అనడం కంటే చాలా బాగా వ్రాశాడు అని పరీక్షాధికారి అనుకొంటే, ఆయన అనుకొన్న విద్యార్థికి నూరు మార్కులు రావచ్చు.

అంతవరకు బాగానే ఉంది కాని. నూరేండ్ల కంటె ఎక్కువ కాలము బ్రతికిన వారి మాట ఏమిటి?

మనను ఇంగ్లీషు వాళ్లు పరిపాలించే రోజులలో పరీక్షాధికారులు అత్యుత్తమ విద్యార్థులకు నూరుకంటె ఎక్కువ మార్కులుకూడ ఇచ్చేవారట.

ఉదాహరణకు ఒక ప్రశ్న పత్రంలో 10 ప్రశ్నలు ఇవ్వబడి అయిదు ప్రశ్నలకు సమాధానాలు వ్రాయుమని ఉంటుంది. అంటే అయిదు ప్రశ్నలకు చక్కటి సమాధానాలు వ్రాస్తే 100 మార్కులు వస్తాయి. మరి ఒక అత్యుత్తమ విద్యార్థి 10 ప్రశ్నలకు 10 ప్రశ్నలు చక్కగా వ్రాశాడు. ఆయనకు ఎన్ని మార్కులు రావాలి? నూరే మార్కులు ఇప్పుడు ఇస్తున్నారు. కాని ఇంగ్లీషు వాళ్లు పరిపాలించే రోజులలో నూటికి రెండు వందల మార్కులు ఇచ్చేవారు. డబుల్ ప్రమోషన్‌లిచ్చే వారు. ఎనిమిదవ తరగతిలో అత్యుత్తమంగా ఉత్తీర్ణుడైన విద్యార్థిని 9వ తరగతిలో చదువకుండానే 10వ తరగతిలో చేర్చుకొనేవారు. సర్ సి.వి. రామన్ పన్నెండేళ్ల వయస్సులోనే బి.ఎస్.సి.లో చేరాడట.

మొత్తము మీద తాత్పర్యమేమిటంటే - భగవంతుడే స్వతంత్ర పరీక్షాధికారి. సాధారణంగా మన ఆయుష్యము నూరేండ్లు అయినా ఆయన ఇష్టాన్ని బట్టి నూరేండ్లు ఉంచవచ్చు. తక్కువ ఉంచవచ్చు. ఎక్కువగా ఉంచవచ్చు.

"నాళేలరియేన్ ఎనక్కుళ్లన" అంటారు ఆళ్వారులు. "నీవు నన్ను స్వీకరించేనాడు (రోజు) నాకు తెలియదు స్వామీ" అంటారు ఆ భక్తాగ్రేసరులు.

అయితే సీతాదేవి లంకలో ఉన్నంత కాలము రామునితో, లక్ష్మణునితో కలవాలని ఎదిరిచూచినట్లు మనము ఈ శరీరంలో ఉన్నంత కాలము "అడియార్‌గళ్ కుజాంగళై ఉడన్ కూడువ దెన్నుకోలో" స్వామీ! దాసుల గుంపులో చేరి ఉండేది ఎన్నడో కదా! అని పరాంకుశ మునుల వలె ఎదిరి చూడడమే మన కర్తవ్యము.

ఇతిశం

# రామలక్ష్మణుల లక్షణాలు - 26

శ్రీరామభద్రుని పరాక్రమాన్ని గురించి హనుమ చెప్పిన వాక్యాలు సీతాదేవి మనస్సులో అనుమానాన్ని అంతం చేసి, ప్రశాంతతను ఏర్పరిచాయి.

అయితే ఆమెకు ఒక విషయం అర్థంకాలేదు. రామలక్ష్మణులు మనుష్యులు. సుగ్రీవాదులు కోతులు. ఎక్కడైనా స్నేహం ఇద్దరు మనుష్యుల మధ్య, లేదా రెండు కోతుల మధ్య ఉంటుంది. కాని మానవులకు, వానరులకు మధ్య మైత్రి అనేది ఉండదు కదా!

మనుష్యులు కొన్ని జంతువులను పెంచుకోవచ్చు. వాటికి వారికి మధ్య అవగాహన (అర్థము చేసికొనే) శక్తి ఉండవచ్చు. అంతేకాని వారికి, వాటికి మధ్య మైత్రి సాధ్యము కాదుక దా!

అందువలన రామలక్ష్మణులకు సుగ్రీవాదులకు మధ్య మైత్రి ఏర్పడిందంటే ఆమెకు ఆశ్చర్యం వేసింది. ఆ ఆశ్చర్యంతోనే అడిగింది –

"వానరాణాం నరాణాంచ కథమాసీత్సమాగమః?"

"చపల చిత్తులైన వానరులకు, వశిష్టమహర్షి శిష్యులు స్థిరచిత్తులైన రామలక్ష్మణులకు (నరులకు) కలయిక ఎలా ఏర్పడింది?

ఒకవేళ నిజంగా మా రామలక్ష్మణులకు మీతో స్నేహమేర్పడితే, మా రాముని స్వరూపాన్ని నీవు చక్కగా తెలిసికొని ఉంటే ఆయన రూపాన్ని, లక్షణాలను వివరించు. రాముని యొక్క జగన్మంగళ స్వరూపము వింటే ఇక నాకు దుఃఖమే కలుగదు".

హనుమ శ్రీరాముని దర్శనం కలిగినప్పటి నుండి ఇప్పటి దాకా ఎల్లప్పుడు శ్రీరామచంద్రుని జగన్మోహన రూపాన్ని తన మనోనేత్రముల ముందు సాక్షాత్కరించు కొంటూనే ఉన్నాడు. హనుమ ఎక్కడికి వెళ్లినా, ఏది అన్నా, ఏ పని చేసినా శ్రీరాముని సుందర శుభాశ్రయరూపము ఆయన మనో దర్పణం నుండి చెరిగి పోలేదు. అందువలన ఆయన చిరునవ్వుతో

"జానంతీ బత దిష్ట్యామాం। వైదేహి పరిపృచ్ఛసి"

అమ్మా! నన్ను పరీక్షిస్తున్నావా తల్లీ! జగద్భర్త అయిన నీ భర్త యొక్క రూపు రేఖలు ఆయన సంస్థాన విశేషాలు నీకు తెలియవా తల్లీ! అయినా నా రామభద్రుని స్వరూప సౌందర్యగానం కంటె నాకు కోరదగిందేముంటుంది తల్లీ! అని ఆనందపారవశ్యంతో రామచంద్రుని అసాధారణమైన రూపురేఖా విలాసాలను గానం చేయసాగాడు.

"రామః కమల పత్రాక్షః సర్వసత్వ మనోహరః
రూప దాక్షిణ్య సంపన్నః ప్రసూతోజనకాత్మజే"

జానకీదేవీ! శ్రీరాముడు అచ్చమైన సౌందర్యము ముద్ద. ఆయన సౌందర్యము వాక్కులకు, మనస్సుకు కూడ అందేది కాదు.

ఆ స్వామి ఏ అంగాన్ని చూచినా, మన దృష్టి అంతా అక్కడే ఆగిపోతుంది కద తల్లీ!

అయితే ఆయన ఒక్క కనుల సౌందర్యాన్ని తెలుపుతున్నాను విను.

రామఃకమలపత్రాక్షః:- రాముని కన్నులు తామర పూరేకుల వలె విశాలములైనవి. చెవుల దాకా విస్తరించిన స్వామి కన్నులు అందరిని వశపరుచుకొంటాయి. విముఖులను కూడ ఆకర్షించేవి స్వామి కన్నులు. అభిముఖులైన వారిని చేర రమ్మని పిలిచేవి, దగ్గరకు వచ్చిన వారితో చిలిపిగా దౌత్యం చేసేవి స్వామి కన్నులు.

స్వామి యొక్క సౌందర్యము ఒక మహా ప్రవాహము. ఆ సౌందర్య ప్రవాహములో పైకి తేలకుండా ముంచే సుడులే స్వామి నయనాలు. సర్వ జన వశీకరణ దక్షములు కమనీయ రాముని కమల దళనేత్రాలు.

సర్వసత్వమనోహరః:- హనుమ తన్మయత్వంతో ఊగిపోతూ స్వామి నయన సౌందర్యాన్ని వర్ణిస్తూ పోతూ ఉంటుంటే, సీతాదేవి ముఖం తిప్పుకొని నవ్వుకోసాగింది. "ఈ కోతులకు మా స్వామి అరవిరిసిన కన్నుల సౌందర్యమేమి తెలుసు?" అని.

సీతాదేవి అభిప్రాయాన్ని గ్రహించిన హనుమ, "అమ్మా! రాముని సౌందర్యము సుర, నరులను మాత్రమే కాదమ్మా సర్వప్రాణుల మనస్సులను దొంగిలించి, వశపరుచు కొనేదమ్మా!" అంటూ కొనసాగించాడు.

రూపదాక్షిణ్యసంపన్నః:- స్వామి శరీర గుణాలు అందమైనవే. స్వామి ఆత్మగుణాలు అందమైనవే.

స్వామి రూపము సర్వాధిక సుందరము. స్వామి దాక్షిణ్య (దయా) గుణము కూడ సర్వాధికమే కదా!

ప్రసూతోః:- స్వామి గుణాలు సహజాలు. సంపాదించుకొంటే వచ్చినవి కావు. ఎప్పుడో ఒకసారి వచ్చిపోయేవి కావు. పుట్టుకతో వచ్చినవి. ఎల్లప్పుడు పరిపూర్ణంగా ఉండే గుణ సంపద స్వామికి సహజము.

"గుణాలదేముంది? కొద్దో గొప్పో అందరిలో ఉండేవే కదా!" అంటే కల్యాణ గుణాలు అందరిలో సహజంగా ఉండేవి కావు. ఎప్పుడో ఒకప్పుడు ఉండేవి. స్వామికి ఎప్పుడు ఉండేవి.

జనకాత్మజే:- "ఏమయ్యా! అందమంతా మీ రాముని స్వంతమే అన్నట్లు మాట్లాడు తున్నావు. లోకంలో సుందరులెవ్వరు లేరా? అన్నట్లుగా సీతాదేవి హనుమపై చూపులను విసిరితే, పురుషులలో స్వామితో సాటివచ్చే (మునిజనులను కూడ మోహింపజేసే) సౌందర్యరాశి ఎవ్వరు లేరమ్మా. ఆడవాళ్లలో మాత్రము ఆ స్వామికి సాటి వచ్చే సౌందర్యము నీదేనమ్మా. జానకీ! అన్నాడు హనుమ.

రామః:- రాముడంటేనే సుందరుడని అర్థము కదా! శూర్పణఖ వంటి రాక్షసిని కూడ మోహింపజేసే సౌందర్యము కదా! మన్మథుడు దేవతలు అందరిలో సుందరుడట. అటువంటి మన్మథుని మనస్సును కూడ మథించే సౌందర్యము స్వామి సౌందర్యము.

శ్రీరాముని పురుష సౌందర్యాన్ని ఇంతగా వర్ణించాడు హనుమ. కాని ఆయన మాటలు రాముడు పురుషుడే కాదు పురుషోత్తముడని కూడ సూచిస్తాయి.

రామః:- "రమతీతి రామః" ఆనందించే వాడు రాముడు. "రమయతీతి రామః" అందరిని ఆనందింపజేసేవాడు రాముడు. "రమంతే అస్మిన్ యోగినః" ఇతి రామః" సర్వసంగ పరిత్యాగులైన ముని జనుల మనస్సులను కూడ ఆనందింపజేసే పరమ పురుషుడమ్మా రాముడు.

కమలపత్రాక్షః:- స్వామియొక్క పురుషోత్తమత్వానికి ఉదాహరణంగా స్వామి కన్నులను చెప్పితే చాలమ్మా! స్వామి పుండరీక విశాలాక్షుడు.

శ్రుతి స్వామి కన్నులను వివరిస్తూ "కప్యాసం పుండరీకమేవమక్షిణీ" అని తెలిపింది. నిజానికి స్వామి కన్నులకు కమలాలు కూడ ఉపమానాలు కాదు. అవి ఎండకుఎండుతాయి. వాడుతాయి. సూర్యాస్తమయం కాగానే ముడుచుకొంటాయి.

అయినా స్వామిని వర్ణించాలని ప్రేమ. ఏవో ఉదాహరణలు చెప్పితే వినేవారికి స్వామి స్వరూపము అర్థమవుతుందని తపన. కాని లోకంలో ఏ వస్తువులు కూడ స్వామి సౌందర్యాన్ని, సౌలభ్యాన్ని, సౌశీల్యాన్ని తెలుపడానికి పనికి రావు.

భగవద్రామానుజులు స్వామి కన్నులను కమలాలతో పోల్చాలనుకొని వాటి లోపాలను తొలగించి చూపారు. ఎటువంటి కమలాలు కావాలి? అని ప్రశ్నించుకొని

"గంభీరాంభస్సంభూత" బాగా లోతుగా ఉన్న నీటిలో పుట్టాలి.

"సుమృష్టనాళ" బలసిన కాడలు కలవి కావాలి (నీటిని ఎప్పుడు త్రాగుతు ఉండడము వలన కాడలు బలిసి ఉంటాయి).

"రవికరవికసిత":- ఉదయిస్తున్న సూర్యభగవానుని చక్కిలిగింతలకు అప్పుడప్పుడే వికసిస్తున్న

"పుండరీకదళ" = తామరపూల రేకులవలె.

"అమల, ఆయతేక్షణః":- స్వచ్ఛమై, విశాలములైన నేత్రాలు కలవాడు అని వర్ణించారు.

సర్వసత్వమనోహరః:- సర్వ ప్రాణుల మనస్సులను ఆకర్షించే సుందరుడు స్వామి.

రూపదాక్షిణ్య సంపన్నః:- ఆయన అన్ని ప్రాణుల మనస్సులను ఆకర్షించేది కేవల రూప సౌందర్యంతోనే కాదు. ఆయన గుణ సౌందర్యంతో కూడ.

హనుమతో లక్ష్మణుడు తనను గురించి తెలుపుకొంటూ, "తస్యాఽహం అవరో భ్రాతా గుణైర్దాస్యముపాగతః" మా అన్నగారేమో నన్ను తమ్ముడంటారు. కాని నిజానికి ఆయన గుణసంపదకు అమ్ముడు పోయిన దాసుడిని" అంటాడు. అందువలన హనుమ "రాముడు రూపసంపన్నుడే కాదు. దయాది సకల కల్యాణ గుణసంపన్నుడు" అని తెలుపుతున్నాడు.

ప్రసూతో:- హనుమా! రాముని సౌందర్యము తెలుపుమంటే పరమాత్మ సౌందర్యాన్ని ఎందుకయ్యా తెలుపుతావు? అని హనుమ వైపు చూచింది జానకీ దేవి.

అవునమ్మా! రాముడు కేవలము నరుడు కాదు. "సాధువుల పరిత్రాణము (సంరక్షణ) కొరకు, దుర్మార్గుల (దుష్కృతుల) వినాశం కొరకు ధర్మ సంస్థాపనం కొరకు దేవతలు ప్రార్థించగా నారాయణుడే నరునిగా (రామునిగా) అవతరించాడమ్మా!

జనకాత్మజే:- నీకు రామతత్వం తెలియదా తల్లీ? పరమపురుషుడు రాముడుగా అవతరిస్తే ఆయనని విడిచి ఉండజాలని నీవు

"రాఘవత్వేఽభవత్సీతా" జనక మహారాజుకు యాగ భూమిలో లభించిన అనర్ఘరత్నము వమ్మా!" అని. ఆమె స్వరూపం కూడ తనకు తెలుసునని వివరించాడు.

అంతే కాదమ్మా! రాముడు తేజస్సులో సూర్యునితో సమానుడు. ఓర్పులోభూదేవి వంటి వాడు. బుద్ధిలో బృహస్పతి సముడు. కీర్తిలో ఇంద్రతుల్యుడు.

రాముడు స్వజనాన్ని, సర్వజనాన్ని సంరక్షించేవాడు. తన వృత్తాన్ని, ధర్మాన్ని కాపాడుకొనేవాడు. రాముడు చాతుర్వర్ణాలను సంరక్షించేవాడు. లోకంలో మర్యాదను పాటించేవాడు, పాటింపచేసేవాడు.

ఆయన అగ్నిహోత్రుని అర్చనలో ఆసక్తి గలవాడు. బ్రహ్మచర్య వ్రతాన్ని నిష్ఠతో పాటించేవాడు. సాధువులకు, సజ్జనులకు ఉపకారకుడు. ధర్మ కార్యాలన్నిటిని ప్రచారం చేసేవాడు.

రాజవిద్యలన్నిటిలో ఆరితేరినవాడు. అన్నితెలిసినవాడైనా పెద్దలను ఎల్లవేళలలో సేవించేవాడు. వినయవంతుడు, శీలవంతుడు, యజుర్వేదంలో సుశిక్షితుడు. వేదవేత్తలందరి చేత సన్మానింపబడేవాడు. ధనుర్వేదంలో సర్వాధికుడు. వేదములను, వేదాంగాలను చక్కగా అభ్యసించినవాడు.

విశాల వక్షస్థలుడు, మహాబాహువు. శంఖము వంటి కంఠము గలవాడు. శుభ వదనుడు. సర్వాంగసుందరుడు శ్రీరామచంద్రస్వామి.

శ్రీరాముని సోదరుడైన లక్ష్మణుడు అపరాజితుడు. తన తల్లి సుమిత్రాదేవికి, రామ మాత అయిన కౌసల్యాదేవికి కూడ అత్యంత ప్రియుడు. రూపంలో, అనురాగంలో కూడ రామునితో సమానుడు".

ఆ ఇద్దరు పురుషశ్రేష్ఠులు నిన్ను వెతుకాలని బయలుదేరి అడవి అంతా తిరుగుతూ, అన్న చేత అవమానింపబడి వానర రాజ్యం నుండి వెడలగొట్టబడిన సుగ్రీవుని సందర్శించారు.

మేము నలుగురము వానరులము సుగ్రీవ ప్రభువును విడువక సేవిస్తుంటాము. మా సుగ్రీవ మహారాజు ధనుర్ధరులైన రామలక్ష్మణులను చూచి, తన సోదరుడు పంపిన చారులుగా భావించి భయభీతుడయ్యాడు.

మా రాజాజ్ఞను పాటించి రూపలక్షణ సంపన్నులైన రామలక్ష్మణులకు అంజలి ఘటించి ఆశ్రయించాను. వారిద్దరికి సుగ్రీవుని విషయము తెలిపి, లక్ష్మణుని ద్వారా రామవృత్తాంతము, నీ వృత్తాంతాన్ని కూడ తెలసికొని, వారిద్దరిని నా వీపుపై ఎక్కించుకొని సుగ్రీవ సన్నిధిలో చేర్చాను.

రామసుగ్రీవులకు సఖ్యమేర్పడింది. రాముడు సుగ్రీవునికి అభయమిచ్చాడు. లక్ష్మణుడు రామునికి నీ వియోగం వలన ఏర్పడిన దుఃఖాన్ని సుగ్రీవునికి వివరించాడు.

నిన్ను రావణుడు అపహరించి వెళ్లుతుండగా నీవు ఋష్యమూక పర్వతముపై వేసిన నగల మూట సుగ్రీవునికి జ్ఞాపకం వచ్చింది. నేనా మూటను రాఘవుని ముందు పెట్టాను.

రాముడు నీ నగలను చూడగానే తెలివి తప్పి, కొంత సమయానికి తేరుకొని బహు విధాలుగా దుఃఖించాడు. నేనాస్వామిని ఓదార్చాను.

యాగశాలలో మూడగ్నులవలె, రామునిలో అనిద్ర, చింత, శోకాలు ప్రజ్వరిల్లు తున్నాయి.

వాలిని చంపడానికి రాముడు ప్రతిజ్ఞచేశాడు. నిన్ను వెతుకడానికి సుగ్రీవుడు ప్రతిన పూనాడు.

శ్రీరామచంద్రుడు తన మాటను నిలబెట్టుకోవడానికి సుగ్రీవునితో కలసి కిష్కింధకు వెళ్లి మహాబలుడైన వాలిని ఒకే అమోఘ బాణంతో హతమార్చి సుగ్రీవుడికి రాజ్యాన్ని కట్టబెట్టాడు.

"రామసుగ్రీవయోరైక్యం దేవ్యేవం సమజాయత"

ఈ విధంగా తల్లీ! రామసుగ్రీవులకు ఐక్యం (స్నేహం) కలిగింది. అంతేకాదు తల్లీ! తన తమ్ముడు సర్వసమర్థుడైన లక్ష్మణుడు ఉండగా ఆయనను కాదని, కోతి నైన నన్ను నమ్మి నీ దగ్గరికి అంతఃపురానికి పంపేంత గాఢమైత్రి మాతో ఏర్పడింది. నిజానికి అంతటి గాఢ స్నేహమేర్పడడానికి నాకు కూడ కారణము తెలియనంత గాఢ అనుబంధము కలిగింది.

ఇప్పుడు శ్రీరాముని పట్టమహిషివైన నీకు, ఒక వానర మాత్రుడనైన నాకు ఇంతటి అనుబంధమేర్పడింది కదా! ఇలాగే రామ సుగ్రీవులకు అంతటి అనుబంధం కలిగింది. దీనికి కారణము నాకు తెలిస్తే కదా! వశిష్ట మహాముని శిష్యులైన శ్రీరామ లక్ష్మణులకు చంచలుడైన సుగ్రీవుని మధ్య స్నేహానికి కారణము చెప్పగలిగేది. (వీటి అన్నిటికి కారణము రామచంద్రస్వామి కరుణే అని హనుమ అభిప్రాయము).

రాజ్యాభిషిక్తుడైన సుగ్రీవుడు తన మాట నిలబెట్టుకోవడానికి వానర వీరులందరిని సమావేశపరచి నాలుగు దిక్కులకు నిన్ను వెతుకడానికి వీర వానరులను పంపాడు.

దక్షిణ దిశకు వాలి కుమారుడైన అంగదుని నాయకత్వంలో మేము బయలు దేరాము. నిన్ను వింధ్యాటవిలో వెతుకుతుండగానే సుగ్రీవుడు మాకు విధించిన నెల గడువు గడచి పోయింది.

గడవు గడిచాక నిన్ను చూడనిదే వెళ్లితే సుగ్రీవుడు మా ప్రాణాలను తీస్తాడనే భయంతో మేము ప్రాయోపవేశానికి పూనుకొన్నాము. అక్కడ రామచరిత్ర నంతా చెప్పుకొంటూ "గృధ్ర రాజయిన జటాయువు సీతా సంరక్షణ కొరకు రావణుని చేతిలో ప్రాణాలను త్యాగం చేసిన ధన్యుడు కదా" అని మాట్లాడుకొంటున్నాము.

అక్కడికి అప్పుడు సంపాతి అనే మహాకాయుడైన ఒక గృధ్రరాజు వచ్చి "తన తనయుడైన జటాయువుకేమైంది?" అని అడిగాడు. మా వలన జటాయువు మరణవివరాలు విని, తన తమ్మునికి ధర్మోదకాలు వదలి, "సీతాదేవి రావణుని భవనములో దాచిపెట్టబడిందని, ఆమెను తాను సముద్రము బయట నుండే చూడగల్గుతున్నానని" సంపాతి చెప్పాడు.

ఆ మాటలు మా అందరికి ఆనందోత్సాహాలను కలిగించాయి. మా అనుచరులందరి ప్రోత్సాహంతో నేను నూరు యోజనాల సువిశాల సముద్రాన్ని దాటి లంకలోనికి వచ్చి ఇదిగో ఇప్పుడు నిన్ను చూడగల్గాను. తల్లీ! నేను చెప్పిందంతా యదార్థము. నన్ను రాముని దూతగా నమ్ము. రామలక్ష్మణులు క్షేమంగా ఉన్నారు. నీవు కనబడలేదనే విచారంతో ఉన్నారు.

నా ప్రయత్నము వ్యర్థము కాలేదు. నా భాగ్యవశంగా నిన్ను ఎలాగో చూడగల్గాను. నేను నీ విషయము తెలిపిన తక్షణమే శ్రీరాముడు లక్ష్మణ, సుగ్రీవ, వానరసేనా సమేతంగా ఇక్కడికి దండెత్తి వచ్చి రావణాసురుని సంహరించి నిన్ను తీసికొని వెళ్తాడు.

ఇక నా విషయము వినాలని ఉంటే విను. మా తండ్రి కేసరి అనే వానర వీరుడు. ఆయన దేవతల మాటను మన్నించి మలయ పర్వతము పై నుండి బయలుదేరి గోకర్ణ పర్వత పుణ్యక్షేత్రానికి వెళ్లి సజ్జనులను బాధిస్తున్న "శంబసాదనుడనే" రాక్షసుని సంహరించాడు.

మా తల్లి అంజనాదేవికి వాయుదేవుని ప్రసాదంగా రుద్రాంశతో జన్మించిన వాడను. పుట్టగానే సూర్యుని చూచి ఎఱ్ఱని పండు అనుకొని మ్రింగబోయి, ఇంద్రుని వజ్రాయుధము దెబ్బ వలన క్రింద బడి నా దవుడలు వంకరబోయినందున నన్ను హనుమంతుడు అంటారు" అని హనుమ రామలక్ష్మణుల వృత్తాంతాన్ని, తన విషయాన్ని కూడ నివేదించాడు. సీతాదేవి అతని మాటలు పూర్తిగా నమ్మి ఆనందంతో కన్నీరు కార్చింది.

-- ఇతిశం --

చపలచిత్తులైన వానరులకు, స్థిరచిత్తులైన (రామలక్ష్మణులకు) నరులకు కలయిక ఎలా కలిగింది?
రాముడు కమలపత్రాక్షుడు. సకలప్రాణి మనోహరుడు.

# అంగుళీయక ప్రదానము - 27

"వానరో2హం మహాభాగే। దూతో రామస్య ధీమతః।

రామనామాంకితం చేదం। పశ్య దేవ్యంగులీయకం।

ప్రత్యయార్థం తవానీతం। తేనదత్తం మహాత్మనా।

సమాశ్వసిహి భద్రంతే। క్షీణ దుఃఖఫలాహ్యసి".

ఆంజనేయుడు సీతాదేవి దుఃఖాన్ని తొలగించడానికి, ఆమెలో పూర్తి విశ్వాసం కల్గించడానికి. ధైర్యోత్సాహాలను నింపడానికి శ్రీరామభద్రుని నుండి ఉంగరం తెచ్చానని తెలిపాడు.

"ఓ సౌభాగ్యవతీ! నేను నీవు అనుమానించినట్లుగా నీచుడైన రావణుని కాను. నేను వానరుడను. అయితే ఏమిటి నీ ప్రత్యేకత అంటావా? బృహస్పతిని మించిన బుద్ధిమంతుడైన శ్రీరామభద్రుని దూతను నేను.

నీవు ఆయన దూతవు అవునో కాదో నాకెలా తెలుసు? ఇదివరకు సన్యాసినని చెప్పుకొని వచ్చిన రావణుడు ఇదిగో నా ఇంతటి ఆపదకు కారణమయ్యాడు. అలాగే రామదూతను చెప్పుకొని వచ్చి నీవు ఎంతటి ఆపదకు కారణమవుతావో? అంది సీతమ్మ.

లేదు తల్లీ! నీకు అపకారం చేయాలని రాలేదు. నేను కపటవేషంతో రాలేదు. నేను నిజంగా రామదూత అయిన హనుమనే.

నీవు అనుమానిస్తావని, నన్ను నమ్మవని ముందుగానే నాకు తెలుసు. అందువలన నన్ను నమ్మటానికి ఏదైనా గుర్తునిమ్మని నేను రాఘవుని ప్రార్థించాను. ఆ మహానుభావుడు తన ఉంగరాన్ని గుర్తుగా ఇచ్చాడు. ఇదిగో నీ భర్త కరభూషణాన్ని గ్రహించు. నీ దుఃఖాన్ని తొలగించుకో. కొంత ఊరడిల్లుమని" హనుమ సీతాదేవిని ఊరడించాడు.

సుందరకాండలో చాల శ్లోకాలు మంత్రాలే. మంత్రాలు జపించే వారిని ఎలా రక్షిస్తాయో, అలాగే ఈ శ్లోకాలు కూడ భక్తితో పఠిస్తే మన బాధలను తీరుస్తాయి.

ఈ శ్లోకాన్ని చదివిన తరువాత సీతారాముల (ఫోటోకు లేదా విగ్రహాల)కు అర్ఘ్య పాద్యాలనిచ్చి ఏదో ఒకటి ఆరగింపు చేసి మంగళాశాసనము చేయాలి.

ఆ తరువాత మళ్లీ తరువాత శ్లోకంతో పారాయణాన్ని ప్రారంభించాలి.

అయితే ఎందుకు ఈ శ్లోకానికి అంత గొప్పదనము?

ఈ శ్లోకంలో ఆచార్య స్వరూపము స్పష్టంగా ప్రకటింపబడుతుంది.

హనుమ తనను "వానరుడని" (వానరోఽహం) అని చెప్పుకొన్నాడు సామాన్యంగా వానరుడు అంటే కోతి అని అర్థము. ఆచార్యుడు పెద్దల ముందు నైచ్యానుసంధానాన్ని ప్రకటించు కొంటాడు. తనను "దాసుడ"ని చెప్పుకొంటాడు.

కాని ఆయనచెప్పుకొన్నట్లు ఆచార్యుడు తక్కువ వాడు కాదు. ఆయన సన్నిధిలో గడిపినా కొద్ది ఆయన త్రివిక్రమ స్వరూపము మనకు అర్థమవుతుంది. "ఆయన మనలాగా సామాన్య మానవుడా? అయితే ఇంత వైభవము ఎలా ఉంటుంది ఆయనకు?" అని సందేహం కలుగుతుంది.

హనుమ తెలిపిన "వానరోఽహం" అనే శబ్దాన్ని కొంత నిదానంగా పరిశీలిస్తే "నరోవా?" అని తెలుతుంది. ఆయన మనలాగా "సామాన్యనరుడా?" కాదు అని తేలుతుంది.

హనుమ సీతాదేవిని "మహాభాగే" అదృష్టవంతురాలా! అని సంబోధిస్తున్నాడు. రావణుడు చూపిన ఆకర్షణలకు, అల్పసుఖములకు ఆశపడక, "రామమేవానుధ్యాయంతీ" అన్నట్లు శ్రీరామచంద్రునే మనస్సు నిండా నింపుకొన్న సీతాదేవి నిజంగా మహాభాగురాలే కదా!

అల్పమైన ప్రపంచ సుఖాలను, ఆకర్షణలను తలదన్ని అనల్పమైన పరమాత్మ ఆనందాన్ని కోరుకొనే "ముముక్షువులు" నిజంగా అదృష్టవంతులే కదా!

"దూతో రామస్య ధీమతః" తాను బుద్ధిమంతుడైన రాముని దూతనని చెప్పుకొన్నాడు హనుమ.

"ధీమంతుడైన రాముడు" అంటే జ్ఞాన స్వరూపుడైన పరమాత్మ అని అర్థము. "సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ" అని వేదము భగవంతుని జ్ఞాన స్వరూపుడని వివరిస్తుంది. అటువంటి పరమాత్మకు దూత అయిన వాడు ఆచార్యుడు. ఆచార్యుని యొక్క జ్ఞానానుష్ఠానాలను (శ్రోత్రియం, బ్రహ్మనిష్ఠం) గమనించి భగవంతుడు తన దాసుల యొక్క దుఃఖాన్ని, అజ్ఞానాన్ని తొలగించడానికి వాళ్ల దగ్గరకు ఆ ఆచార్యుని తన దూతగా పంపుతాడు.

"రామనామాంకితం చేదం। పశ్యదేవ్యంగులీయకం"

సీతాదేవిని నమ్మించడానికి "రామనామం" చెక్కబడిన శ్రీరాముని ఉంగరాన్ని చూడుమని చూపుతున్నాడు. అంగులీయకమంటే ఉంగరము.

ఈ "ఉంగరము" అంగుళి భూషణము కదా! అంటే వేళ్లకు ఆభరణము కదా!

కాని వాల్మీకి కవీంద్రుడు దీనిని తరువాత "కరవిభూషణమ్" అంటాడు. "గృహీత్వా సా భర్తుః కరవిభూషణమ్" అని తరువాత శ్లోకంలో భర్తయొక్క కరవిభూషణాన్ని సీతాదేవి గ్రహించింది" అంటాడు.

వేళ్లకు అలంకారముగా ఉండవలసిన ఉంగరము, చేతికి ఆభరణమెలా అవుతుంది? చేతి ఆభరణాలంటే గాజులు, దండగడియాలు కావాలి కదా! ఉంగరం కంటె పెద్దగా ఉండే ముంజేతి కంకణాలు కావాలి కదా!

అంగుళీయకాన్ని కరవిభూషణం అనడానికి ఒక చమత్కారమైన సమాధానం చెప్తుతారు పెద్దలు.

అది నిజంగా రాముని ఉంగరమే. వేళ్లకు పెట్టుకోవలసిందే. సీతాదేవితో కలసి ఉన్నప్పుడు ఆయన ఈ ఉంగరాన్ని వేళ్లకు పెట్టుకొనే వాడే.

కాని సీతాదేవిన్ని కోల్పోయాక, ఆమె విరహంతో కృశించి పోయాడు. ఎంత కృశించి పోయాడంటే, ఇది వరకు వేళ్లకు ధరించిన ఉంగరాన్నే ఇప్పుడు చేతులకు ఆభరణంగా ధరిస్తున్నాడు.

సరే! ఈ చమత్కారార్థాన్ని అలా ఉంచితే "కరవిభూషణం" అంటే ఒక విశేషార్థము కూడ ఉంది. భగవంతునికి కరవిభూషణాలంటే శంఖచక్రాలు కదా! అందువలన రాముని యొక్క (కరవిభూషణమైన) ఉంగరం శ్రీమన్నారాయణుని దివ్యాయుధాభరణాలైన శంఖ చక్రాలకు గుర్తు. ఉంగరము ఒకటే కదా ఏదో ఒక దానినే సూచించాలి కదా అంటే ఉపలక్షణంగా రెండింటిని సూచించవచ్చు.

"ప్రత్యయార్థం తవానీతం। తేన దత్తం మహాత్మనా" మహాత్ముడైన రామచంద్రునిచే ఇవ్వబడిన ఈ విభూషణాన్ని నీ నమ్మకం కొరకు తెచ్చాను" అంటాడు హనుమ.

ఇక్కడ మహాత్ముడు అన్నా "పరమాత్మా" అన్నా ఒక్కటే అర్థము. పరమాత్మ తన విభూషణాలను ఆచార్యునికి ఇస్తాడు. ఆ ఆచార్యుడు ఆ శంఖచక్రాలను మనలో పరమాత్మ పట్ల, తన (ఆచార్యుని) పట్ల నమ్మకం కలిగించడానికి మన రెండు భుజాలకు ప్రసాదిస్తాడు.

ఆచార్యుడు తాపము, పుండ్రము, నామము, మంత్రము, యాగము అని అయిదు సంస్కారాలను అనుగ్రహిస్తాడు కదా. అంగుళీయకము శంఖచక్రాలకే సూచకం కదా! అంటే తాపలక్షణాలైన శంఖచక్రాలు మిగిలిన సంస్కారాలకు ఉపలక్షణమే.

"సమాశ్వసిహి భద్రంతే।
క్షీణదుఃఖఫలాహ్యాసి".

"తల్లీ! ఈ ఉంగరాన్ని స్వీకరించు. శ్రీరామచంద్రుడు నీ దుఃఖాన్ని త్వరలోనే తొలగిస్తాడు. నీవు ఊరడిల్లు" అంటాడు హనుమ.

మన దుఃఖము కూడ తొలగిపోయేది ఆచార్యుని ద్వారా భగవంతుని ఆశ్రయించిన తరువాతే. ఒకసారి ఆశ్రయించాక, (ప్రపత్తి చేశాక) ఇక మళ్లీ మళ్లీ మనము చేయవలసిన దేమి లేదు.

"పునః ప్రపత్తి పాపత్తోడొక్కుం" మళ్లీ మళ్లీ ప్రపత్తి చేయడం పాపంతో సమానము.

మరి సమాశ్రయణం తరువాత ప్రతిరోజు శ్రీపాద తీర్థం పుచ్చుకోవడం లేదా? భగవంతుని మంత్రత్రయాన్ని అనుసంధించుకోవడం లేదా? అంటే అవి పునః ప్రపత్తికి అర్థము కాదు. మనము ఆచార్యుని ద్వారా భగవంతుని ఆశ్రయించామని గుర్తు చేసికోవ డానికి అర్థము. అలాగే మనకు సత్కాలక్షేపము (చక్కగా ప్రొద్దుపుచ్చుకోవడం) కావాలి కదా! ఆచార్య స్మరణ, భగవత్స్మరణ సత్కాలక్షేపానికే గుర్తు కదా!

అంతే కాదు. వారి స్మరణ మనకు ఆనందాన్ని కలిగిస్తుంది. అందువలన భగవన్మం త్రాను సంధానము, ఆచార్యనుసంధానము, శ్రీపాద తీర్థసేవనము పునః ప్రపత్తి కాదని, "కాలక్షేపత్తుక్కుం, భోగత్తుక్కుంహేతు వాయిరుక్కుం" సత్కాలక్షేపానికి, ఆనందానికి కారణమవుతాయని లోక గురువులు సెలవిస్తారు.

మన సమాశ్రయణము మన తాపత్రయాలను తొలగించి పరమపదానందాన్ని కల్గిస్తుందని మనము నమ్మితే, ఇక మన దుఃఖము క్షీణించి పోవలసిందే కదా.

దీనిని సూచించడానికే "సమాశ్వసిహి (నమ్ము)" భద్రంతే (నీకు శుభం కల్గుగాక) క్షీణ దుఃఖ ఫలాహ్యాసి" (నీ దుఃఖ ఫలము నశిస్తుంది) అని హనుమ సీతాదేవిని ఓదార్చాడు.

"శ్రీరాముని ఉంగరాన్ని హనుమ శింశుపా వృక్షం పై నుండి క్రిందికి మొదటే జారవిడిచాడని, దానిని చూచాకే హనుమంతుని చూచి రాముని దూతగా నమ్మి, అయనతో సీతాదేవి మాట్లాడిందని "రామచరిత మానస్"లో ఉంది. ముక్కు మొగ్గము తెలియని హనుమను సీతాదేవి నమ్మాలంటే మొదటనే ఉంగరము సీతాదేవి దగ్గరలో వేస్తే బాగుంటుందని మహాత్ముడైన గోస్వామి తులసీదాస్ భావించి ఉండవచ్చు.

కాని హనుమ చెట్టుపై నుండి ఉంగరాన్ని వేయడం సీతాదేవి గమనించకపోతే, అది ఒకవేళ సీతాదేవికి లభించకపోతే, ఇతరులెవ్వరికైనా దొరికితే చాల ప్రమాదకరము కదా!

అంతేకాదు సీతాదేవిని లోబరుచుకోవడానికి యుద్ధానికి ముందు రావణుడు మాయా రాముని శిరస్సును ఖండించి సీతాదేవికి చూపెట్టుతాడు. అది నిజమే అని సీతాదేవి నమ్ముతుంది. అలాగే "రాముని ఉంగరము వంటి మాయా ఉంగరమును సృష్టించాడు రావణుడు" అని సీతాదేవి ఎందుకు అనుకోకూడదు? సీతాదేవి ఉన్న పరిస్థితులలో ఆమె దేనినైనా నమ్మడం అంత సులువు కాదు.

అంతేకాదు హనుమ మొదట ఉంగరమును అందివ్వడం క్రమం కూడ కాదు.

హనుమ ఆచార్యుడు కదా! ముందు రాముని వృత్తాంతాన్ని సీతాదేవికి తెలిసినంత వరకు (సీతాదేవిని రావణుడు అపహరించేవరకు) తెలిపాడు. రామవృత్తాంతము మృత సంజీవనము – అంటే చనిపోయేవారిని కూడ బ్రతికిస్తుంది. ఆత్మహత్యకు సిద్ధమైన సీతాదేవికి రామవృత్తాంతము చెవులలో అమృతం పోసినట్లు అనిపించింది. బలవన్మరణ ప్రయత్నాన్ని విరమించుకొంది. ఆమెకు బ్రతుకుపై ఆశ కలిగింది.

ఆ తరువాత సీతాదేవికి తెలియని కథను తెలిపాడు. అంటే సీతాన్వేషణలో రామ లక్ష్మణులు కిష్కింధకు రావడం, సుగ్రీవ మైత్రి, వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకము, నాలుగు దిక్కులలో వానరులు పంపబడుట, దక్షిణ దిశలో బయలు దేరిన వారిలో తాను సముద్రం దాటి సీతను చూచుట వరకు తెలిపాడు.

అందువలన ఆచార్యుడు ముముక్షువులకు మొదట భగవన్మహిమను వివరించాలని తెలుస్తుంది. దాని వలన విశ్వాసం కలుగుతుంది.

సీతాదేవికి రామలక్ష్మణుల రూపురేఖలను గురించి వినాలని ఆసక్తి కలిగింది. హనుమ శ్రీరాముని అంగాంగసౌందర్యాన్ని వర్ణించాడు.

ఆచార్యుడు కూడ భగవంతుని దివ్యమంగళ విగ్రహాన్ని వర్ణించాలి. దాని వలన భగవంతునిపై ప్రేమ కలుగుతుంది.

హనుమ తనను "దూతో రామస్య ధీమతః" అని తెలిపినట్లే తనను ఆచార్యుడు భగవద్దాసునిగా, దూతగా తెలుపుకోవాలి.

అప్పుడు ఆచార్యుని పట్ల కూడ ప్రీతి కలుగుతుంది.

శ్రీరాముని పట్ల ప్రేమ, తన పట్ల విశ్వాసం కలిగాక హనుమ రామాంగుళీయకాన్ని పదిలంగా సీతాదేవికి అందించాడు. ఆచార్యుడు కూడ శిష్యుని చేతులకు భగవంతుని కరవిభూషణాలైన శంఖచక్రాలను అప్పుడే ధరింప జేస్తాడు.

ఇది సరియైన క్రమం. వాల్మీకి ఈ సరియైన క్రమాన్నే అనుసరించాడు.

"గృహీత్వా ప్రేక్షమాణాసా। భర్తుః కరవిభూషణం
భర్తారమివ సంప్రాప్తా। జానకీముదితా2భవత్"

హనుమంతుని నుండి తీసికొన్న ఉంగరాన్ని సీతాదేవి అదే పనిగా రెప్పవాల్చక చూడసాగింది. అది తన భర్త ఉంగరము. చాల కాలము తన దగ్గరనే బహుమానంగా భర్త ఉంచిన ఉంగరము. తనకెంతో ప్రియమైన ఉంగరము. ఆటలో ఓడి పోయి తన దగ్గర ఉన్న దానిని రామునికి తాను ఇచ్చిన ఉంగరము.

నిజానికి రామునికి ఉంగరానికి సీతాదేవి దృష్టిలో తేడాయే లేదు. అందువలన ఆటలో ఉంగరాన్ని కోల్పోయాక, రావణునిచే అపహరింపబడి, తాను రామునే కోల్పోయింది.

ఇప్పుడు ఇంత కాలము తరువాత హనుమ ఆ రామాంగుళీయకాన్ని తెచ్చి తన కిచ్చాడు. తన ప్రాణాలు లేచి వచ్చాయి. దానిని వేలుకు పెట్టుకోగానే రామునితో కలయిక జరిగినట్లే భావించి సంతోషించింది.

ఈ ఉంగరాన్ని ధరించాక, రాముడు తనను తప్పక రక్షిస్తాడని ధైర్యము కలిగింది. ఆ ధైర్యాన్ని కలిగించింది రాముని ఉంగరమే.

భగవంతుడు తనను తప్పక రక్షిస్తాడని ధైర్యాన్ని కల్పించేది భగవన్మంత్రము. "మంతారం త్రాయత ఇతి మంత్రః" – మంత్రాన్ని జపించేవారికి భగవద్రక్షణను కలిగించేది భగవన్మంత్రము.

రాముని ఉంగరములో "రామ" నామము (చెక్కబడి) ఉంది. శ్రీమన్నారాయణుని మంత్రరాజంలో ఆయన పేరు ఉంటుంది. మంత్ర రత్నంలో కూడ ఉంటుంది.

"రామ" అంటే "బ్రహ్మ" (పరమాత్మ)

రామ అనే అక్షరాలు బ్రహ్మగా మారాయి (బ్+ర = బ్ర, హ్+మ = హ్మ) "బ్రహ్మ" లో "రామ" నామము ఉంది.

భగవద్రక్షణను నిత్యం కలిగి ఉండవలసిన జీవుడు సంసారంలో చిక్కుపడి (బ్రహ్మను) పరమాత్మను మరచి ఆయన రక్షణకు దూరమయ్యాడు.

సంసార దుఃఖసముద్రంలో పడి మునుగుతూ, తేలుతూ బయటకు రాజాలని బద్ధ జీవుని ధుఃఖాన్ని చూచి భరించలేక పరమాత్మ – ఆ జీవునికి తన రక్షణను అందివ్వమని తన దూతను పంపుతాడు. భగవద్దూత అయిన ఆచార్యుడు భగవన్మంత్రాన్ని మనకు అందించి, ఆయన రక్షణను కలిగిస్తాడు.

ఇదే "రామ" నామాంకితమైన అంగుళీయకమునుసీతా దేవికి హనుమ అందివ్వడం, దానిని చూచి, ధరించి రామునితో కలసినట్లే భావించి సీతాదేవి మోదాన్ని పొందడంలో తాత్పర్యము.

ఇక సీతాదేవి తనకు రామవృత్తాంతాన్ని తెలిపి, తనకు ప్రియమైన రాముని ఉంగరాన్ని అందించిన హనుమ వైభవాన్ని ప్రస్తుతిస్తుంది.

"జప్తవ్యం ఆచార్య వైభవమ్" – అంటారు లోక గురువులు. ఆచార్యుని వైభవాన్ని ఆయన సమక్షంలోనే శిష్యుడు స్తుతించాలి.

"విక్రాంతస్త్వం; సమర్థస్త్వం।

ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ"

యేనేదం రాక్షస పదం।

త్వయైకేన ప్రధర్షితం"

హనుమా! నీవు వీరుడవు, సమర్థుడవు, ప్రాజ్ఞుడవు. ఒంటరిగానే నీ శక్తితో ఈ లంకా నగరాన్నంతటిని అణచివేశావు. ఈ విక్రాంత, సమర్థ, ప్రాజ్ఞపదాలు. శక్తి, బల, జ్ఞానాలను సూచిస్తున్నాయి. ఈ మూడు ఉన్నాయి కనుకనే హనుమ సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించి, లంకిణిని నిర్జించి, రాక్షసుల కళ్ళబడకుండా సీతాదేవిని చూడగల్గాడు.

ఆచార్యునిలో కూడ జ్ఞాన బలశక్తులనే ఈ మూడు గుణాలు ఉండాలి. జ్ఞానం ద్వారా భగవద్వైభవాన్ని, మన దుస్థితిని గమనిస్తాడు. బలం ద్వారా విముఖులమైన మనను అభిముఖులుగా మార్చుకొని, మన దుఃఖాన్ని శమింపజేస్తాడు.

శక్తి ద్వారా పంచ సంస్కారాలను కలుగజేసి భగవద్రక్షణను కలిగిస్తాయి.

"హనుమా! నీవు నూరు యోజనాల మహా సముద్రాన్ని గోవు కాలు గుంట అంత చిన్నదిగా భావించి దాటావు. నీకు రాక్షసులంటే దోమలతో సమానము (మశకీ కృత రాక్షసం). రావణుడంటే గడ్డిపోచతో సమానము (తృణీకృతదశగ్రీవం)

నీ బలాన్ని, చాతుర్యాన్ని, నీ విధేయతను, నీ సహృదయతను పరీక్షించకుండా సమర్థుడైన, సర్వజ్ఞుడైన శ్రీరాముడు నా దగ్గరికి పంపడు.

అది సరే కాని, ధర్మాత్ముడు, సత్యవ్రతుడైన నా రాముడు క్షేమంగా ఉన్నాడా? సమర్థుడైన సౌమిత్రి క్షేమమా?

మా రామునికి నేను గుర్తున్నానా? నన్ను కాపాడుకోవాలని ఆలోచిస్తున్నాడా? నన్ను రక్షించాలనుకొంటే శ్రీరామునికి ఈ సముద్రము ఒక అడ్డా? నిజంగా ఆయన అనుకొంటే ఈ సముద్ర వలయిత భూమండలాన్నంతా ప్రళయాగ్ని వంటి తన కోపాగ్నితో ఒక్క క్షణంలో మాడ్చి, మసిచేయలేడా?

పోనీలే! ఆయన క్షేమంగా ఉన్నాడు కద :- అదే చాలు. రాముడు నా విరహంతో కృశించలేదు కద? చేయవలసిన పనులను చేయక జాడ్యంతో లేడు కదా? సామ, దాన, భేద, దండోపాయాలను సరియైన చోట్ల ఉపయోగిస్తున్నాడా?

దైవ, పౌరుషాలను రెంటిని తగిన పాళ్లలో వాడుతున్నాడా?

లోకభర్త అయిన నా భర్తను కన్నతల్లి కౌసల్యాదేవి క్షేమమా? ఆమెను నీడలా అనుసరించే మా రెండవ అత్తగారు సుమిత్రాదేవి క్షేమమా? అన్నగారి ఆజ్ఞను పాలించుట కొరకే రాజ్య భారాన్ని అంగీకరించిన భరతుడు కుశలమేనా? ఆయన నా రక్షణ కవసరమైన సైన్యాన్ని సహాయంగా పంపుతాడా?

సుమిత్రకు ఆనందాన్ని కలిగించే మా లక్ష్మణుడు తన భయంకర బాణాగ్నితో ఈ లంకను భస్మం చేయాలని అనుకోవడం లేదా?

వానరాధిపుడైన సుగ్రీవుడు వేలాది తన వానర వీరులతో కలసి నన్ను రక్షించడానికి వస్తాడా?

మా రాముడు నా వియోగాన్ని భరించజాలడు. ప్రపంచంలో తల్లి, తండ్రి, మరెవ్వరైనా రామునికి నా అంత ప్రియులు కారు.

ఆయన బంగారు పద్మము వంటి ముఖము నా విరహము వలన నీరులేక ఇంకినట్లు వాడిపోవడం లేదు కదా?

హనుమా! నేనింత వరకు జీవించి ఉన్నది నా ప్రాణాలపై తీపి వలన కాదు. నేను లేనని తెలిసిననాడు నా రాముడు కూడ జీవించి ఉండడని నాకు తెలుసు. అందువలననే నా ప్రాణాలను బిగపట్టుకొని ఉన్నాను".

ఈ విధంగా దీనంగా పలికే సీతాదేవిని చూచి; తన తలపై చేతులు జోడించి హనుమ సీతాదేవికి ఉత్సాహాన్ని కలిగించే పలుకులను పలుకుతున్నాడు.

"తల్లీ! రామునికి ఇంతవరకు నీవెక్కడ ఉన్నావో తెలియదు. తెలిశాక తక్షణమే మహేంద్రుడు శచీదేవిని తీసికవెళ్లినట్లు నిన్ను తీసిక వెళ్తాడు.

నీ వార్త తెలిసిన వెంటనే వానర మహాసైన్యంతో శ్రీరాముడు బయలుదేరి తన బాణాలతో సముద్రాన్ని బంధించి, లంకలోనికి ప్రవేశించి, సమస్త రాక్షస కోటిని సంహరిస్తాడు. ఆయనకు సురులు, అసురులు ఎవ్వరు అడ్డుకారు.

సింహముచే బాధింపబడిన మహాగజమువలె నీ విరహ బాధతో శ్రీరాముడు నలిగి పోతున్నాడు.

మేము నివసించే మహా పర్వతములపై, మేము భక్షించే కందమూల ఫలములపై ఒట్టుపెట్టుకొని నిజమే చెప్పుతున్నాను.

స్వర్గంలో ఉన్న మహేంద్రునివలె ప్రస్రవణ పర్వతముపై అందమైన కన్నులు, సుందరములైన కుండలములు గల శ్రీరాముని నీవు అతి త్వరలో చూడగలవు.

శ్రీరామునికి నీకు దూరమైన నాటినుండి అన్నము, రుచించడం లేదు. నిద్రపోవడం లేదు. ఒకవేళనిద్రపట్టితే, వెంటనే "సీతా" అని నీ మధుర నామాన్ని ఉచ్చరిస్తూ వెంటనే మేల్కొంటాడు.

ఆయనకు ఆయన శరీరముపై స్పృహే లేదు. ఆయన నిన్నే ధ్యానిస్తూ నీ గురించే పలవరిస్తూ, నిన్ను పొందడానికే ప్రయత్నిస్తున్నాడు" అని హనుమ తెలిపాడు. సీతాదేవికి రామ వార్త విన్నందువలన శోకము తొలగింది. కాని ఆయన తన కొరకే శోకిస్తున్నాడని తెలిసి మళ్లీ శోకము కలిగింది. మబ్బులు కొద్దిగా మిగిలిన శరద్రాత్రి వలె సీతాదేవి శోక హర్షాలను కలిగి ఉంది.

-- ఇతిశం --



రాముని ఉంగరాన్ని గ్రహించిన సీత

# రెండు నెలలు మాత్రమే - 28

హనుమంతుడు సీతాదేవితో "అమ్మా! రాముడు క్షేమంగా ఉన్నాడు. కాని నీ విరహ దుఃఖముతో కృంగిపోతున్నాడ"ని చెప్పాడు. ఆ మాటలు సీతకు అమృతమువలె, విషము వలె అనిపించాయి.

"హనుమా! రాముని క్షేమవార్త అమృతము వలె నాకు ప్రాణం పోసింది. అయితే ఆయన అమితమైన దుఃఖంతో ఉన్నాడు" అన్న మాట నాకు విషమువలె భరించరానిదిగా ఉంది.

సుఖదుఃఖాలు మనిషిని త్రాటితో కట్టి లాగినట్లు దైవములాగి వేస్తుంది. దైవాన్ని ఎవ్వరు ఎదిరించజాలరు. లేకపోతే సజ్జనులు, శక్తి సంపన్నులైన రామలక్ష్మణులు, నేను ఇంత ఆపదల వలయంలో చిక్కుకోవడమేమిటి?

శ్రీరామచంద్రస్వామి లంకకెప్పుడు వస్తాడో? రావణుని సంహరించి నన్నెప్పుడు స్వీకరిస్తాడో? అయితే ఆయన ఆలస్యం చేస్తే ప్రయోజనము లేదు. రావణుడు నన్ను తీసిక వచ్చాక, తనను వరించడానికి ఒక సంవత్సరము గడువిచ్చాడు. ఆ గడువు పూర్తి కావడానికి ఇంకా రెండు నెలలు మాత్రమే మిగిలాయి.

రావణుడు మూర్ఖుడు. చండ స్వభావుడు. ఆయన ఎవ్వరి మాటను వినడు. ఇంతకు ముందు ఎన్నోసార్లు "రాఘవునికి నన్ను అప్పగించి లంకా సామ్రాజ్య వైభవాన్ని, ఆనందోత్సాహాలను పదిలంగా కాపాడుమని" విభీషణాదులు హితము పలికారని విభీషణుని పెద్ద కూతురు "అనల" నాతో చెప్పింది. అయితే అంత్యకాలము దాపురించిన వానికి దీపము మలిగిపోయేప్పటి వాసన రానట్లే రావణునికి ఈ సలహాలు రుచించడం లేదు.

అయినా రావణుడెంత కాలము ప్రయత్నించినా నన్ను దక్కించుకోలేడు. నా ప్రభువు అతులిత పరాక్రమ సంపన్నుడు. ఆశ్రిత రక్షాదక్షుడు. నన్ను రావణుని బారి నుండి తప్పక కాపాడగలడు.

రాముడు రావణుని జయించుటకు తగిన బలము, పరాక్రమము, ఉత్సాహము, ప్రభావము మొదలైన గుణాలన్ని కలవాడు.

పదునాల్గు వేల మంది భయంకర రాక్షసులను "ఒంటి చేతితో" గెలిచిన శ్రీరామ భద్రుని ముందు రావణుడు నిలువగలుగుతాడా?

రాముడనే సూర్యుడు తన బాణాలనే కిరణాలతో శత్రుసైన్యమనే జలాన్ని తప్పక ఇంకింప జేస్తాడు" అని పలికి ఊరుకుంది.

హనుమకు సీతాదేవి ఇంకా లంకలో శత్రువుల మధ్య బాధపడడం మంచిది కాదనిపించింది. అప్పుడు హనుమ సీతాదేవి భయాన్ని, బాధను పోగొట్టడానికి ఆమెతో ఈ విధంగా అన్నాడు.

"అమ్మా! నేను తిరిగి వెళ్ళి శ్రీరామచంద్రునికి నీ వార్తను వివరించగానే, ఆయన ససైన్యంగా వచ్చి, రావణుని సంహరించి, నిన్ను తీసికొని వెళ్తాడు.

కాని నీకంత వరకు ఓర్చుకొనే ఓపిక లేక పోతే, నిన్ను నా వీపుఎక్కించుకొని ఇప్పుడే వెళ్లి స్వామి సన్నిధిలో సమర్పిస్తాను.

నేను సముద్రమును దాటడం, నిన్ను దాటించడం నాకు ఒక లెక్క కాదు. అవసరమైతే రావణునితో పాటు, ఆయన పరివారంతో పాటు మొత్తము లంకనే పెల్లగించి, తీసికొని వెళ్లి రాముని ముందు ఉంచుతాను.

అగ్నిదేవుడు హోమంలో అర్పించిన హవిస్సును ఇంద్రునికి అప్పగించినట్లే నిన్ను నేను రామునికి అప్పగిస్తాను. నీవు సందేహించకు. నా వీపుపై కూచో. ఆకాశమార్గంలో సూర్యచంద్రులతో సంభాషిస్తూ నా వీపుపై కూచొని సముద్రాన్ని దాటి ఇప్పుడే రామలక్ష్మణులను చూడగలవు. నన్నెదిరించుటకు రావణునికి శక్తి చాలదు. నేనెంత సులభంగా సముద్రం దాటి వచ్చానో అంత సులభంగా తిరిగి నిన్ను తీసికొని సముద్రం దాటి వెళ్లగలను".

హనుమ మాటలు సీతాదేవికి ఆశ్చర్యాన్ని కలిగించాయి. "హనుమా నీ రూపం చారెడు. నీ పలుకులు బారెడు" అన్నట్లు ఉన్నాయి. పిల్లి అంత చిన్నగా ఉన్న నీవు నన్ను సముద్రం దాటిస్తావా?" అని ప్రశ్నించింది.

సీతాదేవి పలుకులకు హనుమ చిన్నబోయాడు. తన శక్తి సామర్థ్యాలను సీతాదేవికి చూపాలనుకొన్నాడు. తన శరీరాన్ని పెంచసాగాడు. పెద్ద పెద్ద కొండలే చిన్న చిన్న బండలుగా తగ్గిపోయాయి అప్పుడు హనుమ అగ్నివంటి ఎట్టని ముఖంతో, వజ్రము వంటి గోళ్లతో భయంకరమైన దంష్ట్రలతో మేరుపర్వతమంత ఎత్తుతో ప్రకాశించాడు. ఆయన అప్పుడు సీతాదేవిని చూచి:- "తల్లీ! నా పర్వతాకారాన్ని చూచావుకదా! ఇక అనుమానాన్ని వదలిపెట్టి నిశ్చింతగా నా వీపుపై ఎక్కి వచ్చి రామలక్ష్మణులను దర్శించి, వారి శోకాన్ని తొలగించు"మని కోరాడు.

సీతాదేవి చిరునవ్వు నవ్వి, "హనుమా! నీవు మహాదేహుడవని నాకు ముందుగానే తెలుసు. నీకు అంత దేహబలము, ధైర్యబలము, లేకుంటే నీవు అంత పెద్ద సముద్రాన్ని అవలీలగా ఎలా దాటగల్గుతావు?

అయితే నీవు నన్ను రాముని దగ్గరకు తీసికపోగలిగిన శక్తిగల వాడవైనా, నీవెంట నేను రాలేను. ఎందుకంటావా?

1) నీవు వాయువేగ మనోవేగాలతో సముద్రము దాటుతావు. అప్పుడు నేను నీ వేగాన్ని చూస్తే నా కళ్ళు తిరిగి నేను సముద్రంలో పడిపోవచ్చు. అప్పుడు నన్ను మొసళ్లు తినివేయవచ్చు;

2) నన్ను నీ వీపుపై ఎక్కించుకొని తీసిక వెళ్లుతుంటే రావణునికి తెలిసి ఆయన భయంకరులైన రాక్షసులను నిన్ను ఎదిరించడానికి పంపవచ్చు. ఆయుద్ధంలో నీవే గెలుస్తావో? లేదా మహావీరులు నిన్ను చుట్టుముట్టి వారే గెలుస్తారో? పోనీ చివరకు నీవే గెలిచినా, ఒకవైపు వాళ్లతో నీవు యుద్ధంచేస్తూ, మరొక వైపు నన్ను గట్టిగా పట్టుకొంటావా?;

"మర్కట కిశోర" న్యాయంగా నావైపు దృష్టిపెట్టకుండా నలువైపుల నీవు పరుగెత్తుతూ యుద్ధం చేస్తుంటే, నేను నీ వీపుపై సురక్షితంగా ఉండగలనా?;

3) నీ వీపుపై నుండి నేను క్రిందపడితే, నన్ను రాక్షసులు పట్టుకొని తీసికొని వెళ్లి రావణునికి అప్పగించరా? అప్పుడాయన నన్ను చంపినా చంపవచ్చు;

4) లేదా ఎవ్వరికి తెలియని ఏదో ఒక చోట నన్ను ఉంచి, ఆయన మరింత భయంకరమైన రాక్షసుల కాపలా ఉంచవచ్చు;

5) అందువలన నేను నీతో వచ్చుట ప్రమాదకరము. రామలక్ష్మణులను నీవు ఇక్కడికి తీసిక రావటమే మేలు;

6) ఈ మాటలన్ని ప్రక్కకు పెట్టి, ఒక ముఖ్య విషయాన్ని చెప్పుతాను విను. నేను పతివ్రతను. నా రాముని తప్ప ఏ ఇతర పురుషుని నేను తాకను. ఆనాడు రావణుడు నిన్ను తాకలేదా? అంటే విధి లేక ఆయన స్పర్శను భరించవలసి వచ్చింది. అప్పుడు నాకు నా శరీరం పై స్పృహే లేదు;

7) అంతేకాదు మాయామృగాన్ని (లేడిని), పంపి, రావణుడు సీతను అపహరిస్తే, శాఖా మృగాన్ని (కోతిని) పంపి రాముడు సీతను తెప్పించుకొన్నాడు. ఇద్దరిద్దరే. ఇందులో ఎవ్వరు కూడ యుద్ధం చేయగల సమర్థులు కారు అని నా నాధుని అందరు పరిహసిస్తారు.

అందువలన రాముడే స్వయంగా రావాలి. ఆయన ఈ లంక నిండా తన రామనామాంకి తాలైన బాణాలను నింపాలి. సమస్త శత్రు సంహారము చేసి తన పరాక్రమంతో నన్ను సగౌరవంగా తీసికవెళ్లాలి. అది ఆయనకు, నాకు తగినట్లుగా ఉంటుంది.

నేను శ్రీరాముని అమేయ పరాక్రమ సంపదను కనులార చూచాను. ఆయనను ఎదిరించగలిగిన మొనగాడు దేవ, దానవ, గంధర్వాదులలో ఎవ్వరు లేరు. మొదలే అగ్ని అందులో వాయువు కూడ తోడైతే ఆ ప్రళయ భయంకరాగ్ని లోకాలన్నిటిని నిమిషంలో మాడ్చివేయగలదు. అలాగే మొదటే రాముడు శత్రు భయంకరుడు, అందులో ప్రతాప రుద్రుడైన మా లక్ష్మణుడు తోడైతే ఆ మహావీరుల నెదుర్కోవడానికి ఎవ్వరి తరము? కనుక హనుమా! నీవిక్కడి నుండి వెళ్లి వెంటనే నా నాథుడు ససైన్యంగా కదలి వచ్చేట్లు చూడు. నా దుఃఖాన్ని తొలగించు"మని హనుమకు తెలిపింది.

-- ఇతిశం --

'బిడ్డ పెరిగినట్టిదు - పరపురుషునితో సమంబు గాదె"
- శ్రీ విశ్వనాథ

పరపురుషున్ స్పృశించనని పల్కిన పల్కు త్రిలోక వంద్యము"

చరణంబు, సెట్టు మమ్ము - నాయిఆ కొసదేలియున్న
భుజమెక్కుమునిన్ నిన్ పతి చెంత దించెదన్".

ఒకనెలదాటి బ్రతికి యుండను, రాఘవ! వార్ధికి ఒక సేతు
నిర్మితిని దెత్తువో? మీకపిమీద వత్తువో? మకర
మహానిలయానికి నమస్కృతులు బొనరించి నిల్తువో".

# కాకాసురుడు - 29

సీతాదేవి పరిశుద్ధమైన పలుకులను విని హనుమ సంతృప్తితో ఇలా అన్నాడు : "తల్లీ! పురుషులు ఆవేశంతో తొందరపడితే, స్త్రీలు నెమ్మదిగా ఆలోచించి, ఆ పురుషుల ఆలోచనలలోని మంచి చెడులను వారికి తెలిపి, వారిని శాంతపరుస్తారు.

అలాగే నీవు ఒక స్త్రీ రత్నంగా నా ఆవేశానికి మంచి చెడులు చెప్పి అడ్డుకట్ట వేశావు. ఒక వీర పత్నిగా నీ పతికి కలిగే అవమానాన్ని నివారించావు. ఒక పతివ్రతగా నీ స్వభావాన్ని నీ మహిమను నిరూపించుకొన్నావు. ఇంతటి స్థిరత్వము, ఇంతటి వీరత్వము, ఇంతటి పాతివ్రత్యము రామభద్రుని ధర్మపత్నివైన నీకు తప్ప మరొకరికి సాధ్యమా?

నేను నీ కష్టాలకు తొందరలో ముగింపు పలుకాలని నాతో రమ్మని పిలిచానే తప్ప వేరే ఉద్దేశ్యంతో కాదు.

నీకు నా వెంట రావడం ఇష్టము కాకుంటే, నేను నిన్ను కలసి మాట్లాడానని రాముడు నన్ను నమ్మే విధంగా ఏదైనా ఒక ముఖ్యమైన గుర్తు తెలుపుమని కోరాడు.

అప్పుడు సీతాదేవి తనకు, రామునికి తప్ప వేరెవ్వరికి తెలియని కాకాసుర వృత్తాంతాన్ని హనుమకు తెలిపింది.

"రామభక్తా! మేము చిత్రకూట పర్వతముపై ఒక తాపసాశ్రమాన్ని నిర్మించుకొని అందులో నివసించాము. మందాకినీ నదీతీరంలోని, ఆ ఆశ్రమ పరిసరాలలోని ఒక తోటలో భార్యాభర్తలము ఒక తూరి విహరించాము. ఆ ఆటలో నేను తొందరగా అలసిపోయి విశ్రాంతి తీసికోవాలనుకొన్నాను. నా భర్త తొడపై పడుకొన్నాను. అప్పుడు అక్కడికి మాంసముపై ఆశతో ఒక పాడు కాకి వచ్చి నా చుట్టు తిరుగుతూ రొద చేయసాగింది. కొంచెము సమయం తరువాత నా గుండెలపైకి ఎగిరి పొడవ సాగింది.

దగ్గరలో ఎండు మాంసము ముద్ద ఉన్నా, దాని జోలికి పోక నా గుండెలనే గీర సాగింది. నేను నా మొలత్రాడును తీసి దానిని కొట్టబోయాను. అప్పుడు నా నాథుడు "ఇంత చిన్న పిట్టపై అంత కోపమా" అని పరిహసించాడు. నాకు అంత బాధలో కూడ నా భర్త మాటలకు సిగ్గు కలిగింది. రాముడు నన్ను దగ్గరకు తీసికొని ఓదార్చాడు. నా కన్నీటిని తుడిచాడు.

అప్పుడు నా ప్రాణవిభుడు నా తొడపై పడుకొన్నాడు. నేను కాకి బాధను భరిస్తున్నాను. నా భర్తకు నిద్రా భంగము కలుగుతుందని ఆ కాకిని కొట్టే ప్రయత్నాన్ని మానుకొన్నాను.

"స్వామి నిద్రా సౌందర్యాన్ని కనులారా సేవిస్తున్నాను. ఆ స్వామి సహజంగానే సుందరుడు. నిద్రలో ఆయన సౌందర్యము మరింత అధికమైంది. రెప్పపాటు కూడ లేక తదేకంగా తన్మయంగా ఆ స్వామినే చూస్తూ ఉండిపోయాను. ఆ ఆనందంలో నా గుండెల నుండి కారే రక్తాన్ని కూడ గమనించలేదు.

అయితే నా రక్తపు బిందువులు కొన్ని నా భర్త కపోలము పై పడ్డాయి. ఆ వేడికి వెంటనే సుఖంగా నిద్రించే పరంతపుడు నా స్వామి మేలుకొన్నాడు. "అయ్యో నా మూలంగా నా స్వామికి నిద్రాభంగమైందే?" అని నేనెంతో బాధపడ్డాను. ఆయన ఆగ్రహ పరవశుడయ్యాడు. "ఐదు తలలుగల భయంకర సర్పముతో ఆటలాడే ఆ నీచుడెవ్వడు? నిన్ను ఇంత క్రూరంగా హింసిస్తున్న ఆ అధముడెవ్వడు?" అని కోపంతో లేచి చుట్టు ప్రక్కల పరిశీలించాడు. అప్పటికి విడువకుండా నా గుండెలను పొడుస్తున్న అసుర స్వభావం గల ఆ పాడు కాకి రాముని కంటబడింది.

అరులను అణచడానికి ఆ అసహాయ శూరుడైన రామునికి ప్రత్యేకంగా ఒక ఆయుధము కావాలా? ప్రక్కలో ఉన్న ఒక గడ్డిపోచను తీసికొన్నాడు. బ్రహ్మాస్త్రాన్ని దానిలో సంధించి వదిలాడు. ఆ బ్రహ్మాస్త్రము ఆ కాకిని తరుమసాగింది.

ఆ కాకి నిజంగా కాకి కాదు. ఆయన ఇంద్రుని కుమారుడైన జయంతుడు. ఆ అస్త్రాన్నుండి తనను తప్పించుమని తన తండ్రి అయిన మహేంద్రుని ప్రార్థించాడు జయంతుడు. "తనకు దేవేంద్రత్వాన్ని ప్రసాదించిన ఆ పరమాత్మే తన ప్రార్థనపై రావణుని సంహరించ డానికి రాముడిగా అవతరించాడు. ఆ సర్వశక్తిని ఎదుర్కొనే శక్తి తనకు లేదని తండ్రి అయిన సురేంద్రుడు తప్పుకొన్నాడు.

సాధారణంగా పిల్లలు తప్పులు చేస్తే తమ పిల్లలను శిక్ష నుండి తల్లులు తప్పిస్తారు. అందువలన తన తల్లి అయిన శచీదేవి కొంగుచాటున వెళ్లి దాక్కొన్నాడు. అయితే తల్లులందరికి తల్లి అయిన సీతామతల్లికే అపచారం చేసిన తన కొడుకు తనకు అక్కర లేదని అతనిని దూరంగా తరిమివేసింది శచీదేవి.

"సపిత్రాచ పరిత్యక్తః" తల్లిదండ్రులు ఇద్దరిచే తరుమబడ్డాడు. అందువలన బ్రహ్మ రుద్రులను శరణు వేడాడు.

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం",
"క ఇతి బ్రహ్మణోనామ। ఈశోऽహం సర్వదేహినాం
ఆవాం తవాంగే సంభూతౌ। తస్మాత్ కేశవనామవాన్"

అని చెప్పబడినట్లు బ్రహ్మ, మహేశ్వరులు కూడ తమ తండ్రి అయిన పరమాత్మ అవతారమైన రామభద్రుని ఎదుర్కోవడానికి ఇష్టపడలేదు. ఇక ఇతర దేవతల మాట చెప్పాలా?

అప్పుడు కాకాసురుడు దయామయులైన మహర్షులను శరణు వేడాడు. తాము నిరంతరము తమ హృదయకమలాలలో ధ్యానించే పరమాత్మే రాముడని అటువంటి ఆ మహాత్ముని ఆగ్రహానికి తాము పాత్రులము కాజాలమని వారు కూడ వదలి వేశారు.

"సురైశ్చ సమహర్షిభిః",

"ఒక్కసారి దగ్గరకు తీయకపోయినప్పటికి మళ్లీ మళ్లీ వెళ్లి కాళ్లపై పడితే కరుణించక పోతారా?" అని వెళ్లిన వారి దగ్గరకే మళ్లీ వెళ్లాడు. మూడులోకాలలో తిరస్కారమే మళ్లీ మళ్లీ ఎదురైంది.

"త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య। తమేవ శరణం గతః".

ఇక ఎవ్వరు తనను దగ్గరకు రానీయరని తెలిసి, లోకాలన్ని తిరిగి తిరిగి విసిగి వేసారి అలసటతో తాళలేక ఆ దుర్మార్గుడు తనను చంపదలిచిన రామ ప్రభువు పాదాల పైననే పడిపోయాడు.

సీతాదేవి అతని స్థితిని చూచింది. జాలి పడింది. అంత అపచారము చేసిన వానిని కూడ, తప్పుచేసే కొడుకులాగే చూచింది ఆ లోకజనని. అయనపై ఆ తల్లికి దయ కలిగింది.

కాకాసురుడు రామచంద్రుని కాళ్లపై పడ్డాడు. కాని సక్రమంగా పడిపోలేదు. స్వామి కాళ్లవైపు తన కాళ్లు ఉండేట్లు పడిపోయాడు. కావాలని కాదు. చేతగాక పడిపోయాడు.

"పురతః పతితం దృష్ట్వా। ధరణ్యాం వాయసం తథా
తచ్ఛిరః పాదయోస్తస్య। యోజయామాస జానకీ"

తండ్రి కంటపడకుండా తనయులను కాపాడే తల్లివలె, రామభద్రుడు ఆగ్రహంతో ఉండగానే, ఆయన గమనించకుండా ఆ కాకిని లేవనెత్తి, దాని తలను స్వామి పాదాలపై పడేట్లుగా సవరించింది ఆ దయామయి.

అప్పటికి ఆ కాకిని గమనించని రామచంద్రునితో "స్వామీ! ఇంత పిట్టపై అంత కోపమా? అని నన్ను పరిహసించారే గాని మీరు మాత్రము "పిచ్చుకపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాలా?" ఆ అల్పప్రాణి మీ బ్రహ్మాస్త్రాన్ని తట్టుకోగల్గుతుందా? దిక్కులేక వచ్చి

మీ చరణాలనే ఆశ్రయించింది చూడండి. శరణన్న వారిని సంరక్షించే కరుణామయులే మీరు" అని కాంతా సమ్మితంగాస్వామితో ఆ కాకి విషయంలో పురుషకారం చేసింది.

"వధార్హమపి కాకుత్థః కృపయా పర్యపాలయత్".

జానకీ దేవి పురుషకారం (ప్రార్థన)తో స్వామి ఆగ్రహం మటుమాయ మైంది. చిరునవ్వుతో "కాకీ! బ్రతికి పోయావులే" అని లేపాడు.

అయితే రామబాణానికి తిరుగులేదు కద! అందువలన బ్రహ్మాస్త్రానికి ఏదైనా ఒక అవయవాన్ని ఆహారంగా సమర్పించుమన్నాడు కాకుత్సుడు. (కకుత్థుని వంశంలో జన్మించిన శ్రీరాముడు) కాకి తన కుడికన్నును సమర్పించింది.

అందుకే కాకికి ఒకటే కన్ను ఉంటుంది. కాకాసురుడు "కాకః" "కాకః" అని సంతోషంతో అరవసాగాడు?

దయగల తల్లి ఎవ్వరో తెలుసా? సీతాదేవి తప్ప మరెవ్వరు? "కా?" అని అరచాడు.

ఆశ్రయించిన అరిని అయినా రక్షించే వాడు ఎవ్వడు? దయాసముద్రుడైన దాశరథి తప్ప వేరెవ్వరు "కః?" అని అరచాడు.

అప్పటి నుండి "కాకికి" "కాకః" అని పేరు వచ్చింది. సీతాదేవి తప్ప రక్షించే తల్లి వేరు ఎవ్వరు? అని ప్రశ్నిస్తూ "కాకా" అని మాటికి మాటికి అరచింది. ఇప్పటికి కాకులు "కాకా?" అనే అరుస్తాయి.

తనకెవ్వరు దిక్కులేరని, తనను "కావు, కావు" మంటు ఆ కాకి రాముని ప్రార్థించింది. ఇప్పటికి కాకులు "కావు, కావు" మంటునే ఉంటాయి.

ఆ పరమార్థము తెలియక, "కావు, కావు" మని అరచే కాకులను చూచి, "ఛీ, ఛీ పాడు కాకులు" అని విసిగి కొంటాము మనము.

ఈ కాకాసుర వృత్తాంతము ఆశ్రిత రక్షాదీక్షుడైన రామభద్రుని రక్షాగుణాన్ని తెలిపింది కదా! అంతేకాదు. ఇందులో మరింత రహస్యముంది.

ఇంద్రుని కుమారుడు కదా జయంతుడు. ఇంద్రుడు దేవుడే. కాని జయంతుని తల్లి శచీదేవి "పులోముడు" అనే రాక్షసుని కూతురు. అందువలన జయంతునికి మాతామహుని నుండి కొంత రాక్షసగుణము వారసత్వంగా వచ్చింది.

అంతేకాదు ఇందులో కొంతవరకు దేవతల ప్రణాళిక కూడ ఉంది. రావణుని సంహారం కొరకే కదా స్వామి రాముడుగా అవతరించాడు. అంతవరకు బాగానే ఉంది. కాని రామునిలో కోపపు ఛాయలే లేవు. సంతోషంగానే రాజ్యాన్ని వదలుకొన్నాడు. తల్లిదండ్రులను వదలుకొన్నాడు. సమస్త సంపదలను పరిత్యజించాడు. కఠినమైన కాంతారంలో కూడ ఆనందంగానే ఉంటున్నాడు ఆ ఆనందమయుడు.

రామునికి ఆగ్రహం కలుగనే కలుగదా? కోపం రాకుండానే ఉంటే రావణుని ఎలా సంహరిస్తాడు? రాముని అవతార ప్రయోజనమే సిద్ధించదా? అని దేవతలకు అనుమానం వేసింది. నిరాశ కలిగింది.

అయితే "రాముని ఆనందానికి సీతాదేవి కారణం కావచ్చు. ఇన్ని కష్టాలు కలిగినా సీతాదేవి ప్రక్కలో ఉన్నందువలన ఆయనకు ఆగ్రహం కలుగడం లేదేమో?" అనే ఆలోచన అమరులకు కలిగింది.

"సీతాదేవిని వేరే ఏ పురుషుడైనా తాకి చూస్తే ఎలా ఉంటుంది? రాముని ఆగ్రహాగ్ని ఒక్కసారి భగ్గుమంటుందేమో?" అనే ఆశ కలిగింది.

ఇదివరకే "అహల్యా విషయంలో శరీరాన్ని వికృతం చేసికొన్న అమరపతి అందుకు అంగీకరించలేదు. అందువలన ఆయనను విడిచిపెట్టి దేవతలు ఆయన కుమారుడైన జయంతుని ఆశ్రయించారు.

జయంతుడు మిసిమిసి వయస్సులో ఉన్నాడు. కామభావనలు ఆయన మదిలో అదే పనిగా సందడిచేస్తున్నాయి. తన తండ్రికి పరకాంతలతో కామానుభవంలో తలపండి పోయింది. అందువలన ఆయనకు అన్యకామినీ సంగమం అంత తప్పనిపించలేదు. సీతాదేవి వంటి అతిలోకసుందరి ఆయన మనస్సును ఊరుకోనివ్వలేదు.

ఇదివరకు ఇంద్రుడు కోడిరూపంలో గౌతమాశ్రమ పరిసరాలలో కూతవేసి, కాకి రూపంలో ఆ మహర్షి ఆశ్రమం ముందు తిరుగసాగాడు. కాకే కదా అని పట్టించుకోకుండా ఆ మునీంద్రుడు తపస్సుకై బయటికి వెళ్లిపోయాడు. ఆయన స్నాన తపస్సులకై వెడలడాన్ని గమనించిన అమరేంద్రుడు ఆశ్రమంలోనికి వెళ్లాడు.

ఇప్పుడు జయంతుడు కూడ తాను కాకి రూపంలో వెళ్లితే సీతారాములు పట్టించుకోరనుకొన్నాడు. కాకి రూపంలో మాంసం ముక్క కొరకు వెళ్లినట్లు వెళ్లి సీతాదేవి గుండెలపైకి ఎగిసి ముక్కుతో గాయపరిచాడు. పతివ్రతను దుర్భావంతో తాకిన కాకాసురునికి చావు తప్పి కన్నులొట్ట పోయింది.

అప్పుడు అర్థమైంది అమరులందరికి రాముని స్వభావము! ఒక కాకి తన భార్యను తాకితేనే సహించని సాకేతరాముడు రావణుని వంటి దుర్మార్గుడు సీతాదేవిని నేరుగా అపహరించి తనకు దూరం చేస్తే చూస్తూ ఊరకుంటాడా? వాడిని సపరివారంగా సంహరించకుండా వదులుతాడా?

అందువలన రావణుని వలన సీత అపహరింపబడే ప్రణాళికను బ్రహ్మదేవునితో సహా దేవతలందరు రచించి, అమలు చేశారు. దాని ఫలితమే శూర్పణఖా పరాభవము, ఖరదూషణ సంహారము, సీతాపహరణము మొదలైన సంఘటనలు ఒకదాని తర్వాత మరొకటి వరుసగా జరిగాయి.

అందుకే రావణాసురుడు అతిక్రూరంగా ఒక చేత్తో సీతాదేవి జడలను గట్టిగా పట్టుకొని, మరొక చేత్తో ఆమె తొడలను పైకెత్తి లేడి పిల్లను పట్టుకొని వెళ్లే పెద్దపులివలె, అపహరిస్తు పోతుంటే సీతాదేవి దీనాతిదీనంగా గట్టిగా విలపిస్తుంటే గుండెలు, అవిసి పోవలసిన బ్రహ్మాది దేవతలు "నః కార్యం కృతమితి వ్యాజహార పితామహః" మనము అనుకొన్న పని (ప్రణాళిక) నెరవేరిందని తృప్తి చెందారట.

ఈ ఆలోచనలో మహర్షులు కూడ భాగస్వాములే. అయితే వారు సుకుమార హృదయులు కనుక ఒకవైపు విచారాన్ని, మరొకవైపు ఆనందాన్ని అనుభవించారట. చూచారా ఆ ఆదిదంపతుల దీన స్థితి. దుఃఖమే తెలియక ఎల్లప్పుడు ఆనందాన్నే అనుభవించవలసిన ఆ దివ్య దంపతులు, వారికి దూరమై, దుర్భర దుఃఖాన్ని అనుభవిస్తున్న మననుచూచి, మన దుఃఖాన్ని నివారించడానికి మన మధ్యకు వస్తే మనం చేసే పనిఏమిటి? వారికి మన దుఃఖాన్ని అంటించి వారు దుఃఖిస్తుంటే చూచి మనము ఆనందిస్తుంటాము. అది మన స్వార్థబుద్ధి. అది మన క్రూర బుద్ధి. ఈ దుర్బుద్ధి ఎన్నడైనా మారేనా? తెలియదు. ఆ బుద్ధిని పూర్తిగా మనలో నుండి తొలగించుమని ఆ సర్వస్వామినే శరణు వేడుతాము.

సీతాదేవి కన్నకొడుకువలె హనుమను భావించి కనీసము సౌమిత్రి కూడ తెలుపని ఇంత రహస్యమైన, భార్యాభర్తలకే పరిమితమైన కాకాసుర వృత్తాంతాన్ని తన గుర్తుగా హనుమకు తెలిపింది.

ఇందులో సీతాదేవి తనను కాకాసురుని బాధనుండి కాపాడుకోవడానికి దానిని రాళ్లతో కొట్టడం, మొల నూలు తీసి బెదిరించడము వంటి పనులను చేస్తున్నంత సేపు

రాముడు పట్టించుకోలేదు. "ఇంత చిన్నపిట్టపై అంత కోపమా?" అని పరిహసించాడు కూడ.

ఆయన సీతాదేవి తొడపై పడుకొని నిద్రపోతున్నప్పుడు ఆయనకు నిద్రాభంగము కాకూడదని, తన బాధనంతా ఆమె భరిస్తు ఉన్నప్పుడు, ఆమె గుండెల నుండి రక్త బిందువులు ఆ కాకి కారణంగా ఆ స్వామి కపోలాలపై పడినప్పుడు, ఆ పిచ్చుకపై బ్రహ్మాస్త్రాన్నే స్వయంగా ప్రయోగించాడు.

స్వామి సంరక్షణను పొందాలంటే స్వరక్షణ ప్రయత్నాన్ని మానుకోవాలన్న మాట. ఇదే ప్రపత్తి, న్యాసము, భరన్యాసము, శరణాగతి అని వేరు వేరు పేర్లతో పిలువబడుతుంది.

"స్వ ప్రవృత్తి నివృత్తిః ప్రపత్తిః"

సీతాదేవి శరణాగతి వలన ఆమెకు రక్షణ కలిగింది. అది నిజమే కాని, కాకాసురునికి కూడ రామరక్ష లభించిందే. దానికేమి కారణము? కాకాసురుని సంరక్షణ కొరకు కూడ ఆయన శరణాగతే కారణము. అదేమిటి చేసిందంతా చేసి, తిరిగిందంతా తిరిగి, చివరకు ఏ దిక్కులేక అస్తవ్యస్తంగా రాముని పాదాలపై పడితే అది కూడ శరణాగతి అవుతుందా?

అవును ఏ దిక్కులేకుండా ఆయనను ఆశ్రయించినా శరణాగతే. శరణాగతి చేసే వారందరు "అకించనులమని" (తమను రక్షించుకొనే శక్తి ఏ మాత్రము లేనివారమని) "అనన్య గతులమని" (వేరే ఏ దిక్కులేని వారమని) స్వామి పాదాలను ఆశ్రయిస్తేనే ఆ స్వామి మనను రక్షిస్తాడు.

-- ఇతిశం --

శ్రీనిధి యెక్క కాకి కథ జెప్పితి నంచనుకోకుమీ! స్వామి యెరుంగును, నేనెరుంగుము - తానుగ వాయసం' బెరుగు - దారిని గన్పడి నీకు వాయసంబైనను జెప్పి పోవదు గదా'

- శ్రీ విశ్వనాథ

బిడ్డవు నీకు వచియింపగరానిదకటా ఒకడుండనే?

- శ్రీ విశ్వనాథ

# నా పాపమే కారణము - 30

సీతాదేవి హనుమతో రామునికి తన వినతిని అందించాలనుకొంది. అప్పుడు నేరుగా రామునితోనే మాట్లాడుతున్నట్లు ఈ మాటలు అన్నది. "రామచంద్రా! ఆనాడు నా కొరకు ఒక పిచ్చుకపై బ్రహ్మాస్త్రం వేశావు కదా! ఈనాడు నేనింత ఆపదలో ఉన్నప్పుడు నన్ను కాపాడవా?

నానాథుడివే! జగన్నాథుడివే! ఇప్పుడు నేను అనాథగా అలమటిస్తుంటే కూడ చూచి ఊరకుండడము న్యాయమా?

ఆనాడు నీతో కలసి ఉన్నప్పుడు "అన్ని ధర్మాలకంటే శ్రేష్ఠమైన ధర్మమేది?" అని అడిగినప్పుడు.

"ఆనృశంస్యం పరోధర్మః" పరదుఃఖ దుఃఖిత్వమే (జాలే) పరమధర్మము అన్నావే? ఇప్పుడు నన్ను నా దుఃఖానికి వదలివేయడం ధర్మమా?

స్వామీ! మీరు మహావీరులే. అసహాయశూరులే. "ఇక్ష్వాకూణా మియం భూమిః సశైల వనకాననా" అన్నట్లు ఈ భూమి, పర్వతాలు, సముద్రాలు అన్ని మీ ఆధీనంలో ఉన్నవే కదా! మీరు రక్షించాలనుకొంటే సురులు, నరులు, రాక్షసులు, గంధర్వులు ఎవ్వరైనా, సకల లోకాలలో మరెవ్వరైనా మీ ముందు నిలువగలుగుతారా?" అని అడిగానని నా మాటలను హనుమా! నాస్వామికి తెలుపు.

అయినా హనుమా! అసాధారణ సామర్థ్యము కల్గికూడ, నా స్వామి నన్ను రక్షించడం లేదంటే ఆయనకు దయలేదని కాదు. ఆయన దయాసముద్రుడు. అయినా నన్ను రక్షించ రాలేదంటే కారణము నా పాపమే.

"మమైవ దుష్కృతం కించిత్। మహదస్తి న సంశయః"

నాదే కొద్దో, గొప్పో పాపము తప్పక ఉంటుంది. ఇందులో సందేహమే లేదు అంది.

సీతాదేవి పాపం చేసిందా? అంతటి పతివ్రత, అంతటి పుణ్యశీల పాపం చేసిందా? "కించిన్మహదస్తి" కొద్ది గొప్ప పాపము ఉందని ఆమే స్వయంగా అంగీకరించింది కదా! కొద్ది, గొప్ప పాపమంటే ఏమిటి?

సాధారణంగా మనము అనుకొన్న మంచి జరుగనప్పుడు, దానికి కారణము ఇది అని ఖచ్చితంగా తెలియనప్పుడు "ఏదో కొద్దో గొప్పో పాపము మనము చేసి ఉండవచ్చు" అని అనుకొంటాము.

సీతాదేవి కూడ అలాగే అందా? లేక కొద్దో గొప్పో ఏదో ఒక పాపము చేసే ఉందా? లేక ఆమె కొద్ది పాపము, గొప్ప పాపము వేర్వేరుగా చేసిందా? గంభీర స్వభావుడైన వాల్మీకి వివరంగా తెలుపలేదు. కాని వ్యాఖ్యాతలు ఇంతవరకు జరిగిన చరిత్రను పరిశీలించి, సీతాదేవి రెండు తప్పులను వేర్వేరుగా చేసిందనే నిర్ణయించారు.

అయితే ఆమె చేసిన కొద్ది తప్పు ఏమిటి? పెద్ద తప్పు ఏమిటి?

1) భగవదపచారము కొద్ది తప్పు:- ఇంతకు పూర్వము సీతారాములు అడవికి బయలు దేరేముందు శ్రీరాముడు సీతాదేవిని అడవికి రావద్దని, అయోధ్యలో అత్తమామలకు సేవచేస్తూ పదునాలుగు సంవత్సరాలు ఎదిరి చూస్తుండుమని తెలిపాడు. సీతాదేవి ఆ మాటను వినక రామచంద్రునితో పాటు అడవికి తప్పక వస్తానని పట్టుపట్టింది. ఆయన అడవిలో రాళ్లు, రప్పలు, ముళ్లు, పాములు, రాక్షసులు ఈ విధంగా అనేక కారణాలుగా కష్టాలు కలుగుతాయని తెలిపాడు. అప్పుడు సీతాదేవికి రోషం కలిగింది. తన భర్తను ఒక అనరాని మాటను కఠినంగా అంది.

"కింత్వామన్యత వైదేహః॥ పితామే మిథాలాధిపః॥
రామ జామాతరం ప్రాప్య॥ స్త్రియం పురుషవిగ్రహం॥"

"అయ్యో! నా తండ్రి మిధిలాధిపుడైన విదేహుడు (జనకుడు) నిన్ను చూచి ఏమని (ఎంత మహావీరుడవని) అనుకొన్నాడో? కాని రామా! నీవుపురుష వేషంలో ఉన్న స్త్రీవే కదా" అన్నది.

ఎంత తప్పు మాట? పన్నెండు సంవత్సరాలు అత్యంత సంతోషంగా కాపురము చేశాక భర్తను నీవు ఆడదానివి అంది. ఆడదానిలా పిరికి పందవు అన్నదే సీత.

ఒక సాధారణ పురుషుని ఇతరులెవ్వరైనా "ఆడదానివి" అంటేనే ఊరుకోరే? అందులో స్వంత భార్య అంటే సహిస్తారా?

రాముడు అసాధారణ మనుష్యుడు. సాధారణ పురుషుడు కాదు. పురుషోత్తముడు. అటువంటి అతిలోక మహావీరుని "నీవు ఆడదానివి" అని సీతాదేవి ఘోరంగా అంది. ఇది ఆమె చేసిన భగవదపచారము. అయితే అంత తప్పు కూడ కొద్ది తప్పే. ఆ తప్పుకు వెంటనే రాముడు ఆగ్రహించలేదు. అప్పుడు తన వెంట అడవులకు తీసిక వెళ్లాడు తరువాత కొంతకాలానికి ఆమెకు దూరంగా వెళ్లిపోయాడు.

2) భాగవతాపచారము పెద్ద తప్పు:- "భగవదపచారము కంటె మించిన పెద్ద తప్పు ఉంటుందా?" అంటే అవును ఉంటుంది. అదేమిటి? భాగవతాపచారము.

రాముడు సీతాదేవి కోరికను మన్నించి మాయా లేడి వెంట వెళ్లుతూ, సీతాదేవి రక్షణను లక్ష్మణునికి అప్పగించి వెళ్లాడు. లక్ష్మణుడు కంటికి రెప్పలా ఆమెను కాపాడు తున్నాడు.

అంతలో రాముని గొంతుననుకరించి, "హా సీతా! హా లక్ష్మణా! అని మారీచుడు అరిచాడు. ఆ అరుపులు తన భర్తవే అనుకొంది సీత. లక్ష్మణుని "అన్నకు సహాయం చేయడానికి వెళ్లుమ"ంది. లక్ష్మణుడు "ఆ కేకలు రామునివి కావని మారీచునివి" అని తెలిపాడు.

సీతాదేవి ఆయన మాటలు వినలేదు. సరికదా ఆగ్రహానికి వచ్చింది. "అన్నను రక్షించకుండా ఉండడానికి కారణమువేరే ఉంది" అంది.

రాముడు దూరంగా వెళ్లినప్పుడు తనపై అత్యాచారము చేయాలనే ఆలోచనతోనే లక్ష్మణుడు ఉన్నాడని, ఆయన అడవులకు వెంట వచ్చింది కూడ అందుకే అంది. తాను ఆయనకు ఎన్నటికి లొంగవని అంది.

కన్నకొడుకు వంటి మరిదిని, తమకు సేవలు చేయడానికి రాజ్యాన్ని భార్యను, సమస్త సంపదలను త్యాగం చేసిన సౌమిత్రిని, "కాముకుడు" అని దుర్భాషలాడింది. అది "భాగవతాపచారము" అది మహాపచారము. ఆ అపచారాన్ని రాముడు క్షమించలేదు. అందుకే రావణుడు ఆమెను అపహరించి తీసిక వెళ్లినా ఇంతకాలము వేరే పనులతో కాలము గడిపాడు. ఆమెను పట్టించుకోనే లేదు.

ఇప్పటికైనా ఆమెకు బుద్ధి వచ్చి ఉండవచ్చుననుకొని ఇంతకాలానికి (తన స్మరణతోనే కాలం గడుపుతూ, రావణుని బాధలు తట్టుకోలేక ఆత్మహత్యకు కూడ సిద్ధమైనప్పుడు) ఇప్పుడు తన దూతను పంపాడు.

లేకపోతే ఇదంతా ఎందుకు? జటాయువే తెలిపాడు కదా "సీతాదేవిని అపహరించింది రావణుడని" ఆ వార్తను కబంధుడు కూడ ధృవపరిచాడు కదా! శబరి దగ్గరకు వెళ్లడం దేనికి? కిష్కింధకు వెళ్లడం దేనికి? హనుమను పంపడం దేనికి? నెలను మించి కాలం గడుపడం దేనికి?

రావణుడు లంకాధిపతి అని తెలుసు కదా! పోనీ సుగ్రీవునికి పట్టాభిషేకం జరిపాక అయినా అందరు కలసే లంకకు బయలుదేరి రావచ్చు కదా!

సముద్రుడు అడ్డమా! హనుమ వెళ్లి వచ్చాక కూడ అది అడ్డంగా నిలిచింది కదా? ఆయన ఆగ్రహానికి తలవంచింది కదా! మొదట మాత్రము సముద్రుడు అడ్డగించ గలిగేవాడా?

మరి ఇంతకాలము ఎందుకు స్వామి ఉపేక్షించింది? సీతాదేవి భాగవతాపచారం చేసిందని కోపంతో!

హనుమ తిరిగి వచ్చాక కూడ "కిమాహమమభామినీ" ఏమందీ నా భార్య? అని అడుగుతాడు.

లక్ష్మణుని గురించి అన్న మాటలకు ఆమె బాధపడిందని హనుమ తెలుపుతాడు.

"ఆమె తన పాపాలకు బాధపడుతుందని తెలిశాక" అప్పుడు రాముడు లంకకు తక్షణమే బయలుదేరుతాడు. ఇది భాగవతాపచారమనే మహా పాపానికి సీతాదేవికి రామచంద్రస్వామి విధించిన ఇంత కఠిన శిక్ష!

సమర్థులై ఉండి కూడ రామలక్ష్మణులు తనను రక్షించడానికి రాకపోవడానికి తన తప్పులే కారణమని సీతాదేవి బాధపడుతుంటే – హనుమ ఆమెను ఓదార్చసాగాడు.

"అమ్మా! నీవిక్కడ ఎంత బాధపడుతున్నావో, రామలక్ష్మణులు కూడ నీ కొరకు అంత బాధపడుతున్నారు. నీవు ఉన్న ఈ లంక గురించి తెలియగానే తక్షణమే దండెత్తి వచ్చి లంకలోని రాక్షసులను కోపాగ్నితో మాడ్చివేసి నిన్ను తీసికొని అయోధ్యకు వెళ్లుతారు. వాళ్లిద్దరికి ఏమి చెప్పుమంటావమ్మా?" అని హనుమ అడిగాడు.

"హనుమా! లోకభర్త అయిన రాముని కన్న మనస్విని కౌసల్యాదేవి. ఆమె కన్నకొడుకైన రాముని కుశలమడిగానని, తలవంచి నమస్కరించానని తెలుపు.

అన్న, వదినలను అనుసరించడానికి అన్ని సంపదలను వదలుకొని అడవికి బయలుదేరిన లక్ష్మణుడు మా దంపతులను తల్లిదండ్రులుగా భావించి సేవలు చేశాడు. సౌమిత్రి మా మామగారికి తగిన తనయుడు. నా భర్తకు నీడవంటి వాడు. నాకు మిగుల ఇష్టమైన వాడు. ఆయన వెంట ఉండి పరిచర్యలు చేయడం వలన మాకు అడవి కూడ అయోధ్య లాగే అనిపించింది. సౌమ్యుడు, సమర్థుడు, పవిత్రుడైన సౌమిత్రి క్షేమాన్ని అడిగినట్లు తెలుపు.

హనుమా! అంతా నీ చేతిలోనే ఉంది. నీవే ఈ పనిని సాధించగల వాడివి. రాఘవుడు వెంటనే బయలుదేరి వచ్చే రక్షించేలా చూచే బాధ్యత నీదే సుమా!"

"త్వమస్మిన్ కార్యనిర్యోగే। ప్రమాణం హరి సత్తమ।
రాఘవస్త్వత్సమారంభాత్। మయ యత్న పరోభవేత్"

సుందరకాండలో మంత్రరూపమైన శ్లోకాలలో ఇది కూడ ఒకటి. దీనిని భక్తితో పఠిస్తే హనుమ ద్వారా రామానుగ్రహం లభిస్తుంది.

"హనుమా శూరుడగు రామునితో మళ్లీ ఈ మాట చెప్పు సుమా! ఇక నేను బ్రతికేది నెల రోజులే. ఆ తరువాత రావణుడు నన్ను బ్రతుక నీయడు. వృత్రాసుర సంహార పాపం కారణంగా ఇంద్రుని వదలి పాతాళంలో దాగి ఉన్న శ్రీని, శ్రీమహావిష్ణువు బయటకు తెచ్చి కాపాడినట్లు రావణునిచే బంధింపబడిన నన్ను రక్షించుమని చెప్పు.

ఇదిగో నా గుర్తును కూడ నీకు ఇస్తున్నాను. ఇది రామునికి అందిస్తే నన్ను నీవు చూచినట్లు నమ్మి, నీ మాటను బట్టి వెంటనే ఆయన బయలుదేరుతాడని చెప్పి తన సిగపూవును (చూడామణిని) తన చీరముడి నుండి బయటకు తీసి, రామునికి సమర్పించుమని హనుమకు ఇచ్చింది" హనుమ దానిని కళ్లకు అద్దుకొని తన వేలికి పెట్టుకొన్నాడు.

ఇంతకుముందు హనుమ సీతాదేవి అనుమానం తీర్చడానికే పర్వతమంత ఎత్తు పెరిగాడు. సీతాదేవి తనను నమ్మిన తరువాత ఇప్పుడు మళ్లీ సాధారణ రూపం ధరించాడు.

ఆ చూడామణిని వేలుకు పెట్టుకొని, వెంటనే తాను రాముని సన్నిధికి చేరుకొన్నట్లు దానిని శ్రీరామునికి అందించినట్లే భావించాడు.

సీతాదేవి బాధను చూచి సుడిగాలికి వణకిపోయిన వృక్షము వలె చలించిన హనుమ ఇప్పుడు కొంత తేరుకొని తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

-- ఇతిశం --

"నా మరది నాడు నేననిన పల్కుల కింకను కోపమూనకో"

- శ్రీవిశ్వనాథ

నాకు నే వెలితి పుట్టెనో నీదెస - నాయెడంద నొత్తెడు

నఘలేశమున్ రఘుపతీ క్షమియింపవె" - విశ్వనాథ

హనుమా! అంతా నీ చేతిలోనే ఉంది.

# సీతాదేవి సిగపూవు - 31

సీతాదేవి హనుమంతునకు తన సిగపూవును తన చీరకొంగు ముడివిప్పి ఇచ్చింది.

శ్రీరామచంద్రుడు వెంట ఉన్నప్పుడు నగలన్ని ధరించి లక్ష్మీదేవిలా ఉండేది. అతివకు అభరణాలు అందాన్ని, అదృష్టాన్ని అందివ్వడమే కాక భర్తయొక్క అనురాగానికి, సౌభాగ్యానికి కూడ కారణమవుతాయి.

శ్రీరాముని నుండి వేరయినప్పటి నుండి ఆమెకు నగల పట్ల ఆసక్తి తగ్గింది. సగము నగలను ఋష్యమూకంపై మూటలో కట్టి వదలింది. కొన్ని నగలను దగ్గరలో నున్న చెట్టుకొమ్మకు వేలాడతీసింది. సిగపూవును తన చీర కొంగులో ముడివేసి దాచింది.

భద్రంగా దాచిన ఆ అమూల్యాభరణాన్ని తన గుర్తుగా భర్త దగ్గరికి పంపుతున్నది. ఆడదానికి ఆభరణాలన్నిటిలో సిగపూవు అమూల్యమైనది. అది ముఖ్యమైన కేశాభరణము.

స్త్రీ కేశ సంపద పురుషునికి వ్యామోహాన్ని కల్గిస్తుంది. సిగపూవు పడతి వెంట్రుకల అందాన్ని పదిరెట్లుగా పెంచుతుంది.

సీతాదేవి తన సిగపూవును పంపుతూ "హనుమా! నిన్ను నమ్మడానికి ఇది ముఖ్యమైన గుర్తు. దీన్ని చూడగానే శ్రీరామునికి మా వివాహ దృశ్యము తప్పక గుర్తుకు వస్తుంది.

నన్ను మా అత్తగారి ఇంటికి పంపేముందు మా అమ్మ పరుగు పరుగున వచ్చి ఈ సిగపూవును నాకు అలంకరించింది. అప్పుడు నా భర్త, మా మామగారు చిరునవ్వు నవ్వుతూ ఆమె ఆందోళనను గమనించారు. ఈ దృశ్యాన్ని మా మామగారు ఉండగా తరచుగా జ్ఞాపకం చేస్తూ నవ్వుతుండేవారు. అప్పటి ఆ దృశ్యము మా దంపతుల మనస్సులలో ఇప్పటికీ చెరిగిపోలేదు.

మళ్లీ హనుమను సీతాదేవి తొందరపెట్టసాగింది.

"త్వమస్మిన్ కార్యనిర్యోగే। ప్రమాణం హరి సత్తమ।
హనుమన్ యత్నమాస్థాయ। దుఃఖక్షయకరో భవ।"

ఈ శ్లోకము కూడ ఒక మంత్రమే. దీనిని కూడ ప్రతిరోజు అనుసంధించుకొంటే ఇది శుభప్రదము. ఇది హనుమ యొక్క అనుగ్రహాన్ని కలిగించి సమస్త దుఃఖాలను పోగొట్టుతుంది.

హనుమా! రామలక్ష్మణుల, సుగ్రీవ, సచివాదుల క్షేమాన్ని కోరానని వారికి తెలుపు. ఎలాగైనా రామభద్రుడు నన్ను కాపాడేట్లు ఒప్పించే బాధ్యత నీదే సుమా। మాట సహాయం తప్పక చేయాలి సుమా!

"వాచా ధర్మమవాప్నుహి"

నీవు చెప్పితే రాముడు తప్పక నన్ను కాపాడడానికి పూనుకొంటాడు.

హనుమ సీతాదేవికి అంజలి ఘటించి "తల్లీ! రామభద్రుడు నేను వెళ్లి నీ విషయము తెలుపగానే తక్షణమే నీ రక్షకై బయలు దేరుతాడు. శ్రీరాముని బాణాల వాడిని, దాడిని ఎదుర్కోవడం నరులకే కాదు సురశ్రేష్ఠులైన సూర్య, పర్జన్య, యమాదులకు కూడ సాధ్యము కాదు. శ్రీరాముని విజయానికి నీవే కారణమవుతావు".

హనుమ యొక్క ఓదార్పు మాటలు సీతాదేవికి కొంత ప్రశాంతత కలిగించాయి. ఆమె హనుమను ఒక్క రోజైనా, రాక్షసులకు కనబడకుండా రహస్యంగా ఉండి వెళ్లుమని కోరింది. ఆయన ఉనికి వలన మరొక్కరోజు తాను ప్రశాంతంగా ఉండగల్గుతాను అంది.

ఆమెకు ఒక అనుమానము ఆమె మనస్సులో మెదలసాగింది. దానిని తీర్చుకోవాలని, "హనుమా! నీవంటే దైవ వరప్రసాదివి. వాయుపుత్రుడివి. నీవు గరుత్మంతునితో, వాయుదేవునితో సమానవేగంగా వెళ్లగల్గినవాడివి. నీకు ఈ సముద్రాన్ని దాటడం ఒక లెక్క కాదు.

"కాని మిగిలిన వానరులు సముద్రాన్ని ఎలా తరించగల్గుతారు? రామ లక్ష్మణులెలా దాటి రాగల్గుతారు? వారు నన్ను ఎలా కాపాడగల్గుతారు?" అనే అనుమానము నన్ను బాధిస్తున్నది. "దీనికి తగిన సమాధానము తెలిపి, నా మనస్సుకు శాంతిని కలిగించవా? రాముడు ఇక్కడికి రావాలి. లంకనంతా రామబాణమయం కావించాలి. రావణాసురుని సపరివారంగా సంహరించాలి. నన్ను గౌరవంగా తనతో తీసికవెళ్లాలి. అది ఆయనకు, నాకు తగినట్లుగా ఉంటుంది" అని తెలిపింది.

"శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః।
మాం నయేద్యది కాకుత్స్థః తత్తస్య సదృశో భవేత్॥"

సీతాదేవికి విశ్వాసం కలిగించేలా హనుమ ఇలా బదులిచ్చాడు.

"మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః।
మత్తః ప్రత్యవరః కశ్చిత్ నాస్తిసుగ్రీవ సన్నిధౌ"

అహం తావదిహ ప్రాప్తః కిం పునస్తే మహాబలాః।
నహిప్రకృష్టాః ప్రేష్యంతే। ప్రేష్యంతేహీతరాజనాః"

అమ్మా! సుగ్రీవుని సన్నిధిలో అందరికంటే (చిన్న) తక్కువ వాడిని నేనే. నా కంటే ఎందరో పెద్దవారు, కొందరు నాతో సమానులు ఉన్నారు.

ఇంత చిన్నవాడిని నేనే సులభంగా సముద్రం దాటి లంకకు వచ్చాను. ఇక నాకంటే పెద్దవాళ్ల గురించి వేరే చెప్పాలా? చూడమ్మా! ఎవ్వరైనా అందరికంటె చిన్నవారికే కదా పని చెప్పేది. పెద్దవారికి ఎవ్వరు పనులు చెప్పరు కదా!

నాస్మిన్ చిరం వత్స్యసి దేవి దేశే। రక్షోగణైరధ్యుషితే2తిరౌద్రే।
నతే చిరాదగమనం ప్రియస్య। క్షమస్వ మత్సంగ కాల మాత్రమ్"

రాక్షసులకు నిలయమై, అతి రౌద్రమైన ఈ లంకా నగరంలో ఇక ఎంతో కాలము నీవు ఉండబోవమ్మా! నేను రాముని కలుసుకొనే దాకా ఓర్చుకో. వెంటనే నీ ప్రియుడు నీ దగ్గరికి వచ్చి రావణుని సంహరించి నిన్ను తీసికవెళ్తాడు.

-- ఇతిశం --



హనుమకు సీత సిగపూవునిచ్చుట

# సీతాదేవి చివరి మాటలు - 32

హనుమ పలుకులు సీతాదేవి మనస్సులో తాపాన్ని తగ్గించాయి. ఆమె మళ్లీ హనుమతో

"వాయునందనా! సగము మొలకెత్తిన పైరు పొలములో, వర్షము పడి, పైరు మరింత పైకి వచ్చినట్లు నా మనస్సులో నీ మాటలు మరింత హర్షాన్ని కలిగించాయి. శ్రీరామునితో నా కలయిక జరిగేలా అనుగ్రహించు. కాకాసుర వృత్తాంతాన్ని జ్ఞాపకం చేయి. ఈ చూడామణిని భద్రంగా రామభద్రునికి అప్పగించు". ఇంత కాలము ఈ సిగపూవును రామచంద్రుని జ్ఞాపకంగా భద్రంగా దాచుకొన్నానని తెలుపు.

"ఒకనాడు చెమటతో నా బొట్టు కరిగిపోయింది. అప్పుడు నా భర్త నన్ను దగ్గరకు తీసికొని స్వయంగా మణిశిలతో నాకు బొట్టు పెట్టాడు". ఈ విషయం కూడ మా భార్యా భర్తలిద్దరికే తెలుసు. ఈ బొట్టు గురించి కూడ నా రామునికి జ్ఞాపకం చేయి.

"రాముని కొరకే ఈ రాక్షస బాధలను అనుభవిస్తున్నాను. ఆయన కొరకే నా ప్రాణాలను కాపాడుకొంటున్నాను. నేను బ్రతుకాలనుకొన్నా నెల రోజులకు మించి రావణుడు నన్ను బ్రతుకనీయడు. ఆ లోపు నా పతి రాకున్నా, నన్ను రక్షింపకున్నా, ఆ తరువాత నేను ప్రాణాలతో ఉండను.

రావణుడు క్రూరుడు. ఆయన నన్ను తన వశం చేసికోవడానికి అన్ని రకాల బెదిరిస్తున్నాడు. నెల తరువాత కూడ తనకు నేను వశం కాకపోతే నన్ను చంపి, తనకు ఆహారముగా పంపుమని పాచకులకు తెలిపాడు" అని కన్నీటితో అంది.

అప్పుడు హనుమ, "అమ్మా! రాముని విడిచి నీవెంత దుఃఖిస్తున్నావో, నిన్ను విడిచి రామలక్ష్మణులు కూడ అంత దుఃఖిస్తున్నారు. నిన్ను నేను చూచి వెళ్తున్నాను కదా! నేను వెళ్లగానే రామలక్ష్మణులు అత్యంత పరాక్రమోపేతులై ఇక్కడికి వచ్చి ఈ లంకను భస్మము చేసి నిన్ను తీసిక వెళ్తారు. శ్రీరామునికి ప్రీతికరంగా మరేదైనా గుర్తు నివ్వగలవా?" అని ప్రశ్నించాడు.

బదులుగా, 'నేనిచ్చిన సిగపూవు చాలు. దానిని చూచి వెంటనే రాముడు నిన్ను నమ్ముతాడని" ఆమె తెలిపింది.

ఇక హనుమ తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. అప్పుడు కన్నుల నిండా నీరుతో మళ్లీ సీతమ్మ:-

"హనుమా! రామలక్ష్మణులను, సుగ్రీవుని, అతని మంత్రులను, ఆయన పరివారా న్నంతటిని నేనడిగినట్లు" మరొకసారి తెలుపు.

"యథాచ సమహాబాహుః మాంతారయతి రాఘవః।
అస్మాత్ దుఃఖాంబు సంరోధాత్। త్వం సమాధాతు మర్హసి।"
ఇమంచ తీవ్రం మమ శోకవేగం। రక్షోభిరేభిః పరిభర్త్సనంచ।
బ్రూయాస్తు రామస్య గతస్సమీపం। శివశ్చతే2ధ్వాస్తు హరిప్రవీర

"హనుమా! నా దుఃఖసముద్రాన్నుండి మహాబాహువైన రామభద్రుడు నన్ను తరింప జేసేలా నీవే ప్రోత్సహించు.

నా దుఃఖాతిశయాన్ని, ఈ రాక్షస స్త్రీలు ప్రతిక్షణం నన్ను పెట్టే భయంకర బాధలను నీవు వెళ్లగానే రామునికి పూసగ్రుచ్చినట్లు తెలుపు.

హనుమా! నీ మార్గము మంగళమయమగుగాక! నీ ప్రయాణము సుఖంగా సాగుకాక" అని పలికింది.

సీతమ్మ తన బాధలన్ని తెలుపుతుంటే హనుమ మనస్సులో ఆగ్రహము, దుఃఖావేశము పొంగుకొచ్చాయి. అయినా సీతా సందర్శనానందం ఆయన మనస్సులో పరుగులెత్తింది.

ఇక సీతాసందర్శన కార్యము పూర్తి అయిందని హనుమ అనుకొన్నాడు. "ఎలాగూ లంకకు వచ్చి సీతాదేవిని చూచాను కదా! ఇంకా కొంతపనిని లంకలో నెరవేర్చి వెళ్లితే బాగుంటుందని" అనుకొన్నాడు.

ఈ సర్గలో కాకాసుర వృత్తాంతము ద్వారా శరణాగతి ఎప్పుడైనా ఎవ్వరైనా, ఏ విధంగా నైనా చేయవచ్చునని, శరణన్న వాడు ఎంత దుర్మార్గుడైనా భగవదనుగ్రహానికి పాత్రుడవుతాడని తెలుస్తుంది.

మణిశిలతో బొట్టును రాముడే పెట్టడం ద్వారా అన్ని అలంకారాలు పరమాత్మ ప్రీతి కొరకే కాని మన ఆనందం కొరకు మనము పెట్టుకోకూడదని తెలుస్తున్నది.

అంతేకాదు తిలకం ఎఱ్ఱగా ఉంటుంది కదా. ఎరుపురంగు అనురాగానికి గుర్తు. "భగవదనురాగమంటే భగవద్భక్తి" అని అర్థము. ఈ భగవదనురాగము కూడ భగవంతుడే కలిగించాడని, తనకు తాను సాధించుకొన్నది కాదని గుర్తించాలి. మార్జాలము (పిల్లి) తన కిశోరాన్ని (పిల్లను) తానే పట్టుకొని కాపాడినట్లు భగవంతుడే మనను నిర్హేతుకంగా కాపాడుతాడు" అని అర్థము.

అదే విధంగా చూడామణి ఒక కేశభూషణము. భర్త యొక్క సంతోషానికి ప్రేమకు కారణమైనది. భర్తకు సంతోషం కలుగాలని భార్య ధరించేది. భగవంతుని పట్ల వ్యామోహమైన భక్తికి కూడ చూడామణి సూచకము. తన పట్ల వ్యామోహాన్ని భార్య కలిగి ఉందని గుర్తించడం భర్తకు కూడ హర్షదాయకమే కదా!

ఇంతవరకు సుందరకాండలో రెండు ముఖ్యఘట్టాలు పూర్తి అయ్యాయి. (1) రామాజ్ఞతో సముద్రం దాటి వచ్చి సీతను లంకలో వెతుకడం. (2) అశోకవనంలో రాక్షసుల మధ్య సీతాదేవిని చూడడం.

(1) అన్వేషణము (2) దర్శనము.

హనుమ వలె ఆచార్యుడు కూడ సంసార సముద్రాన్ని దాటి సులభంగా లంక అనే శరీరంలోకి వచ్చి, వెళ్లుతాడు. ఆచార్యుడు కూడ భగవత్సంబంధం కావాలనే కోరికగల, (ఈ శరీరంలో ఉన్న) చేతనులను (ముముక్షువులను) అన్వేషిస్తాడు.

(1) హనుమకు రాక్షసుల మధ్య సీతాదేవి కనబడినట్లు (ఆచార్యుని అన్వేషణలో ఆయనకు భగవంతుని పట్ల అభిముఖులైనవారు సంసారుల మధ్య కనబడతారు.

ఇక మిగిలిన పని (3) విరోధినిరసనము: సీతాదేవికి విరోధులైన రావణుని సైనికులను తనకు వీలైనంత మందిని నశింపజేసి రాముని మార్గాన్ని కొంతవరకు రాళ్లు రప్పలు లేకుండా చేయడం.

భగవత్ప్రవృత్తికి ఆటంకాలైన కామక్రోధాదులను (అరిషడ్వార్గాన్ని) ఆచార్యుడు కొంత వరకు శమింపజేస్తాడు.

-- ఇతిశం --

కోమలమైన పతియడుగులకు నా నమస్కృతులు
జెప్పుమయ్య"

మన్మస్తకమున నెవని కాల్దమ్ము భూషణాయితముగ మసలు
నాతనికిని మన్నమస్కృతులివి.

ఎదురు లేదు, శ్రీరామునకు ఎదురులేదు లక్ష్మణునకు
"ఏమియు గానక పోయిన వాడు దూతయే"

# శత్రునిరసనము - 33

సుందరకాండ హనుమ యొక్క మూడు అసాధారణ కృత్యాలతో కూడుకొని ఉంది. 1)సీతాన్వేషణము 2)సీతాసందర్శనము 3)శత్రువిజయము

ఇంతవరకు హనుమ సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించి సీతకొరకు రావణాంతః పురమంతటిలో అన్వేషించాడు.

ఆయనకు అశోకవనములో ఆమె కనబడింది.ఆమెకు తాను రామదూతనని తెల్పి రామాంగులీయకాన్ని ఇచ్చి, ఆమె సిగపూవును ఆమె గుర్తుగా స్వీకరించాడు. ఇప్పటికి ఆయన కార్యము పూర్తి అయింది.

ఆచార్యుడు కూడ భగవదాజ్ఞతో భూమండలముపై అవతరించి ముముక్షువులైన జనులను అన్వేషిస్తాడు. కాని 'ఇరుళ్ తరుంమాజాలం' అన్నట్లు అజ్ఞానప్రచురమైన ఈ ప్రపంచములో 'భగవత్ తిరోధానకరీ, స్వభోక్తృ బుద్ధిజననీ' అన్నట్లు భగవంతుని మరపించి, తన సుఖాలపట్ల వ్యామోహాన్ని కలిగించే ప్రకృతి పట్ల వ్యామోహవివశులైన రాక్షసస్వభావులే అధికంగా ఉంటారు. రావణాసురుని అంతఃపురములో హనుమకు కనబడిన జనులందరు అటువంటివారే.

అయినా ఆచార్యుడు తన అన్వేషణ ప్రయత్నాన్ని మానడు. తన ప్రయత్నం సఫలం కావాలని 'నమోస్తు రామాయ, సలక్ష్మణాయ' అని భగవంతుని, భాగవతోత్తములను ప్రార్థిస్తాడు. 'నమోస్తు దేవ్యై జనకాత్మజాయై' అని పురుషకారస్వరూపిణి అయిన అమ్మవారిని ప్రార్థిస్తాడు.

శ్రీ శ్రియఃపతుల, భాగవతోత్తముల కృపాఫలంగా హనుమకు సీతాదేవి లభించినట్లుగా ఆచార్యునికి భగవద్విరహదుఃఖాన్ని భరించలేక, భగవంతునితో సంగమము తన జీవితకాలంలో కలుగుతుందో లేదో అని పరితపించే ముముక్షువు కనబడతాడు.

ఆయనకు ఆచార్యుడు భగవద్విషయాన్ని, ఆయన వ్యామోహాన్ని తెలిపి, భగవంతుని అసాధారణ లక్షణాలను(రాముని ఉంగరాన్ని=భగవంతుని శంఖచక్రాదులను) ముముక్షువుకు అందజేసి, ఆయన భగవద్వ్యామోహచిహ్నాలను గ్రహించి భగవంతునికి అందజేయాలనుకొంటాడు.

ఇక ఇప్పుడు హనుమ చేసే మూడవ పని మిగిలింది. అదే 'శత్రువిజయము'. సీతాదేవికి శత్రువులైన రావణుని సైనికుల పరివారాన్ని మట్టుబెట్టి,ప్రధాన శత్రువైన రావణునే కలసి, శ్రీరామచంద్రస్వామి అమోఘ బలపరాక్రమాలను తెలిపి, శ్రీరామునితో విరోధము మానుకోకపోతే సర్వనాశము తప్పదని హెచ్చరించి ఆయనకు లంకాదహనము ద్వారా భయాన్నికలిగించి శ్రీరాముని సన్నిధికి చేరుకొంటాడు. అంతటితో ఈ సుందరకాండ సుందరంగా పూర్తి అవుతుంది.

ఆచార్యుడు కూడ ఆత్మవిరోధులైన కామక్రోధాది ఆరు ప్రబల శత్రువులను భగవన్నామసంకీర్తనాబలంతో శమింపజేసి, ఆశ్రితులలో అధైర్యాన్ని పోగొట్టి, వారి దుః ఖాతిశయాన్ని తెలుపడానికి పరమాత్మను చేరుకొంటాడు.

ఆచార్యుడు ఆది నుండి తన ప్రయత్నము విజయవంతము కావడానికి భగవన్మంత్రాన్ని అనుసంధించుకొంటాడు. ఆ మంత్రమే ఆయనకు వజ్రకవచము.

ఆరు అక్షరాలు, మూడు పదాలు గల 'రామ మంత్రమే' ఇక్కడ భగన్మంత్రము.'ఓం నమో రామాయ'

ఇందులో మూడు పదాలు ఉన్నాయి. అందులో మొదటి పదము 'ఓం' ఇందులో మూడు అక్షరాలు(మూడు పదాలు కూడ) ఉన్నాయి.

1)'అ',2)'ఉ', 3)'మ'

అకారవాచ్యుడైన పరమాత్మ (ఉ) కే, మకారవాచ్యుడైన జీవుడు (నవవిధములుగా) సంబంధించినవాడు అని అర్థము.

అకారముతో తెలుపబడే రాముని(ఉ) తోనే మకారవాచ్యురాలైన సీతాదేవిని కలిపే ప్రయత్నమే ఓంకారార్థము. కనుక హనుమ సీతాదేవిని దర్శించేవరకు జరిపిన అన్వేషణమే ఓంకారము చేత తెలుపబడింది.

ఇక సీతాదేవిని దర్శించే ఘట్టమంతా 'రామాయ' అనే పదంతో సూచితము అవుతుంది.సీతాదేవి 'రామాయ' రాముని కొరకే తాను జీవించి ఉన్నానని చెప్పుతుంది. 'రామమేవాను ధ్యాయంతీ' రామునినే ధ్యానిస్తూ జీవించి ఉంది.

ఇక మిగిలింది శత్రువిజయము. అది 'నమః' అనే పదము చేత సూచింపబడుతుంది. 'మః' నాకు నేను అని "అహంకారాన్ని" సూచిస్తుంది. శత్రువులైన రావణ సైనికులందరు

హనుమను నేనే ఓడిస్తాను నేనే ఓడిస్తాను అని అహంకరించి ముందుకు వచ్చిన వారే. వీరందరి నాయకుడైన రావణుడు స్వయంగా అహంకారరూపమే.

అటువంటి అహంకార స్వరూపులైన రాక్షసులందరి ఉద్ధృతిని తొలిగించి 'నమః' నాకు నేను కాను. నేను స్వతంత్రుడిని కాను. నేను 'దాసోహం కోసలేంద్రస్య' "నేను కోసలేంద్రుడైన రామపరమాత్మకు దాసుడినే" అనే సందేశాన్ని రాక్షసుల మధ్య బలంగా వినిపిస్తాడు హనుమ. ఈ రామమంత్రమే "రాం" అనే బీజాక్షరంతో కలిసినప్పుడు "రాం రామాయ నమః" అనే ప్రత్యేక "రామ మంత్రం"గా మారుతుంది. ఓం స్థానంలో "రాం" వస్తుంది.

హనుమ తన ఉనికిని రావణునికి తెలియజేసి, అయన బలాన్ని స్వయంగా తెలుసుకోవాలనుకుంటాడు. అందుకు రావణునికి ప్రమదాన్ని కలిగించే (అశోకవనాన్ని) ప్రమదావనాన్ని ధ్వంసం చేయాలని, "ప్రమద" అయిన సీతాదేవికి 'అవనాన్ని' రక్షణను కలిగించే హనుమంతుడు పూనుకొన్నాడు. దానితో ఆ అశోక(లతా ప్రతానములు గల) వనము శోక లతా ప్రతాన(విరువబడిన కొమ్మలు,పూలు,పండ్లు,తీగలను కల్గినది) మయింది.

'సావిహ్వలా(అ)శోకలతా ప్రతానా
వనస్థలీ శోకలతా ప్రతానా
జాతా దశాస్య ప్రవదావనస్య
కపేర్బలాద్ధి ప్రమదావనస్య'

రావణుని యొక్క ప్రమదా (ఆనందాన్ని కల్గించే) వనము యొక్క అశోక లతాప్రతానము(సంతోషాన్ని కలిగించే వివిధ పుష్ప ఫలద్రుమాలు) ప్రమదావనుడైన కపీశ్వరుని బలము వలన శోకలతాప్రతానము అయింది.అనేక శబ్ద చిత్రాలతో వ్యంగ్యార్థాలతో అత్యంత సుందరంగా సాగింది, వాల్మీకి రచనాచమత్కృతికి అద్దం పట్టే ఈ శ్లోకము.

-- ఇతిశం --

శత్రు విజయము. "నమః" అనే పదముతో సూచింపబడుతుంది.

# "రాముడు జయించుగాక" - 34
# (జయత్యతి బలో రామః)

చెట్లకొమ్మలు 'పెళ పెళ' శబ్దాలతో విరిగిపడుతున్నాయి. చెట్లపైన ఆనందంగా నిద్రిస్తున్న పక్షులు భయంకరంగా అరుస్తూ పారిపోతున్నాయి. ఆ అడవిలో నివసిస్తున్న మృగాలు శత్రుభయంతో భయంకర ధ్వనులు చేస్తూ చెల్లాచెదురవుతున్నాయి.

ఈ ధ్వనులతో నిద్రాభంగమైన రాక్షసస్త్రీలు మేల్కొని వనాన్ని ధ్వంసము చేస్తున్న హనుమంతుని చూచారు. ఆయన ఆకారము వారికి భయాన్ని కలిగించింది.

వారు సీతాదేవి దగ్గరకు వచ్చి 'నీతో ఈ వానరుడు ఇంతసేపు ఏమి మాట్లాడాడు? నీవేమి మాట్లాడావు? నీకు ఈయన ఎలా తెలుసు? ఎందుకు రాక్షసేశ్వరుని అశోకవనాన్ని ఈయన శోకమయం చేస్తున్నాడు?" అని అడిగారు.

సీతాదేవి ఎక్కువగా మాట్లాడలేదు. "నెమ్మదిగా ఆయన ఎవ్వరో నాకెలా తెలుసు? ఈ లంకలో నాకు అయిన వాళ్ళెవరు ఉన్నారు? ఆయన రూపము నాకు కూడా భయంకరంగానే ఉంది. "ఆయనెవ్వరో ఒక క్రూర రాక్షసుడు కావచ్చు" అని భయంతో ఊరుకున్నాను. మీరు నాకు అంతశ్శత్రువులే(అహిరూపులే). ఆయన కూడా అహిరూపుడే. అహి(అంతశ్శత్రువు) యొక్క పాదాల జాడను 'అహే' తెలుసుకోగలుగుతుంది కదా!" అని పలికి ఊరకుంది.

అహి అంటే పాము. పాము పాదాలజాడను పామే పసికట్టుతుంది కదా అని అర్థము.

'అహిరేవహ్యాహేః పాదాన్ విజానాతి న సంశయః'

సీతాదేవి మాటలు రాక్షసాంగనలకు అర్ధము కాలేదు. వారు అయోమయంతో రావణాసురుని సన్నిధికి వెళ్లి "ప్రభూ! ఒక పెద్దకోతి వచ్చి మీ కిష్టమైన అశోకవనాన్ని అంతటిని అస్తవ్యస్తము చేస్తున్నది. అయినా ఆ వనంలో సీతాదేవికి సమీపంలో ఉన్న శిశుపావృక్షాన్ని మాత్రము తాకలేదు.

అంతకుముందు ఆ వానరుడు సీతాదేవితో కొంతసేపు ఏమో మాట్లాడాడు" అని నివేదించారు.

రావణాసురునికి కోపము తలకెక్కింది. ఏమిటి? ఒక కోతి ఎక్కడినుండో వచ్చి తన కత్యంత ప్రియమైన సీతాదేవితో స్వతంత్రంగా సంభాషించడమా?

తనకు ప్రమదాన్ని (అధిక సంతోషాన్ని) కలిగించే అశోకవనాన్ని ధ్వంసము చేయడమా?

రావణాసురుని నేత్రాలు కోపంతో ఎర్రబారాయి. ఆగ్రహంతో ఆయన కళ్లనుండి వేడి కన్నీటి బొట్లు పడ్డాయి. అవి మండుతున్న దీపాలనుండి మంటలతో పడుతున్న నూనె బిందువులవలె ఉన్నాయి.

"దీప్తాభ్యామివ దీపాభ్యాం సార్చిషః స్నేహబిందవః" మంటలు హనుమపై కోపానికి, స్నేహ(నూనె)బిందువులు సీతాదేవి పట్ల ప్రేమకు సంకేతాలు.

ఆ తరువాత రావణాసురుడు బలవంతులైన ఎనభైవేలమంది కింకరులను హనుమను నిగ్రహించడానికి పంపాడు.

ఆ రాక్షసకింకరులు భయంకరాకారులై అనేక ఆయుధాలను ధరించి హనుమతో అన్నివిధాలా ఆహవానికి (యుద్ధానికి) ఆయత్తులై వెళ్లారు. వారందరు హనుమను చుట్టుముట్టారు.

అప్పుడు హనుమ కూడా పర్వతాకారంతో ప్రతీకారవాంఛతో ఒడలు విరుచుకొని గర్జించి తన గూర్చి ఈ విధంగా తెలుపుకున్నాడు.

1)"జయత్యతి బలో రామో। లక్ష్మణశ్చ మహాబలః।
రాజాజయతి సుగ్రీవో। రాఘవేణాభి పాలితః॥
దాసోహం కోసలేంద్రస్య। రామస్యా క్లిష్టకర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం। నిహంతా మారుతాత్మజః"

2)"న రావణ సహస్రం మే। యుద్ధే ప్రతిబలం భవేత్
శిలాభిస్తు ప్రహరతః। పాదపైశ్చ సహస్రశః।
అర్దయిత్వా పురీం లంకాం।అభివాద్యచ మైథిలీం।
సమృద్ధార్థో గమిష్యామి। మిషతాం సర్వరాక్షసాం".

ఈ రెండు శ్లోకాలు జయమంత్రాలు. వీటిని శ్రద్ధాభక్తులతో పారాయణం చేస్తే శత్రుజయము, దారిద్ర్యము, వ్యాధి, బాధలు తొలగుతాయి.

హనుమ తన విజయానికి కారణాన్ని ముందు తెలుపుతున్నాడు. హనుమ ఒక్కడికే కాదు అందరికి అన్ని విజయాలకు కారణము శ్రీరాముని బలమే.అందువలన అతిబలుడైన శ్రీరాముడు జయిస్తాడు అన్నాడు. "జయత్యతిబలోరామో"।

భగవంతుని బలము మనను నేరుగా రక్షించదు. భగవంతుని రక్షణను మనకు నేరుగా అందించేవాడు ఆచార్యుడు. అందువలన భగవంతుని అతిబలంతో పాటు ఆచార్యుని మహాబలాన్ని కూడ మనము కీర్తించాలి.

'లక్ష్మణశ్చ మహాబలః'

లక్ష్మణుని నిర్లక్ష్యం చేసిన సుగ్రీవుడు మొదటిసారి వాలితో సమరానికి వెళ్లినప్పుడు రాముడు ఆయనను రక్షించలేదు. మళ్లీ గజపుష్పమాలను లక్ష్మణుడు గ్రీవంలో వేయగానే సుగ్రీవుడు లక్ష్మణాభిమానానికి పాత్రుడయ్యాడు. కనుక రామరక్షను పొంది వాలి మరణమును, తనకు భార్యా రాజ్యలాభములను పొందాడు.

భగవదాచార్య సహాయాలు లభించినప్పటికి మనకు సంపూర్ణ రక్షణ లభించదు. భగవంతుని, ఆచార్యుని రంజింపజేసేవాడు భాగవతోత్తముడు. ఆయన అభిమానము లభిస్తేనే భగవదాచార్యాభిమానము మనకు శాశ్వతమవుతుంది. భాగవతాభిమానము లేకపోతే కొంతకాలానికి భగవదాచార్యులు కూడ చేయి వదులుతారు.

హనుమ భాగవత వైభవాన్ని కీర్తిస్తున్నాడు.

"రాజాజయతి సుగ్రీవో రాఘవేణాభి పాలితః"

లక్ష్మణానుగ్రహంతో రాఘవునితో పరిపాలింపబడ్డవాడు సుగ్రీవుడు భాగవతోత్తముడు. భాగవతోత్తముడైన సుగ్రీవుడు రాజు. ఆయన సీతాన్వేషణకు పూనుకొని రామ లక్ష్మణుల మనస్సులను రంజింపజేశాడు.

అంతేకాదు సీతాదేవి దక్షిణదిశాధిపతి అయిన రావణునిచే అపహరింపబడింది, కనుక ఆ దిశకు అంగద, జాంబవదాది మహావరులతో పాటు హనుమను పంపాడు, హనుమ అనన్య ప్రతిభా ప్రభావాలను రామునికి సూచించి, శ్రీరాముని ప్రత్యేకాభిమానానికి అతనిని పాత్రుని గావించాడు, రాముడు తన అంగుళీయకాన్ని కూడ ఇచ్చి పంపేంత స్థాయిలో రామానుగ్రహాన్ని హనుమకి కలిగించిన మహాభాగవతోత్తముడు సుగ్రీవుడు. ఆ విధంగా రామలక్ష్మణుల మనస్సులను, హనుమ మనస్సును కూడ రంజింపజేసినవాడు సుగ్రీవుడు. అందువలన హనుమ 'రాజా జయతి సుగ్రీవో' అని సుగ్రీవుని విజయాన్ని కూడ ప్రత్యేకంగా పేర్కొన్నాడు.

ఇప్పుడు హనుమకు భగవద్భాగవతాచార్యాభిమానము సంపూర్ణంగా లభించింది. ఇప్పుడు చెప్పుకోవలసింది తన దాస్య సంబంధాన్ని. దాస్య సంబంధము భగవంతునితో ప్రారంభమై భాగవతోత్తములదాకా పర్యవసిస్తుంది(కొనసాగుతుంది). అయితే తాను ప్రత్యేకంగా భాగవతోత్తములకు దాసుడనని చెప్పుకోకున్నా భగవద్దాస్యము భాగవతోత్తముల దాకా కొనసాగుతుందని పెద్దలందరు అంగీకరించిందే.

'భాగవతపర్యంతమాక అనుసంధిక్కేయం' అంటారు లోక గురువులు. అందువలన హనుమ చెప్పుకుంటున్నాడు తన భగవద్దాస్యమహిమను.

'దాసోహం కోసలేంద్రస్య। రామస్యా క్లిష్టకర్మణః'

రాముడు అక్లిష్టకర్ముడు, ఎంత అసాధ్యకార్యాలనైనా అవలీలగా నెరవేర్చగలిగిన మహాత్ముడు. అటువంటి రామపరమాత్మకు తాను దాసుడు.

ఇక శత్రువిజయము అతనికి పెద్ద విషయం కాదు. తన శత్రుభయంకరత్వాన్ని, తన పేరును, తన తండ్రి పేరును గర్వంగా ప్రకటించుకుంటున్నాడు.

"హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతామారుతాత్మజః"

ఒకే రావణుడు కాదు వేలమంది రావణులు కూడ తనకు సాటిరారని తెలుపుతున్నాడు.

"నరావణ సహస్రంమే। యుద్ధే ప్రతిబలం భవేత్"

రావణుని జయింపగలిగిన నా సంపద ఏమిటో తెలుసా?లంకలో వేలాదిగా ఉన్న రాళ్ళు,చెట్లు.

'శిలాభిస్తు ప్రహరతః। పాదపైశ్చ సహస్రశః'

ఏమయ్యా రాళ్ళు రప్పలతో, చెట్లతో, మహేంద్రుని గడగడలాడించిన మహాపరాక్రమ సంపన్నుడైన రావణుని జయింపగల్గుతావా? అంటే అవును అంటున్నాడు.

"అర్ధయిత్వా పురీం లంకాం।మిషతాం సర్వ రాక్షసాం"

రాక్షసులందరు నివ్వెరపడుతూ చూస్తుండగా ఈ లంకానగరాన్ని నాశనం చేస్తాను.

ఆ తరువాత ఏమి చేస్తావు? 'అభివాద్యచ మైథిలీం' నా ఈ విజయానికి కారణమైన చల్లని కరుణ కలిగిన సీతాదేవికి ప్రణమిల్లుతాను.

'సమృద్ధార్థో గమిష్యామి'

అదిగో ఆవిధంగా నా పనిని అంతా పూర్తిచేసికొని, నా ఈ అపూర్వ విజయానికి కారణమైన అతిబలుడైన రామభద్రుని సన్నిధికి చేరుకుంటాను.

చూచారా హనుమ రామభక్తిని। హనుమ రామదాస మహిమను. మొట్టమొదటిసారి హనుమ తనను 'దాసోహం కోసలేంద్రస్య రామస్య' అని రామదాసునిగా పేర్కొన్నాడు.

ఇంతవరకు తన అనుచరులతో, సీతాదేవితో కూడ 'దూతోహం' అని రామదూతగా పేర్కొన్నాడు.

ఎందుకు వచ్చింది హనుమలో ఈ మార్పు? సీతాదేవిని చూచాక కలిగింది ఆయనలో ఈ మార్పు.రావణాసురుని ముందు 'తృణమంతరతఃకృత్వా' అని ఒక గడ్డిపోచను వేసి,

'నత్వాకుర్మి దశగ్రీవ। భస్మ భస్మార్హ తేజసా'

రావణా! నిన్ను నేనే స్వయంగా భస్మం చేయగలుగుతాను. అయితే నీవింత నీచంగా, క్రూరంగా ప్రవర్తించినా నిన్నెందుకు భస్మము చేయడంలేదో తెలుసా?

"అసందేశాత్తు రామస్య తపసశ్చాను పాలనాత్"

'నన్ను నేను అవసరమైతే స్వయంగా రక్షించుకోవచ్చా'అని నా నాథుని అడగలేదు. అప్పుడు అడగకపోతే ఏమిటి?ఇప్పుడింత ఆపద వచ్చింది కదా?అంటే ఎంత ఆపద వచ్చినా నేను స్వతంత్రంగా ఏ పని చేయకూడదని నా తపస్సు. అ తపస్సును పాలించుకోవడంవరకే నిన్ను భస్మం చేయడంలేదని సీతాదేవి నిర్భయంగా రావణుని ముందు తెలిపింది. సీతాదేవి ఉన్నది రామునికొరకే "రామాయ".

హనుమంతునికి ఆశ్చర్యం వేసింది. సీతాదేవి అద్భుత తేజస్సును, ఆమె అత్యద్భుత పాతివ్రత్యమహిమను చూచాక అప్పుడనుకొన్నాడు "రామదాసత్వానికి మించింది ఏదీ లేదని" అప్పుడు భావించుకొన్నాడు. తనను 'రామదాసుడని'. అప్పుడనుకున్నాడు తనకు తాను స్వతంత్రుడను కానని. 'నమః' అని అనుకున్నాడు.

అప్పుడు తళుక్కున మెరిసింది ఆయన మనస్సులో రామతారకమంత్రము.

"రాంరామాయనమః"

ఈ ఆరు అక్షరాల రామమంత్రము సంసారాన్ని తరింపజేసే తారకమంత్రము.

ఈ ఆరు అక్షరాల రామమంత్రము సర్వఆపదలనుండి దాటింపజేసే తారకమంత్రము.

ఇక రామమంత్రము హనుమకు సర్వస్వమైంది. ఈ మంత్రమే ఆయనకు సర్వాధారమైంది.


ఆయన అశోకవనంలోని తోరణముపై కూచున్నాడు. ఆయన రామ తారక మంత్రాన్నే ఆధారంగా చేసుకున్నాడు.

తోరణానికి క్రింది మీదులు, కుడి ఎడమలు అని నాలుగు వైపులు ఉన్నాయి. రామమంత్రములో మూడు పదాలు ఉన్నాయి.

'రాం రామాయనమః'

ఎడమనుండి కుడివైపుకు వెళ్లడం మన పద్ధతి. ఇప్పుడు తోరణ స్థంభానికి ఎడమ వైపు 'రాం' కుడివైపు "రామాయ" పదాలను హనుమ ఊహించుకున్నాడు. ఇప్పుడు స్థంభానికి ఉత్తర దక్షిణాలున్నాయి. 'నమః' అనే ఒకే పదం ఉంది.

అయితే 'నమః' అనే పదము నమస్కారాన్ని సూచిస్తూ ఒకే పదము అవుతుంది. లేదా నాకు నేను (మః), కాను (న) అని రెండు పదాలు అవుతాయి. అందువలన తోరణంపై (ఉత్తర) భాగంలో 'న' అనే మొదటి అక్షరాన్ని క్రింది (దక్షిణ) భాగంలో 'మః' అని చివరి అక్షరాన్ని అనుకున్నాడు. ఇప్పుడా తోరణస్థంభం ఈ క్రింది విధంగా ఉంది.




తాను కూచున్న తోరణంపై భాగంలో 'న' అనే అక్షరాన్ని ఊహించుకున్నాడు. తాను చేయాలనుకుంటున్న శత్రువిజయానికి తాను కారణం (న) కాదు అని నిశ్చయించుకున్నాడు.

తోరణం పైభాగంలో స్థిరంగా కూచొని, తన గురించి గర్వంగా చెప్పుకొంటున్న హనుమను ఎనభైవేలమంది రాక్షసకింకరులు ఒక్కుమ్మడిగా చుట్టుముట్టారు. వారందరు గదలను, పరిఘలను, బాణాలను అనేక ఆయుధాలను ఆయనపై ప్రయోగించారు. హనుమ ఆ తోరణానికి చెందిన పరిఘను పెకిలించి వారందరిని సునాయాసంగా వధించాడు.

-- ఇతిశం --

అచట వచ్చి రావణు సహస్రము యుద్ధము నందు నిల్వగా
లేదు నిజంబు నా యెదుర

# రాముడు సకలాస్త్రవేత్త - 35

ఎనుభై వేల మంది రాక్షస కింకరులను అవలీలగా హతమార్చిన హనుమను చూచి భయకంపితులైన కొందరు సేవకులు రావణుని ముందువెళ్లి ఈ వార్తను తెలిపారు. పగవాడి పరాక్రమాన్ని విని సహించలేక రావణుడు ప్రధానమంత్రి అయిన ప్రహస్తుని కుమారుడని జంబుమాలివైపు తన తీక్ష్ణములైన చూపులను ప్రసరింపజేశాడు. జంబుమాలి సర్వ సైన్య సమేతంగా సమరానికి బయలుదేరాడు.

అయితే జంబుమాలివచ్చేదాక కూడ హనుమ ఆగ దలచుకోలేదు. అశోకవనంలో ఒక్క చైత్య ప్రాసాదము మిగిలి ఉంది. దానిని కూడ ధ్వంసము చేస్తే మరికొంత పని జరుగిపోతుందని ఆయన భావించాడు.

ఆ ప్రాసాదము మేరు పర్వత శిఖరమువలె ఉన్నతంగాఉంది. ఆ భవనముపైకి తన బలాన్నంతా ఉపయోగించి దుమికాడు. హనుమ యొక్క అపారమైన బలాన్ని ఆ భవనము తట్టుకోజాలలేదు. అది ముక్కలు ముక్కలుగా పేకమేడవలె కూలిపోయింది. మళ్లీ ఒకసారి తన విజయమంత్రాన్ని బిగ్గరగా చదువుతున్నాడు.

"అస్త్ర విజ్జయతాం రామో। లక్ష్మణశ్చ మహాబలః॥
రాజా జయతి సుగ్రీవో। రాఘవేణాభిపాలితః॥"

సకలాస్త్రవిదుడైన రాముడు జయించుగాక! మహాబలుడైన లక్ష్మణుడు జయించుగాక! రాఘవుని చేత పాలింపబడుతున్న సుగ్రీవుడు జయించుగాక!

తాను జయించాలని హనుమ ప్రత్యేకంగాకోరుకోలేదు. వాళ్ల విజయమే తన విజయము. భగవద్భాగవతాచార్య అభిమానమే తన విజయకారణము.

ఆ భవనాన్ని కాపలాకాచే వందమంది రాక్షస వీరులు ఆగ్రహావేశాలతో హనుమ పై బడ్డారు.

హనుమ ఆ మేడ యొక్క సువర్ణ స్థంభాన్ని ఊడబెరికి దానిని గిర గిర త్రిప్పసాగాడు. ఆ స్థంభం యొక్క తాకిడికి ఆ భవనం నుండి అగ్ని భయంకరంగా కలిగింది. ఆ అగ్ని భవనాన్ని అంతటిని తగుల బెట్టింది. ఆ స్థంభంతో హనుమ నూరుమంది కాపలాదారులను కాటికి పంపాడు.

హనుమ శ్రీమంతుడై ఆకాశంలోనే నిలిచి, మేఘ గంభీర ధ్వనితో "మహా పరాక్రమ సంపన్నుడైన సుగ్రీవుని ఆజ్ఞకు లోబడి వేలాది వానరవీరులు మహాగజబలులై భూమండల మంతా సంచరిస్తున్నారు. వారందరితో కలసి సుగ్రీవుడు, సహజ బలపరాక్రమ సంపన్నుడైన రామభద్రుడు లంకపై దండెత్తి వస్తున్నారు. అచిరకాలంలో లంకా నగర మంతా రాముని వైరాగ్నికి ఆహుతి అవుతుందని" ఉచ్చైస్వరంతో హెచ్చరించాడు.

-- ఇతిశం --

"కనరాముడెంతవాడో - అనుజుండును అంతవాడె"

శివుని విల్లు విరిచి సీతమ్మ కేలుగైకొన్నవాడు భూమి యెల్ల గడ్డిపోచగా వదలిన త్యాగమూర్తి

సృష్టి సమస్త మాతడె ఏలించును.
కావలెనేనియున్ పునఃసృష్టిని జేయురాముడు.

# జంబుమాలి - 36

రావణుని కనుచూపుల సైగలను గ్రహించిన జంబుమాలి ఇంద్ర ధనుస్సుతో సమానమైన, సమున్నత చాపాన్ని గ్రహించి, రక్త నేత్రాలతో దిక్కులు పిక్కటిల్లేలా ధ్వనిని చేస్తూ గాడిదలు పూన్చిన రథంపై బయలుదేరాడు.

జంబుమాలి వస్తూనే తోరణముపై కూచొన్న హనుమ ముఖముపై, బాహువులపై బాణాలతో కొట్లాడు. ఆ బాణము దెబ్బలతో రక్తముతో ఎఱ్ఱనైన హనుమ ముఖము పూచిన మోదుగుపూవు వలె కనబడింది.

హనుమ జంబుమాలి బాణప్రయోగ చాతుర్యానికి సంతోషించి, ఒక విశాల శిలను భూమిపై నుండి పెకిలించి జంబుమాలిపై విసిరాడు. అయితే జంబుమాలి దానిని పది బాణాలతో ముక్కలు ముక్కలు చేశాడు.

హనుమ ప్రక్కలో ఉన్న ఒక మహా వృక్షాన్ని పెకిలించి జంబుమాలిపైకి విసిరాడు. దానిని ఆయన నాలుగు బాణాలతో ఖండించాడు.

అంతేకాదు హనుమ భుజాలను, గుండెను, రొమ్మును తీవ్ర బాణాలతో బాధించాడు. దానితో ఆగ్రహించిన హనుమ - తాను కూచొన్న తోరణము యొక్క పరిఘను పెకిలించి తీసికొని, మహావేగముతో జంబుమాలి గుండెలపై కొట్టాడు. రాక్షసుని శరీరమంతా ముక్కలు ముక్కలైంది. శిరస్సు ఉండవలసిన స్థానంలో లేదు. బాహువులు విరిగాయి. మోకాళ్లు పగిలాయి. శరీరమంతా పొడి అయింది. ధనుస్సు, రథము, గాడిదలు అన్ని వాటి వాటి రూపాన్ని కోల్పోయాయి.

"తస్యచైవ శిరోనాస్తి న బాహూ, నచ జానునీ।

న ధనుర్నరథోనాశ్వాః తత్రాదృశ్యంత నేషవః"

జంబుమాలి విరిగిన శరీర భాగాలవలె, వాటిని వేర్వేరుగా ముక్కలు ముక్కలుగా వాల్మీకి వర్ణించడం ఆయన సహజ కవితా సౌందర్యానికి ఒక మచ్చు తునక.

-- ఇతిశం --

# మంత్రి సుతులు - 37

జంబుమాలి చనిపోయాడనే వార్తను విన్న రావణాసురుడు ఏడుగురు మంత్రుల పుత్రులను మహా బలులను ససైన్యంగా హనుమపైకి పంపాడు.

మేఘ గంభీర ధ్వనిగల మహారథాల నెక్కి, కనకమయ ధనువులను ధరించి వారు హనుమపైకి వెళ్లారు. వారు హనుమపై శరవర్షాన్ని కురిపించారు.

అయితే అందరు ఒక్కుమ్మడిగా శరప్రయోగం చేసినా, ఒక్క బాణం కూడ తనకు తగులకుండా హనుమ విచిత్రంగా తన శరీరాన్ని అమిత వేగంగా త్రిప్పుతూ తప్పించుకొన్నాడు.

ఒకవైపు ఆ ఏడుగురు భయంకర బాణ ప్రయోగంతో ప్రాణాలకు తెగించి పోరాడుతూ ఉంటే హనుమ విలాసంగా వాటిని తప్పించుకొంటూ ఆడుకోసాగాడు.

అరచేతి దెబ్బలతో, పాదాఘాతాలతో, పిడికిలి గ్రుద్దులతో, పదును గోళ్లతో, గుండె తాకుడులతో, తొడల రాపిడులతో హనుమ ఆ సప్త మంత్రి సుతులను ససైన్యంగా మట్టుపెట్టాడు.

శేష సైన్యము అన్ని దిక్కుల వైపు చీలి పారిపోయింది. ఆ విధంగా మంత్రి కుమారుల, సైన్యము మృతికి కారణమైన హనుమ మళ్లీ తోరణముపైకి ఎగిరి ఠీవిగా కూచొన్నాడు.

-- ఇతిశం --

శత్రు సైన్యము మృతికి కారణమైన హనుమ మళ్లీ
తోరణము పైకి ఎగిరి ఠీవిగా కూచొన్నాడు.

# సేనాధిపతులు - 38

మంత్రి సుతులు హనుమ చేత నిహతులైనారని విని, రావణుడు శూరాగ్రేసరులైన సేనాధిపతులను హనుమపైకి పంపుటకు నిశ్చయించుకొని,

“సేనా నాయకులారా! మీరు మహావీరులు. మీ సహాయంతోనే నాగులను, యక్షులను, గంధర్వులను, దేవతలను, మహర్షులను ఓడించాను. వాళ్లందరు కలసి మనను ఓడించాలని ఉవ్విళ్లూరుతుంటారు. వారందరు కలసి ఈ వానరుని సృష్టించి ఉంటారు.

ఆయన వానరుడో, మహాభూతమో తెలియదు. ఇంద్రుడు కఠిన తపస్సు కావించి ఆయనను సృష్టించాడో ఏమో?

మీరు రథ, గజ, తురగ, పదాతుల బలంతో వెళ్లి, అప్రమత్తంగా ఉండి, ఆయనను ఎదుర్కోండి.

ఇదివరకెందరినో మహావీరులైన వానరులను చూచాను. ఈయనలోని తేజో, బల, పరాక్రమ, మహోత్సాహాలు మరెవ్వరికి లేవు. జయము దైవాధీనము!!.

రావణుని ప్రబోధము సేనాగ్రేసరులను అప్రమత్తం చేసింది. సూర్య సమాన తేజుడైన హనుమను చూచి వారందరు ఒక్కుమ్మడిగా తమ ఆయుధాలతో ఎదుర్కొన్నారు.

దుర్ధరుడు అయిదు పదను బాణాలను హనుమ శిరస్సుపై ప్రయోగించాడు. ఆయనపై వందలాది బాణాలను వేశాడు. హనుమ మహాగ్రహంతో ఆకాశంలోకి ఎగిరి తన బలమంతటితో దుర్ధరుని రథముపై పిడుగు వలె పడ్డాడు. ఆయన మహా బలాన్ని తట్టుకోలేక రథము, గుఱ్ఱాలు ధ్వంసమయ్యాయి. దుర్ధరుడు మృతుడై నేల వాలాడు.

దుర్ధరుని మృతికి ఆగ్రహించిన విరూపాక్ష, యూపాక్షులిద్దరు తమ తమ ఆయుధాలతో హనుమపైకి ఉరికారు. వాళ్ల ఆయుధాల తాకిడిని ఎదుర్కొంటూ, హనుమ అక్కడ ఉన్న ఒక మహా సాలవృక్షాన్ని మహావేగంగా ఆ ఇద్దరివైపు విసిరాడు. ఆ మహాసాలము వారిద్దరి మరణానికి కారణమైంది.

ప్రఘసుడు, భాసకర్ణుడు ఇద్దరు రెండువైపుల నుండి తమ పట్టస శూలా యుధాలతో హనుమ నెదుర్కొన్నారు. వారి దెబ్బలకు హనుమ శరీరము రక్తసిక్తమైంది. అయినా అప్పుడే ఉదయిస్తున్న ఆదిత్యునివలె ఆయన ప్రకాశిస్తూ ఒక మహాపర్వత శిఖరాన్ని పెకిలించి వారిద్దరిపై ప్రయోగించాడు. ఆ కొండ వారిద్దరి గుండెలను చీల్చింది. తరువాత వారి రథగజ, తురగ, పదాతి బలాలను హనుమ ధ్వంసము చేశాడు.

ఈ విధంగా ఆ అయిదుగురు మహావీరులైన సైన్యాధిపతులను హనుమ ప్రళయకాల సూర్యునివలె మాడ్చి మసి చేశాడు. విజయ ధ్వనులను చేస్తూ ఆయన మళ్లీ తోరణంపై అధిష్ఠించాడు.

అయిదుగురు మహావీరులైన సేనా నాయకుల మరణ వార్త రావణాసురునికి పిడుగుపాటు వలె కంపనాన్ని కలిగించింది.

-- ఇతిశం --

దైవాధీనముల్ జయాపజయముల్ దైవంబు శ్రీరాముడే

వాడె భగవంతుడొ? మరి వీడగునో వార్ధివ్రాతము దాటినవాడు వీడ.

ఆయన వానరుడో, మహాభూతమో తెలియదు. ఆయనలోని తేజో, బల, పరాక్రమ, మహోత్సాహాలు మరెవ్వరికి లేవు.

# అక్ష కుమారుడు - 39

సాధారణమైన సైన్యము, మంత్రి కుమారులు, సేనానాయకులు అందరు హనుమను ఎదుర్కొని నేరుగా అమరలోకానికి ప్రయాణమయ్యారు.

ఇక రావణుడు తన కుటుంబము వైపు దృష్టి సారించాడు. ఆయన చిన్న కుమారుడు అక్ష కుమారుడు. బాలభానునివలె పరాక్రమంతో వెలిగిపోతున్నాడు. అమరవీరులు కూడ ఆయన ముందు నిలువలేరు. ఆయన సకలాయుధ సంపన్నుడు, శస్త్రాస్త్రకోవిదుడు. తపస్సు చేసి దివ్యరథాన్ని వరంగా పొందాడు. రావణుడు అక్ష కుమారుని వైపు చూశాడు.

ఆయన రత్నఖచిత పతాకంతో, వాయువేగ, మనోవేగ సంపన్నాలైన అష్టాశ్వాలతో కట్టబడిన దివ్యరథంపై బయలుదేరాడు. ఆయన వెంట చతురంగ బలాలు కదిలాయి. వాళ్ల రథ, గజ, తురగ ధ్వనులు భూమ్యాకాశాలను దద్దరిల్ల జేశాయి.

హనుమ తోరణంపై ఆసీనుడై ఉన్నాడు. ఆయనను చూడగానే అక్ష కుమారునికి ఆశ్చర్య, గౌరవాలు కలిగాయి. ఆయన హనుమ బలాన్ని, తన బలాన్ని ముందుగానే బేరీజు వేసికొన్నాడు. సువర్ణ గళాభరణంతో, అంగదాలతో, కుండలాలతో విరాజమానుడైన అక్షయ కుమారుడు తన ధనుర్బాణాలతో హనుమను ఎదుర్కొన్నాడు.

వారిద్దరి యుద్ధము భయంకరంగా జరిగింది. సురాసురులు ఆశ్చర్యంతో ఆ సమరాన్ని అవలోకించారు.

పంచభూతాలు పనిచేయడం మానివేశాయి. బాణప్రయోగ పారీణుడైన అక్షకుమారుడు హనుమ శిరస్సుపై క్రూర సర్పాల వంటి మూడు శరాలను వేశాడు. వాటి తాకిడికి హనుమ శిరస్సు నుండి రక్తము రాసాగింది.

అక్షకుమారుని అవక్ర పరాక్రమానికి హనుమకు హర్షం కలిగింది. ఆయన గట్టిగా గర్జించాడు. అక్ష కుమారుని శరవర్షాన్ని ఆకాశంలో విహరిస్తూ అవలీలగా హనుమ ఎదుర్కొన్నాడు. అయితే బాలభాస్కరుని వంటి అక్షకుమారుని హతం కావించడానికి హనుమ మనస్సు అంగీకరించలేదు. కాని ప్రాణాలతో వదలినంత మాత్రాన అక్ష కుమారుడు సమర రంగాన్నుండి వెనుదిరిగి పోయేవాడు కాదు. ప్రజ్వరిల్లే అగ్ని శిఖను ఆర్పివేయక తప్పదు.

హనుమ ఒక్కసారి విజృంభించి తన భయంకరమైన అరచేతి దెబ్బలతో రథాన్ని, అశ్వాలను ధ్వంసము కావించాడు.

విరిగిన రథాన్ని వదలి అక్షకుమారుడు ఆకాశంలోకి ఖడ్గధరుడై ఎగిరాడు. ఆయన ఆకసంలో వీర విహారం చేయసాగాడు.

హనుమ చాకచక్యంతో అక్షకుమారుని రెండు కాళ్లు పట్లుకొని గిరగిర త్రిప్పి నేలపై అనేక పర్యాయాలు బలంగా కొట్టాడు. దానివలన అక్షకుమారుని సకలావయవాలు చూర్ణమయ్యాయి. ఆయన మరణించి నేలకూలాడు.

అక్ష కుమారుని మరణానికి అమరులు, మహర్షులు ఆకాశం నుండి పుష్ప వర్షం కురిపించారు. రక్తనేత్రుడైన హనుమ తిరిగి తన యధాస్థానంలో ఆసీనుడయ్యాడు.

-- ఇతిశం --

"ఇతడు శ్రీరామచంద్రున కెచటి దొరికె? సర్వధీశాలి
సౌమిత్రి చాలనట్లు"

అతడు బాలఘాసమున యందొక యస్త్రము
నుంచి వేయగా ధాత, శివుండు
ఇంద్రుడును దానికి జోతలు చేసినారటే?

హనుమ నెదుర్కొన్న అసురులందరు నేరుగా అమర
లోకానికి ప్రయాణ మయ్యారు.

# ఇంద్రజిత్తు - బ్రహ్మాస్త్రము - 40

తన ప్రియకుమారుడు, చిన్నకుమారుడైన, అక్షకుమారుని హత్య వలన రావణాసురుని మనస్సు విషాదగ్రస్తమైంది. కొంచెముసేపు ఆయన స్థబ్ధుడయ్యాడు. ఆ తరువాత తన మనస్సును సమాధానపరుచుకొని తనకు ప్రాణప్రియుడైన జ్యేష్ఠ కుమారుని, ఇంద్రజిత్తును చూచాడు.

"కుమారా! నీవు నాకు అత్యంత ఇష్టుడవు. జ్యేష్ఠుడవు. సకల శస్త్రాస్త్ర కోవిదుడవు. బ్రహ్మదేవుని అమోఘ తపముతో మెప్పించి అమోఘమైన అస్త్ర సంపదను ఆర్జించిన వాడవు.

మూడు లోకాలలో నిన్నెదిరించే మొనగాడే లేడు. దేవేంద్రుడు నూరు అంచుల వజ్రాయుధాన్ని ప్రయోగించి కూడ, అది పని చేయక పోవడం వలన నీకు దాసో2హమన్నాడు.

ప్రస్తుతము మనకొక భయంకరమైన ఆపద సంభవించింది. ఎనుబై వేల కింకరులు, జంబుమాలి, అమాత్యపుత్రులు, సేనానాయకులు, నీ ప్రియ సోదరుడు అక్ష కుమారుడు హనుమతో ఆహవంలో హతమయ్యారు. నిన్ను ఈ కార్యానికి పంపకూడదు. కాని నీవు తప్ప ఈ కార్యాన్నుండి గట్టెక్కించే గట్టి వీరుడు లేడు.

నీవు శత్రువులను జయించే పరాక్రమ స్వభావాలు కలవాడివి. స్వంత బలాన్ని, శత్రుబలాన్ని అంచనా వేసికొని ఆహవ రంగంలోకి అడుగుపెట్టు.

అమరేంద్రుని వజ్రాయుధము కూడ హనుమ ముందు అల్పమే. సకల సైన్యము ఒక్కుమ్మడిగా హనుమపై బడ్డా, ఆయనకు ఆవగింజంత బాధ కూడ కల్గదు. వాయుదేవుని వేగము కూడ ఈ వానర వేగము ముందు దిగదుడుపే. అందువలన దివ్యాస్త్రాలను స్మరించుకొని సమరానికి సమాయత్తం కావాలి" అని ఉపదేశించాడు.

తండ్రి మాటలను తలదాల్చి, ఇంద్రజిత్తు తన తండ్రి చుట్టు ప్రదక్షిణం చేసి ధైర్యంతో, తండ్రి ఆశీర్బలంతో, ఇష్టులైన అసుర వీరులతో సమరానికి బయలు దేరాడు. ఆయనలో పర్వదినాలలో పొంగిపొరలే సముద్రం వలె సమరోత్సాహము ఉరకలెత్తింది.

భయంకరమైన నాలుగు సింహాలను పూన్చిన దివ్య రథమెక్కి ఆయన ఆహవానికి బయలు దేరాడు. ఆయన యొక్క రథ చక్రధ్వని, ధనుస్సు యొక్క నారీటాంకార ధ్వనిని హనుమ విని, తనకు తగిన అరివీరుడు లభించాడని ఆనందించాడు.

ఇంద్రజిత్తు రథరవాన్ని విన్న మృగాలన్ని మౌనం దాల్చాయి. దిక్కులన్ని మసక బారాయి. పక్షి సంఘాలు నలువైపుల పారిపోయాయి.

ఇంద్రజిత్తు అత్యంత కౌశలంతో శరవర్షం కురిపించినా, ఒక్క బాణం కూడ హనుమను బాధించలేదు. ఇంద్రజిత్తును పట్టుకోవడానికి ఎంత ప్రయత్నించినా హనుమకు వీలు కల్గలేదు.

ఇద్దరు సమర విశారదులే. ఇద్దరు వాయు సమవేగులే.

ఎంత భయంకరంగా యుద్ధం చేసినా, ఎన్ని శస్త్రాస్త్రాలను ప్రయోగించినా హనుమ తనకు చిక్కడని తెలిసికొన్న ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్ర ప్రయోగంతో అతనిని బంధించాలని ఆలోచించాడు. హనుమపై చివరకు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగం చేశాడు.

బ్రహ్మాస్త్రము అమోఘమైన దివ్యాస్త్రము. ఆ అస్త్రము ముందు ఏ శస్త్రము, ఏ అస్త్రము పనిచేయజాలవు. సురాసురులలో, నరులలో వానరులలో ఎంతటి వీరులైనా బ్రహ్మాస్త్రము చేత బంధింపబడవలసినవారే.

అంతటి మహాస్త్రాన్ని, బ్రహ్మాస్త్రాన్ని హనుమపై అమరారాతి ప్రయోగించాడు. ఆ మహాస్త్రము హనుమ యొక్క బల, వీర్య తేజస్సులను అపహరించింది. హనుమ విధిలేక ఆ అస్త్రానికి వశుడయ్యాడు.

హనుమ తనలో ఈ విధంగా అనుకోసాగాడు: "ఈ దివ్యాస్త్రము మహా ప్రభావ భరితమైనది. దీనినెదుర్కోవడానికి నాకే కాదు మరెవ్వరికి కూడ శక్యము కాదు.

అయితే నాకు బ్రహ్మ వరప్రసాదము ఉంది. అందువలన ఈ మహాస్త్రము వలన నాకు మరణ భయం లేదు. ఈ అస్త్రం నుండి విడుదల పొందడం కూడ బ్రహ్మదేవుని దయవలననే లభిస్తుంది.

ఇంతటి భయంకరాస్త్రానికి బద్ధుడనైనా నన్ను, బ్రహ్మదేవుడు, మహేంద్రుడు, నా తండ్రి వాయుదేవుడు కాపాడుతున్నారు. అందువలన ఈ అస్త్రాన్ని అనుసరించడమే మేలు" అనుకొని వేరే ఏ ప్రయత్నం చేయకుండా అస్త్రబద్ధుడయ్యాడు.

అయితే అసురవీరులందరు అస్త్రబద్ధుడైన హనుమను నమ్మలేదు. ఎప్పుడు ఏ క్షణంలో మళ్లీ ఆ వానరవీరుడు తమపై విరుచుక పడుతాడో అనే భయంతో అక్కడ ఉండే చెట్లనారలతో, త్రాళ్లతో హనుమను మరింత బలంగా బంధించారు.

ఇక్కడొక విచిత్రము ఉంది.

బ్రహ్మాస్త్రము మిగిలిన అస్త్ర బంధాలకంటే విలక్షణమైనది. అది ఎంతటి మహా బలవంతునైనా బంధించి తీరుతుంది. అయితే ఆ బంధం విడిపోతుందేమో అనే అనుమానంతో ఆ అస్త్రబంధాన్ని మరొక బంధంతో బిగిద్దామనుకొంటే మొదటికే మోసం వస్తుంది. ఇంకొక బంధ స్పర్శ కలుగగానే బ్రహ్మాస్త్ర బంధము తనంతట తానే విడిపోతుంది. అప్పుడు బంధాలన్ని వదలిపోయాయనే బాధతో తిరిగి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినా అది పనిచేయదు.

హనుమపై అద్భుతంగా ప్రయోగించిన అమోఘమైన బ్రహ్మాస్త్రము వ్యర్థమైందని ఇంద్రజిత్తు విచారగ్రస్తుడయ్యాడు.

హనుమ తనకు బ్రహ్మాస్త్ర బంధము వదలిపోవడం గుర్తించాడు. అయినా అతడు తిరిగి లేవలేదు. ఆ అవకాశాన్ని మరొక కార్యానికి ఉపయోగించుకోవాలను కొన్నాడు. వీళ్లు ఎలాగూ తనను రావణుని ముందుకు తీసికవెళ్తారు.

“తాను కూడ రావణుని సభా భవనంలో దర్శించాలని, ఆయనకు అమోఘమైన రామబాణ బలాన్ని తెలుపాలని, సీతాదేవిని రామచంద్రస్వామికి అప్పగించుమని సలహా ఇవ్వాలని, తన మాట వినకపోతే రావణాసురునికి సర్వనాశనము తప్పదని హెచ్చరించాలని” అనుకొన్నాడు.

అందువలన హనుమ బ్రహ్మాస్త్ర బద్ధుడుగానే ఉండాలని నిర్ణయించుకొన్నాడు. ఇంద్రజిత్తుకు తప్ప మిగిలిన రాక్షసులకు హనుమకు బ్రహ్మాస్త్రబంధం వదలి పోయిందని తెలియదు. అందువలన వారు తాళ్లతో హనుమను బంధించి రావణుని ముందుకు ఈడ్చుక వెళ్లారు. బలమైన త్రాళ్లతో బంధింపబడిన భద్రగజమువలె హనుమ కనబడ్డాడు.

హనుమ పరాక్రమాన్ని, రాక్షసుల సంహారాన్ని విన్న రాక్షసులందరు రావణ సభలో హనుమను ఆశ్చర్యంతో చూడసాగారు.

“ఎవ్వరు ఈయన? ఎవ్వరు పంపితే వచ్చాడు? ఎందుకు వచ్చాడు? అని వారిలో వారు మాట్లాడుకోసాగారు.

“కొట్టండి, చంపండి” అని కొందరు హనుమవైపు చూస్తూ ఆగ్రహంతో అరవసాగారు.

తేజోబల సంపదలతో సూర్యునివలె ప్రకాశిస్తున్న రావణుని చూచి హనుమ ఆశ్చర్య చకితుడయ్యాడు.

అత్యద్భుత వీర్యతేజో బలసంపన్నుడైన హనుమను చూచి రావణుడు తన మంత్రుల వైపు తిరిగి “హనుమ గురించి తెలిసికొను”దని ఆదేశించాడు.

అప్పుడు వారు ఆ వానరవీరునితో:- నీ వెవ్వరు? ఎందుకు వచ్చావు? నిన్ను ఎవ్వరు పంపారు?" అని అడిగారు. దానికి సమాధానంగా హనుమ: "నేను వానర వీరుడైన సుగ్రీవుని దగ్గర నుండి దూతగా వచ్చాను" అని తెలిపాడు.

ఈ సర్గ పారాయణము శనిగ్రహదోషాన్ని తొలగిస్తుంది.

-- ఇతిశం --



**ఆంజనేయుని బ్రహ్మాస్త్రముతో ఇంద్రజిత్తు బంధించుట**

ఈ బ్రహ్మాస్త్రము మహాప్రభావవంతమైనది. దీనినెదుర్కొనుట నాకే కాదు మరెవ్వరికి సాధ్యము కాదు.

# ప్రపత్తి - బ్రహ్మాస్త్రము - 41

భగవంతుని లభించడానికి వేదము వివిధ ఉపాయాలను వివరించింది. అవి (1) కర్మ (2) జ్ఞాన (3) భక్తులు.

కర్మణైవ హి సంసిద్ధిం ఆస్థితాజనకాదయః" అని కర్మను.

నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహవిద్యతే" అని జ్ఞానాన్ని

"భక్త్యాత్వనన్యయా శక్యః" - అని భక్తిని భగవద్గీత వివరించింది. అయితే ఈ వైదికోపాయాలన్ని అధికారి యోగ్యతానుగుణాలే. అంటే వాటిని ఆచరించడానికి తగిన యోగ్యతగల వారికే అవి ఫలిస్తాయి.

ప్రపత్తి లేక శరణాగతి మిగిలిన ఉపాయాలన్నిటికంటే విలక్షణమైనది. అది నివృత్తి రూపమైనది. ప్రపన్నుడు ఏమిలేనివాడు (అకించనుడు), ఏదిక్కు లేనివాడు కావాలి. ఏది లేనివాడిననే అనుసంధించుకోవాలి. అహంకార, మమకార రాహిత్యమే ముఖ్యం. అది సర్వాధికారము. అంటే కుల, గోత్రాలు, అధికార, ఐశ్వర్యాదులు లేని వారందరు కూడ ఆచరింపదగినది.

"ఆకించినః, అనన్యగతిః శరణ్యం
త్వత్పాదమూలం శరణం ప్రపద్యే"

అది అత్యంత సులభోపాయం కదా! అదేమి ఫలమిస్తుంది? అని ప్రశ్నించాల్సిన అవసరము లేదు. అది అన్నిటిని సాధించిపెట్టుతుంది.

"ఐహలౌకిక మైశ్వర్యం। స్వర్గాద్యం పారలౌకికం

కైవల్యంభగవంతంచ।... సాధయిష్యతి" ప్రపత్తి స్వతంత్రోపాయమే కాక ఇతర ఉపాయాలకు సహకారిగా ఉండి కూడా వాటిని పరిపూర్ణం కావిస్తుంది.

ఈ ప్రపత్తిని బ్రహ్మాస్త్రం వలె ఒకేసారి (ప్రయోగం) చేయాలి. మొదటిసారికంటె రెండవ, మూడవ పర్యాయాలు ప్రపత్తిని చేస్తే ప్రపత్తి చాల బలవత్తరమైన మహత్ఫలాన్ని అందిస్తుందని అనుకోకూడదు.

"సకృదేవహి ప్రపన్నాయ। తవాస్మీతి చయాచతే।
అభయం సూర్వభూతేభ్యో। దదామ్యేతద్వ్రతం మమ"

శ్రీరామచంద్రుడు సుగ్రీవాదులతో "ఒక్కసారి నేను నీ వాడనని ప్రపత్తి చేస్తేనే, ప్రపన్నులందరికి కూడ అభయాన్ని ఇస్తానని" తెలిపాడు కదా!

బ్రహ్మాస్త్ర ప్రభావం తక్కువ ఉందని, దానికి తోడు మరొక బంధమువేస్తే బ్రహ్మాస్త్ర ప్రభావము బలపడదు. పైపెచ్చు. మొదటి ప్రభావము కూడ తొలిగిపోతుంది. అంతేకాదు మళ్లీ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినా కూడ అది పనిచేయదు.

అలాగే ప్రపత్తి కూడ చరమోపాయము. ఆ ఉపాయము ఒక్కటే సరిపోదని కర్మ, జ్ఞాన, భక్తులను తోడుగా వాడితే ఈ ఉపాయాలు అదనపు ప్రభావాన్ని, కలిగించవు. పైపెచ్చు ప్రపత్తి ప్రభావము కూడ తగ్గిపోతుంది. అంతేకాదు ముందు చేసిన ప్రపత్తికి పునఃప్రపత్తి తోడై అధిక ప్రభావాన్ని కలిగిస్తుందను కోవడము కూడ పాపమవుతుంది.

"పునఃప్రపత్తి పాపత్తోడుక్కుం"

"పునః ప్రపత్తి పాపంతో సమానము"

అంటారు లోకాచార్య స్వామివారు.

-- ఇతిశం --

హనుమ ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి
కట్టుబడడంలో మరొక పరమార్థ విషయము దాగుంది.

శిష్యుడు చేసిన ప్రపత్తి ఎంతటి ఆచార్యుని అయినా
నిర్బంధించి, శిష్యుని వైపు వెళ్లేలా చేస్తుంది.

బ్రహ్మాస్త్రమే చివరి అస్త్రము ప్రపత్తే చివరి ఉపాయము.

# హనుమ హితోపదేశము - 42

రావణప్రభువు మంచి ముత్యాలు వ్రేలాడుతున్న బంగారు కిరీటంతో, రత్న ఖచితమైన సువర్ణాభరణాలతో మహేంద్రవైభవముతో ప్రకాశిస్తున్నాడు. తెల్లని పట్టుధోవతిని ధరించి, రక్తచందనాన్ని పూసుకొని, పదిశిఖరాలు గల మందర పర్వతంవలె తన పది శిరస్సులతో వెలిగిపోతున్నాడు.

నల్లని ఆయన మేనులో తెల్లని ముత్యాల హారాలు నీలాకాశంలో ఎగురుతుండే కొంగలబారును తలపిస్తున్నాయి.

ఆయన సింహాసనం ప్రక్కలో ఇద్దరు సువర్ణాలంకృత సుందరీమణులు విసనకర్రలతో ఆయనను సేవిస్తున్నారు.

రావణునికి క్రింది భాగంలో చతుస్సముద్రాలవలె దుర్ధరుడు ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు అనే నలుగురు మంత్రులు కొలువై ఉన్నారు.

హనుమ తనను బాధిస్తున్న రావణకింకరులను పట్టించుకోక రావణునే చూడసాగాడు. రావణుని అద్భుత రూప ధైర్యబలాలు హనుమను ఆశ్చర్యచకితుని చేశాయి.

"అహో రూపమహోధైర్యం అహో సత్వమహోద్యుతిః
అహో రాక్షస రాజస్య సర్వలక్షణ యుక్తతా"

ఇన్ని గొప్ప లక్షణాలు ఉన్నా వీటన్నింటిని నశింపజేసే అధర్మము రావణునిలో నిండుగా ఉంది. ఒకవేళ ఆ అధర్మమే లేకపోతే ఆయన మహేంద్రునితో సహా మూడు లోకాలకు అధిపతి అయ్యేవాడే కదా!

ఈయన తన అధర్మంతో మూడు లోకాలను బాధిస్తున్నాడు.

హనుమ ఆలోచనలు ఇలా ఉంటే రావణుని ఆలోచనలు మరొక రీతిగా ఉన్నాయి.

'ఏమి ఈ హనుమ రూపము! నన్ను శపించిన నందీశ్వరుడే ఈ రూపంలో వచ్చాడా? లేక నన్ను సాధించడానికి బాణాసురుడే ఈరూపంలో వచ్చాడా? ఇంతటి పరాక్రమ వంతుడు ఒక సామాన్య వానరుడు కాదు.

రావణుడు హనుమ వైపు నుండి తన కళ్ళను మరల్చి ప్రధానమంత్రి అయిన ప్రహస్తుని వైపు చూచి 'ఈయన ఎవ్వరు? ఎందుకు వచ్చాడు? ఎవ్వరు పంపారు? ఎవ్వరు

కాలు పెట్టడానికి వీలులేని లంకకు ఎట్లా వచ్చాడు? రాక్షసులను ఎందుకు సమరంలో సంహరించాడో కనుక్కొమ్మని ఆయనను ఆదేశించాడు.

ప్రహస్తుడు హనుమను; "నీ రూపానికి నీ తేజస్సుకు పోలిక లేదు. నీవు దేవేంద్రుని రాయబారివా? యమ వరుణ కుబేరుల చారుడివా?విష్ణుదేవత దూతవా?నిర్భయంగా నిజము చెప్పుమ"ని ప్రశ్నించాడు.

హనుమ ప్రహస్తుని సరకు చేయక రావణుని వైపు తిరిగి, 'రాక్షసాధిపా నేను ఇంద్ర వరుణ కుబేరుల దూతను కాను. మహావిష్ణువు కూడా నన్ను పంపలేదు.

నేను సుగ్రీవ సచివుడైన వానరుడను. నిన్ను వ్యక్తిగతంగా కలవాలని నీ వనాన్ని ధ్వంసము చేశాను. ఆత్మరక్షణ కొరకు నన్ను ఎదిరించిన రాక్షసులసు సంహరించాను. సురాసురులు నన్ను సమరంలో ఎదుర్కోలేరు. శస్త్రాస్త్రపాశాలు నన్ను బంధించజాలవు. 'బ్రహ్మాస్త్ర బద్ధుడివి కాలేదా" అంటావా? నేను ఆ అస్త్రానికి కావాలనే పట్టుబడ్డాను. నిన్ను సభలో చూడాలని, కలువాలని, నీతో మాట్లాడాలని కటుబడ్డాను.

నేను మహా పరాక్రమవంతుడైన రామచంద్రుని దూతగా కొన్ని మంచి మాటలు చెప్పుతాను విను.

'రథ, గజ, తురగ పదాతి దళాలు అసంఖ్యాకంగా ఉన్న దశరథ సార్వభౌముని తనయుడు శ్రీరామచంద్రుడు. తండ్రి ఆజ్ఞను తలదాల్చి రాజ్యాధికారాన్ని వదలుకొని అడవులకు సతీ, సోదర సమేతంగా వచ్చాడు.

రాముడు ధర్మాత్ముడు. సీతాదేవి మహా పతివ్రత. రామ లక్ష్మణులు ఇంట్లో లేనప్పుడు రామపత్నిని అపహరించి తెచ్చావు. ఆమె జాడను కనుక్కోవాలని రామ లక్ష్మణులు కిష్కింధానగరానికి వచ్చారు. ఋష్యమూకపర్వతముపై రామ సుగ్రీవుల సఖ్యము సమకూరింది. నీకు మహాబలి అయిన వాలి తెలుసుకదా! అంతటి మహాపరాక్రమ వంతుడైన వాలిని ఒకే కోలతో నేలగూల్చి రామభద్రుడు సుగ్రీవునికి రాజ్యాధికారాన్ని కలిగించాడు.

సుగ్రీవుడు తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చడానికి, సీతాదేవిని అన్వేషించడానికి నలు దిక్కులలో అసంఖ్యాక వానర వీరులను పంపాడు. వారందరు గరుడవేగులు. పర్వత దేహులు, ప్రచండ బలులు. వారు భూమిపై, సముద్రాలలో, ఆకాశంలో కూడ స్వేచ్ఛగా సంచరింపగల్గుతారు.

నేను దక్షిణ దిశకు బయలు దేరిన వానర దళ సభ్యుడిని. సముద్రం దాటి, లంకలోకి వచ్చాను. సీతాదేవిని చూచాను. ఆమెతో మాట్లాడాను.

రావణప్రభూ! నీవు సర్వశాస్త్రకోవిదుడివి. ధర్మార్థ జ్ఞానివి. అమోఘ తపస్సంపదను ఆర్జించినవాడివి. పరభార్యాపహరణము అధర్మమని నీకు తెలుసు. అది సామాన్యమైన అధర్మము కాదు. అపహరించిన వాడిని సమూలంగా సర్వనాశనము చేయగలది.

ఇక రామభద్రుని పరాక్రమము గురించి చెప్పమంటావా? ఆయన బాణాల దెబ్బల రుచిని నీవు చూడలేదు. కనుక ఇంత నిశ్చింతగా ఉన్నావు.

"బ్రహ్మా స్వయంభూశ్చతురాననోవా।
రుద్రస్త్రినేత్రస్త్రిపురాంతకోవా।
ఇంద్రో మహేంద్ర స్సుర నాయకోవా
త్రాతుం నశక్తా యుధిరామవధ్యం"

"బ్రహ్మ వరప్రసాద మహాబలుడిని. రామ బాణాలు నన్ను ఏమి చేస్తాయి?" అనుకోకు. దేవతలలో అందరికంటె ఆద్యుడు, నాలుగు ముఖాలతో నాలుగు వేదాలను చదువుతూ సకల లోకాలను సృష్టించిన బ్రహ్మ దేవుడు. నీకు వరాలను ప్రసాదించిన ఆ బ్రహ్మదేవుడు కూడ రామచంద్రస్వామి శత్రువును సంరక్షింపజాలడు.

"నేను మహాశివుని అంతరంగ భక్తుడను. పంచకాల పూజా పరాయణుడను. నన్ను రాముడు ఏమి చేయగల్గుతాడు"? అనుకోకు. త్రినేత్రుడు, త్రిపురాసుర సంహారి, మహారుద్రుడైన మహేశ్వరుడు కూడ రామవిరోధిని రక్షింపజాలడు".

"బ్రహ్మ, రుద్రులు, రామ పక్షపాతులు కనుక నన్ను కాపాడక పోవచ్చు. కాని సురాసురులిద్దరు అక్క చెల్లెండ్ల పిల్లలు కదా! నేను మా సోదరుడైన మహేంద్రునితో కలిస్తే రాముడు ఏమి చేయగల్గుతాడు?" అనుకోకు.

ముప్పై మూడు కోట్ల దేవతలందరితో కలసి కూడ మహేంద్రుడు రామనరేంద్రుని ముందు నిలువ జాలడు. కనుక ఆ సహాయము కూడ నీకు పనికిరాదు.

అందువలన రామభద్రునికి అపచారము చేసి నీవు బ్రతికి ఉండడము అసంభవము.

"సీతాదేవి నా చేతికి చిక్కి ఉంది" అని భ్రమ పడుతున్నావేమో? ఆమె అయిదు తలల నల్ల త్రాచు. నిన్నొక్కడినే కాదు. నీ పరివారాన్నంతటిని కాటువేసి తన విషంతో మాడ్చివేయగల శక్తిగలది.

"నేను అసాధారణమైన తపస్సు చేసి ఎవ్వరిచేత కూడ చావులేకుండా వరము పొందానని విఱ్ఱవీగకు" నీవు వరము పొందిన వారిలో నరులు, వానరులు లేరు. శ్రీరాముడు మానవ సార్వభౌముడు. ఆయన చేతిలో చావును నీవు తప్పించుకోజాలవు".

"నేను యజ్ఞ, దాన, తపో, భక్తులు కల వాడను. ఇన్నిపుణ్య కార్యాలు చేసిన నన్ను పరదారాపహరణము అనే ఒకే ఒక పాపము ఏమి చేయగల్గుతుంది? అనుకోకు. ఎవ్వరైనా పుణ్యపాపాలను రెండింటిని చేసినప్పుడు పుణ్యఫలాన్ని ముందుగా అనుభవించి, అంతిమంగా పాప ఫలితాన్ని అనుభవిస్తారు.

నీవింతవరకు అనుభవిస్తున్నది నీ పుణ్యఫలాన్నే. ఆ పుణ్య ఫలాన్ని కూడ క్షీణింపజేయగల పరభార్యాపహార మహాపాప ఫలాన్ని ఇక ముందు అనుభవింప బోతున్నావు.

పుణ్య ఫలంగా అపజయ, మరణాలను ఇంత వరకు రుచి చూడని నీవు పరస్త్రీహరణ మహాపాపానికి శిక్ష అయిన దుర్మరణాన్ని త్వరలో పొందబోతున్నావు.

ధర్మాధర్మాల మాట ఎవ్వరికి కావాలి? పుణ్య పాప ఫల ప్రసక్తి నాకెందుకు? నేను కైలాస పర్వతాన్ని కదిలించాను. పిడుగులను ఎదుర్కొన్నాను. వజ్రాయుధపు దెబ్బలను భరించాను. నేను మహావీరుడిని. భార్యా రాజ్యాలను కోల్పోయి, అడవుల పాలైన అల్పమానవుడైన రాముడు నన్ను ఏమి చేయగల్గుతాడని? అని ఉపేక్షించి ఊరుకోకు.

రాముడు అల్పమానవుడు కాదు. మహాబలుడు. పన్నెండేండ్ల ప్రాయంలోనే తాటకిని, సుబాహువును సంహరించిన మహాబాహువు. మారీచుని నూరామడ దూరంలోకి విసిరి వేయగలిగిన మహావీరుడు.

ఇరువై ఒక్కసార్లు క్షత్రియ కోటిని ఒంటరిగానే సంహరించిన పరశురాముని సైతము పరాభవింపగలిగిన పరాక్రమశాలి.

అపరిమిత తపోబలసంపన్నులై, శాపకారణంగా రాక్షస జన్ములైన విరాధ, కబంధాది, మహా వీరులను మట్టుపెట్టిన మహాశక్తి సంపన్నుడు.

ఖర,దూషణ, త్రిశరస్క సమేతులైన పదునాల్గువేల ప్రచండ రాక్షసుల ప్రాణాలను మూడు గడియలలో ముగింపజేసిన వీరమూర్ధన్యుడు.

నిన్ను తన వాలానికి కట్టివేసి నాలుగు సముద్రాల నీళ్లలో ముంచి తేల్చిన మహా బలుడైన వాలిని ఒకే ఒక బాణంతో సంహరించిన శత్రు సంహారకుడు.

సహజ బల సంపన్నుడైన రామభద్రుడు ఇప్పుడు కోటాను కోట్ల మహావీరులైన వానరులకు అధిపతి అయిన సుగ్రీవుని సహాయ సంపద కలిగి ఉన్నాడు.

రాముడు అవసరము లేదు. సుగ్రీవుడు కూడ అవసరము లేదు. తక్కిన వానర వీరులు అవసరములేదు. నేనొక్కడినే సర్వరాక్షస సంహారము కావించి, సీతాదేవిని శ్రీరామచంద్రుని సన్నిధిలో సమర్పించగల సమర్థుడను.

అయితే నన్ను రాముడు సీతాదేవిని చూచి మాత్రమే రమ్మన్నాడు. సీతాదేవిని అపహరించిన వాడు ఎంతవాడైనా, నేలపై నిలిచినా, నీటిలో దాగినా, ఆకాశంలో అదృశ్యంగా ఉన్నా, అతనిని తానే అతి క్రూరంగా సంహరిస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

నేను రామునివైపే మాట్లాడడానికి నరుడిని కాదు. నీవైపే ఉండడానికి రాక్షసుడిని కాదు. నేను వానరుడిని. నేను మీ ఇద్దరికి మధ్యవర్తిని. సీతాదేవిని రామునికి అప్పగించు. లేదా ఆయన చేతిలో నీ చావు తప్పదు" అని హెచ్చరించాడు.

లోకంలో అధర్మ పరులు అత్యంత సంపన్నులుగా, అధికారసమేతులుగా, బలవంతులుగా కనబడుతు ఉంటారు. "మేమింత బలవంతులము కదా! మేమెంత తప్పుచేసినా, మమ్మల్ని వారించే వారెవ్వరు ఉంటారు?" అని గర్విస్తుంటారు. రావణుని వైభవాన్ని స్వయంగా హనుమ కనులారా చూచి ఆశ్చర్యచకితుడయ్యాడు.

అంతేకాదు కొందరు కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకోవాలని దానధర్మాలు చేస్తుంటారు. పూజలు చేస్తుంటారు. కాని చాటుగా సమస్త పాపాలను చేస్తుంటారు. "మేము ఇన్ని పూజలు చేస్తున్నాము కదా! ఇన్ని దానధర్మాలు చేస్తున్నాము కదా! మేము తప్పు చేశామంటే ఎవ్వరైనా నమ్ముతారా? నమ్మరు కదా? అని వారి ధైర్యము. ఒకవేళ ఎవ్వరైనా నమ్మినా అందరు తమకంటే ఆర్థికంగా, అధికారికంగా తక్కువ వారే కదా? వారి వలన తమకే ప్రమాదం కలుగదని వారి ధైర్యము".

"అంతేకాదు మేము దానధర్మాలు, పూజలు మొదలైన పుణ్యకార్యాలు చేస్తున్నాము కదా! వాటి వలన మాకు పుణ్యము చాల కలుగుతుంది కదా! అంత పుణ్యము చేసినప్పుడు, కొంత పాపము చేస్తే ఏమౌతుంది? పాపఫలాన్ని మన పుణ్యఫలము నివారించదా?" అని వారి దీమా.

"భగవంతునికి ఎన్నో కానుకలు సమర్పిస్తున్నాము కదా! మేము తప్ప అన్ని కానుకలు సమర్పించే వారెవ్వరు ఉంటారు? అన్ని కానుకలను అందుకొన్న పరమాత్మ పాప ఫలాన్నుండి కాపాడదా?" అని వారి విశ్వాసము.

పెద్దవాళ్లు చీకట్లో చేసిన పాపాలను ఎవ్వరు చూడక పోవచ్చు, చేశారని నమ్మక పోవచ్చు. కాని భగవంతుడు వాటిని చూడజాలడా?

"భగవంతునికి మేము తప్ప వేరెవ్వరు ఇంత కానుకలు సమర్పిస్తారు?" అనుకోవడం మన అజ్ఞానము. ఆయనకు కోటాను కోట్లమంది నిలువుదోపిడి ఇచ్చేవారు ఉంటారు. మనము సమర్పించేది ఎంతపాటిది? తొండమాన్ చక్రవర్తి ప్రతిరోజు వేంకటేశ్వరుని బంగారు పూలతో పూజలు చేసేవాడు. ఒకరోజు ఆయనకు అహంకారం కలిగింది. ఆయన సమర్పించిన బంగారు పూలు మాయమై, స్వామి విగ్రహముపై మట్టిపూలు మొలిచాయి. చక్రవర్తికి గర్వభంగమైంది.

భగవంతుడికి బంగారు పూలు గొప్పకాదు. మట్టిపూలు తక్కువ కాదు. ఏ పూలనైనా ఆర్ద్ర హృదయంతో సమర్పించడం కావాలి ఆ స్వామికి.

ఇక పుణ్యఫలము పాప ఫలాన్ని నివారించదని, మొదట పుణ్యఫలము వలన కొన్ని భోగాలు, కొంత వైభవం కలిగినా, తరువాత పాప ఫలానుభవ సమయం వచ్చాక శిక్ష తప్పదని రావణునికి హనుమ హెచ్చరిక ద్వారా స్పష్టమవుతుంది.

బయటికి పుణ్యాత్ములుగా, చాటుకు పాపాత్ములుగా ఉన్నవారిని పరమాత్మ క్షమించడు. సరికదా అధికంగా శిక్షిస్తాడు. తెలిసి చేసిన తప్పులకు కఠినంగా శిక్షించడం ఆ దయామయుని స్వభావము, కానుకలతో ఎవ్వరైనా భగవంతుని కొనజాలరు కదా!

-- ఇతిశం --



**రావణునికి హితోపదేశం చేయుట**

# లంకా దహనము - 43

ఒక వానర మాత్రుడు తనంతటి వాడికి ఉపదేశం చేయడం రావణునికి ఎంత మాత్రము రుచించలేదు. హితోపదేశంతో పాటు హెచ్చరికలను కూడ వినిపిస్తున్నాడు. హనుమ గొప్పదనము తన ముందేపాటిది?

ఇప్పుడు విని ఊరుకుంటే రేపటి నుండి ప్రతివాడు తనకు హితోపదేశం చేయడానికి, హెచ్చరించడానికి ముందుకొస్తాడు. అప్పుడు తన అధికారము, ఐశ్వర్యము ఏమవుతాయి?

"అందువలన తన ముందు పనికిరాని మాటలను పలికిన హనుమ ప్రాణాలను తీయవలసిందే" అని రావణుడు తీర్మానించుకొన్నాడు. కోపంతో ఆయన కళ్లు నిప్పులను కురిపిస్తున్నాయి. ఆయన రాక్షస పరిజనాన్ని పిలిచి "హనుమను చంపు"మని ఆజ్ఞాపించాడు.

నీతికోవిదుడైన విభీషణునికి రావణాజ్ఞ అన్యాయమనిపించింది. ఆయన స్వయంగా అత్యంత విధేయుడై రావణుని ప్రసన్నుడిని చేసికొని, "అన్నా! అన్ని ధర్మశాస్త్రాలను అధ్యయనం చేసిన నీవంటి ధర్మవేత్త ఈ విధంగా ధర్మాన్ని తప్పి ఆజ్ఞాపిస్తే ఇక ధర్మశాస్త్రాలకు విలువేముంటుంది? దూతను వధించడం ధర్మ విరుద్ధము కదా?" అని ఆయనను అనునయించాడు.

విభీషణుడు ధర్మశాస్త్ర పారంగతుడని రావణునికి తెలుసు. అందువలన ఆయన తన తమ్మునివైపు తిరిగి "సోదరా! పాపాత్ములను వధించడంలో పాపము కలుగదు కదా?" అని ప్రశ్నించాడు.

"నపాపానాం వధే పాపం! విద్యతే శత్రు సూదన"

అప్పుడు విభీషణుడు ఏ విధంగానైనా హనుమ హత్యా ప్రయత్నాన్ని ఆపాలనుకొని "రాక్షసేశ్వరా! మన్నించు. దూతను చంపడం ఏ శాస్త్రం విధించలేదు. ఏ జాతివారిలో కూడ ఆచరణలో లేదు.

"హనుమంతుడు కేవలము దూతే కాదు. అక్ష కుమారాదులను హత్య చేసిన ప్రబల శత్రువు కూడ" అంటావా? నీ మాట నిజమే. కాని హనుమ వచ్చింది మాత్రము రామదూతగానే కదా!

దూతకు శాస్త్రాలలో అనేక శిక్షలు విధించబడ్డాయి. (1) ఒక ముఖ్య అవయవాన్ని నరుకవచ్చు. (2) కొరడాలతో కొట్టించవచ్చు (3) జుత్తు కత్తిరించ వచ్చు (4) శరీరముపై కాల్చిగాయాలు చేయవచ్చు. ఇవి హత్యతో సమానమే కదా?

అంతేకాదు దూతను చంపితే మనకు వచ్చే లాభమేమిటి? ఈయనను చంపితే, ఈయనను పంపిన వాడికి మన పరాక్రమము ఎలా తెలుస్తుంది? అందువలన ఎవ్వరో ఏదో చెప్పితే, వాళ్ల మాటలను బట్టి దూతను చంపకూడదు.

"బ్రువన్ పరార్థం పరవాన్ నదూతోవధమర్హతి" మరొకరి తరఫున మాట్లాడే దూత వధార్హుడు కాదు.

దేవదానవులకు కూడ అజేయుడవైన నీవు సమరానికి శత్రువులను ఆహ్వానించాలి. కాని పిరికిపందవలె దూతను చంపకూడదు కదా?" అని అన్నకు నచ్చజెప్పాడు. బలగర్విష్ఠుడైన రావణునికి విభీషణుని సలహా చక్కగా నచ్చింది. ఆయన తన తమ్ముని వైపు తిరిగి.

"సోదరా! నీ మాటలు న్యాయసమ్మతాలే. నిజంగానే ఎటువంటి దూతనైనా సంహరించడం అవద్యకరమే.

అందువలన నా శిక్షను మారుస్తాను. కోతికి అన్నిటికంటే ముఖ్యమైనది తోక. తోకలేని కోతి ఏ పనికి పనికిరాదు. అంతేకాదు అందురు దానిని చూచి అవమానిస్తారు.

సైనికులారా! ఈ వానరుని వాలానికి (తోకకు) నిప్పంటించి, మన నగరమంతా తిప్పి అందరికి చూపండి. ఈయనకు విధింపబడిన శిక్షను వీధి వీధిలో జనులు చూచి ఆనందించాలి. తమ భర్తలను, సోదరులను, పుత్రులను ఈయన మూలంగా కోల్పోయిన రాక్షసస్త్రీలు ఈయన కాలుతుండే తోకను చూచి తమ హృదయ దుఃఖాన్ని మరచి శత్రువుకు తగిన శిక్ష విధింపబడిందని సంతోషించెదరు గాక!" అని రావణాసురుడు ఆజ్ఞాపించాడు.

సైనికులందరు నగరంలో పనికి రాకుండా పడి ఉన్న పాత బట్టలన్నిటిని నేతిలో ముంచి తెచ్చి హనుమ తోకకు చుట్టారు. దానికి నిప్పంటించారు. అగ్ని మండడానికి బట్టలు మంచి సాధనం. పైపెచ్చు అగ్నిదేవుడికి అత్యంత ప్రియ ఆహారమైన నేయిలో నిండుగా ముంచి తీసిన బట్టలు. ఇక నిప్పుకేమి కొదువ?

హనుమంతుని తోక నిప్పు మంటలను ఎగజిమ్మింది. అంతలోనే హనుమ మెదడులో ఒక ఆలోచన తళుక్కుమని మెరసింది. ఆయన అంతవరకు లంకానగరాన్ని చీకట్లో

కదా చూచింది. అప్పుడు ఆయనకు కోటలు, బురుజులు, అగడ్తలు ఏవి స్పష్టంగా కనబడలేదు. ఇప్పుడీ అగ్నిజ్వాలల వెలుగులో అన్నిటిని హాయిగా చూడవచ్చు.

రెండవది ముందు చూచినప్పుడు హనుమ మనస్సంతా సీతాదేవి పైననే ఉంది. ఆ పరధ్యానంలో నగరాన్ని చక్కగా చూడలేదు. ఇప్పుడు దృష్టంతా నగరముపైననే ఉంది. అందువలన రాక్షసుల వెంట వెళ్లి వెలుగులో నగరమంతా సందర్శించి వెళ్తే రామ సుగ్రీవులకు అంతా వర్ణించి చెప్పవచ్చు. కనుక రాక్షసభటులను అనుసరించడమే మేలు అనుకొన్నాడు.

ఇక సైనికులు హనుమను బంధించి నగరమంతా త్రిప్పసాగారు. నాలుగు వీధులు కలిసే చోట్లలో (చతుష్పథాలలో), ముఖ్యమైన వీధులలోను, ప్రముఖ స్థలాలలో హనుమను నిలిపి, జనులందరిని బయటకు పిలిచి హనుమను చూపుతూ "ఈయన చారీకుడు (చారుడు) తగిన విధంగా శిక్షను అనుభవిస్తున్నాడు" అని పకపకనవ్వుతూ, పరాభవించారు. రాక్షస జనులందరు కూడ హనుమను అనేక విధాల దూషిస్తూ, నవ్వుకోసాగారు.

అందులో కొందరు రాక్షస స్త్రీలు సీతాదేవి దగ్గరకు వెళ్లి సంతోషంతో "సీతా! నీతో మాట్లాడిన కోతిని పట్టుకొని రాజభటులు తోకకు నిప్పంటించి, నగరము చుట్టు తిప్పుతున్నారు" అని తెలిపారు.

సీతాదేవి ఒక్కసారి ఉలిక్కిపడింది. తన భర్తచేత దూతగా పంపబడి, సముద్రమంత టిని దాటి, తన దగ్గరకు వచ్చి తన దుఃఖాన్ని పోగొట్టిన తమ హనుమ, తోక కాలుతుండగా, నగరమంతా అవమానకరంగా తిప్పబడుతున్నాడని తెలిసి అధికంగా బాధపడింది.

ఆమె పవిత్ర హృదయంతో అగ్ని దేవుని ఇలా ప్రార్థించింది.

1) "యద్యస్తి పతిశుశ్రూషా। యద్యస్తి చరితం తపః।
యదిచాస్త్యేక పత్నీత్వం । శీతోభవహనూమతః॥

సీతాదేవి హనుమంతునికి చల్లగా ఉండుమని ఒట్టుపెట్టుకొని అగ్నిదేవుని కోరు తున్నది.

"ఒకవేళ నాకు నా భర్త అయిన శ్రీరాముని నిరంతరం సేవించే స్వభావమే ఉంటే, ఒకవేళ నాకు భార్యగా పారతంత్ర్యమును కాపాడుకొనే స్వభావమే ఉంటే, ఒకవేళ నా భర్తకు ఏకపత్నీత్వమే ఉంటే అగ్నిదేవా! హనుమంతునికి చల్లబడు." తన పతి శుశ్రూష,

తన తపస్సులపై, తన భర్తయొక్క ఏకపత్నీత్వముపై ఒట్టుపెట్టుకొని అగ్నిదేవుని హనుమకు చల్లబడుమని కోరింది.

2) యది కించిదనుక్రోశః। తస్యమయ్యస్తి ధీమతః।
యది వా భాగ్యశేషోమే। శీతోభవహనూమతః॥

ఒకవేళ నా పట్ల ధీమంతుడైన రామచంద్రునికి దయే ఉంటే, నాకు ఒకవేళ నా నాథునితో కలిసి జీవించే అదృష్టమే మిగిలి ఉంటే, అగ్నిదేవా! హనుమంతుని విషయంలో చల్లబడు.

మొదటి శ్లోకంలో తనకు తెలిసిన, వాస్తవమైన తన పతిశుశ్రూష, తన తపస్సు, తన భర్త ఏక భార్యాత్వములపై ఒట్టుపెట్టుకొని అంది.

ఇప్పుడు తనను విడిచి చాలకాలము దూరంగా ఉన్న తన భర్తకు, తన పట్ల ఇంకా ప్రేమ మిగిలి ఉందో, లేదో తెలియదు. అలాగే తనకు తన భర్తతో తిరిగి కలసి జీవించే సౌభాగ్యము ఉందో లేదో తెలియదు. వాటిపై ఒట్టుపెట్టుకొని అగ్నిని ప్రార్థిస్తున్నది.

నిజంగా సీతాదేవి కోరినట్లు అగ్ని చల్లబడితే, తన భర్తకు తన పట్ల ప్రేమ ఉన్నట్లు, తనకు అదృష్టము ఉన్నట్లు ధృవపడుతుంది.

3. యది మాం వృత్త సంపన్నాం। తత్సమాగమలాలసాం।
సవిజానాతి ధర్మాత్మా। శీతో భవ హనూమతః॥

ఒకవేళ నా పాతివ్రత్యం పట్ల, తనను కలుసుకోవాలనే నా కోరిక పట్ల ఆ ధర్మాత్మునికి నమ్మకమే ఉంటే, అగ్నిదేవా! నీవు హనుమంతునికి చల్లబడు.

ఈ శ్లోకంలో సీతాదేవి మరింత ముందుకు వెళ్లి ఒట్టుపెట్టుకొంటుంది. తనకు భార్య దూరంగా చాలకాలము విడిచి ఉంటే ఆ భార్య పట్ల భర్తకు అవిశ్వాసం కలుగుతుంది. అంతేకాదు ఒకవేళ తనను విడిచి దూరంగా ఉన్న భార్య పవిత్రంగా ఉంటే ఉండవచ్చు. కాని ఈ మధ్యకాలంలో ఒంటరిగా ఉండడము అలవాటై భర్తతో కలసి ఉండాలనే కోరికను కూడ కోల్పోవచ్చు.

శ్రీరాముడు ధర్మాత్ముడు. ఆయనకు ఇటువంటి అనుమానాలే ఉండవు. ఆ విషయాన్ని ధృవపరచుకోవడం కొరకే తన శీలంపట్ల, తన స్వభావం పట్ల రామచంద్రుని విశ్వాసంపై ఒట్టుపెట్టుకొని అగ్నిదేవుని కోరుతుంది.

4) యదిమాంతారయేదార్యః। సుగ్రీవః సత్యసంగరః
అస్మాద్దుంఖాంబుసంరోధాత్। శీతోభవహనూమతః॥

సుగ్రీవుడు సత్యప్రతిజ్ఞుడై నన్ను ఈ దుఃఖసాగరాన్నుండి దాటింపజేస్తే, అగ్నిదేవా! నీవు హనుమంతునికి చల్లబడు.

సీతాదేవికి తన గురించి, తన భర్త గురించి పూర్తిగా తెలుసు. అందువలన తాను ఒట్టుపెట్టుకొన్న విషయాల పట్ల ఆమెకు విశ్వాసము ఉంది.

సుగ్రీవుని గురించి, ఆయన స్వభావం గురించి సీతాదేవికి బొత్తిగా తెలియదు. ఇంతవరకు సుగ్రీవుడు తనను వెతకడానికి నలుదిశలలో వానరులను పంపి ఉండవచ్చు. ఆ విషయము హనుమ రాకతోనే నిశ్చయంగా తెలిసింది.

కాని హనుమ తిరిగి వెళ్లి ఇక్కడి విషయాలు చెప్పిన తరువాత రావణుని పట్ల భయాన్ని కలిగి సుగ్రీవుడు తన ప్రయత్నాన్ని మానుకోవచ్చు కదా! ఆ అనుమానం కూడ తీర్చుకోవడానికి సుగ్రీవుని ప్రయత్నం పట్ల కూడ ఒట్టుపెట్టుకొంది.

ఒకవేళ అగ్ని నిజంగా హనుమకు చల్లబడితే తన అనుమానాలు అన్ని తీరిపోతాయి. సీతాదేవి నిజంగా తెలివిగలదే.

సీతాదేవి చాల ఒట్లు పెట్టుకొని హనుమకు చల్లబడుమని అగ్నిదేవుని ప్రార్థించింది. అయితే ఆమె ప్రార్థన నిజంగా అగ్నిదేవుడికి ఆజ్ఞే. ఒకవేళ ఆమె ఆజ్ఞను తాను పెడచెవి పెట్టితే, సీతాదేవి తన పాతివ్రత్యాగ్నితో తననే భస్మం చేసినా చేయవచ్చు.

రావణాసురుని సైతము తాను భస్మం చేయగలుగుతానని బెదిరించిన రామపత్ని తనను భస్మం చేయజాలదా?

"ద్రవంతి దైత్యాః ప్రణమంతి దేవతాః"

భగవంతుని భక్తులను చూస్తే దైత్యులు (దయ్యాలు) భయంతో పారిపోతారు. ఇతర దేవతలు ప్రణమిల్లుతారు.

అర్చిరాది మార్గంగా వెళ్లే ముక్త పురుషుని బ్రహ్మాది దేవతలు తమ లోకాలకు ఆహ్వానించి, ఆయనను సత్కరించి పంపుతారనే విషయము ప్రపన్న కోటికి తెలిసిన విషయమే కదా!

అంతవరకు తోకమంటలు హనుమకు తాపాన్ని కలిగించాయి. కాని సీతాదేవి శాసించిన తరువాత అగ్నిదేవుడు తన తాపాన్ని పూర్తిగా తొలగించాడు. దాని వలన హనుమంతునికి మంటలు చల్లబడ్డాయి.

అప్పుడు మంది చూస్తుంటే మంటలు చెలరేగిపోతుంటాయి. కాని అవి హనుమకు చందనం వలె చల్లగా ఉంటాయి. "చందన పంక శీతః" అది ఒక విచిత్రము.

అంతేకాదు మరొక విచిత్రము! హనుమంతుని తోకకు ఎప్పుడో నిప్పంటించారు. నిజానికి కొంతసేపు నెయ్యి ఉండేదాకా, బట్టలు కాలిపోయే దాకా నిప్పు ఉంటే ఉండవచ్చు. ఆ తరువాత అది చల్లబడి పోవలసిందే కదా!

కాని ఆ తోక మంటలు క్షణక్షణానికి అధికం కాసాగాయి. రాక్షసులు ఆయన తోకకు కొత్తగా నేయి పోయలేదు. బట్టలు కొత్తగా చుట్టలేదు.

మరెలా మంటలు ప్రతిక్షణము అధికమయ్యాయి? నిజానికి హనుమ తోకకు ఉన్న నిప్పు రాక్షసులు అంటించింది కాదు. అదెప్పుడో ఆరిపోయింది. మరి ఈ అగ్ని ఎక్కడిది?

అది పదిమాసాలుగా రగులుకొంటున్న సీతాదేవి శోకాగ్ని. ఆ అగ్ని రాక్షసులు అంటించిన అగ్నికి తోడైంది.

అంజనేయస్వామి ఆ అగ్నిని శత్రువినాశం కొరకు ఉపయోగించాలను కొన్నాడు. ఒక్కసారి తన దేహాన్ని పెంచి, రాక్షసులను వదిలించుకొని, ఆకాశంపైకి ఎగిరాడు. రాక్షసులు దూరంగా పడిపోయారు. ఆయన కట్లన్ని తెగిపోయాయి.

ఆకాశంలోకి ఎగిరిన హనుమ ఒక్కొక్క రాక్షస గృహానికి తన తోక అగ్నితో నిప్పంటించడం మొదలు పెట్టాడు. కొంచెము నిప్పు అంటినా, మంటలు పెరిగి ఆ భవనమంతా భస్మము అయింది. అగ్నిహోత్రుడు అంతవరకు రావణాసురునిపై, లంకపై తనకున్న కోపాన్ని ప్రతీకార జ్వాలలుగా మార్చుకొని ఇప్పుడు ఒక్కొక్క ఇల్లునే భస్మం చేయసాగాడు. కొద్ది సమయంలో లంకానగరము మాడిమసి అయిపోయింది.

అంతవరకు హనుమను చూచి పకపక నవ్విన రాక్షసీ, రాక్షస జనము తమ ఇండ్లకే నిప్పంటుకొనేసరికి "హాహా" కారాలు చేయసాగారు. పిల్లలను తీసికొని భయంతో పారిపోసాగారు. తాము చూస్తుండగానే తమ కళ్ల ముందే తమ ఇండ్లు కాలి మసి అయిపోతుంటే నిస్సహాయంగా ఏడువసాగారు. హనుమ అగ్నిదేవుడికి ఆహుతి చేయకుండా ఒక్క విభీషణుని భవనాన్ని మాత్రమే వదిలాడు.

కొన్ని క్షణాలలో లంకానగరము మొత్తము దగ్ధమైంది. హనుమ అనుకొన్న పనులన్ని పూర్తి అయ్యాయి.

శతయోజన సముద్రందాటి హనుమ లంకా నగరానికి చేరుకొన్నాడు. సీతాదేవిని చూచాడు. ఆమెను కలిశాడు. ఆమెతో మాట్లాడాడు. ఆమెకు రాముని ఉంగరాన్ని ఇచ్చి ఆమె దుఃఖాన్ని తొలగించాడు. ఆమె దగ్గర చూడామణిని గ్రహించాడు.

రావణుని సైన్యాన్ని పరిమార్చి, రావణుని కలసి, సీతాదేవిని శ్రీరామునికి

అప్పగించుమని హితోక్తులను పలికాడు. రాబోయే ప్రమాదాన్ని గురించి రావణుని హెచ్చరించాడు.

ఇప్పుడు అగ్నిప్రకాశంలో లంకానగరమంతా చూచాడు. ఆ అగ్నితోనే లంకనంతా కాల్చి, బూడిద చేశాడు.

తాను వచ్చిన పనిని పూర్తి చేసికొని, హనుమ తిరుగు ప్రయాణమయ్యాడు. సముద్రం దాకా వెళ్లి - దాని జలంలో తోకను ముంచి నిప్పు చల్లార్చుకొన్నాడు.

లంకాదహన విషయంలో మనము తెలిసికోవలసిన విషయాలెన్నో ఉన్నాయి.

హనుమ ఒక ధీరుడైన కార్యసాధకుడు. ఆయన బయలుదేరినప్పటి నుండి అనేక విఘ్నాలు ఆయనకు ఎదురయ్యాయి. నూరు యోజనాల సముద్రాన్ని దాటాలనుకోవడమే ఒక పెద్ద ధైర్యము. మైనాకుని ప్రలోభము, సురస బెదిరింపు, సింహికవిఘాతము మొదలైన విఘ్నాలేవి హనుమంతుని దృఢదీక్షను సడలించలేదు.

ఆ తరువాత సీతాదేవి చాల సమయం దాకా కనబడక తీవ్రమైన నిరాశ హనుమకు ఎదురైంది. ఆత్మహత్య చేసికోవాలని లేదా వానప్రస్థునిగానే ఉండిపోవాలనే అంతగా ఆశ వదలుకొన్నాడు.

ఇంద్రజిత్తు వేసిన బ్రహ్మాస్త్రం ఆయనను బంధించి నిర్వీర్యుని కావించింది. తరువాత రాక్షసుల కట్లు, పోట్లు ఆయనను బాధించాయి. అంతిమంగా ఆయన తోకకు నిప్పంటించడం జరిగింది. తోక కాలుతున్నా హనుమ తన ప్రయత్నాన్ని మానుకోలేదు. భయంకరమైన బాధను మౌనంగా తన పంటి బిగువున భరించాడు.

ఆయన తోక అంటుకున్న విషయాన్ని రాక్షస స్త్రీలు సీతాదేవికి తెలిపారు. ఆ మాటలు విని ఆమె సహించలేదు.

ఇదివరకు పది మాసాలుగా సీతామతల్లి అనేక బాధలను భరిస్తూ వచ్చింది. రావణాసురుని భస్మం చేయ్యగల తేజస్సు ఆ పతివ్రతా శిరోమణికి ఉన్నా, ఆ తేజస్సును ఆమె తన రక్షణ కొరకు వాడుకోలేదు.

కాని హనుమ తోకకు నిప్పంటించారని తెలియగానే, ఆమె క్షణ మాత్రము కూడ భరించలేకపోయింది. హనుమకు చల్లగా ఉండుమని అగ్నిదేవుని కోరింది.

సీతాదేవి రామ పరమాత్మ నుండి దూరమై ఆయన జాడ తెలియక అమితంగా పరితపిస్తున్న జీవాత్మ.

ఆమె అన్వేషణకు రామ పరమాత్మచేత (ఆయన) దూతగా ఎన్నుకోబడిన హనుమ - ఆచార్యుడు. ఆచార్యుని యొక్క దేహ సంరక్షణ శిష్యుని యొక్క బాధ్యత. శిష్యుని యొక్క ఆత్మ సంరక్షణ ఆచార్యుని బాధ్యత. **"ఆశారియన్ శిచ్చన్ ఆరుయిరై పేణుమవన్, తేశారుం శిచ్చనవన్ శీర్‌వడివై.., నోక్కుమవన్"** అంటారు మణవాళ దేశికులు.

అందువలన ఆత్మరక్షణకు కూడ ఉపయోగించుకోని తన పాతివ్రత్య తేజస్సును సీతాదేవి ఆచార్య హనుమ యొక్క సంరక్షణ కొరకు ఉపయోగించింది. ఆత్మరక్షణ స్వయంగా చేసికోకపోవడం పారతంత్ర్యలక్షణము. ఆచార్య రక్షణకు పూనుకోవడం శిష్య లక్షణము. సీతాదేవి రామ పత్నిగా తన పాతివ్రత్య ధర్మాన్ని, ఆచార్య హనుమను రక్షించడం ద్వారా తన శిష్యలక్షణాన్ని రెండింటిని పూర్తిగా నెరవేర్చింది.

అంతవరకు తనకు మంట బాధను కలిగించిన అగ్నిదేవుడు హఠాత్తుగా చందనము వలె చల్లబడే వరకు హనుమ ఆశ్చర్యచకితుడయ్యాడు. అగ్నిదేవుడు మొదటి నుండి కూడ హనుమ శరీరాన్ని మాడ్చివేయలేదు. కారణము హనుమ అగ్నిదేవునికి అత్యంత మిత్రుడైన వాయుదేవుని కుమారుడు కావడమే.

అగ్నిదేవుడు హనుమ శరీరాన్ని మాడ్చి మసి చేయలేదు. కాని మంట బాధ మాత్రము హనుమకు తప్పలేదు. ఆ బాధనంతా ఆయన ఓపికతో భరించాడు. రామ పరమాత్మ కొరకు భరించాడు.

అయితే ఆ బాధ కూడ ఆకస్మాత్తుగా అదృశ్యమయ్యే వరకు హనుమ ఆశ్చర్యపరవశు డయ్యాడు. ఆ తరువాత సీతమ్మ తల్లి కృపే తనను మంట బాధనుండి కాపాడిందని అర్థము చేసికొన్నాడు.

మనస్సులోనే కృతజ్ఞతగా ఆ తల్లి శ్రీచరణాలకు చేతులు జోడించాడు. శ్రీరాముని తేజస్సుకు మనస్సులోనే నమస్కరించాడు.

హనుమ తోక సీతాదేవి ప్రార్థన వలన చల్లబడడము వలన ఆయనకు మేలు కలిగింది. అంతేకాదు హనుమ తోక చల్లబడడం వలన సీతాదేవికి శుభం కల్గుతుందనే నమ్మకాన్ని కలిగించింది.

రామచంద్రస్వామికి తన పట్ల ప్రేమ ఉందని, ఆయనకు తన శీలం పట్ల నమ్మకము ఉందని, తనకు శ్రీరామచంద్రస్వామితో కలసి జీవించే అదృష్టము ఉందని, సుగ్రీవుడు వానరకోటి సైన్యంతో రామలక్ష్మణులకు సహాయంగా వచ్చి తనను తన దుఃఖసముద్రం నుండి కాపాడుతాడనే విశ్వాసం కలిగి, ఆమెకు ఆనందం కలిగింది.

-- ఇతిశం --

# హనుమ పరితాపము - 37

తన తోకను చల్లార్చుకొన్నాక హనుమ లంకానగరము వైపు చూచాడు. ప్రహస్తుని భవనము, మహాపార్శ్వుని భవనము, వజ్ర దంష్ట్ర, శుక, సారణ, ఇంద్రజిత్, రావణ, కుంభకర్ణాదుల భవనములన్ని అగ్నికి ఆహుతులయ్యాయి.

ఈ వచ్చిన హనుమ అగ్నిహోత్రుడే కావచ్చునని రాక్షసులనుకొన్నారు. అనేక రాక్షసులు అగ్నికి ఆహారమయ్యారు. వారి శరీరములలోని కొవ్వు అగ్నిహోత్రుని మంటలను మరింత పెంచింది.

ఇంద్ర, యమా, నిల, వరుణ, రుద్రా, ర్కులలో ఎవ్వరో ఒక్కరు హనుమ రూపంలో వచ్చారనుకొన్నారు. వైష్ణవ తేజస్సే హనుమ రూపంలో లంకను భస్మం చేసిందను కొన్నారు.

చనిపోయిన తమ బంధువుల గూర్చి రాక్షసులు హాహాకారాలు చేశారు. సీతాదేవి దుఃఖాన్ని చూచి బాధపడిన హనుమ లంక కాలిపోతుంటే సంతోషించాడు.

కాని మరుక్షణంలో ఆయనమనస్సు భయంతో నిండిపోయింది. "అయ్యో! నేనెంత పాడు పనిని చేశాను? నేను లంకను కాల్చానే. వనాలు, భవనాలు తేడా లేకుండా నగరమంతా మాడి మసి అయిపోతున్నదే?

అశోకవనమంతా కాలిపోకుండా ఉంటుందా? సీతాదేవి మాత్రము ప్రాణాలతో క్షేమంగా జీవించి ఉంటుందా?

ఒకవేళ సీతాదేవికి ఏదైన జరుగకూడనిది జరిగితే నా అంత పాపాత్ముడు, కృతఘ్నుడు, స్వామిద్రోహి ఎవ్వరైనా ఉంటారా?

సీతాదేవిని చూచిరమ్మంటే లంకానగరాన్ని మొత్తాన్ని కాల్చివచ్చానే? నా కెందుకీ పనికిరాని కోపము వచ్చింది?

క్రోధము కల్గాక పాపము చేయనివాడెవ్వడు? క్రుద్ధుడు గురువులను చంపడానికి కూడ వెనుకాడడు. కోపము కల్గినవాడు కఠినమైన మాటలతో సజ్జనులను కూడ నిందిస్తాడు.

"క్రుద్ధః పాపం నకుర్యాత్కః। క్రుద్ధోహన్యాద్గురూనపి।
క్రుద్ధః పరుషయావాచా। నరః సాధూన్ అధిక్షిపేత్।

క్రోధము కల్గినవాడు ఏది అనాలో ఏది అనకూడదో తెలిసికోజాలడు. ఆయన చేయని (చెడు) పని ఉండదు. అనని మాట ఉండదు.

వాచ్యావాచ్యం ప్రకుపితో। నవిజానాతి కర్హిచిత్
నాకార్యమస్తి క్రుద్ధస్య। నావాచ్యం విద్యతే క్వచిత్।

కుబుసాన్ని పామువలె ఎవ్వరు కోపాన్ని సహనంతో తొలిగించుకొంటారో వారే ధన్యులు పురుషులనబడుతారు.

యస్సముత్థితం క్రోధం। క్షమయైన నిరస్యతి
యథోరగస్త్వచం జీర్ణాం। సవైపురుష ఉచ్యతే॥

మండుతున్న అగ్నిని చల్లార్చే నీటివలె ఏ మహాత్ములు తమకు కల్గిన కోపమును తమ బుద్ధితో నిరోధిస్తారో వారు ధన్యులు, పురుషశ్రేష్ఠులు.

"ధన్యాస్తే పురుషః శ్రేష్టాః యేబుద్ధ్యా కోపముత్థితం।
నిరుంధంతి మహాత్మానో। దీప్తమగ్నిమివాంభసా॥"

రాముడు చెప్పిన పనేమిటి? నేను చేసిన దేమిటి? రామకార్యాన్ని నాశనం చేసిన స్వామి ద్రోహి నయ్యానే?

నేను రామకార్యాన్ని తప్పక నెరవేరుస్తానని అహంకరించానే? ప్రగల్భాలు పలికానే? నేనెందుకు రాజసంగా ప్రవర్తించాను? ఎందుకు స్వతంత్రుడివలె వ్యవహరించాను? సీతను కాపాడలేక పోయానే?

సీతాదేవికి ఏమైనా ప్రమాదం కల్గితే రామలక్ష్మణులు ప్రాణాలతో ఉంటారా? వారికేదైనా అయితే సుగ్రీవుడు జీవించి ఉండగల్గుతాడా? అయోధ్యలో ఈ విషయం తెలిస్తే భరత, శత్రుఘ్నులు, రాజమాతలు, పౌరులు జీవించి ఉండగల్గుతారా?

ఛీఛీ నేనెంత పాడుపని చేశాను? సీతాదేవిని రక్షింపలేక పోవడమే కాక, అయోధ్యా, కిష్కింధలలో సర్వనాశనానికి కారణమయ్యానే? మూలాన్నే నరికి వేశానే? లోక వినాశకుడనయ్యానే?

ఇప్పుడు నేనేమి చేయాలి? కిష్కింధకు వెళ్లాలా? లంకలోనే ఉండిపోవాలా? నేను బ్రతికి ఉండాలా? లేక సముద్రములోనో, అగ్నిలోనో పడి ప్రాణాలు కోల్పోవాలా?" అని పరిపరి విధాల పరితాపం చెందుతున్న ఆంజనేయ స్వామికి అనేక శుభ శకునాలు కలిగాయి. లంకా నగరానికి బయలుదేరే సమయంలో కలిగిన శుభశకునాలు ఇప్పుడు మళ్లీ కలిగాయి.

ఆయన కుడికన్ను, కుడిభుజము అదిరాయి. వాటి వలన హనుమకు కొంత ధైర్యము కలిగింది. ఏ సీతాదేవి తేజస్సు నా తోక నిప్పును చల్లబరిచిందో, ఆ తేజస్సు ఆమెను రక్షింపజాలదా? 'నాగ్ని రగ్నౌ ప్రవర్తతే' సీతాదేవి అగ్నికంటె మించిన తేజస్సు కలది. ఆ తల్లిని ఈ సామాన్య అగ్ని ఏమి చేయగల్గుతుంది? ధర్మాత్ముడైన రాముని పత్నిని, పాతివ్రత్య తేజస్సంపన్నను, లక్ష్మణాదుల దేవతను ఈ సాధారణ అగ్ని కాల్చ గలుగుతుందా?

అగ్ని సీతను కాల్చకపోవడము కాదు. ఆ అగ్నినే సీతాదేవి ఆగ్రహము మాడ్చి మసి చేయగల్గుతుంది.

"అపి సా నిర్దహే దగ్నిం । నతామగ్నిః ప్రదక్ష్యతి"

అని ఈ విధంగా బుద్ధిని సమాధానపరుచుకొన్న హనుమకు అప్పుడు ఆకాశంలో వెళ్లుతున్న చారణుల శుభవాక్యాలు వినవచ్చాయి.

"ఎంత ఆశ్చర్యము। సర్వలోకాలను తన దుర్మార్గంతో వణికించిన రావణాసురుని రాజధాని అయిన లంకా నగరాన్ని హనుమ దహించి, అసాధ్యమైన పనిని సాధించాడు.

లంకానగరాన్ని అంతటిని మాడ్చి మసిచేసిన అగ్నిహోత్రుడు సీతాదేవి ఉన్నశింశుపా వృక్ష ఛాయలకే వెళ్లలేదు. ఇది మరింత ఆశ్చర్యము కదా!" అని వారు పలికారు.

ఆయనకు కల్గిన శుభశకునాలు, ఋషుల మంగళవాక్యాలు హనుమ మనస్సును ప్రశాంత పరిచాయి.

అయినా ఒకసారి సీతమ్మ తల్లిని సేవించుకొని ఆమె మంగళాశాసనాలతో తిరుగు ప్రయాణము సాగించాలనుకొన్నాడు.

లంకా నగరాన్నంతటిని భస్మీపటలం చేసిన అగ్నిహోత్రుడు సీతమ్మ ఛాయల కెందుకు వెళ్లలేదు? ఇందులో పరమార్ధమేమిటి?

ఒక సమాధానము మనకింతవరకే తెలిసింది "అపిసానిర్దహేదగ్నిం" సీతాదేవి తన తేజస్సు చేత (అందరిని దహించే) అగ్నిని కూడ కాల్చి వేయగలదని కదా ఆ సమాధానము.

ఇక ఈ సంఘటనలోని పరమార్ధాన్ని గ్రహిద్దాము. దీని ద్వారా రెండవ సమాధానము కూడ దొరుకుతుంది.

రావణుడు అహంకార పూరిత మనస్సు

సీతాదేవి జీవాత్మ. శ్రీరామపరమాత్మతో ఎన్నడు విడిచి ఉండని సీతాదేవి అనే జీవాత్మ. రావణుడు అనే అహంకార మనస్సు కల్పించిన మాయాలేడి అనే విషయవాంఛకు (మృగతృష్ణకు) వశురాలై రావణుని (మనస్సు) చేత అపహరింపబడి లంకఅనే శరీరంలో బంధింపబడింది. సీత అనే జీవాత్మ.

ఇప్పుడు "లంక" అంటే దేహము. సీత అంటే జీవాత్మ అని తెలిసింది కదా!

లంక (శరీర) స్వభావము వేరు. సీత (జీవాత్మ) స్వభావము వేరు.

లంక (శరీర) స్వభావము:- జాతస్యహిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ"

పుట్టిన శరీరము నశిస్తుంది. నశించాక శరీరము మళ్లీ పుట్టుతుంది. పరిణామ (మార్పు) శీలమైంది శరీరము. కాలిపోయేది దేహము.

సీతాదేవి (జీవాత్మ) స్వభావము:-

"నజాయతే, మ్రియతేవా। కదాచిత్ నాయంభూత్వా భవితావా న భూయః"

ఆత్మ పుట్టదు. చావదు. ఒకసారి లేక, ఒకసారి ఉండేది కాదు. ఎల్లకాలాల్లో ఉండేది ఆత్మ. మార్పు లేనిది జీవాత్మ.

"న హన్యతే హన్యమానే శరీరే"

నశించి పోయే శరీరములో నశించక ఎల్లప్పుడుండేది జీవాత్మ. అందువలన లంకానగరమంతా మాడి, మసి అయినా సీతాదేవి ఎటువంటి ఆపద కల్గక భద్రంగా ఉంది. "నైనం దహతి పావకః" అగ్ని ఆత్మను కాల్చదు కదా.

హనుమ మళ్లీ లంకలోని అశోకవనం చేరాడు. వనము అంతా కాలిపోయినా శింశుపావృక్షము యొక్క ఒక ఆకు కూడ వాడిపోలేదు. పచ్చదనంతో పూర్వం లాగే కళకళలాడుతున్నది. ఆ శింశుపావృక్షము యొక్క మొదట్లో సీతాదేవి క్షేమంగా కూచొని ఉంది. ఆమెకు అంజలి ఘటించి,

"తల్లీ! నిన్ను నా అదృష్టవశంగా క్షేమంగా చూచాను" అని వినయంగా పలికాడు. అప్పుడు సీతాదేవి హర్షపరవశ అయి, "హనుమా! నీవు కార్యధురంధరుడవు. నీ బలము, నీ పరాక్రమము అభినందనీయాలు. శ్రీరాముడు స్వయంగా వచ్చి, తన బాణాలను లంకనిండా నింపి, రావణుని సమూలంగా సంహరించి నన్ను గౌరవంగా తనవెంట

తీసికవెళ్లడమే ఆయనకు తగినట్లుగా ఉంటుంది. నీవెలాగైనా నా నాథుని బయలు దేరేట్లు పురుషకారము చేయాలి సుమా! ఈ కార్య భారమంతా నీవే వహించాలి సుమా!" అని పలికింది.

హనుమ మరొకసారి వినయాంజలితో అలాగేనని తెలిపి సీతాదేవి సెలవు తీసికొని సముద్ర ప్రాంతములో నున్న "అరిష్టా చలము"పైకి వచ్చాడు. అక్కడి నుండి సముద్రము పైకి ఎగురడానికి వీలుగా ఆ పర్వతాన్ని తన పాదాలతో అదిమిపట్టాడు. పర్వతంలో ఉన్న నాగ సర్పాలు, జంతువులు, బాధపడ్డాయి. యక్ష, కిన్నర, గంధర్వాదులు ఆ గుట్టను వదిలి వెళ్లారు.

-- ఇతిశం --


## లంకా దహనము చేయుట



అగ్ని హనుమకు చల్లనై దోచినంత
మహిజాత మహిమంబు దోచెనంత

పాపము ప్రేమతో నెదురవచ్చెను, పున్నెము
సేయ బోయినన్ - పాపముగాని తానెదుర
వచ్చిన దన్న విధాన.

ఒక్కడు
చేయబోయి
పనియుం
చెడగొట్టుట కంటె
నెవ్వడున్ మిక్కిలి
జేయకుండుటయె
మేలు.



# తిరుగు ప్రయాణము - 45

హనుమ దక్షిణం వైపు నుండి ఉత్తరం వైపు సముద్రం పై ఆకాశమార్గంలో తిరుగు ప్రయాణం చేయాలనుకొన్నాడు. తన బలాన్నంతా కూడదీసికొని ఒక్కసారి ఆకాశంలోకి ఎగిరాడు.

ఆయన మేఘాలను చీల్చుకొంటూ సూర్యచంద్రులను తన చేతులతో తాకుతున్నాడా అన్నట్లు వెళ్లుతున్నాడు. మానస సరోవరంలో విహరించే రాజహంసవలె ప్రయాణిస్తున్నాడు. గరుడుని వలె వేగంగా వెళ్లుతూ, మేఘం వలె గర్జిస్తున్నాడు. ఆయన మహావేగానికి (నూరు యోజనాల) అంత పెద్ద సముద్రము గోపాదమంతా చిన్నగా కనబడింది. చాల తొందరగా సముద్రాన్ని దాటుతున్నాడు. తాను బయలుదేరిన మహేంద్ర పర్వతము కనుచూపుమేరలోకి వచ్చింది.

క్షణక్షణం తన రాక కొరకు ఎదిరిచూస్తూ, క్షణమొక యుగంగా దీనంగాబిక్కు బిక్కు మంటు ప్రాణాలను నిలుపుకొంటున్న తన సహచర వానరుల మనస్సులలో నూతనోత్సాహ, జవాలను నింపాలనుకొని సింహగర్జన కావించాడు హనుమ.

ఆయన గంభీర గర్జన ధ్వనిని విన్న, అంగద, జాంబవదాదులకు పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి. వారిలో నూతనోత్సాహము పెల్లుబికింది. వాళ్లు లేచి తమకు అంటుకున్న దుమ్మును దులిపివేసికొన్నారు. హనుమకు స్వాగతం పలుకడానికి సిద్ధమయ్యారు.

హనుమ గంభీర గర్జన నాదాన్ని విన్న వారు హనుమ తప్పక కఠిన రామకార్యాన్ని సాధించి వచ్చాడనే నిర్ణయానికి వచ్చారు.

"సర్వథా కృత కార్యోసౌ। హనుమాన్నాత్ర సంశయః॥
నహ్యస్యాకృత కార్యస్య। నాద ఏవం విధో భవేత్"

"ఒకవేళ హనుమకు సీతాదేవి కనబడకుండా ఉంటే ఆయన ధ్వని ఇంత గంభీరంగా, ఇంత నిండుగా ఉండేది కాదు" అని జాంబవంతుడు అన్నాడు.

ఉత్సాహంతో ఆ వానర వీరులు పర్వత శిఖరంపైకి, చెట్ల కొమ్మలపైకి ఎక్కి నిలుచున్నారు. చేతులను ఊపుతూ, చెట్ల కొమ్మలను ఊపుతూ హనుమకు స్వాగతం తెలుపసాగారు.

అంతలోనే వాయునందనుడైన హనుమ మహేంద్ర పర్వతము పైకి వచ్చి వాలాడు. వానరులందరు ఉత్సాహంగా హనుమ చుట్టూ చేరారు. యువరాజైన అంగదునికి, పెద్దవాడైన జాంబవంతునికి నమస్కరించి, వానరులందరితో "దృష్టా సీతా" సీతాదేవిని చూచాను అని హనుమ పలికాడు.

అంగదునితో కలసి ఆ పర్వత రమణీయ ప్రదేశంలో కూచొని సీతా వృత్తాంతాన్ని ఇలా తెలిపాడు.

"పెద్ద పులుల మధ్య ఆడ లేడివలె, భయంకర రాక్షస స్త్రీల మధ్య ఏకవేణి (ఒంటి జడ)తో, మాసిన వస్త్రంతో, ఉపవాసములచే కృశించి, అలసిన శరీరంతో మహా పతివ్రత అయిన సీతాదేవి నాకు దర్శనమిచ్చింది" అని తెలిపాడు.

ఆ వానరులందరు ఉత్సాహంతో గంతులు వేశారు. తమ పొడవైన తోకలను నేలకు కొట్టారు. కొందరు మదించిన ఎద్దువలె గర్జించారు. కొందరు కిలకిల శబ్దాలను చేశారు. కొందరు హనుమను తాకారు. కొందరు కొండపైకి ఎగిరి దుమికారు.

ఇన్ని విచిత్ర వానర చేష్టల మధ్య యువరాజైన అంగదుడు హనుమ కార్యాన్ని ప్రశంసించాడు. "హనుమా! బలంలో, ఉత్సాహంలో పట్టుదలలో నీకు సాటి రాదగిన వారు ఎవ్వరు లేరు. నూరు యోజనాల విస్తీర్ణమైన సముద్రాన్ని అవలీలగా దాటావు. అనాయాసంగా తిరిగి వచ్చావు" అని ప్రస్తుతించాడు.

"అహో స్వామిని తే భక్తిః అహో వీర్య మహోధృతిః
దిష్ట్యా దృష్టా త్వయాదేవీ। రామపత్నీ యశస్వినీ।"

"హనుమా! ఏమి నీ స్వామిభక్తి! ఏమి వీర్యము! ఏమి ధైర్యము! అసాధారణ పాతివ్రత్య కీర్తిగల రామపత్నిని జానకీదేవిని నీవెంత చక్కగా చూశావు! ఇక సీతాదేవి క్షేమ వార్తను విన్న రామచంద్రుని దుర్భర దుఃఖము తప్పక తగ్గి పోతుంది" అని జాంబవంతుడు హనుమను ప్రశంసలలో ముంచివేశాడు.

హనుమ ద్వారా అతని ప్రయాణ వివరాలను, సముద్ర తరణ, లంకాగమన, సీతాసందర్శన, రావణ సమాగమాదులను వినాలని వానరులంతా చేతులు జోడించికొని, చెవులను నిక్కరించికొని అంగద, హనుమ జాంబవంతుల ముందు వారు నిలుచొని ఉన్నారు. మహేంద్ర పర్వత పరిసరాలన్ని మహోత్సాహంతో హనుమ మాటలను శ్రద్ధగా విని ఆనందించాలని సిద్ధమయ్యాయి.

# హనుమ ప్రయాణ వర్ణనము - 46

మహేంద్ర పర్వతముపై అంగదుని సరసన హనుమ కూచొని ఉన్నాడు. మిగిలిన వానరులందరు వారి చుట్టు ప్రక్కల గుమిగూడారు. అప్పుడు వృద్ధుడగు జాంబవంతుడు

"హనుమా! సీతాదేవిని నీవు ఎలా చూచావు? ఆమె ఎలా ఉంది? రావణుడు ఆమె విషయంలో ఏ వైఖరితో ఉన్నాడు?" "ఈ విషయాలను వివరించు. ఆ తరువాత ఏమి చేయాలో, శ్రీరామునితో ఏమి చెప్పాలో ఆలోచిద్దాము" అన్నాడు.

హనుమ ఒక్కసారి సీతాదేవిని తన మనస్సులో ధ్యానించి, ఆమెకు నమస్కరించి - ఆ వృత్తాంతాన్ని చెప్పసాగాడు:-

"మీ అందరు చూస్తుండగానే నేను "రాముని బాణంవలె లంకకు వెళ్తానని" చెప్పాను కదా! అలాగే సముద్రంపై ప్రయాణించసాగాను. కొంత దూరము వెళ్లాక ఒక కొండ నాకు ఎదురుగా వచ్చింది. అదేదో విఘ్నమనుకొని నా అరచేయితో దాన్ని బలంగా మోదాను. ఆ కొండ శిఖరము విరిగి, అది సముద్రంలో పడిపోయింది. అంతలోనే అది పైకి వచ్చి, మానవ భాషలో, "కుమారా! నీ తండ్రి వాయుదేవుడు నాకు ప్రియమిత్రుడు. దేవేంద్రుడు పూర్వము పర్వతముల రెక్కలను వజ్రాయుధంతో ఖండించాడు. ఆయనకు అందకుండా నేను పరుగెత్తాను. నన్ను మీ తండ్రి తన వేగంతో తీసిక వచ్చి సముద్రం మధ్యలో దాచాడు. నేను మైనాకుడను.

నన్ను దాచుకొన్న సముద్రుని మాటలు విని నీకు ఆతిథ్యమివ్వడానికి పూలు, పండ్లు, మధుర జలాలతో నీ ముందు నిలిచాను. కొంత విశ్రాంతి తీసికొని మళ్లీ వెళ్లు" మని మధుర వాక్కులతో ఆహ్వానించాడు.

"మైనాకా! నీ ఆహ్వానానికి సంతోషించాను. కాని నాకు చాల తొందరగా ఉంది" అని ఆ కొండను చేతితో ముట్టుకొని ముందుకు వెళ్లాను"

మళ్లీ కొంత దూరము ప్రయాణించాక, "సురస" అనే నాగమాత ఎదురై నన్ను దేవతలు తనకు ఆహారంగా ఇచ్చారని, తనను నేను తప్పించుకోజాలనని, నన్ను మ్రింగడానికి నోరు తెరిచింది నేను శరీరము పెంచుకొంటూ వెళ్లాను. నాగమాత నోరును పెంచుకొంటూ వెళ్లింది. ఒక్కసారి నేను చిన్నరూపం కలిగి ఆమె నోటిలో ప్రవేశించి, ఆమె నోరు మూసే లోపే బయటపడ్డాను. నా లాఘవానికి నాగమాత సంతోషించింది నన్నుఆశీర్వదించింది.

మరికొంత దూరము వెళ్లాక సముద్రంలో ఒక భయంకర ప్రాణి పైకి లేచి, నా నీడను పట్టుకొని లాగి నన్ను దుర్బలుడిని కావించింది. నేను సుగ్రీవుడు చెప్పిన "ఛాయాగ్రాహిగా" గుర్తించి, దాని నోటిలో ప్రవేశించి పెద్ద శరీరముతో దాని ఉదరాన్ని చీల్చి బయటకు వచ్చాను. ఆకాశములో సంచరించే సిద్ధ చారణులు, "భయంకరమగు సింహికను ఆంజనేయుడు సంహరించాడని" చెప్పుకొన్నారు.

నా ధృతిని, దృష్టిని, మతిని, దాక్షిణ్యాన్ని, దేవతలందరు పొగిడారు. సూర్యాస్తమయానికి ముందే నేను లంకలో ప్రవేశించి, రాత్రి అయ్యే దాకా ఆగి, చిన్నపిల్లి అంత ఆకారంతో రావణాంతఃపురంలో సీతాదేవిని వెతికాను. అక్కడ ఆమె కనుపించలేదు.

రావణ భవనానికి సమీపంలో ఒక అశోక వనము ఉంది. సీతారామ లక్ష్మణులకు, సుగ్రీవునికి నమస్కరించి ఆ వనంలోకి ప్రవేశించాను. అక్కడ ఒక పెద్ద శింశుపావృక్షం కొమ్మల మధ్య దాగి ఉన్నాను.

అంతలో రావణుడు ఉదయమవుతూనే మన్మధావేశంతో సీతాదేవిని సందర్శించి, తనను అనుగ్రహించి, తన భార్యగా కమ్మని ఆమెను ప్రార్థించాడు. వానిని గడ్డిపోచలా చూచి, సీతాదేవి తిరస్కరించింది. వాడు ఆగ్రహంతో తనను ప్రేమించకుంటే రెండు నెలల కంటె ఎక్కువ కాలము ఆమె జీవించదని బెదిరించి, తన భార్య అయిన మండోదరితో, స్త్రీ పరివారంతో వెళ్లి పోయాడు.

సీతాదేవి దుఃఖాన్ని చూచి భరించలేక నేను శింశుపా వృక్షంపై నుండే రామాయణాన్ని వినిపించాను. ఆమె విస్మితురాలై తనకు మధురాతి మధురమైన రామ వృత్తాంతాన్ని వినిపించిన మహనీయుడెవరని నలువైపుల పరిశీలించింది. నేను చెట్టుదిగి ఆమె ముందు అంజలి ఘటించి నిలబడ్డాను. "నీవెవ్వరు? నీకు రామలక్ష్మణులతో ఎలా మైత్రి కలిగింద"ని ప్రశ్నించింది. నేను "రామ-సుగ్రీవమైత్రి, వాలివధ, సుగ్రీవ పట్టాభిషేక వార్తలను" తెలిపి, "ధీమంతుడైన రామచంద్రుడు నన్ను నీ దగ్గరికి దూతగా పంపాడ"ని తెలిపి, ఆమెకు రాముని ఉంగరాన్ని గుర్తుగా ఇచ్చాను.

అప్పుడు సీతాదేవి, "హనుమా! నేను జీవించడానికి రెండు నెలల గడువు మాత్రమే మిగిలింది. ఈ లోగా నా నాథుడు లంకానగరానికి వచ్చి, రావణుని సంహరించి, నన్ను సగౌరవంగా తీసికవెళ్లాలి. హనుమా! నా నాథుని తీసిక వచ్చే బాధ్యత నీదే సుమా!" అని తెలిపి, తన 'సిగపూవును' తన గుర్తుగా నాకు ఇచ్చింది.

సీతాదేవి దైన్యాన్ని చూడగానే నాలో కోపాగ్ని భగ్గుమంది. రావణాసురుని కొంత సైన్యాన్ని సంహరించి, రావణాసురునికి బుద్ధి చెప్పాలని భావించి రావణాసురునికి అత్యంత ప్రియమైన ఆ అశోక వనాన్ని ధ్వంసము చేశాను.

రావణుడు పంపిన ఎనుబై వేల మంది కింకరులను, నూరుగురు వనపాలకులను, జంబుమాలిని చంపాను. రావణుడు మరింత ఆగ్రహంతో వరుసగా ఏడుగురు మంత్రి పుత్రులను, అయిదుగురు సేనా నాయకులను పంపాడు. వారిని చంపాను.

రావణాసురుని చిన్న కుమారుడు మహావీరుడైన అక్ష కుమారుడు నన్ను ఎదిరించడానికి వచ్చాడు. ఆకాశానికి ఎగిరిన అతనిపాదాలను పట్టుకొని నేలకు కొట్టి చంపాను.

మహాబలసమేతుడు, వరప్రసాదుడు అయిన ఇంద్రజిత్తు నన్ను ఎదుర్కొని నన్ను బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి బంధించాడు. రావణుడు నా వృత్తాంతాన్ని అడిగాడు.

"నేను సీతాదేవి కొరకే లంకకు వచ్చానని, వన భంగము, సైన్య సంహారము అంతా ఆమె కొరకే" అని తెలిపి, నేను రామదూతనని తెలిపాను.

సీతాదేవిని వెతుకుతూ, రామలక్ష్మణులు కిష్కింధకు వచ్చారని, అక్కడ సుగ్రీవునితో సఖ్యము చేసికొని, రాముడు ఒకే బాణంతో వాలిని సంహరించి సుగ్రీవుని రాజుగా చేశాడని, సుగ్రీవుడే సీతాన్వేషణ కొరకు పంపగా రాముని దూతగా వచ్చానని, రాముని బాణాలనే భయంకరాగ్నికి ఆహుతి కావద్దని సీతాదేవిని శ్రీరామచంద్ర స్వామికి సమర్పించుమని కోరాను.

రావణుడు నా మాటలకు ఆగ్రహావిష్టుడై నన్ను చంపుమని భటులకు ఆదేశించాడు. ఆయన సహోదరుడు విభీషణుడు "దూత వధ" తగదని వారించాడు. నా తోకను కాల్చుమని రావణుడు ఆజ్ఞాపించాడు. ఆయన భటులు నేయిలో పాత బట్టలను తడిపి, నా తోకకు చుట్టి నిప్పంటించారు.

నేను నా రూపాన్ని తగ్గించుకొని, ఆ బంధాలను జార్చుకొని అతివేగంగా ఆకాశంలోకి ఎగిరి లంకనంతా దహించాను.

నేను సముద్రంలో నా తోకను చల్లార్చుకొన్నాను. అంతలో కాలిపోతున్న లంకలో సీతాదేవి కాలిపోయి ఉండవచ్చుననే ఆవేదన నాలో చోటు చేసికొంది.

అప్పుడు ఆకాశ సంచారులైన చారణులు "లంక అంతా కాలినా, సీతాదేవి బ్రతికే ఉందని" తెలిపారు. నేను సంతోషంతో మరొక్కసారి సీతాదేవిని సేవించుకొని ఆ దేవి ఆజ్ఞతో తిరుగు ప్రయాణము చేసి సముద్రము దాటి మీ దగ్గరికి వచ్చాను. ఈ విధంగా సుగ్రీవుడు పంపిన దౌత్య కార్యాన్ని నెరవేర్చాను.

ఇక ముందు చేయవలసిన పనిని మీరందరు ఆలోచించండి" అని హనుమ తెలిపి ఊరకున్నాడు.

కొంత సమయం తరువాత లంకా వృత్తాన్ని హనుమ మళ్లీ కొనసాగించాడు. "రావణాసురుడు అమోఘ తపస్సంపన్నుడు. అద్భుత వరప్రసాద బలుడు. ఆయన తపో బలం వలననే సీతాదేవిని బలవంతంగా ఎత్తుకొని వెళ్లినా ఆయనకు ఏమి కాలేదు.

సీతాదేవి అతిలోక పతివ్రత. ఆమె తేజస్సు రావణాసురుని ఒక్కడినే కాదు సమస్త లంకా నగరాన్ని శ్మశానంగా మార్చగలదు. కాని ఆమె రావణుని కన్న కుమారునిగా భావించుకొని ఆయనను శిక్షింపలేదు" అని తెలిపాడు.

మనము సీతమ్మను తీసికొనే రామలక్ష్మణుల సన్నిధికి వెళ్లుట న్యాయమ"ని ముగించాడు. తిరిగి హనుమ తమ బలాలను వివరిస్తూ,

"నేనొక్కడినే రావణుని సపరివారంగా సంహరింపగలను. రాక్షసులు సర్వశస్త్రాస్త్ర సంపన్నులు. అయినప్పటికి అవి నన్నేమి చేయలేవు.

నేనే కాదు ఒక్క జాంబవంతుని ముందు సర్వ రాక్షస సైన్యము తృణప్రాయము.

అంగదుడొక్కడే సమస్త రాక్షస సైన్యాన్ని సంహరిస్తాడు. పనసుడు నీలుడు తమ వేగంతో మందర పర్వతాన్ని కూడ ముక్కలు చేయగల్గుతారు.

అమృతాన్ని పానం చేసినవారు, అశ్వినీదేవతల పుత్రులైన మైందద్వివిదులను ఎదుర్కోగల బలము సురాసురులలో ఎవ్వరికి లేదు" అని పలికాడు.

హనుమంతుని మాటలను విన్న అంగదుడు - "సీతమ్మను చూచిన తరువాత ఆమెను తీసికొని వెళ్లక శూన్య హస్తాలతో రామచంద్ర స్వామి దగ్గరకు వెళ్లడం సరియైన పనికాదు". మనను ఎదిరించగల శక్తి దేవదానవులలో ఎవ్వరికి కూడ లేదు. హనుమ ఒక్కడే వెళ్లి లంకనంతా దహించి, సైన్యంలో కొంత భాగము సంహరించి వచ్చాడు.

ఇప్పుడు మనము అందరము కలసి రావణాసురుని సంహరించి సీతాదేవిని తీసికొని వచ్చి శ్రీరామచంద్ర స్వామిని సేవించుట యుక్తము" అని పలికాడు. మిగిలిన వానరులందరు అంగదుని మాటను అంగీకరించారు.

కాని జాంబవంతుడు మాత్రము, "నిజమే - మనము సీతాదేవిని తీసిక రాగల సమర్థులమే. అయినా మనను చూచి రమ్మనే సుగ్రీవుడు ఆదేశించాడు.

సీతాదేవిని మనమే తీసికొని వెళ్లడం రామచంద్రునికి ఇష్టము అవుతుందో కాదో? తెలియదు. ఆయన ఇష్టాన్ని అనుసరించే మనము నడుచుకోవడము బాగుంటుంద"ని తెలిపాడు.

జాంబవంతుని అభిప్రాయాన్ని అంగదాదులు, హనుమ అంగీకరించారు. వారందరు తక్షణమే ఆకాశంలోకి ఎగిరి కిష్కింధకు చేరారు. పర్వత దేహులు, వజ్రబలులు అయిన వారు అందరు హనుమను రెప్పపాటు లేకుండా చూస్తూ ముందుకు సాగారు. ఇక రామకార్యము తప్పక నెరవేరుతుందనే నమ్మకం వారికందరికి కలిగింది.

వారిలో ప్రతివారికి, తామే రామునికి ముందుగా సీతాదేవి క్షేమవార్తను తెలుపాలనే ఉబలాటం ఏర్పడింది. అందరు యుద్ధానికి మనస్సులో సిద్ధమయ్యారు. రావణునికి తగిన బుద్ధిని చెప్పాలని నిశ్చయించుకొన్నారు.

వారందరు అలా వెళ్లుతుండగా కిష్కింధా నగరానికి ముందుగా అందమైన ఒక ఉద్యాన వనం కనబడింది. అందులోని ఫలాలన్ని తేనెతో నిండి ఉంటాయి. అందువలన దానికి "మధువనము" అనే పేరు వచ్చింది.

అలసి పోయిన వారందరికి ఉద్యానవన పరిమళాలు ఆహ్వానం పలికాయి. ఆకలితో ఉన్న వారందరికి ఆ ఫలాల తేనెలు నోరూరించాయి.

వారందరు అంగదుని అంగీకారముతో మధువనంలో ప్రవేశించారు. కడుపునిండా ఫలాలను భుజించారు. తీయని తేనెను ఇష్టము వచ్చినంతా త్రాగారు. భుక్తాయాసము, మధుపాన మదము వారిని వివశుల చేసింది. వారు ఒళ్లు మరిచారు.

"గాయంతి కేచిత్, ప్రణమంతి కేచిత్,
నృత్యంతి కేచిత్, ప్రహసంతి కేచిత్
పతంతి కేచిత్, విచరంతి కేచిత్
ప్లవంతి కేచిత్, ప్రలపంతి కేచిత్"

"కొంతమంది ఇష్టము వచ్చిన పాటలు పాడుతున్నారు. కొందరు చేతులు జోడించారు. కొందరు మైమరచి ఆడారు. కొందరు పకపక నవ్వారు. కొందరు క్రింద పడి బురిడీలు కొట్టారు. కొందరు ఇటు అటు ఊరికే తిరిగారు. కొందరు ఎగురుతున్నారు. కొందరు ఏడుస్తున్నారు.

ఎవ్వరు ఏ పనిని ఎందుకు చేస్తున్నారో వారికే తెలియదు. ఒక విధమైన మత్తు అందరిని ఆవేశించింది."

ఆవన పాలకుడు దధివక్త్రుడు తారాదేవి పిత. ఆయన ఆ వనమంతా ఆ వానరుల చేత ధ్వంసం కావడం చూచి సహించలేదు. ఆయన ముందుగా వచ్చి ఆ పనిని ఆపుమని కొందరిని ప్రార్థించాడు, కొందరిని ఆగ్రహించాడు.కొందరిని కొట్టాడు. కొందరిని తిట్టాడు.

అయినా ఎవ్వరు దధిముఖుని చర్యలకు బెదరలేదు. వారందరు ఆయన పైకి తిరుగబడ్డారు. ఆయన తన అనుచరులందరిని పిలిచి వారందరితో యుద్ధం చేశాడు.

అయితే అంగదాదులు వారి నెవ్వరిని వదలలేదు. అందరికి దేహశుద్ధిని చేశారు. ఆ దెబ్బలను దధిముఖాదులు భరించలేక పోయారు. అంగదాది వానరులను వారు వారించలేక పోయారు.

అంగదుడు తన తండ్రి మేనమామను, మహాబలుడైన దధిముఖుని రెండు చేతులతో కొట్టాడు. నేలమీద పడవేసి కొట్టాడు. అంగదుని దెబ్బలకు ఆయన కాళ్లు, చేతులు, తొడలు, దేహమంతా రక్తసిక్తమైంది.

ఇక చేసేది ఏమి లేక చండశాసనుడైన సుగ్రీవుని దగ్గరకు వెళ్లి, వారి దుర్మార్గాన్ని వివరించి, వారిని శిక్షింప చేద్దామని దధిముఖుడు సుగ్రీవుని దగ్గరకు వెళ్లాడు.

సుగ్రీవుని చేరుకొని దధిముఖుడు సుగ్రీవుని కాళ్లపై పడ్డాడు. తనకు మామ, వయోవృద్ధుడైన దధిముఖుడు తన కాళ్లపై పడి విలపించడం సుగ్రీవుని అయోమయంలో పడవేసింది.

ఆయన తన మామగారిని లేవనెత్తి; దుఃఖకారణాన్ని అడిగాడు. అప్పుడు సుగ్రీవుని ముందు చేతులు జోడించుకొని నిలువబడి, దధిముఖుడు.

"మహారాజా! మధువనము మీ అందరికి అత్యంత ప్రియమైనది. నా మీది గౌరవంతో, ప్రేమతో ఆ వన పాలక బాధ్యతను నాపైన ఉంచారు.

మీ తండ్రిగారు ఋక్షరజుని కాలంలో, మీ అన్నగారైన వాలి మహారాజు కాలంలో మీ కాలంలో కూడ ఇంతవరకు దానిని ప్రాణప్రియంగా కాపాడుకొంటూ వచ్చారు.

కాని ఇప్పుడే ఆ వనానికి చెడు కాలము దాపురించింది. హనుమ అంగద, జాంబవదాదులు, అనేక వానరులు ఆ వనంలో ఆజ్ఞ లేకుండా ప్రవేశించి పూలను వాసన చూచి పారవేసి,తిన్నన్ని పండ్లను తిని మిగిలిన వాటిని పారవేసి, చెట్ల కొమ్మలను విరిచి, ఆకులను, పూలను నలిపి వనాన్ని అంతా ధ్వంసం చేశారు.

అడ్డుపోయిన పరిచారకులందరిని అమితంగా బాధించారు. పెద్దవాడిని. అప్తుడనని కూడ చూడక అలక్ష్యంతో నన్ను కూడ చావబాదారు. వారిని మీరు కఠినంగా శిక్షించాలి. లేదా ఇక ఆ వనము మీకు మిగులదు" అని ఏడుస్తూ చెప్పాడు.

లక్ష్మణుడు దీన్ని అంతా గమనిస్తు ఉన్నాడు. దధిముఖుని మాటలు ఆయనకు అర్థం కాలేదు. కాని ఆయన ఏడుస్తున్నది మాత్రము కనబడుతున్నది. సీతాదేవి దగ్గర నుండి ఏమైనా వార్త తెలిసిందా? ఆమెకు ఏ ప్రమాదమైనా కలిగిందా? అనే ఆందోళన ఆయనకు అధికమైంది. ఆ విషయాన్నే ఆయన సుగ్రీవుని అడిగాడు.

సుగ్రీవుడు లక్ష్మణుని ఆందోళనను అర్థం చేసికొన్నాడు. సీతాదేవి వార్త స్పష్టంగా తెలియ లేదని, హనుమ అంగదాదులు మాత్రము తిరిగి వచ్చారని, వారు మధువనంలో ప్రవేశించి, మధువునంతా త్రాగి, అల్లరి చేస్తున్నారని దధిముఖుడు తెలుపుతున్నాడని లక్ష్మణునితో పలికాడు.

అంతేకాదు మధువనము రాజవనము. ఆ ఉద్యానవనంలోకి రాజాజ్ఞ లేకుండా ఎవ్వరు ప్రవేశించజాలరు. అంగద, హనుమదాదులందరికి ఈ విషయము చక్కగా తెలుసు.

అయినా వాళ్లందరు ఇష్టము వచ్చినట్లు తేనె త్రాగి అల్లరి చేస్తున్నారంటే కారణము వాళ్లు సీతాదేవిని చూసి ఉండడమే. ఆ ఆనందం తోనే వాళ్లు అంత అల్లరి చేస్తున్నారు. ఇందులో ఎంత మాత్రము సందేహము లేదు" అని సుగ్రీవుడు లక్ష్మణునికి స్పష్టం చేశాడు.

"దృష్టాదేవీ న సందేహో। నచాన్యేన హనూమతా।
నహ్యన్యః సాధనేహేతుః కర్మణోస్య హనూమతః।
కార్యసిద్ధిర్మతిశ్చైవ। తస్మిన్ వానర పుంగవే।
వ్యవసాయశ్చ వీర్యంచ। శ్రుతం చాపి ప్రతిష్ఠితం।"

"లక్ష్మణా! హనుమంతుడే సీతాదేవిని చూచాడు. ఆ పని మిగిలిన వారెవ్వరికి సాధ్యము కాదు.

హనుమ ఈ పనిని నెరవేర్చడంలో ఎవ్వరి సహాయము కూడ అర్థించడు. కార్యమును సాధించేనేర్పు, బుద్ధి చాతుర్యము, పట్టుదల, శక్తి, సామర్థ్యము హనుమకు సహజ సిద్ధాలు.

ఇప్పుడు కార్యాన్ని సాధించుకొని వచ్చారు. సీతాదేవి క్షేమంగా ఉండవచ్చు. సంతోషంలో మా మధువనంలో ప్రవేశించి, యధేచ్ఛగా మధువును త్రాగి, అల్లరి చేస్తున్నారు" అని సుగ్రీవుడు సౌమిత్రికి తెలిపి, "మామా! ఏదో ఆనందంలో అల్లరి

చేశారు. వారిని నీవు మన్నించు. వారిని వెంటనే ఇక్కడికి రమ్మని నా ఆజ్ఞగా వారికి తెలుపుమ”ని దధిముఖుని ఆదేశించాడు.

దధిముఖుడు సుగ్రీవుని మాటలను మన్నించి వాళ్లను ఇక్కడకు పంపడానికి వెళ్లి పోయాడు.

రామలక్ష్మణులకు సీతాదేవిని చూచి హనుమదాదులు తిరిగివచ్చారని సీతాదేవి క్షేమమని తెలియగానే వారి మనస్సులు ఆనందంతో నిండిపోయాయి.

-- ఇతిశం --

లంక పెల్లగించి రాఘవపాద సమీపమునందు పెట్టెదన్

ఒకని వలన పొంది ఉపకృతి వానికి నొక్క చనువొంగకున్న రేడు రేడనంగ నకునె

ఆజ్ఞలేని రాజు అవని పాలన యేమి?

కొందరు కోతులు పాడుతున్నారు. కొందరు ఆడుతున్నారు. కొందరు నవ్వుతున్నారు. కొందరు ఎగురుతున్నారు. ఎవ్వరు ఏ పనిని ఎందుకు చేస్తున్నారో వారికే తెలియదు.

# శ్రీరామునికి నివేదనము - 47

సుగ్రీవుడు అంగదాదులను శిక్షిస్తాడనుకొన్న దధిముఖుడు – సుగ్రీవుడే స్వయంగా హనుమ యొక్క బలమును, పట్టుదలను కీర్తించినందువలన తన మనస్సును మార్చుకొని అంగదాదుల దగ్గరికి సవినయంగా వెళ్లాడు. "ప్రభువు మీ పట్ల ప్రసన్నంగా ఉన్నాడు. మిమ్మల్ని వెంటనే తన దగ్గరికి రమ్మన్నాడు" అని విన్నవించి, వారిని మధువనంలో వారించినందుకు తన దోషాన్ని మన్నించుమని కోరాడు.

అంగదుడు తనఅనుచరుల అభిప్రాయాన్ని అడిగాడు. వారందరు అంగదుని గౌరవించి, ఆయన మాట ప్రకారము రామలక్ష్మణుల సన్నిధికి బయలు దేరారు. నల్లని మబ్బులు నిండిన ఆకాశమువలె అప్పుడు అంబరవీధి అంతా వానర వీరమయింది.

వాళ్లు రావడంలో జరిగిన ఆలస్యము వలన శ్రీరాముడు బాధ పడుతుంటే సుగ్రీవుడు సవినయంగా ఆయన శోకాన్ని తగ్గించాలనుకొని, "అంగదాదులు నెల గడువు మీరాక కూడ నిర్భయంగా తిరిగి వచ్చారంటే, కేవలం రావడమే కాక, రాజవనాన్ని ధ్వంసం చేశారంటే తప్పక సీతాదేవిని హనుమ చూచే ఉంటాడని, సీతాదేవి క్షేమంగా ఉండి ఉంటుందని" శ్రీరాముని ఓదార్చాడు.

"రామచంద్రా! కౌసల్య కన్న కొడుకువైన నీవు అదృష్టవంతుడవు. హనుమ సీతాదేవిని తప్పక చూచి ఉంటాడు. దక్షిణ దిశకు అంగద నాయకత్వంలో, జాంబవంతుని సచివత్వంలో, హనుమ కార్యదక్షతలో వెడలిన సైన్య విభాగము అత్యంత పటిష్టమైనది. కార్యాన్ని నెరవేర్చకుండా తిరిగిరాదు".

ఈ విధంగా సుగ్రీవుడు శ్రీరామునికి నివేదిస్తున్నంతలో శ్రీరామ సన్నిధిలో వానర సైన్యము వాలింది. హనుమ శ్రీరామునికి శిరస్సు వంచి నమస్కరించి సీతాదేవి నియతంగా (పాతివ్రత్య నియమంతో) అక్షతంగా (క్షేమంగా) ఉందని నివేదించాడు. శ్రీరాముడు హనుమంతుని ప్రశంసాపూర్వకంగా చూచాడు.

హనుమ ప్రయోగించిన రెండు విశేషణాలు సార్థకమైనవి. సీతాదేవి పాతివ్రత్య నియమంతో (నియతా) క్షేమంగా (అక్షతా) ఉందని చెప్పాడు. ఆమె పాతివ్రత్య నియమాన్ని చెడగొట్టుకుంటే క్షేమంగా ఉండి కూడ వ్యర్థమే. పాతివ్రత్యముతో చనిపోయినా అనర్థమే.

అంగదుని ముందుంచుకొని వానర వీరులు రామలక్ష్మణులకు, సుగ్రీవునికి నమస్కరించి, తాము హనుమ ద్వారా విన్న విషయాన్ని "సీతాదేవి రావణాంతఃపురంలో

నిర్బంధింపబడి ఉండడము, రాక్షస స్త్రీల బెదిరింపులు, సీతాదేవి శ్రీరామునే ధ్యానిస్తు ఉండడము, ఆమెకు రెండునెలల గడువు విధింపబడడము మొదలైన వాటిని," రామలక్ష్మణులకు విన్నవించారు.

ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని గమనించాలి. హనుమ తప్ప మిగిలిన వారెవ్వరు సముద్రము దాటి లంకకు పోలేదు. సీతాదేవిని చూడలేదు. కాని వారు ముందుకొచ్చి సీతాదేవి లంకలో ఉన్న స్థితిని వివరించారు.

నిజానికి చెప్పవలసింది హనుమ. కాని మిగిలినవారు అత్యుత్సాహంతో సీతాదేవిని తామే చూచినట్లుగా చెప్పారు. అయినా హనుమ వాళ్లను వద్దనలేదు. వాళ్లను కాదని తాను ముందుకు రాలేదు.

శ్రీరాముడు కూడ హనుమను చెప్పనీయకుండా మీరెందుకు ముందుకు వచ్చి చెప్తున్నారని వాళ్లను వద్దనలేదు.

ఇతరులు ముందుకు రావటాన్ని సహించకపోవడాన్ని 'మాత్సర్యము' అంటారు. అరిషడ్వర్గాలలో ఒక దోషము మాత్సర్యము. దానిని జయించినవారు మహాత్ములు.

కల్యాణగుణాకరుడైన శ్రీరాముడే కాదు. హనుమ కూడ అటువంటి మహాత్ముడే.

శ్రీరామచంద్రస్వామి "ఎక్కడ సీతాదేవి చూడబడింది? ఎలా ఉంది?" అని వివరాలను అడిగాడు. అప్పుడు మిగిలిన వానరులు వెనుకకు జరిగి, హనుమను ముందు ఉంచారు.

అప్పుడు హనుమ దక్షిణ దిశలో లంకలో ఉన్న సీతాదేవికి నమస్కరించి, తన ప్రయాణ వివరాలను, సీతాదేవి స్థితిని చెప్పసాగాడు. వినయవంతుడైన హనుమ తాను సముద్రం దాటే సమయంలో ఎదురు వచ్చిన మైనాక, సురస, సింహికల గురించి ప్రస్తావించ లేదు. ఆ ప్రస్తావన రాముని ముందు తన గొప్పదనాన్ని చెప్పుకోవడమే కదా!

అందువలన తాను "నూరు యోజనాల సముద్రాన్ని దాటి దుర్మార్గుడైన రావణాసురుని నగరమైన లంకలో బంధింపబడిన సీతాదేవిని తాను చూచానని ఆ తల్లి రామధ్యానంతోనే జీవిస్తున్నదని, రాక్షస స్త్రీ బెదిరింపులకు ప్రతిక్షణము లోనవుతున్నదని, ఉపవాస, భూశయనాది కఠిన నియమాలను పాటించడం వలన మంచుపడిన తామరపూవు వలె రూపసౌందర్యాన్ని కోల్పోయి కృశించి ఉందని తెలిపాడు.

"రావణాసురుని, ఆయన పరిచారికల బెదిరింపులకు తాళలేక సీతాదేవి ప్రాణత్యాగానికి సిద్ధమైంది. అప్పుడు అక్కడే శింశుపావృక్షము పై ఉన్న నేను మీ

వంశచరిత్రను, మీరు అడవులకు బయలుదేరడం, సీతాదేవిని రావణుడు అపహరించడం వరకు జరిగిన విషయాలను వివరించాను.

అప్పుడు సీతాదేవి మీ "శ్రీరామనామాన్ని" వినగానే హర్షంతో పొంగిపోయింది. నన్ను మీ దూతగా విశ్వసించింది.

అప్పుడు మీరు ఆమెను వెతుక్కుంటూ కిష్కింధకు రావడం, మీ "రామ – సుగ్రీవ మైత్రి" వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకము మొదలైన విషయాలను వివరించాను.

మీ మైత్రిని తెలిసికొని సీతాదేవి చాల సంతోషించింది. ఆ తల్లికి రామచంద్రా! మీ ధ్యాన, సంకీర్తనలే ఆహార పానీయాలు. ఆమెకు మీ ఉంగరాన్ని గుర్తుగా ఇచ్చాను.

చిత్రకూటంలో జరిగిన కాకాసుర సంఘటనను తన గుర్తుగా తెలిపింది. మణిశిలతో ఆమె బొట్టును మీరు సవరించడం తెలిపింది.

తాను జడలో ధరించే సిగపూవును మీరు దగ్గరలో లేనందున తీసి తన చీరకొంగుముడిలో భద్రంగా ఈ పదినెలలు దాచి ఉంచింది. ఆ ముడిని విప్పి, తన చూడామణిని తన గుర్తుగా మీకిమ్మని నా చేతిలో పెట్టింది.

ఒక నెలకంటె ఎక్కువ కాలము మిమ్మల్ని విడచి తాను బ్రతుక జాలనని, మీరే తనను ఈ విపద్దుఃఖ సాగరాన్నుండి తరింప జేయాలని మొరపెట్టుకొంది.

మీకు తన పరిస్థితిని ఉన్నదున్నట్లుగా తెలిపి, తన సంరక్షణకై మీరు బయలుదేరేలా చూడుమని నన్ను కోరింది" అని హనుమ తెలిపాడు.

రామునితో చెప్పిన "కాకాసుర", మణిశిల" వృత్తాంతాలను ఇంత వరకు అంగదాదుల ముందు చెప్పలేదు. అవి భార్యాభర్తలకు సంబంధించిన రహస్య విషయాలు. వారు లేనప్పుడు వాటి గురించి ప్రసంగించడం మర్యాదకాదు.

అలాగే తన సముద్ర తరణ విజయగాథను రాముని ముందు ప్రస్తావించలేదు. ఆ ప్రసంగం అహంకారాన్ని సూచిస్తుంది. ఆదర్శ వినయమూర్తి కదా హనుమ.

ఈ విధంగా హనుమంతుడు తెలిపి సీతాదేవి తనకు అప్పగించిన చూడామణిని రామచంద్రునికి అందించాడు.

రామచంద్రుడు ఆ మణిని తన గుండెలపై ఉంచుకొని తనకు దూరమైన సీతాదేవిని తలచుకొని విలపించసాగాడు. శ్రీరాముని దుఃఖము లక్ష్మణునికి కూడ దుర్భరమై ఆయన కూడ రోదించసాగాడు. ఆ దృశ్యము సుగ్రీవాది వానరులందరికి దుఃఖాన్ని కల్గించింది.

అప్పుడు శ్రీరాముడు సుగ్రీవునితో, "మిత్రమా! తల్లి ఆవు దూడపై ప్రేమతో ఆ దూడ దూరమైనప్పుడు ఎలా దుఃఖిస్తుందో, అలాగే నా మనస్సు సీతాదేవి ధరించే చూడామణిని చూచి అలా దుఃఖిస్తున్నది" అన్నాడు.

శ్రీరాముడు చూడామణి వృత్తాంతాన్ని సుగ్రీవునికి వివరించాడు. "మిత్రమా ఈ మణి సముద్రం నుండి అమృతమథన సమయంలో పుట్టింది. మా మామగారు చేసిన యజ్ఞము వలన సంతృప్తుడైన సంక్రందనుడు (ఇంద్రుడు) ఈ మణిని మా మామగారికి ఇచ్చాడు. ఆయన సీతాదేవికి వివాహ సందర్భంగా బహూకరించాడు. ఈ మణిని చూస్తున్నప్పుడు నాకు మా నాన్నగారు, మామగారు గుర్తుకొస్తున్నారు.

అంతలోనే ఆయన హనుమవైపు తిరిగి, "హనుమా! నా సీత ఏమన్నది? దాహము నీరుతో శాంతించినట్లు, నా దుఃఖము ఆమె మధురములైన మాటల వలన అలా శాంతిస్తుంది. ఆమె అన్న మాటలు నాకు తెలిపి నన్ను ఓదార్చు".

"ఏమన్నది సీతాదేవి? నన్ను విడిచి నెలరోజులు బ్రతికి ఉంటుందా? అయితే ఆమె ఎప్పటికి జీవించినట్లే. కాని నల్లని కన్నులుగల ఆ సీతాదేవిని చూడకుండా నేను ఒక్క క్షణము కూడ జీవించేలా లేనే? మరి నా పరిస్థితి ఏమవుతుంది?

"చిరంజీవతి వైదేహీ। యది మాసంధరిష్యతి।
క్షణం సౌమ్య న జీవేయం। వినాతామసి తేక్షణాం"

హనుమా! నా సీత ఎక్కడ ఉందో, అక్కడికి నన్ను కూడ తీసికవెళ్లు. ఆమె ఎక్కడ ఉందో తెలిశాక కూడ నేను ఆమెకు దూరంగా ఉండలేను. నా సీత మొదలే భయస్థురాలు. ఆమె దుర్మార్గుడైన రావణుని, భయంకరులైన రాక్షసస్త్రీల బెదిరింపుల మధ్య ఎలా జీవిస్తుందో? పెద్దపులుల గుంపులో ఆడలేడివలె అనుక్షణము భయంతో బిక్కుబిక్కుమంటు క్షణమొక యుగంగా కాలం గడుపుతూండవచ్చు.

హనుమా! నా సీతరూపము మధురము. ఆమె మాట మరింత మధురము. ఆమె మాటలు చెప్పే నీ మాటలు కూడ మధురాలే. ఆమె నాకు అత్యంత దూరముగా ఉంది. ప్రేమ, దుఃఖము రెండు పెనవేసిన ఆమె మాటలు వినాలని నాకు కుతూహలంగా ఉంది. వాటిని ఉన్నదున్నట్లుగా తెలుపవా?

"మధురా మధురాలాపా। కిమాహ మమభామినీ।
మద్విహీనావరారోహా। హనుమన్ కథయ స్వమే"

చూడామణి వృత్తాంతము, శ్రీరాముడు హనుమతో "తాను సీతాదేవిని విడిచి క్షణము కూడ జీవించను" అన్న మాట మనకు ఒక ముఖ్యమైన పరమార్థాన్ని సూచిస్తున్నాయి.

భగవంతుని కల్యాణ గుణాలన్నిటిలో వాత్సల్యము ప్రధానమైనది. వాత్సల్య గుణము అత్యధికంగా పశువులలో అందులో గేదెలో, ఆవులో విశేషంగా ఉంటుంది. దూడను "వత్స" అంటారు. దూడను కాపాడే తల్లి "వత్సలా". ఆ (దూడ)తల్లి స్వభావమే వాత్సల్యము.

గేదెలేక ఆవు ఒక దూడను కంటుంది. అప్పుడే పుట్టిన దూడ శరీరమంతా మురికితో నిండి ఉంటుంది. అయితే తన దూడపైన ఉండే ప్రేమతో తల్లి తన దూడ శరీరముపై ఉన్న మురికినంతా నాలుకతో తుడిచి వేస్తుంది. ఈ స్వభావము పశువులలో తప్ప ఇతర జాతులలో ఉండదు. తన పిల్ల శరీర మాలిన్యమునంతా తన నాలుకతో తుడిచి వేయగలిగినంత ప్రేమ తల్లి పశువుకు మాత్రమే స్వంతము.

భగవంతునికి జీవునిపైన ఉండే ప్రేమను కూడ వాత్సల్యము అంటారు. తల్లి పశువు వలె పరమాత్మ కూడ జీవుల యొక్క మాలిన్యాన్ని (దోషరాశిని) భోగ్యంగా స్వీకరిస్తాడు. అందువలననే పరమాత్మకు "దోష భోగ్యుడు" అని పేరు.

శ్రీరామచంద్రస్వామి చూడామణిని చూడగానే ఆయన మనస్సంతా సీతాదేవి పట్ల వాత్సల్యంతో నిండిపోయింది. అప్పుడు సీతాదేవి తనను "స్త్రియం పురుష విగ్రహం" "పురుష రూపంలో ఉండే స్త్రీవి" అని నిందించడం మరచిపోయాడు.

తనకంటె మిన్నగా మాయాలేడిని ప్రియంగా భావించి, దాని వెంట తనను తరుమడాన్ని కూడ మరచిపోయాడు. అలాగే లక్ష్మణుని పట్ల ఆమె దోషాన్ని మరిచాడు. ఈ మరుపుకు కూడ కారణము స్వామి వాత్సల్య గుణమే. ఇది చూడామణిని చూడగానే స్వామికి కలిగిన వాత్సల్య విశేషము.

ఇక "సీతాదేవి నెలరోజులు జీవిస్తుందా? నేనైతే ఒక్క క్షణం కూడ ఆమే లేకుండా జీవించజాలను అని రామచంద్రస్వామి అనడంలో విశేషాన్ని పరిశీలిద్దాము.

ప్రేమ అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే సాన్నిహిత్య భావన. అది భార్యా భర్తల మధ్య, తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య, అన్నదమ్ముల మధ్య, జీవాత్మ పరమాత్మల మధ్య ఉంటుంది.

అయితే జీవాత్మ, పరమాత్మల మధ్య ఉండే ప్రేమలో ఎవ్వరి ప్రేమ గొప్పది? "సాధారణంగా మనమే భగవంతుని అమితంగా ప్రేమిస్తున్నాము. కాని పరమాత్మకు

మనపైన అంత ప్రేమలేదని, అందువలననే మనకు అన్ని కష్టాలు వస్తున్నాయని” అనుకొంటాము.

కాని వాస్తవమేమిటంటే మనపైన భగవంతునికి ఉండే ప్రేమే అమితము. ఆయన ప్రేమ సముద్రమైతే, మన ప్రేమ గోష్పదము అంటే ఆవుకాలు అంత మాత్రమే.

భగవంతుని ఆశ్రయించక మనము ఎన్ని జన్మలను వ్యర్థం చేశాము? మహనీయమైన మానవ జన్మ లభించాక కూడ ఎంతమంది భగవంతుని ఆశ్రయిస్తారు? ఒకవేళ ఆశ్రయిస్తే కూడ ఎన్నాళ్లకు ఆశ్రయిస్తారు? ఆశ్రయించాక కూడ ఎంత మంది తక్షణ ముక్తిని కోరుకొంటారు? ఇది మనకు భగవంతునిపైన మనకు ఉండే ప్రేమ.

ఇక తనను మనము ఆశ్రయించిన ఆ క్షణం నుండే భగవంతుడు మనను తన వాళ్లుగా భావిస్తాడు. మన యోగక్షేమాలను తానే వహిస్తాడు. చివరలో తన దగ్గరకు తీసికొనే వెళ్లే సమయంలో కూడ పూవువలె సుకుమారంగా, ఏ మాత్రము బాధ కల్గించకుండా అతి వాహికుల ద్వారానో, స్వయంగానో తీసికవెళ్తాడు. ఇది భగవంతుని ప్రేమ. ఎంత తేడా ఆ ప్రేమలో ఎంత పిచ్చిప్రేమ ఆ స్వామిది!

సీతాదేవి శ్రీరామునికి దూరంగా ఒక నెల రోజులు మాత్రమే జీవిస్తాననంటుంది. స్వామి మాత్రము సీతాదేవిని ఒక క్షణం కూడ విడిచి ఉండజాలనంటాడు. పిచ్చి దొర మన స్వామి. శ్రీరామచంద్రస్వామి.

“హనుమా! మధురంగా మాట్లాడే మా సీతాదేవి ఏమి చెప్పింది? అన్న ప్రశ్నకు సీతాదేవి తనతో చెప్పిన కాకాసుర వృత్తాంతాన్ని హనుమ యథాతథంగా తెలుపసాగాడు.

రామా! చిత్రకూట ప్రాంతంలో భార్యాభర్తలు మీరిద్దరు ఏకాంతంగా విహరిస్తున్నారట.

మొదట సీతాదేవి మీ ఒడిలో పడుకొని ఉందట. అప్పుడొక చెడ్డ కాకి ప్రక్కలో ఉన్న మాంసం ముద్దపై వాలక, ఆమె గుండెను చీల్చ సాగిందట. అప్పుడామె ఆ కాకిని వారిస్తు ఉంటే మీరు పరిహసించారట.

తరువాత కొంత సమయానికి మీరు ఆమె ఒడిలో పడుకొని నిద్రపోయారట. మీకు నిద్రా భంగం కల్గకూడదని ఆమె కదలకుండా కూచొని ఉందట.

ఆ విషయాన్ని గ్రహించిన కాకి ఆ తల్లి వక్షాన్ని మరింత పొడవ సాగిందట. ఆమె వక్షం నుండి రక్తము కారసాగిందట.

ఆమె వెచ్చని రక్త బిందువులు మీ చెంపలపై పడగానే మీకు హఠాత్తుగా మెలకువ వచ్చిందట.

మీరు వెంటనే ఆగ్రహంతో "నిన్ను గాయపరచిన ఆ దుర్మార్గుడెవ్వడు? ఆగ్రహించిన అయిదు తలల నాగసర్పంతో ఆటలాడుకొనే సాహసి ఎవ్వరు?" అని ప్రక్కలోనే దర్భను తీసికొని దానిపై బ్రహ్మాస్త్రాన్ని మంత్రించి వదలారట. అది సీతాదేవి గుండెలను పొడుస్తున్న కాకాసురుని తరుమసాగింది. ఆయన భయంతో తన తల్లిదండ్రులయిన శచీంద్రులను శరణు వేడాడు. మిమ్మల్ని ఎదిరించే ధైర్యము లేక వారిద్దరు ఆ కాకాన్ని వదులుకొన్నారు. మహర్షులను ఆశ్రయించాడు. వారు కూడ ఆయనను వదలి వేశారు. బ్రహ్మ, రుద్రులు కూడ పరిత్యజించారు.

అన్ని లోకాలు, అనేక పర్యాయాలు వెళ్లి వచ్చి, ఎవ్వరు తనను రక్షింప జాలనందున ఆ కాకము మీ కాళ్లపై పడిపోయిందట. కాళ్లపై పడ్డ కాకిని చంపక, మీరు దాని కుడి కన్ను మాత్రము తీసి వదలి వేశారట. అప్పుడా కాకి మీకు, మీ తండ్రిగారైన దశరథ చక్రవర్తికి ప్రణమిల్లి మీ అనుమతిని తీసికొని స్వర్గలోకానికి వెళ్లిపోయిందట".

ఈ విషయాన్ని సీతాదేవి నాకు చెప్పి మళ్లీ ఇలా అన్నది "ఆనాడు నా స్వల్ప గాయం కొరకు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించిన కరుణాసముద్రుడైన నా నాథుడుఈనాడు ఇంత ఆపదలో నన్ను ఒంటరిగా వదలివేయడం న్యాయమా?

ఆయనను ఎదిరించేవారు నరులలో, సురాసురులలో ఎవ్వరు లేరు కదా! అగ్ని, వాయువులతో సమానులైన ఆ అన్నదమ్ములు నన్నుఎందుకు కరుణతో కాపాడడం లేదు? నేనేదో కొద్దో గొప్పో పాపము చేసి ఉంటాను" అని చెప్పి దీనంగా కన్నీరు కార్చసాగింది.

అప్పుడు సీతాదేవి దుఃఖాన్ని తగ్గించడానికి, నేను "అమ్మా! రాముడు కూడ నీవు దూరమైనందుకు చాల బాధపడుతున్నాడు. నిద్రాహారాలను పట్టించుకోవడం లేదు. శ్రీరాముని దుఃఖాన్ని చూచి లక్ష్మణుడు కూడ బాధపడుతున్నాడు.

దైవకృప వలన నేను రామాజ్ఞను పాటించి సముద్రం దాటి వచ్చి నిన్ను చూడ కల్గాను. ఇక నీ దుఃఖము అంతమైనట్లే.

నేను వెళ్లి నీ విషయాన్ని ఆ పురుష శ్రేష్ఠులగు రామలక్ష్మణులకు చెప్పగానే, వారు మహోత్సాహంతో బయలుదేరి వచ్చి, భయంకరమైన తమ దివ్యాస్త్రాలతో లంకానగరాన్ని భస్మం చేస్తారు.

రావణాసురుని సపరివారంగా సంహరించి నీ నాథుడు నిన్ను సగౌరవంగా తీసికొని వెళ్లుతాడు.

అందువలన నేను వచ్చి నిన్ను కలసి, నీతో మాట్లాడినందుకు ఒక ముఖ్యమైన విశ్వాస చిహ్నాన్ని నాకు ఇవ్వు" మని అడిగాను.

అప్పుడా దేవి చుట్టుప్రక్కల జాగ్రత్తగా పరిశీలించి, ఎవ్వరు లేరని నిర్ధారించుకొని, తన చీరకొంగుముడి విప్పి, అంతవరకు భద్రంగా దాచుకొన్న తన "జడపూవును" నీకు గుర్తుగా ఇచ్చింది. దానిని నేను పూజ్యభావంతో గ్రహించి భద్రంగా దాచి ఆ తల్లికి నమస్కరించి మీ దగ్గరకు రావడానికి సిద్ధమయ్యాను.

మీ దగ్గరికి బయలుదేరుతున్న నన్ను చూచి, కళ్లనీళ్లు ధారాపాతంగా కారుతుండగా "హనుమా! సింహ పరాక్రములైన శ్రీరామలక్ష్మణులను, సుగ్రీవుని, ఆయన మంత్రులను కుశలమడిగానని చెప్పు.

మహా బాహువైన శ్రీరాముడు నన్ను దుఃఖసముద్రం నుండి దాటించేలా నీవు ప్రోత్సహించు. నా తీవ్ర శోకాన్ని, రాక్షసుల బెదిరింపులను ఉన్నదున్నట్లుగా శ్రీరామునికి తెలియజేయి "హనుమా! నీ ప్రయాణము సుఖముగా సాగుగాక!"

"రామచంద్రా! సీతాదేవి దుఃఖాతిశయంతో పలికిన పలుకులను నీకు నివేదించాను. సీతాదేవి క్షేమంగా ఉంది. హనుమ మరల సీతాదేవి విషయాన్ని వివరించసాగాడు.

రామచంద్రా! నేను వెళ్లి పోతాననే తొందరతో సీతాదేవి మళ్లీ చెప్పసాగింది.

"హనుమా! రావణాసురుని సంహరించి, నా నాథుడు నన్ను తీసికొని వెళ్లేలా గట్టిగా చెప్పు సుమా!

ఇక్కడ నీ కిష్టమైతే ఏకాంత స్థలంలో ఒక రోజు ఉండి వెళ్లు. ఇక్కడ నీవు ఉన్నంత వరకు నా వాళ్లు ఉన్నారని, నాకేమి ప్రమాదము కల్గదని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. తృప్తిగా ఉంటుంది.

నీవు వెళ్లావంటే రాముడు ఒకవేళ ఇక్కడికి ససైన్యంగా వచ్చినా, అంతవరకు నా ప్రాణాలు నిలిచి ఉంటాయో లేదో? నీవు వెళ్లిపోయావంటే నా దుఃఖము మళ్లీ నాతోనే ఉంటుంది.

మహావీరా! నాకొక అనుమానం కల్గుతున్నది. నీవు మీ వానర జాతిలోనే అత్యద్భుత పరాక్రమ సంపన్నుడివి. నీవు సముద్రము దాటి వచ్చావు సరే. నీవు, నీ తండ్రి వాయుదేవుడు, ప్రచండవేగుడైన గరుత్మంతుడు, మీరు ముగ్గురు తప్ప మరెవ్వరు శతయోజన విస్తీర్ణమైన ఈ మహా సముద్రమును దాటజాలరు.

పరిస్థితి అలా ఉంటే రామలక్ష్మణులు సముద్రము దాటి ఎలా రాగలుగుతారు? మిగిలిన వానరులు ఎలా దాటగల్గుతారు?

అడవిలో ఒంటరిదాననైన నన్ను దొంగతనంగా రావణాసురుడు ఎత్తుకొని వచ్చినట్లు రామభద్రుడు కూడ దొంగతనంగా నన్ను నీ ద్వారా తీసికొని వెళ్లకూడదు. అది ఆయన కీర్తి ప్రసిద్ధులకు, పరాక్రమ స్వభావమునకు తగింది కాదు.

శ్రీరామచంద్రస్వామి వానర కోటిసైన్యంతో లంకపై దండెత్తి రావాలి. లంకానగరం నిండా తనరామబాణాలను నింపాలి. సమరంలో రావణాసురుని పరివార సమేతంగా సంహరించాలి. అప్పుడు నన్ను తన వెంట సగౌరవంగా తోడ్కొని వెళ్లాలి. అది ఆయన శౌర్య పరాక్రమాలకు అర్హంగా ఉంటుంది" అని పలికింది.

అప్పుడు సీతాదేవి మనస్సుకు ఆనందోత్సాహాలను కలిగించడానికి "అమ్మా! వానర సమ్రాట్టు అయిన సుగ్రీవుడు మహా పరాక్రమ సంపన్నుడు. నిన్ను, శ్రీరాముని కలుపాలని ఆయన కృతనిశ్చయంతో ఉన్నాడు. ఆయన ఆధిపత్యంలో బల, పరాక్రమ వరిష్ఠులైన వానరులు వేల సంఖ్యలో ఉన్నారు. ఒక్క విషయాన్ని నేను నీకు స్పష్టం చేయాలనుకొంటున్నాను.

మా సుగ్రీవ మహారాజు సన్నిధిలో నాకంటె చిన్నవాడెవ్వడు లేడు. బలపరాక్రమాలలో నాతో సమానులు, నాకంటె అధికులు మాత్రమే ఉన్నారు.

ఎక్కడైనా, ఎవ్వరైనా ఏదైనా ఒక పని మీద పంపాలంటే అందరికంటె చిన్నవాడిని చూచే కదా పంపుతారు. చిన్నవారు ఉండగా, వారిని వదలి పెద్దవారిని పనిమీద పంపడం మనము ఎక్కడా చూడం కదా!

అందరికంటె అల్పశక్తుడనైన నేనే అనంతమైన సముద్రాన్ని దాటివచ్చానంటే, మిగిలిన వానరుల శక్తి పరాక్రమాల గురించి వేరే చెప్పాలా?

తల్లీ! నీవు దుఃఖింపకు! వానర వీరులు ఒకే అంగలో ఈ మహార్ణవాన్ని ఆకాశ మార్గంలో దాటి రాగలుగుతారు. సింహవక్షులైన శ్రీరామ లక్ష్మణులను లిప్తకాలములో అతి సునాయాసంగా నా భుజాలపై ఎక్కించుకొని తీసికవస్తాను.

సూర్యచంద్రుల వలె తేజస్సంపన్నులైన రామలక్ష్మణులిద్దరు లంకలో ప్రవేశించి తమ ప్రచండ ప్రతాపంతో రావణాసురుని, ఆయన పరివారాన్ని చీల్చి చెండాడుతారు. గోళ్లు, కోరలు గల వానర మహా వీరులు లంకానగరంలో వీర విహారం చేస్తారు.

"నివృత్త వనవాసంచ। త్వయాసార్ధమరిందమం।
అభిషిక్త మయోధ్యాయాం। క్షిప్రంద్రక్ష్యసి రాఘవం!".

తల్లీ! శ్రీరామచంద్రస్వామి అతి త్వరలో రావణాసురుని ససైన్యంగా అంతం చేసి, అయోధ్యకు నీతో కలసి వెళ్లి, వనవాస నియమాలను పూర్తి చేసికొని, మహా వైభవంగా సుర, నర, వానర, సమక్షంలో సామ్రాజ్య పట్టాభిషేకం చేసికోవడం నీవు త్వరలోనే నీ కనులారా కాంచగల్గుతావు" అని నేను ఆమెకు ప్రియకరములు, శుభకరములైన మాటలను చెప్పి, ఆమెను ఓదార్చి ఆమెకు ధైర్యాన్ని కల్గించాను.

"తతోమయా వాగ్భిరదీన భాషిణా। శివాభిరిష్టాభిరభి ప్రసాదితా।
జగామ శాంతిం మమ మైథిలాత్మజా। తవా2పి శోకేన తదాభి పీడితా".

నా మాటలతో ఆమె శాంతించింది. సంతోషించింది. ఆమె శోకము అంతమైంది. అయితే నీవు ఆమె కొరకు అమితంగా దుఃఖిస్తున్నావని తెలిసి మాత్రము ఆమె విచారిస్తున్నది. అంతకంటె ఆమెకు ఇతర దుఃఖము లేదు.

-- సుందరకాండము సమాప్తము --

## చూడామణిని హనుమ రామునికి అర్పించుట

